'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 307

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

వీబీ జీ రామ్‌జీపై చర్చ కుదరదు

- ఎస్ఐఆర్ సర్వేపైనా చర్చించడానికి ఏమీ లేదు
- స్పష్టం చేసిన మోదీ సర్కార్
- అఖిలపక్ష భేటీలో అన్ని పార్టీల సహకారం కోరిన కేంద్రం
- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్న రాష్ట్రపతి
- ఫిబ్రవరి 1న బడ్జెట్.. పద్దును తొలిసారిగా ఆదివారం ప్రవేశ పెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మల

6 లో

రైతులకు న్యాయం జరిగితేనే అమరావతికి చట్టబద్ధత

- రైతుల ప్రయోజనాలను కాపాడుతున్నట్టు అమరావతి బిల్లులో చేరిస్తేనే వైఎస్సార్‌సీపీ మద్దతు.. మెడికల్ కాలేజీలకు కేంద్రమే నిధులివ్వాలి
- అఖిలపక్ష సమావేశంలో స్పష్టం చేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, సుభాష్‌చంద్రబోస్

2 లో

93% వస్తువులపై
సుంకాలు ఎత్తివేత

భారత్, ఈయూ మధ్య ప్రపంచ చరిత్రలోనే భారీ వాణిజ్య ఒప్పందం

- ఈయూ నేతలతో ఫలించిన మోదీ చర్చలు
- ఆర్నెల్లలో సంతకాలు, ఏడాదిలోపు అమల్లోకి
- ట్రంప్ టారిఫ్‌లకు సరైన సమాధానం: విశ్లేషకులు

చేతులు కలిపి హర్షం వ్యక్తం చేస్తున్న యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ప్రధాని నరేంద్ర మోదీ, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయన్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వాణిజ్య చరిత్రలో నూతన శకానికి తెర లేచింది. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) నడుమ చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎట్టకేలకు ఖరారైంది. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం జరిపిన శిఖరాగ్ర చర్చల్లో ఈ చిరస్మరణీయ ఘట్టం ఆవిష్కృతమైంది. పరిమాణంతో పాటు ప్రాధాన్యతపరంగా కూడా అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలన్నింటికీ ఈ ఎఫ్‌టీయేఏ తల్లి వంటిదని(మదర్ ఆఫ్ ఆల్ డీల్స్) పరిశీలకులు అభివర్ణిస్తున్నారు! ఇది అమల్లోకి వస్తే ఇరు పక్షాల నడుమ వార్షిక సుంకాలు ఏకంగా 400 కోట్ల యూరోల మేరకు తగ్గనున్నాయి. యూరప్ కార్లు, వైద్య పరికరాలు, వైన్ తదితరాలపై టారిఫ్‌లు దిగొస్తాయి. మొత్తంగా అక్కడి దేశాల దిగుమతులన్నింటిపైనా సుంకాలు భారీగా తగ్గుతాయి. యంత్ర పరికరాలు, రసాయనాలు, ఫార్మా ఉత్పత్తులపై

మిగతా 2వ పేజీలో ▶

కూటమి ఎమ్మెల్యే శ్రీధర్

నాపై లైంగిక దాడి చేశారు

రైల్వేకోడూరు శాసన సభ్యుడి రోత లీలలను సెల్ఫీ వీడియోలో బహిర్గతం చేసిన బాధితురాలు

నగ్నంగా మహిళకు వీడియోకాల్ చేసిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

- ఎమ్మెల్యే అరవ శ్రీధర్ నన్ను బెదిరించి కారులో ఎక్కించుకుని బలాత్కారానికి పాల్పడ్డారు..
- వీడియో కాల్ చేసి నగ్నంగా చూపించాలని బలవంతం చేశారు
- పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఐదు సార్లు అబార్షన్ చేయించారు..
- ఎవరికైనా చెబితే నన్ను, నా కుటుంబాన్ని నాశనం చేస్తానని హెచ్చరించారు

3 లో

కామ'కూటమి' అధికారాన్ని అడ్డం పెట్టుకొని మహిళలపై కూటమి పార్టీ నేతల ఆగడాలు ఆదిమూలం, నజీర్, కూన రవి, కిరణ్‌రాయల్, జానీ మాస్టర్ అంతా ఇదే తీరు

3 లో

క్లుప్తంగా...

నేడు భీమవరం నియోజకవర్గ నేతలతో వైఎస్ జగన్ సమావేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ నేతలతో సమావేశం కానున్నారు. ఇందులో పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

కాకినాడలో క్రికెట్ స్టేడియం కోసం దేవుడి భూమి

16.55 ఎకరాలు 33 ఏళ్లకు లీజుకిస్తూ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం శ్రీ భావన్నారాయణస్వామి దేవస్థానానికి సంబంధించిన 16.55 ఎకరాల భూమిని 33 ఏళ్ల పాటు లీజుకిచ్చేందుకు ప్రభుత్వం అనుమతి తెలిపింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి హరిజవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఎకరాకు ఏడాదికి రూ.50 వేల చొప్పున లీజు ధరగా నిర్ణయించి, ప్రతి మూడేళ్లకు 33 శాతం చొప్పున లీజు మొత్తం పెంచి చెల్లించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. స్టేడియం చుట్టుపక్కల దేవుడి భూమిలోనే 4,900 చదరపు అడుగుల్లో సీసీ రోడ్ల నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం ఉదయం 10.30 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఇందులో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.

సీఎస్‌వో మల్లికార్జునరావుకు పోలీస్ మెడల్

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయ ముఖ్య భద్రత అధికారి(సీఎస్‌వో) పోలవరపు వెంకట శేష నాగ మల్లికార్జునరావుకు ఇండియన్ పోలీస్ మెడల్(ఐపీఎం)ను కేంద్ర హోంశాఖ ప్రకటించింది. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరుకు చెందిన మల్లికార్జునరావు 1989లో ఐటీబీపీలో శిక్షణ పొందారు. అనంతరం ఢిల్లీ, హరియాణ, చండీగఢ్‌లో విధులు నిర్వహించారు. 1993లోఐటీబీపీ నుంచి ఏపీ ప్రత్యేక రక్షణదళంలో చేరారు. 2006లో ఏపీ పోలీస్ సేవా పతకం, 2013లో ఏపీ ఉత్తమసేవాపతకం అందుకున్నారు.

సర్వే విధులు నిలిపివేశాం

గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల సర్వే విధులను నిలిపివేసినట్లు గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి మధుబాబు, ప్రధాన కార్యదర్శి మహేష్‌నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రీసర్వే అటెండెన్స్ యాప్‌లో కూడా అటెండెన్స్ నమోదు చేయలేదన్నారు. గత ఆదివారం తిరుపతిలో జరిగిన సర్వేయర్ల సమావేశంలో చేసిన తీర్మానం ప్రకారం సర్వే పనులు నిలిపివేసినట్లు తెలిపారు. ఐదేళ్ల సర్వీసు పూర్తయిన గ్రామ సర్వేయర్లకు వెంటనే ఇతర శాఖల ఉద్యోగుల మాదిరిగా కనీస బేసిక్ పే రూ.32 వేలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా 70 శాతం మందికి గ్రేడ్–1 పదోన్నతులు ఇవ్వాలన్నారు. గ్రామ సర్వేయర్ పోస్టు కనీస విద్యార్హతను డిప్లొమాగా సవరించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సర్వేయర్లకు ప్రత్యేక టెక్నికల్ పేస్కేలు మంజూరు చేయాలని కోరారు. రీసర్వే పనులను నిర్దిష్ట కాలవ్యవధిలో నిర్వహించి, నాణ్యమైన భూ రికార్డులు తయారు చేయడానికి తగిన సమయం ఇవ్వాలన్నారు. రెవెన్యూ అధికారుల విధులను జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా గ్రామ సర్వేయర్లపై రుద్దడాన్ని ఆపాలన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం ద్వారా రాతపూర్వకంగా స్పష్టమైన హామీ ఇచ్చే వరకు సర్వే విధులు నిర్వహించబోమని తెలిపారు.

నా తప్పేముంది? సంపద సృష్టించాలంటే ఈ బాదుడు తప్పదు!

93% వస్తువులపై సుంకాలు ఎత్తివేత

▶ మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతమున్న భారీ టారిఫ్‌లు దాదాపుగా కనుమరుగవుతాయి. బదులుగా ఆ ఖండానికి భారత ఎగుమతుల్లో చాలావాటిపై సుంకాలు వచ్చే ఏడేళ్ల వ్యవధిలో 90 నుంచి 100 శాతం దాకా తగ్గనున్నాయి! ఈ తగ్గింపు వస్తూత్పత్తులతో పాటు సేవలకు కూడా వర్తించనుంది!! మొత్తమ్మీద 93 శాతం వస్తువులపై సుంకాల ఎత్తివేతకు ఇరు పక్షాలూ అంగీకరించాయి. ఈ ఒప్పందం కోసం ఇరు పక్షాల నడుమ 18 ఏళ్లకు పైగా చర్చోపచర్చలు కొనసాగుతుండటం విశేషం. అయితే ఎఫ్‌టీఏపై లాంఛనంగా సంతకాలు జరిగేందుకు కనీసం మరో ఆర్నెల్లు, అది అమల్లోకి రావడానికి ఏడాదికి పైగా సమయం పట్టనుంది. ఒప్పందానికి సంబంధించిన న్యాయపరమైన, ఇతరత్రా అంశాలపై ఇరువైపులా పూర్తిస్థాయి అధ్యయనం తదితరాలు జరగాల్సి ఉండటమే ఇందుకు కారణం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొంతకాలంగా ప్రపంచ దేశాలపై టారిఫ్‌లను ఆయుధంగా ప్రయోగిస్తూ హడలెత్తిస్తుండటం తెలిసిందే. ఆ వాణిజ్య బెదిరింపులకు భారత్, ఈయూ ఒప్పందాన్ని దీటైన సమాధానంగా పరిగణిస్తున్నారు. ఎఫ్‌టీఏకు తోడు గా ద్వైపాక్షిక వాణిజ్యానికి ఊపునిచ్చే దిశగా మరో 12 ఒప్పందాలు కూడా శిఖరాగ్ర భేటీ సందర్భంగా ఖరారయ్యాయి. వాటితో పాటు మరో రెండు కీలక ద్వైపాక్షిక ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి. వాటి లో ఒకటి రక్షణ–భద్రతకు సంబంధించినది కాగా మరొకటి భారత్ నుంచి ప్రతిభావంతులను యూరప్‌లో మరింత మెరుగైన ఉపాధి అవకాశాలు తదితరాలు కల్పించేందుకు వీలు కల్పించేది.

మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో ముచ్చటిస్తున్న యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా

ప్రపంచానికే స్థిరత్వం: మోదీ

ఎఫ్‌టీఏ ఖరారుపై మోదీ హర్షం వెలిబుచ్చారు. ఒప్పందం అనంతరం ఉర్సులా, కోస్టాతో కలిసి ఆయన ఫొటోలకు పోజులిచ్చారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. వాణిజ్యపరంగా అంతర్జాతీయంగా అల్లకల్లోల పరిస్థితులు నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో భారత్, ఈయూ భాగస్వామ్యం ప్రపంచానికి అత్యవసరమైన స్థిరత్వాన్ని అందిస్తుందని మోదీ విశ్వాసం వెలిబుచ్చారు. ''భారత్ తన చరిత్రలోనే అతి పెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. యూరప్ మార్కెట్‌తో మన చిన్న పరిశ్రమలు, రైతులకు అనుసంధానం మరింత పెరిగేందుకు, ఉత్పత్తి, సేవా రంగాల్లో నూతన అవకాశాల సృష్టికి ఇది ఎంతగానో తోడ్పడనుంది. ఎఫ్‌టీతో భారత్, ఈయూ మధ్య పెట్టుబడులు ఇతోధికంగా పెరగనున్నాయి. నూతన ఇన్నొవేషన్ భాగస్వామ్యాలు ఏర్పడటమే గాక అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థలు మరింత బలోపేతం కానున్నాయి. ఆ కోణంలో చూస్తే ఇది కేవలం వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదు, భారత్–ఈయూ సమైక్య ప్రగతికి బ్లూప్రింట్ వంటిది''అంటూ ప్రధాని కొనియాడారు. ఇరు పక్షాల నడుమ ఈ భాగస్వామ్యం అంతిమంగా ప్రపంచానికే ఎంతో మేలు చేకూరుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇండో–పసిఫిక్ మొదలుకుని కరీబియన్ దీవుల దాకా పలు ప్రాజెక్టుల విషయంలో భారత్, ఈయూ కలిసి పని చేస్తాయని ప్రకటించారు.

సవాళ్లకు సమాధానం: ఉర్సులా

భారత్, ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఒక మైలురాయి వంటిదని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయన్ అన్నారు. వాణిజ్యాన్ని ఆయుధంగా వాడుతున్న వేళ ఈ ఒప్పందానికి ఎనలేని ప్రాధాన్యం సమకూరిందని అమెరికా ఒంటెత్తు పోకడలను ఉద్దేశిస్తూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. వాణిజ్యపరంగా ప్రస్తుతం దేశాలన్నీ ఎదుర్కొంటున్న పెను అంతర్జాతీయంగా సవాళ్లకు పరస్పర సహకారం, సమన్వయమే అత్యుత్తమ పరిష్కారమని ఈ ఒప్పందం మరోసారి సందేశమిచ్చిందని ఆమె అభిప్రాయపడ్డారు. 'మేం సాధించాం. ఒప్పందాలన్నింటికీ తల్లిగా చెప్పదగ్గ ఎఫ్‌టీఏను కుదుర్చుకున్నాం. ఏకంగా 200 కోట్ల మందికి అద్భుతమైన మార్కెట్‌ను ఏర్పాటు చేసుకోనున్నాం. ఇది ప్రపంచంలో రెండో, నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా నిలిచిన రెండు దిగ్గజాల గాథ. ఇరు పక్షాలకూ లాభదాయకమైన రీతిలో ఒప్పందం కుదిరింది' అని ఉర్సులా పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో భారత, యూరప్ ఎగుమతిదారులపై వార్షిక సుంకాలు ఏకంగా 400 కోట్ల యూరోల దాకా తగ్గుతాయని చెప్పారు. అంతేగాక ఇరువైపలా లక్షలాది నూతన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. 'భారత నైపుణ్యాలు, సేవలు, యూరప్ టెక్నాలజీ, పెట్టుబడులు, ఇన్నొవేషన్లు పరస్పరం అందుబాటులోకి వస్తాయి. తద్వారా ఇరు పక్షాలూ ఊహించలేని స్థాయిలో ప్రగతి సాధిస్తాయి. ఒంటరిగా వెళ్తే భారత్, ఈయూల్లో ఏ ఒక్కరికీ ఆ స్థాయి ప్రగతి సాధ్యం కాదు''అని ఆమె స్పష్టం చేశారు. ''ఎఫ్‌టీఏ ద్వారా రెండు ఆర్థిక వ్యవస్థలు బలోపేతం కావడంతో పాటు భారత్, ఈయూ పౌరులకు భద్రత మరింత మెరుగవనుంది. నానాటికీ అభద్రత పెరిగిపోతున్న నేటి ప్రపంచంలో ఇది అత్యంత కీలకమైన అంశం' అని ద్వైపాక్షిక భద్రతా ఒప్పందాన్ని ఉద్దేశించి చెప్పారు.

మైలురాయి వంటిది: కోస్టా

భారత్, ఈయూ ఎఫ్‌టీఏను వాణిజ్య ఒప్పందాల చరిత్రలోనే మైలురాయిగా యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా అభివర్ణించారు. పరస్పర విశ్వాసం, వ్యూహాత్మక అంశాల్లో సహకారమే పునాదులుగా ఒప్పందం కుదిరిందన్నారు. అందుకే ఇది ఎనలేని చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుందని చెప్పారు.

చర్చలే శాంతికి మార్గం

యుద్ధాలతో శాంతి ఎన్నటికీ సాధ్యం కాదని భారత్, ఈయూ శిఖరాగ్ర సదస్సులో నేతలు అభిప్రాయపడ్డారు. పరస్పర విశ్వాసంతో కూడిన చర్చలే అందుకు ఏకైక మార్గమని ప్రధాని మోదీ, ఈయూ సారథులు ఉర్సులా, ఆంటోనియో కోస్టా స్పష్టం చేశారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో స్థితిగతులు, ఇండో–పసిఫిక్‌లో పరిస్థితులు తదితరాలపై వారితో లోతుగా చర్చలు జరిగినట్టు మోదీ వెల్లడించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సవాళ్ల పరిష్కారానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తప్పనిసరన్న అభిప్రాయం వ్యక్తమైనట్టు చెప్పారు. యుద్ధాలతో ఎన్నటికీ శాంతిని సాధించలేమని ఉక్రెయిన్ ఘర్షణను ఉద్దేశించి ఉర్సులా పునరుద్ఘాటించారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతిసాధన యత్నాల్లో యూరప్ కూడా మోదీవైపు నమ్మకంతో చూస్తోందని కోస్టా పేర్కొనడం విశేషం.

ఎందుకింత ప్రాధాన్యం?

భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. 27 యూరప్ దేశాలకు భారత ఎగుమతులు ఇకపై ఇతోధికంగా పెరగనున్నాయి. వాటిపై సుంకాలు అతి తక్కువ స్థాయికి, లేదా సున్నాకు దిగి వస్తాయి. భారత్‌కు పలు రకాల వస్తూత్పత్తుల ఎగుమతుల్లో యూరప్‌కు కూడా ఇదే తరహా ప్రయోజనం చేకూరనుంది.

- ఈయూకు భారత్ ప్రధానంగా దుస్తులు, లెదర్, ఫార్మా ఉత్పత్తులు, స్టీల్, పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రికల్ మెషీనరీ, స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, సేంద్రియ ఎరువులు, రత్నాలు, ఆభరణాలు, ఆటోమొబైల్ విడిభాగాలు తదితరాలను ఎగుమతి చేస్తోంది. టారిఫ్‌ల తగ్గింపుతో ఇకపై అవి యూరప్ మార్కెట్లో ఇతర దేశాలతో మరింతగా పోటీపడగలవు.
- టెలికాం, వ్యాపార, రవాణా తదితర రంగాల్లో యూరప్‌కు భారత్ అందిస్తున్న సేవలకు కూడా సుంకాల భారం తప్పుతుంది.
- తద్వారా భారత టెక్నాలజీ, ఫార్మా, ఆటోమొబైల్, జౌళి తదితర రంగాలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.
- భారత జౌళి ఉత్పత్తులపై ఈయూ 12 నుంచి 16 శాతం సుంకాలు వసూలు చేస్తోంది.
- యూరప్ నుంచి భారత్ యంత్రాలు, మొబైల్ ఫోన్ల విడి భాగాలు, సర్క్యూట్లు, విమానాలు, వైద్య, సైంటిఫిక్ పరికరాలు, ముడి వజ్రాలు, ప్లాస్టిక్స్, కార్లు, మద్యం తదితరాలను ప్రధానంగా దిగుమతి చేసుకుంటోంది.
- ఈయూ దేశాల నుంచి మేధో సంపత్తి, టెలికాం, ఐటీ తదితర సేవలను పొందుతోంది.
- 2020–24 మధ్య ఈయూ నుంచి భారత్‌కు 117.4 బిలియన్ల మేరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. ఆ కాలంలో భారత మొత్తం ఎఫ్‌డీఐ పరిమాణంలో ఇది 17 శాతం.

అంకెల్లో భారత్–ఈయూ వాణిజ్యం

భారత్, ఈయూ జనాభా	ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వాటా	ప్రపంచ వాణిజ్యంలో వాటా	వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యం
దాదాపు 200 కోట్లు	25 శాతం	33 శాతం	190 బిలియన్ డాలర్లు (2024-25లో)

ఈయూకు భారత వస్తు ఎగుమతులు	ఈయూకు భారత సేవల ఎగుమతులు	భారత మొత్తం ఎగుమతుల్లో ఈయూ వాటా
75.85 బిలియన్ డాలర్లు	30 బిలియన్ డాలర్లు	17 శాతం
ఈయూ నుంచి భారత వస్తు దిగుమతులు	**ఈయూ నుంచి భారత సేవా దిగుమతులు**	**ఈయూ మొత్తం ఎగుమతుల్లో భారత వాటా**
60.68 బిలియన్ డాలర్లు	23 బిలియన్ డాలర్లు	9 శాతం

సుంకాల తగ్గింపు ఇలా..

యూరప్ కార్లపై 70 నుంచి 110 శాతం దాకా ఉన్న సుంకాలను భారత్ తొలుత 40 శాతానికి, అంతిమంగా 10 శాతానికి తగ్గించనుంది. అంతేగాక 90 శాతం పై చిలుకు యూరప్ దిగుమతులపై సుంకాలను భారీగా తగ్గించడమో, తొలగించడమో జరుగుతుంది. ఫలితంగా యంత్ర భాగాలు (ప్రస్తుతం 44 శాతం సుంకాలు), రసాయనాలు (22 శాతం), ఫార్మా ఉత్పత్తులు (11 శాతం) తదితరాల విషయంలో ఈయూ దేశాలు బాగా లాభపడనున్నాయి. ఇక యూరప్ వైన్‌పై సుంకం 20–30 శాతానికి, స్పిరిట్స్‌పై 40, బీర్‌పై 50 శాతానికి తగ్గుతాయి. ఆలివ్ ఆయిల్ వంటి వాటిపై సుంకాలు రద్దవుతాయి. యూరప్ కూడా భారత్‌పై సుంకాలను భారీగా తగ్గించనుంది. వచ్చే ఏడేళ్లలో ఏకంగా 99.5 శాతం భారత వస్తువులపై సుంకాలను కనీస స్థాయికి తగ్గించడమో, ఎత్తేయడమో చేసేందుకు అంగీకరించింది. ఆప్టికల్, సర్జికల్, వైద్య పరికరాలపై సుంకాల తొలగింపుతో వాటి ధరలు దిగొస్తాయి. ఫలితంగా ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుంది.

2007 నుంచీ చర్చలు..

భారత్, ఈయూ నడుమ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం 2007 నుంచీ సుదీర్ఘంగా చర్చలు జరుగుతున్నాయి. పలు దఫాలుగా సంప్రదింపులు నడిచినా మార్కెట్ యాక్సెస్, మేధో సంపత్తి హక్కులు, కార్మిక ప్రమాణాలు తదితర అంశాలపై విభేదాలతో ప్రతిష్టంభన ఏర్పడింది. ఆటోమొబైల్స్, వైన్, స్పిరిట్స్, భారత ఐటీ సంస్థలకు డేటా సెక్యూరిటీ తదితరాలపై టారిఫ్ విషయంలో కూడా ఏకాభిప్రాయం కుదరలేదు. ఎఫ్‌టీఏ విషయమై 2016–20 నడుమ రెండో దఫా చర్చలు నడిచాయి. 2022 నుంచీ చర్చల్లో స్థిరమైన ప్రగతి నమోదై తాజాగా మంగళవారం ఒప్పందం ఖరారైంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

రైతులకు న్యాయం జరిగితేనే అమరావతికి చట్టబద్ధత

- రైతుల ప్రయోజనాలను కాపాడుతున్నట్టు అమరావతి బిల్లులో చేరిస్తేనే వైఎస్సార్‌సీపీ మద్దతు
- మెడికల్ కాలేజీలకు కేంద్రమే నిధులివ్వాలి
- అఖిలపక్ష సమావేశంలో స్పష్టం చేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, సుభాష్‌చంద్రబోస్
- ఉభయ సభల్లో సమస్యలపై కూటమి ఎంపీలను నిలదీస్తామని వెల్లడి

అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, సుభాష్ చంద్రబోస్

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు న్యాయం జరిగిన తర్వాతే అమరావతికి చట్టబద్ధత వస్తుందని వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం నుంచి జరగనున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి లోక్‌సభ పక్షనేత మిథున్‌రెడ్డి, రాజ్యసభ పక్షనేత, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను అఖిలపక్షం ఎదుట ప్రస్తావించారు. అనంతరం మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి ప్రాంత రైతుల ప్రయోజనాలను కాపాడుతున్నట్టు బిల్లులో చేర్చితేనే బిల్లుకు తాము మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని అఖిలపక్ష సమావేశంలో కేంద్రం దృష్టికి తీసికెళ్లినట్టు తెలిపారు. అమరావతి నిర్మాణానికి సీఎం చంద్రబాబు రెండోవిడత భూసేకరణకు కూడా శ్రీకారం చుట్టారని విమర్శించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే ముందు.. రైతులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతి కోసం రూపాయి తీసుకోకుండా భూములిచ్చారని గుర్తు చేశారు. అమరావతి బిల్లులో రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. అక్కడి రైతులకు ఇప్పటివరకు ప్లాట్లు ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్లాట్లు ఇవ్వని కారణంగా ఆందోళన చెందిన ఓ రైతు గుండెపోటుతో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై తాము పార్లమెంట్‌లో పోరాడతామని తేల్చి చెప్పారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెడికల్ కాలేజీలను పీపీపీ పేరిట ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైన విషయాన్ని మరోసారి అఖిలపక్షానికి తెలిపినట్టు మిథున్‌రెడ్డి చెప్పారు. ఇలా చేయడం వల్ల అనేక మంది విద్యార్థులు నష్టపోతున్నారని వివరించారు. ప్రైవేటీకరణ అనేది ఒక స్కామ్ అని, అందుకే టెండర్లు ఎవరూ వేయలేదన్నారు. కేంద్రమే నిధులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

2,450 సీట్లు కోల్పోతున్నాం

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ పక్షనేత పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలను పీపీపీలో నిర్మించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల జరిగే నష్టాన్ని అఖిలపక్షం ముందుకు తీసికెళ్లినట్టు చెప్పారు. పీపీపీ విధానం వల్ల రెండేళ్లలో 2,450 మెడికల్ సీట్లను కోల్పోతున్నామనే విషయాన్ని వివరించామన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం వలన 2,450 పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు సైతం మనోవేదనకు గురవుతున్న విషయాన్ని తెలిపామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి ఏ ఒక్క హామీని అమలు చేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు.

పార్లమెంట్‌లో పోరాడతాం

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కూటమి అరాచక విధానాలపై పోరాడతామని ఎంపీలు మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్ చెప్పారు. ఇందుకోసం తమతో పాటు వైఎస్సార్‌సీపీ ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, డాక్టర్ గురుమూర్తి, డాక్టర్ గుమ్మా తనూజారాణి, రాజ్యసభ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, నిరంజన్‌రెడ్డి, అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, గొల్ల బాబూరావు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 'కూటమి ప్రభుత్వం 20 నెలల వ్యవధిలో చేసిన దాదాపు రూ.4లక్షల కోట్లు అప్పు గురించి నిలదీస్తాం. రెడ్‌బుక్ పేరిట వైఎస్సార్‌సీపీ నేతలపై జరుగుతున్న దాడులపై ప్రశ్నిస్తాం. ఇటీవల దళిత నేత సాల్మన్ హత్యపైన, సూపర్–6 పేరుతో ప్రజలను మభ్యపెట్టిన విధానంపైన కూటమి ఎంపీలను నిలదీస్తాం. పోలవరానికి నిధులు తీసుకురావడంలో వైఫల్యం చెందుతున్నారు, డ్యామ్ ఎత్తు తగ్గించడం వల్ల నిధులు తగ్గాయి. వీటిపైనా ప్రశ్నిస్తాం' అని ఎంపీలు చెప్పారు.

అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదు

వైఎస్సార్‌సీపీ నేతలు, కేడర్‌కు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ భరోసా

జగన్‌ను కలిసిన మాజీ మంత్రి జోగి సోదరులు



వైఎస్ జగన్‌తో జోగి రమేష్, ఆయన కుమారుడు జోగి రాజీవ్, సోదరుడు జోగి రాము

సాక్షి,అమరావతి: అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని వైఎస్సార్‌సీపీ నేతలు, కేడర్‌కు పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులను దీటుగా ఎదుర్కొందామని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అన్యాయంగా ఇరికించిన నకిలీ మద్యం అక్రమ కేసులో అరెస్టై.. 83 రోజుల పాటు జైల్లో ఉండి ఇటీవలే విడుదలైన పార్టీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాము మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో జగన్‌ను కలిశారు. తమను, తమ కుటుంబాన్ని అక్రమ కేసులతో టీడీపీ ప్రభుత్వం ఇబ్బంది పెట్టిన తీరును జోగి సోదరులు జగన్‌కు వివరించారు. పార్టీ లీగల్ సెల్ నుంచి అవసరమైన న్యాయ సహాయం అందుతుందని వారికి వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. జోగి కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను తెలుసుకుని వారందరికీ వైఎస్ జగన్ ధైర్యం చెప్పారు.

భగ్గుమన్న పొగాకు రైతులు

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం వెలుపల ఆందోళన చేస్తున్న పొగాకు రైతులు

టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద ఆందోళన

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద పొగాకు రైతులు భగ్గుమన్నారు. సిగరెట్లపై 70 శాతానికి పైగా పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని తక్షణమే ఉపసంహరింపచేయాలని ఆందోళన చేశారు. నెల్లూరు, ప్రకాశం, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన 400 మందికిపైగా పొగాకు రైతులు తరలివచ్చి కార్యాలయం బయట ఆందోళన చేశారు. కేంద్రం తీసుకున్న పెంచిన సుంకాలను తక్షణమే ఉపసంహరింప చేయకపోతే పొగాకు రైతులతోపాటు పరిశ్రమపై ఆధారపడిన లక్షలాదిమంది జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా పొగాకు సంఘాల ప్రతినిధులు సీఎంను కలిశారు. ఎక్సైజ్ సుంకం పెంపు వల్ల పరిశ్రమకు కలిగే నష్టాలను వివరించారు. ఇప్పటికే మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి వల్ల ధర లేక ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పెంచిన ఎక్సైజ్ సుంకం ప్రభావం వలన పొగాకు మార్కెట్ పూర్తిగా దెబ్బతిన్నదని చెప్పారు. మార్కెటింగ్ సీజన్‌కు ముందే ఈ ప్రభావం క్షేత్ర స్థాయిలో కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ సుంకాన్ని భారీగా పెంచడం వలన అక్రమ సిగరెట్ల వ్యాపారం, అక్రమ రవాణా పెరిగిపోతోందన్నారు. పన్నులు చెల్లించని, నియంత్రించని ఉత్పత్తులు మార్కెట్‌ను ఆక్రమించడమే కాక, నాసిరకం ఉత్పత్తుల కారణంగా ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు. సుంకం పెంపు వల్ల ఎఫ్‌సీవీ పొగాకును అత్యధికంగా ఉత్పత్తి చేసే ఆంధ్రప్రదేశ్‌కు అపార నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. తక్షణమే కేంద్రం సుంకం పెంపును వెనక్కి తీసుకునేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రైతు ప్రతినిధులు చంద్రబాబును డిమాండ్ చేశారు. అనంతరం పొగాకు రైతులు మీడియాతో మాట్లాడుతూ సీఎం సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని వివరించారు.

ఏఐఎస్‌ఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్

సాక్షి, అమరావతి: ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏఐఎస్‌ఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడిగా ఏపీ ఎన్జీజీవో అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్ ఎన్నికయ్యారు. మహారాష్ట్రలోని షిరిడీలో జరిగిన ఫెడరేషన్ 18వ జాతీయ మహాసభల్లో ఆయన ఈ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 80 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అత్యంత ప్రాధాన్యత కలిగిన సంఘానికి జాతీయ ఉపాధ్యక్షుడిగా రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఎన్నకవడంపై పలు ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఏపీఎన్జీజీఓ సంఘానికి చెందిన డీవీ రమణ, రాజ్యలక్ష్మి, శాంతి ఫెడరేషన్ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

'కంది' రైతుకు అండగా ఉంటాం

సాక్షి, అమరావతి: కందులకు మద్దతు ధర దక్కని మాట వాస్తవమేనని, ఈ కారణంగానే కేంద్రం అనుమతితో కందులను సేకరిస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. 'కంది'పోతున్న రైతు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందిస్తూ కేంద్రం 1.17 లక్షల టన్నుల సేకరణకు అనుమతిచ్చిందని తెలిపారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన 412 మార్క్‌ఫెడ్, నాఫెడ్ కేంద్రాల ద్వారా 12,592 మంది రైతుల నుంచి రూ.197 కోట్ల విలువైన 24,613 టన్నుల కందులను సేకరించామన్నారు. మద్దతు ధర దక్కని రైతులకు అండగా నిలుస్తామన్నారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ నాపై లైంగిక దాడి చేశారు

రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రోత లీలలను సెల్ఫీ వీడియోలో బహిర్గతం చేసిన బాధితురాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ కూటమి పాలనలో విచ్చలవిడిగా సాగుతున్న అకృత్యాలు, అరాచకాలతో సామాన్యులకు, ముఖ్యంగా మహిళల భద్రతకు దిక్కులేకుండా పోయింది. సాక్షాత్తూ కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులే కీచకులుగా మారిపోయి పశువుల మాదిరిగా బరి తెగించి మహిళలపై నిర్భీతిగా లైంగిక దాడులకు తెగబడటం నివ్వెరపరుస్తోంది. తాజాగా తిరుపతి జిల్లా రైల్వేకోడూరు కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కీచక పర్వం సర్వత్రా కలకలం రేపుతోంది. బాధ్యతాయుతమైన ప్రజా ప్రతినిధిగా వ్యవహరించాల్సిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కామ పిశాచిలా మారిపోయి ఓ వివాహితను దారుణంగా వేధించి దౌర్జన్యాలకు తెగబడటం పట్ల సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు ఏడాదిన్నరగా ఈ అకృత్యాన్ని భరిస్తూ వచ్చిన బాధితురాలు ఇక తట్టుకోలేక ఈ దారుణాన్ని సెల్ఫీ

నగ్నంగా వీడియో కాల్ మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

వీడియో ద్వారా మంగళవారం బహిర్గతం చేశారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తనతో జరిపిన నికృష్టమైన చాటింగ్‌లు, అసహ్యం పుట్టించే

ఎమ్మెల్యే శ్రీధర్ బాధితురాలు

నగ్న వీడియోలను సాక్ష్యాధారాలుగా చూపించారు. ఈ కీచక పర్వంపై బాధితురాలు వెల్లడించిన వివరాలు ఇవీ..

జుట్టు పట్టుకుని కొట్టి.. కారులో రేప్ చేశారు!

నేను రైల్వే కోడూరు ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నా. ఎన్నికల అనంతరం 2024 జూన్ 14న స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు అభినందనలు తెలుపుతూ ఫేస్‌బుక్ ద్వారా ఓ మెసేజ్ పెట్టా. టెలిగ్రామ్ యాప్‌లో మాట్లాడదామంటూ ఆయన నాకు అందులో మళ్లీ మెసేజ్ చేశారు. నా గురించి వివరాలు తెలుసుకున్నారు. నా ఫోన్ నెంబర్ తీసుకుని, ఆయన నెంబర్ నాకు ఇచ్చారు. నా భర్త నాకు దూరంగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, నువ్వు ఒంటరివి కాదు.. నీకు నేనున్నానంటూ హామీ ఇచ్చారు. మొదటి రోజే రెండు మూడు గంటలు పాటు మాట్లాడారు. రెండు రోజులకే వీడియో కాల్ చేసి నగ్నంగా చూపించాలని (న్యూడ్స్) నన్ను అడిగారు. అది కరెక్ట్ కాదని చెప్పినా వినకుండా బెదిరించి, బలవంతం చేశారు. నువ్వొక చిన్న ఉద్యోగివి.. నీమీద ఎంక్వైరీ వేస్తాం.. నీ కుమారుడితో ఒంటరిగా ఉంటున్నావు.. నీ కుమారుడికి ఏమైనా అయితే తరువాత నన్ను అడగొద్దు.. జాగ్రత్త! అంటూ భయపెట్టారు. నీ భవిష్యత్తు నాశనం కాకూడదంటే నన్ను కలిసి తీరాల్సిందేనని హెచ్చరించారు. దీంతో నేరుగా కలసి ఆయనకు అర్థం అయ్యేలా చెప్పాలనే ఉద్దేశంతో 2024 జూలై 9న మొదటిసారి కలిశా. మా ఇంటి దగ్గరకు వచ్చి నన్ను కారులో తీసుకెళ్లారు. కడప మార్గంలో రాజంపేట దగ్గర నిర్మానుష్య ప్రాంతంలో కారు ఆపి నన్ను లైంగికంగా వేధించారు. నేను వద్దంటూ వారించి, విడిపించుకోవడానికి ఎంతగా ప్రయత్నం చేసినా, కారు డోర్ తెరిచి తప్పించుకోవాలని ప్రయత్నించినా కుదరలేదు. నేను అరుస్తుంటే జుట్టు పట్టుకుని గట్టిగా కొట్టి కారులోనే రేప్ చేశారు. ఈ విషయం ఎవరికైనా చెబితే నన్ను, నా కుటుంబాన్ని నాశనం చేస్తానని హెచ్చరించారు. ఆ తరువాత మళ్లీ మళ్లీ నన్ను కలుస్తూనే ఉన్నారు.

ఐదుసార్లు గర్భం తీయించారు..

ఆగస్టులో నాకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వల్ల గర్భం రావడంతో అబార్షన్ చేయించుకోమని చెప్పారు. రెండు మూడు రోజులు బెదిరించిన తరువాత నా భర్తకు విడాకులు ఇస్తే పెళ్లి చేసుకుంటానని నమ్మించారు. రెండు నెలలు వరకూ అబార్షన్ చేయించుకోకపోవడంతో ఇంటికి వచ్చి నన్ను బాగా కొట్టేవారు. ఆ తరువాత అబార్షన్ చేయించుకున్నా. అలా ఏడాదిన్నరలో ఐదుసార్లు అబార్షన్ చేయించారు. నాకు ఇష్టం లేదని చెప్పినా వినకుండా బయటకు తీసుకువెళ్లడం లేదా ఇంటికి వచ్చి నన్ను లైంగికంగా వాడుకున్నారు. నేను ఇంటి తలుపులు తెరవకపోతే ఎమ్మెల్యే అని కూడా మర్చిపోయి గుమ్మం ముందు నిలబడే ఉండేవారు. అంతేకాకుండా నా భర్త, కుటుంబ సభ్యుల వివరాలు, ఫోన్ నెంబర్లు తెలుసుకుని వారికి ఫోన్లు చేశారు. నాకు విడాకులు ఇవ్వాలని నా భర్తకు ఫోన్ చేసి బెదిరించారు. దీంతో అందరూ నా నుంచి దూరమైపోయారు. నా బిడ్డ కూడా గత ఆరు నెలలుగా నాతో లేడు. ఇలా నన్ను అన్ని విధాలుగా ఒంటరిని చేసిన తరువాత.. నన్ను పెళ్లి చేసుకోవడం కుదరని, దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరించారు. ఏడాదిన్నరగా నన్ను వేధించి, వాడుకుని ఇప్పుడు వదిలేస్తానంటున్నారు. ఆయన స్నానం చేస్తున్నప్పుడు కూడా నేను వీడియో కాల్ చేయాలనేవారు. నన్ను నగ్నంగా చూడాలనేవారు. నాతోనే కాకుండా ఆ ఎమ్మెల్యే ఇలా చాలా మంది మహిళలను వేధించారు. నాకు న్యాయం కావాలి!

కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అరాచకాలను వివరిస్తున్న బాధితురాలి వీడియో కోసం క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి

కామ కూటమి

అధికారాన్ని అడ్డం పెట్టుకొని మహిళలపై కూటమి పార్టీ నేతల ఆగడాలు
అరవ శ్రీధర్, ఆదిమూలం, నజీర్, కూన రవి, కిరణ్ రాయల్, జానీ మాస్టర్ అంతా ఇదే తీరు

- ఈ అరాచక పర్వాన్ని కట్టడి చేయకపోగా.. బాధితులకు అండగా నిలిచే వారిని కిరాయి వక్తలు, కిరాయి మాధ్యమాల కుయుక్తులుగా అభివర్ణించిన కూటమి పెద్దలు
- రైల్వే కోడూరు ఎమ్మెల్యేకు ఏరికోరి ప్రభుత్వ విప్ పదవి
- అరవ శ్రీధర్ కీచక పర్వం కూటమి నేతలకు ముందే తెలుసా?
- ఏపీలో 30 వేల మంది యువతులు అదృశ్యమంటూ గత ప్రభుత్వంపై దుష్ప్రచారం
- ఇప్పుడేమో కూటమి ఎమ్మెల్యేలే ప్రభుత్వ ఉద్యోగులైన మహిళలపై దాష్టీకం
- నిఘా వర్గాలు కూటమి పెద్దలకు చెప్పలేదా అంటూ నెటిజన్ల విమర్శలు

సాక్షి, అమరావతి: అధికారాన్ని అడ్డం పెట్టుకుని కూటమి పార్టీల నేతలు కామకూట విషం గక్కుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులైన మహిళలనే బెదిరించి.. బ్లాక్ మెయిల్ చేసి.. విశృంఖలంగా లైంగిక దాడులు కొనసాగిస్తుండటం చూస్తుంటే ఇక సామాన్య మహిళల సంగతేమిటంటూ సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ విప్ పదవిలో ఉన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తనను బెదిరించి ఏడాదిన్నరగా లైంగిక దాడికి పాల్పడటంతోపాటు ఐదుసార్లు గర్భవతిని చేసి అబార్షన్ చేయించినట్లు బాధితురాలు స్వయంగా చెప్పిన వీడియో మంగళవారం ప్రధాన మీడియా, సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇలాంటి ఘటనలు ఎన్నో వెలుగు చూసినా కూటమి పెద్దల నుంచి కనీస స్పందన లేదు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి కూటమి నేత కిరణ్ రాయల్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నజీర్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి మద్దతుదారు జానీ మాస్టర్.. ఇలా ఎంతో మంది దురాగతాలు బట్టబయలు కావడం కలకలం రేపింది. ఇక నియోజకవర్గాల్లో కూటమి పార్టీల ద్వితీయ శ్రేణి నేతల ఆగడాలు, మహిళలపై వేధింపులు తరచూ బయట పడుతూనే ఉన్నాయి. స్థానిక నేత తనను మోసం చేశారంటూ అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం పోలీసు స్టేషన్‌లో పది రోజుల క్రితం ఓ మహిళ ఫిర్యాదు చేశారు. కూటమి అధికారంలోకి వస్తే ఆడపిల్లల వైపు కన్నెత్తి చూడాలన్నా భయపడేంత కఠినంగా చట్టాలు అమలు చేస్తామన్న ఆయా పార్టీల పెద్దలు.. ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు ఇలా మహిళలను దారుణంగా వేధిస్తున్నా.. బహిరంగ వీడియోల్లో రాసలీలలు కొనసాగిస్తూ అడ్డంగా దొరికినా.. బెదిరించి గర్భవతులను చేసి అబార్షన్లతో ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్నా కనీసం కట్టడి చేయక పోవడంపై జనం నివ్వెరపోతున్నారు.

మహిళతో వీడియో కాల్ మాట్లాడుతున్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ (ఫైల్)

ఎమ్మెల్యే కూనరవి వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసిన రేజేటి సౌమ్య (ఫైల్)

తిరుపతిలో కిరణ్ రాయల్ ఆగడాలను వివరిస్తున్న బాధిత మహిళ (ఫైల్)

అసభ్య నృత్యాలు చేస్తున్న మంత్రి సుభాష్ (ఫైల్)

మహిళతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం (ఫైల్)

కిరణ్ రాయల్ వికృత చేష్టలు

తిరుపతి కూటమి నేత కిరణ్ రాయల్ వికృత చేష్టలు గత ఏడాది ఫిబ్రవరి 8న బాధిత మహిళ రిలీజ్ చేసిన వీడియో ద్వారా బయపడ్డాయి. తిరుపతి రూరల్ మండలం చిగురువాడకు చెందిన ఆమెతో కిరణ్‌రాయల్ చనువు పెంచుకుని డబ్బులు అడిగేవారని, కిరణ్ రాయల్‌కు అప్పులు చేసి మరీ రూ.1.20 కోట్లు, 25 సవర్ల బంగారు ఆభరణాలు ఇచ్చినట్టు బాధితురాలు ఆరోపించింది. ఆ తర్వాత డబ్బులు అడిగితే రాయల్ బెదిరింపులకు దిగుతున్నారని ఆమె వీడియో రిలీజ్ చేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆ తరువాత కూటమి పెద్దలు ఆమెకు, కిరణ్ రాయల్ మధ్య బలవంతంగా రాజీ కుదిర్చారు.

ఆదిమూలం.. అరాచకం

సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కూడా కేవీబీపురం మండలంలో ఓ మహిళా నేతను బెదిరించి రాసలీలలు సాగించారు. ఆనక ఆమెను మోసం చేసి బెదిరింపులకు గురిచేశారు. అరాచకాలకు తెగబడ్డారు. ఈ వ్యవహారంపై బాధితురాలు బయటకు వచ్చి చెప్పడంతో ఆయన అసలు రంగు బయటపడింది.

మంత్రి సుభాష్ అశ్లీల నృత్యాలు

సంక్రాంతి సంబరాల పేరుతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బహిరంగంగా చేసిన అశ్లీల నృత్యాలు తీవ్ర విమర్శలకు దారి తీశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గంలోని ఏఎస్ఎన్ కాలేజీలో సంక్రాంతి సంబరాల పేరిట ఇటీవల మ్యూజికల్ నైట్‌లు, డ్యాన్స్‌లు నిర్వహించారు. బుల్లితెర నటులు, జబర్దస్త్‌లో మహిళా క్యారెక్టర్లు వేసే నటులతో కలిసి మంత్రి సుభాష్ పండగ మూడు రోజులూ పలు పాటలకు అసభ్యంగా చిందులు వేశారు. ఈ వీడియోలు సామాజికమాధ్యమాల్లో చక్కర్లుకొట్టడంతో మంత్రిపై విమర్శలు వెల్లువెత్తాయి. అయినా మంత్రి తన నృత్యాలను సమర్థించుకున్నారు. 'నేను మంత్రి అయినా, ఎమ్మెల్యే అయినా నేను నేనుగానే ఉంటాను. ఇలానే ఉంటాను' అంటూ వింత వాదనకు దిగారు.

బెత్తంతో కొట్టి తోలు తీసే చట్టాలేవి?

ఈవ్ టీజింగ్‌కు పాల్పడేవారిని, ఆడపిల్లలను అభద్రతా భావానికి గురిచేసే వారిని పది మంది చూస్తుండగా వాతలు తేలిపోయే బెత్తంతో కొట్టి తోలు తీసే చట్టాలు రావాలని కూటమి పెద్దలు పలు సందర్భాల్లో చెప్పారు. అధికారంలో లేనప్పుడైతే.. తమకు కేంద్ర నిఘా వర్గాలు చెప్పాయని, రాష్ట్రంలో 30 వేల మంది యువతులు అదృశ్యమయ్యారంటూ ఆరోపణలు చేశారు. మరి ఇప్పుడు వారే ప్రభుత్వ పెద్దలుగా కొనసాగుతుండడంతో పాటు కేంద్రంలోని ఎన్డీఏలో మిత్రపక్షంగానూ ఉన్నారు. మరి రాష్ట్రంలో మహిళలపై కూటమి నేతల అఘాయిత్యాలు, కీచక పర్వాలపై నిఘా వర్గాల నుంచి ముందస్తు సమాచారం లేదా? లేదంటే తెలిసీ మౌనంగా ఉన్నారా? అనే ప్రశ్నలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. దీనిపై సోషల్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. కాగా, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తనను బెదిరించి ఏడాదిన్నరలో ఐదుసార్లు గర్భవతిని చేసి, అబార్షన్లు చేయించారన్న బాధితురాలి వీడియో వెలుగులోకి రావడానికి ముందు కూటమి పెద్దల్లో ఒకరు విడుదల చేసిన ప్రకటన ఇప్పుడు రాజకీయ సంచలనంగా మారింది. కొందరి వివాహేతర సంబంధాలను పార్టీపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆ ప్రకటనలో చెప్పుకొచ్చారు. తద్వారా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కీచక పర్వంపై వారికి ముందుగానే సమాచారం ఉందా? అని విస్తృతంగా చర్చ జరుగుతోంది. బాధితురాలిపైనే ఎదురు దాడికి దిగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూన రవి వేధింపులకు దళిత ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులు తాళలేక ఓ దళిత మహిళా ఉద్యోగి, పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య గతేడాది ఆగస్టు 18న ఆత్మహత్యకు యత్నించారు. అంతకు ముందు ఆమె శ్రీకాకుళం తిలక్‌నగర్‌లోని తన నివాస గృహంలో ఓ ఎలక్ట్రానిక్ మీడియాకు రవి వేధింపులపై ఇంటర్వ్యూ ఇచ్చారు. అనంతరం తన గదిలోకి వెళ్లి బీపీ స్టెరాయిడ్ ట్యాబ్లెట్లు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. మాట్లాడుతూ.. పక్కకు తూలిపోవడంతో ఆమెను వెంటనే రిమ్స్‌కు తరలించారు. వైద్యులు 48 గంటల పర్యవేక్షణలో ఉంచారు. ఎమ్మెల్యే వేధింపుల వల్లే తనకీ దుస్థితి వచ్చిందని, ఆయన తన కార్యకర్తల చేత తనపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిస్తున్నారని, తరచూ వీడియో కాల్‌లో మాట్లాడుతూ వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరుల వల్ల తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

అరవ అ'రాస'కత్వాలెన్నో..

- శ్రీధర్ నన్నే కాదు.. కాలేజ్ అమ్మాయిలనూ వేధించారు
- నేను చూపించిన ఆధారాలన్నీ వాస్తవాలు.. కావాలంటే పోలీసులు చెక్ చేసుకోవచ్చు: ఎమ్మెల్యే బాధిత మహిళ

స్నానం చేస్తూ వీడియోకాల్ మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

సాక్షి, అమరావతి: రైల్వే కోడూరు కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అరాచకత్వం అంతా ఇంతా కాదని, అతని చేతిలో లైంగిక వేధింపులకు ఎందరో గురయ్యారని బాధిత మహిళా ఉద్యోగిని విమర్శించారు. శ్రీధర్ తల్లి తనపై చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. శ్రీధర్ తననే కాకుండా మరికొందరు కాలేజ్ అమ్మాయిలనూ లైంగికంగా వేధించారని, వారిని లోబరుచుకోవడానికి యత్నించారని ఆమె వెల్లడించారు. ఆ విషయాన్ని కూటమి నేత తాతంశెట్టి నాగేంద్ర స్వయంగా తనతో ఫోన్‌లో చెప్పారని, ఇప్పుడు అదే నేత తనను తప్పుపడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఆమె ఏమన్నారంటే.. శ్రీధర్ తల్లి, కూటమి నేత తాతంశెట్టి నాగేంద్ర విలేకరుల సమావేశం పెట్టి, నేను చూపించిన వీడియోలు డీప్ ఫేక్ అని అంటున్నారు. ఇదే నాగేంద్ర నాలుగు రోజల కిందట నాకు ఫోన్ చేసి మాట్లాడారు. అరవ శ్రీధర్ లైంగిక వేధింపుల గురించి మరిన్ని వివరాలు నాగేంద్ర నాతో చెప్పారు. ''శ్రీధర్ నిన్ను మోసం చేశాడు. నిన్నే కాదు నా కొడుకు చదివే కాలేజీలో ఉండే అమ్మాయిలు కూడా కంగ్రాట్స్ చెప్పడానికి మెసేజ్ చేస్తే వాళ్లతో కూడా రాంగ్ ట్రాక్ నడిపాడు. డీప్ ఫ్లర్ట్ చేశాడు'' అని అన్నారు. నా దగ్గర ఆ కాల్ రికార్డింగ్ ఉంది. అంతేకాదు ఫ్రీగా ఉన్నప్పుడు ఫోన్ చేయాలని నాకు మెసేజ్ కూడా చేశారు. శ్రీధర్ కూడా అవన్నీ ఫేక్ వీడియోలు అని కౌంటర్ వేశారు. నా సెల్‌ఫోన్‌ను తీసుకుని అందులో ఉన్న ఈ వీడియోలు ఒరిజనల్ అవునో కాదో పోలీసులు పరిశీలిస్తే తేలుతుంది. ఏడాదిన్నరగా బయటకు రాకపోవడానికి కారణం.. ముందు నేను శ్రీధర్ తల్లిదండ్రులు, మాజీ ఎమ్మెల్యే రూపానంద రెడ్డితో మాట్లాడాను. కానీ నేను ఏం చెప్పినా వారు అతనిని మందలించకుండా, అతనిని కాపాడటం కోసం నన్ను తప్పుపడుతున్నారు. ఎలాంటి విచారణకైనా నేను కూడా సిద్ధంగా ఉన్నాను. నాకు న్యాయం జరిగే వరకూ పోరాడతాను.

అరెస్టు చేసే దమ్ముందా?

అమ్మా.. హోంమంత్రి అనితమ్మా.. ఈ దారుణమైన మీ కూటమి రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ని అరెస్ట్ చేసే దమ్ముందా? లేదా? ఈ బాధితురాలికి న్యాయం చేసే బాధ్యత మీకు ఉందా? లేదా?

- వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు

సీఎం, డిప్యూటీ సీఎం నోరు విప్పాలి

రాష్ట్రంలో మహిళలకు, మహిళా ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందనడానికి కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మహిళా ఉద్యోగినిపై చేసిన లైంగిక దాడి ప్రత్యక్ష నిదర్శనం. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత ఏం సమాధానం చెబుతారు. వారు నోరు విప్పాలి.

- పాముల పుష్పశ్రీవాణి, మాజీ డిప్యూటీ సీఎం

మహిళలకు రక్షణ లేదు

ఎవరైనా మహిళల జోలికి వస్తే అదే చివరి రోజు అని మాట్లాడిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అరాచకాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ఒకటి మాత్రం వాస్తవం. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు.

- విడదల రజిని, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత

అకృత్యాలపై మౌనమేల?

ప్రజాప్రతినిధులే మహిళలపై వేధింపులకు పాల్పడుతున్నారంటే రాష్ట్రంలో ఎంతటి దుస్థితి నెలకొందో చెప్పాల్సిన పనిలేదు. జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అకృత్యాలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత ఎందుకు మౌనంగా ఉన్నారు?

- రోజా, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత

ఆవు చేలో మేస్తే అరవ శ్రీధర్ గట్టున మేస్తాడా?

ప్రభుత్వ ఉద్యోగి అయిన ఓ ఒంటరి మహిళను బెదిరించి, కూటమి రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ లైంగిక దాడిచేసిన వ్యవహారం బయటకు రావడంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి..

- ఆవు చేలో మేస్తే అరవ శ్రీధర్ గట్టున మేస్తాడా అంటూ సామాజిక మాధ్యమాల్లో మీమ్స్ చక్కర్లు కొడుతున్నాయి.
- ఇంత దారుణంగా ఆధారాలతో సహ ఎమ్మెల్యే లైంగిక వేధింపులు వెలుగులోకి వచ్చినా కూటమి పెద్దలు అతనిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.
- కూటమి ఎమ్మెల్యేలు ఎన్ని అరాచకాలకు పాల్పడుతున్నా కాపాడుకునే యత్నంలో భాగంగా ముందుగానే లేఖలు విడుదల చేస్తున్నారా.. అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.
- చిన్న చిన్న వాటికే అతిగా స్పందించే పచ్చ మీడియా.. ఓ ఎమ్మెల్యే విషయంలో ఇంత జరుగుతున్నా..ఎందుకు స్పందించడం లేదని, ఎందుకు డిబేట్లు పెట్టడం లేదని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి, అమరావతి

సోషల్ మీడియాలో నెటిజన్లు పెట్టిన పోస్టులు, మీమ్స్



నువ్ మోసపోయావ్.. వదిలేయ్

సాక్షి, అమరావతి : ''ఇంక నిన్ను వాళ్లు కలుపుకోరు.. నువ్ మోసపోయావ్.. అయ్యిందేదో అయ్యింది.. నువ్ సర్దుకుపోవడం మంచిది' అంటూ రైల్వే కోడూరు కూటమి ఎమ్మెల్యే బాధిత మహిళతో కూటమి పార్టీ నేత తాతంశెట్టి నాగేంద్ర చెప్పిన మాటలివి. ఎమ్మెల్యే అరాచకాలు బయటకు రాకుండా ఆపేందుకు తెర వెనుక కూటమి నాయకులు ప్రయత్నించారు. ఇందులో భాగంగా అదే ప్రాంతానికి చెందిన కూటమి స్థానిక నేత తాతంశెట్టి నాగేంద్ర స్వయంగా బాధితురాలికి నాలుగు రోజుల క్రితం ఫోన్ చేసి మాట్లాడారు. శ్రీధర్ ఇంటిలో ఒప్పుకోవడం లేదని, జరిగింది మరచిపోయి సర్దుకుపోవాలని సలహా ఇచ్చారు. ఇంకా అతనే కావాలని వెళితే మళ్లీ మళ్లీ మోసపోవడం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. నీ కొడుకు కోసం అన్నీ వదిలేసి ముందుకు వెళ్లిపోవాలంటూ సలహా ఇచ్చారు. నిన్ను దూరం చేసుకుంటున్నందుకు ఎమ్మెల్యే బాధపడతారని తాను అనుకోవడం లేదని నాగేంద్ర అన్నారు. బెంగుళూరులో తన కుమారుడు చదివే కాలేజీ అమ్మాయిలతోనూ ఎమ్మెల్యే శ్రీధర్ ఫ్లర్ట్ (లోబరుచుకునే ప్రయత్నం) చేశారని, ఆ విషయం తన కుమారుడి ద్వారా తెలిస్తే తాను ఆ విషయం బయటకు రాకుండా సర్ది చెప్పానని ఆయన కొత్త విషయాన్ని బయటపెట్టారు.

నిరుద్యోగులకు శుభవార్త
మన క్యాపిటల్ అమరావతిలో ప్రముఖ అపార్టుమెంట్స్ నిర్మాణ సంస్థలో పని చేయుటకు
మార్కెటింగ్ స్టాఫ్ కావలెను.
మంచి జీతంతో పాటు ఇన్సెంటివ్ + TA ఇవ్వబడును.
ఇంటర్వ్యూ తేదీలు: 28 to 31 Jan | Timings: 9 AM to 7 PM
MR CONSTRUCTIONS
J.N.R Complex, 3rd Floor, D.No: 4-4-130/1, Opp. Don Basco, Chandramouli Nagar, Guntur-522007.
Ph: 90001 33866, 89777 43774

"చిన్న కాలువలు పెద్ద శబ్దంతో ప్రవహిస్తాయి.
పెద్ద ప్రవాహాలు నిశ్శబ్దంగా సాగిపోతాయి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 28 జనవరి 2026

చిరకాల ఆకాంక్ష

ఆలోచనకూ, అది సాకారం కావటానికీ మధ్య ఇరవై రెండేళ్ల సుదీర్ఘకాలం పట్టిందంటే కొంత ఆశ్చర్యం కలుగుతుంది. భారత్, యూరోపియన్ యూనియన్(ఈయూ)ల మధ్య మంగళవారం సంతకాలైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) వెనక ఇలాంటి ఆశ్చర్యపోయే సంగతులు చాలానే ఉన్నాయి. బహుశా 'నియమాల ఆధారిత' అంతర్జాతీయ క్రమాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ధ్వంసించటం మొదలెట్టకపోతే ఈ ఎఫ్‌టీఏకు మరికొంత సమయం పట్టేదేమో! ఈయూతో ఒప్పందమంటే ఆర్థిక స్థోమత పుష్కలంగా ఉన్న 27 యూరోప్ దేశాలతో బహువిధ రంగాల్లో ప్రగాఢమైన అనుబంధం ఏర్పడటమే! అందుకే ఈ ఒప్పందాన్ని 'సకల ఒప్పందాలకూ తల్లిలాంటిద'ని చెప్పటంతో పాటు, దీన్ని కేవలం వాణిజ్య ఒప్పందంగా కాక, ఉమ్మడి శ్రేయస్సు కోసం రూపొందించిన 'బ్లూ ప్రింట్'గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత్, ఈయూలు రెండూ ప్రపంచ జీడీపీలో 25 శాతం, వాణిజ్యంలో మూడోవంతు వాటా కలిగివున్న రెండు ప్రధాన ఆర్థికవ్యవస్థలు. విడిగా చూస్తే మన దేశం ప్రపంచంలో నాలుగో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. కూటమిగా ఈయూ రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. ఉక్రెయిన్ యుద్ధం వంటి ఆటుపోట్లు... అమెరికా, చైనాల నుంచి తీవ్రమైన పోటీ ఉన్నా ఈయూ ఆర్థిక వ్యవస్థ నిలబడగలుగుతోంది. మన డెయిరీ రంగానికి ఎఫ్‌టీఏలో మినహాయింపు ఇచ్చేందుకు ఈయూ అంగీకరించింది. అయితే చిన్న, మధ్యతరహా సంస్థల ప్రవేశానికీ, సర్వీసుల రంగానికీ మన దేశం వెసులుబాటు నిచ్చింది. కార్ల దిగుమతిపై ఉన్న 110 శాతం సుంకాలు పది శాతానికి పడిపోతాయి.

ఎన్నడో 2004లో ఒక ఆలోచనగా బయల్దేరిన ఎఫ్‌టీఏ జాప్యం కావటంలో ఈయూ మొండి వైఖరే ప్రధాన కారణం. అసలు దానిపై చర్చల ప్రారంభానికే మూడేళ్లు పట్టింది. అప్పట్లో ఈయూకు చైనాయే ఇష్టసఖి. అందుకే భారత్‌ను పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ అమెరికాతో మనకు కుదిరిన పౌర అణు ఒప్పందం '123' దాని కళ్లు తెరిపించింది. 2013లో ఎఫ్‌టీఏ కోసం ఈయూ విధించిన షరతులు లీకైనప్పుడు నిరసనలు వెల్లువెత్తాయి. మేధాసంపత్తి హక్కుల పేరిట తన ఫార్మా రంగాన్ని రక్షించుకోవటానికి ఎఫ్‌టీఏలో ఈయూ పెట్టిన నిబంధన మన ప్రజారోగ్య రంగానికి చేటు తెస్తుందని, జెనెరిక్ మందుల ఉత్పత్తి నిలిచిపోతుందని ఆక్స్‌ఫామ్ వంటి సంస్థలు హెచ్చరించాయి. సాగు రంగంపై అది చూపగల ప్రభావంపైనా భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ఇవి గాక అనంతర కాలంలో కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తినిచ్చే 370వ అధికరణం రద్దు, పౌరసత్వ సవరణ చట్టం వగైరాలు ఈయూకు అభ్యంతరకరం అనిపించాయి. ఈమధ్య పలు దేశాలతో మనకు ఎఫ్‌టీఏలు కుదిరాయి. ఆస్ట్రేలియా, బ్రిటన్, న్యూజిలాండ్, ఒమన్, మారిషస్, యూఏఈలతోపాటు ఐస్‌ల్యాండ్, లిచెన్‌స్టీన్, నార్వే, స్విట్జర్లాండ్‌లతో కూడిన యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య సంఘం(ఈఎఫ్‌టీఏ)తో సైతం ఎఫ్‌టీఏలపై సంతకాలు చేసింది. ఈయూతో సంబంధంలేని కూటమి ఈఎఫ్‌టీఏ.

ఉభయపక్షాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువ నిరుడు మార్చి ఆఖరునాటికి 13,600 కోట్ల డాలర్లు. ఈయూ సరుకుల ఎగుమతుల జాబితాలో భారత్‌ది అగ్రస్థానం. అయితే తాజా ఎఫ్‌టీఏ అమల్లోకి రావటానికి కొన్ని అవరోధాలున్నాయి. ఈ నెల 1 నుంచి కార్బన్ బోర్డర్ అడ్జెస్ట్‌మెంట్ మెకానిజం(సీబీఏఎం) పేరిట ఈయూ అమల్లోకి తెచ్చిన 'పర్యావరణ పన్ను' ప్రధాన అవరోధం. ఉక్కు, సిమెంట్, అల్యూమినియం, ఎరువుల వంటివి చవగ్గా ఉత్పత్తి చేయటానికి కర్బన ఉద్గారాల ముప్పును భారత్ పట్టించుకోవటం లేదని, అందుకే ఇది అవసరమని ఈయూ వాదన. దీన్ని మన దేశం ఖండిస్తోంది. కేవలం తమ ఉత్పత్తుల్ని రక్షించుకోవటానికి ఇదొక సాకు మాత్రమేనన్నది మన వాదన. సీబీఏఎం నుంచి భారత్‌కు మినహాయింపు ఇస్తుందా, అసలు దాని అమలునే ఈయూ వాయిదా వేస్తుందా అన్నది చూడాలి. ఇవిగాక ఆరోగ్యం, భద్రత ప్రమాణాలు... కార్మిక హక్కులు, పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం వంటివి కూడా ఉన్నాయి. కానీ ట్రంప్ దూకుడు నుంచి కాపాడుకోవాలంటే ఇలాంటి సాకులు వదులుకోక తప్పదు. మొత్తానికి 27 యూరోప్ దేశాల చట్టసభలతోపాటు ఈయూ పార్లమెంటు, మన పార్లమెంట్ ధ్రువీకరించాక ఎఫ్‌టీఏ అమలు మొదలవుతుంది. దానికెంత కాలం పడుతుందో చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.దశమి ప.2.35 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** కృత్తిక ఉ.7.51 వరకు, తదుపరి రోహిణి తె.6.09 వరకు (తెల్లవారితే గురువారం), **వర్జ్యం:** రా.10.45 నుండి 12.14 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.50 నుండి 12.34 వరకు, **అమృత ఘడియలు:** రా.3.10 నుండి 4.39 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.49
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

వంటింటి పాఠం!

వంట చేయటం మీకు చాలా నేర్పుతుంది. జీవితంలో మీరు తొందరపడకూడదని వంటింట్లోనే మీకు చక్కగా తెలుస్తుంది. మీరు షెఫ్ కానప్పటికీ మీరు అక్కడ ప్రయోగాలు చేయవచ్చు. అది మీకు జీవితంలో ప్రయత్నాల గొప్పతనం గురించి చెబుతుంది.

– హర్పాల్ సింగ్ సోఖి, 'ఎనర్జీ షెఫ్'

సిద్ధపడితే...

వైఫల్యానికి సిద్ధపడి ఉండటం విజయం సాధించటానికి స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. సిలికాన్ వ్యాలీలో బహుశా నేను అందరికంటే ఎక్కువగా విఫలం అయ్యాను. వైఫల్యానికి 90 శాతం అవకాశం ఉండొచ్చు, కానీ మిగిలిన 10 శాతంలో ప్రపంచాన్నే మార్చవచ్చు.

– వినోద్ ఖోస్లా, వెంచర్ క్యాపిటలిస్ట్

హ్యాండ్‌బ్యాగ్

కీర్తి అనేది అందమైన హ్యాండ్‌బ్యాగ్ లాంటిది. దానిని రాళ్లతో నింపుకుంటే అది మీ భుజాలకు బాధను కలిగిస్తుంది. కీర్తిని మీరు తేలిగ్గా మోయగలగాలి. ఎందుకంటే, అది కాంక్రీట్ నిర్మాణం కాదు. ఎల్లప్పుడూ కాంక్రీట్‌గా నిలబడి ఉండేదీ కాదు.

– శ్రుతీ హాసన్, నటి, గాయని

విలువలు



కెరీర్‌లో మీరు సాధించిన విజయం మీ తల్లితండ్రులు మీ చిన్నప్పుడు మీకు నేర్పించిన విలువలకు మిమ్మల్ని దూరం చెయ్యకూడదు. వృత్తిలో విజయం సాధించి, వ్యక్తిగా మీకు ఉండవలసిన వాటిని విస్మరిస్తే ఆ విజయానికి అర్థమే లేదు.

– సిరియాక్ జోసెఫ్, సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి

రానివ్వండి!

మనం సమస్యలను ఎదుర్కొన్నప్పుడు మాత్రమే అవి మాయమవుతాయి. వాటి నుంచి పారిపోతున్న కొద్దీ మరో వైపు నుంచి ఎదురవుతాయి. సమస్యల్ని వస్తే రానివ్వండి. అవి ఈ రోజు ఉంటాయి, రేపు వెళ్లిపోతాయి. సమస్యను అంగీకరించండి, సరిదిద్దండి!

– కార్లోస్ స్లిమ్ హెలూ, బిజినెస్ మేగ్నెట్

ఒప్పించాలి!

మీ శరీరం దేనినైనా తట్టుకోగలదు. మీరు ఒప్పించాల్సింది మీ మనసునే! ఇక క్రమశిక్షణ అంటే, మీ మనసు అంగీకరించక పోయినా, చేయాల్సిన పనిని చేసి తీరటమే! జీవితానికి పనికొచ్చేది చాలా వరకు క్రమశిక్షణే తప్ప, ఇష్టమైన పనులు కాదు.

– ల్యూక్ కౌటిన్హో, కెరీర్ కోచ్

ఈసారి రాజకీయ దావోస్

సందర్భం



టంకశాల అశోక్

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో 'ప్రపంచ ఆర్థిక సదస్సు'లు ఇంతకుముందు 1971 నుంచి 55 సార్లు జరిగాయి గానీ, ఈ తరహా పరిస్థితులు ఎప్పుడూ తలెత్తినట్లు లేవు. సాధారణంగా ఆ సదస్సు అజెండాలోకి ఆర్థికాభివృద్ధి, వాణిజ్యం, ప్రైవేట్ రంగానికీ ప్రభుత్వాలకూ మధ్య సహకారం, సామాజిక అసమానతలు, సాంకేతిక రంగం, వాతావరణ పరిరక్షణ, రాజకీయ సుస్థిరతల వంటి అంశాలు వస్తాయి. వీటన్నింటిని కూడా ఆర్థిక రంగ కోణం నుంచే చూస్తారు. అందుకే వాటికి ఆర్థిక సదస్సులనే పేరు వచ్చింది. కానీ, ఈ నెల 19 నుంచి 23 వరకు జరిగిన సమావేశాలలో ఈ అంశాలపై ఏ చర్చలు జరిగినా జరగకున్నా, గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ వివాదాలు రాజ్యమేలాయి. అది ఆర్థిక దావోస్‌కు బదులు రాజకీయ దావోస్ అయింది.

మిత్రుల మధ్యే భేదాభిప్రాయలు

తిరిగి అందులోనూ గమనార్హమైన విశేషం ఒకటున్నది. దావోస్ సమావేశాలు మొదలైనప్పటినుంచి ఇంతవరకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అమెరికా, యూరప్ కలిసి శాసిస్తూ వచ్చాయి. అటువంటిది ఈసారి ఆ రెండు పక్షాల మధ్యనే భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత బ్రెట్టన్ ఉడ్స్ సమావేశాలతో ఆరంభించి అమెరికా, యూరప్‌లు కలిసి పలు అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య సంస్థలను సృష్టించాయి. అన్ని చట్టాలూ తామే చేశాయి. ఆర్థిక, వాణిజ్య రంగాలను తమ గుప్పిట పెట్టుకుని లాభపడ్డాయి. అటువంటిది ఈసారి సమావేశాలు వచ్చేసరికి అంతర్గత విభేదాలతో పరస్పరం కత్తులు దూసుకున్నాయి. ఈసారి దావోస్ భిన్నమైనది కావటం అందువల్లనే!

అయితే ఇది ఆకస్మిక పరిణామం కాదు. ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్షుడైన తర్వాత గత ఏడాదిగా ఉభయపక్షాల మధ్య పొగ రాజుకుంటూనే వస్తున్నది. అది, తక్కిన దేశాలతో పాటు యూరప్‌పై భారీ సుంకాలు, ఉక్రెయిన్ విషయంలో రష్యా అనుకూల వైఖరి తీసుకోవటం, యూరప్ తన రక్షణ వ్యయాన్ని రెట్టింపు చేసి తన భద్రతను తాను చూసుకోవాలనటం, 'నాటో'తో సంబంధాలు గతంలో వలె ఉండబోవన్న సూచనలు, యూరప్ ఇంతకాలం 'తమపై పడి తిన్న'దనే తరహా వ్యాఖ్యలు, యూరప్‌లోని ఉదారవాద ప్రభుత్వాలు, పార్టీలకు వ్యతిరేకంగా తమ తరహా మితవాద – జాతీయవాద పార్టీలకు బహిరంగ మద్దతు వంటి చర్యలు ఆ పొగకు కారణమయ్యాయి. అలాగే గత కొద్ది నెలలుగా యూరప్‌ను ఈసడించి మాట్లాడటం ఒకటైతే, గత నవంబర్‌లో ట్రంప్ ప్రకటించిన 'జాతీయ భద్రతా వ్యూహ పత్రం'లో అదే వైఖరిని చూపుతూ, అసలు యూరోపియన్ నాగరికత అన్నదే 'తుడిచి పెట్టుకుపోయే' పరిస్థితి వచ్చిందనటం మరొకటి అయింది.

◆ దావోస్ సమావేశాలు మొదలైనప్పటినుంచి ఇంతవరకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అమెరికా, యూరప్‌లు కలిసి శాసిస్తూ వచ్చాయి. అటువంటిది ఈసారి ఆ రెండు పక్షాల మధ్యనే భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి.

గ్రీన్‌ల్యాండ్‌తో పైపైకి...

ఆ విధంగా పొగలు దట్టం కాగా, తమ సాటి 'నాటో' దేశమైన డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌ల్యాండ్ విషయమై జరుగుతున్న తతంగంతో ఆ పొగ కాస్తా భగ్గున మంటగా మారింది. మొదట ఇదే విధంగా కెనడాను సైనిక బలంతోనైనా తమ 51వ రాష్ట్రంగా మార్చుతామన్న ట్రంప్ పుట్టించిన ఆ మంటలు ఇప్పటికీ ఆగ్రహాన్ని రగుల్చుతుండగా, ఇపుడు గ్రీన్‌ల్యాండ్‌ను బలప్రయోగంతో 51వ రాష్ట్రం చేయగల మనటం అగ్నికి ఆజ్యంగా మారింది. గత వారపు దావోస్‌కు ముందు అందరూ ఎవరి దేశంలో వారుండి రాళ్ళు విసురుకోగా, దావోస్‌లో ఒకేచోట సమావేశమయే పరిస్థితితో బాహాబాహీ వంటి సన్నివేశాలు కనిపించాయి.

ఇది అంతిమంగా ఏ విధంగా పరిణమించేదీ చెప్పలేము. మౌలికంగా ఇరువురివీ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద విధానాలు. ఉభయుల ప్రయోజనాలు కలిసి ఉన్నాయన్నది ట్రంప్ వ్యూహపత్రంలోనూ వివరించిన విషయమే. కానీ గతానికీ, ఇప్పటికీ ఒక కీలకమైన తేడా ఉంది. 'అమెరికా ఫస్ట్', 'మాగా' లక్ష్యాలను ప్రకటించిన ట్రంప్, యూరప్ సహా ప్రపంచ దేశాలన్నింటినీ అందుకోసం ఉపయోగించుకోవటమే తన విధానమైనట్లు ఆ పత్రంలో దాపరికం లేకుండానే ప్రకటించారు. ఆ పద్ధతిలో ముందుకు సాగుతుండటం వల్లనే ఇరువురి మధ్య గతంలో లేని విధంగా పొగలు, మంటలు రాజుకుంటున్నాయి. దావోస్‌లో సమావేశాలు జరుగుతున్నప్పుడు, అవి ముగిసిన తర్వాత కూడా రెండు వైపుల నుంచి వినవచ్చిన మాటలను గమనించగా, రాజీలు కనీసం ప్రస్తుతానికి జరగకపోవచ్చు. తన వ్యూహాలు, ఎత్తుగడలు నెగ్గే పరిస్థితి లేదని ట్రంప్ గ్రహించి బాగా వెనుకకు తగ్గితే తప్ప. కానీ ఆయన స్వభావం తెలిసిన వారిలో అటువంటి ఆశాభావం కనిపించటం లేదు.

ఢీ అంటే ఢీ

పరిస్థితి అర్థం అయేందుకు రెండువైపుల నుంచి వినవచ్చిన కొద్ది మాటలను గమనించాలి. ట్రంప్ అన్నది, 'నేను మితిమీరిన బలప్రయోగానికి నిర్ణయిస్తే తప్ప బహుశా మాకేదీ లభించదు. అపుడు మమ్ములను ఎవరూ ఆపలేరు. అయితే నేనాపని చేయను'. ఇది గ్రీన్‌ల్యాండ్ గురించినది. మరొకవైపు యూరోపియన్ యూనియన్ కమిషనర్ ఉర్సులా వ్యాఖ్యలు ఇవి: 'గతాన్ని (ఇరువురి సంబంధాలపై) గుర్తు చేసుకున్నంత మాత్రాన గత వ్యవస్థలు, సంబంధాలు తిరిగి రావు. ఈ మార్పే గనుక శాశ్వతమైతే, యూరప్ కూడా శాశ్వతంగా మారాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఒక కొత్తదైన యూరప్‌ను శాశ్వతంగా నిర్మించుకోవాలి'. ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన గీతా గోపీనాథ్, 'అమెరికా, యూరప్‌ల మధ్య విశ్వాసమన్నది పూర్తిగా భంగపడిపోయింది. ఇపుడు యూరప్ ఆర్థికంగా, అంతర్గత భద్రత రీత్యా వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి కోసం ఆలోచిస్తున్న'దని అన్నారు.

ఈ కొత్త పరిస్థితికి బాగా అద్దం పట్టింది కెనడా ప్రధాని మైక్ కార్నీ ఉత్తేజకర ప్రసంగం. అది అంతే ఆలోచనాస్ఫోరకం కావటంతో వెంటనే దావోస్‌లోనే గాక ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ట్రంప్‌కు అదే స్థాయిలో ఆగ్రహాన్ని తెప్పించింది. దానిపై ఆయన వ్యాఖ్యను హైదరాబాద్ పరిభాషలో చెప్పాలంటే, 'యాద్ రఖ్‌లో బేటా, దేఖ్ లూంగా' అవుతుంది. అట్లా అని ఊరుకోలేదు. అమెరికా లేనిదే కెనడా అసలు బతకలేదన్నారు. దానిని కార్నీ తిప్పికొట్టడమేగాక, పది రోజుల క్రితం చైనా వెళ్లి భారీ ఒప్పందాలు చేసుకున్నారు. పైగా చైనా నమ్మదగ్గ భాగస్వామి అనీ, అమెరికా కాదనీ ప్రకటించటాన్ని ట్రంప్ గుర్తు చేసుకుంటూ... ఆ ఒప్పందాలు చేసుకున్నందుకు కెనడాపై వందశాతం సుంకాలు విధించగలనని ప్రకటించారు. వాస్తవానికి కార్నీ ప్రసంగం పూర్తి పాఠంగా పత్రికలలో రాదగ్గది. మొత్తంమీద ఈసారి దావోస్ సమావేశాల ప్రభావం దీర్ఘకాలం ఉండనున్నది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

రాజధాని పేరిట మళ్లీ అదే మోసం!

అభిప్రాయం

ప్రొ॥ సి. రామచంద్రయ్య

రాజధాని నిర్మాణం పేరిట ఏపీలో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) రైతులను నిలువునా ముంచేసే కుట్రగా కనిపిస్తోంది. 'రాజధాని ప్రాంత అభివృద్ధి సాధికారిక సంస్థ' (సీఆర్‌డీఏ), ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో బలిపశువులు అవుతున్నది సామాన్య రైతులే!

2015 జనవరి 1న వెలువడిన జీవో నం.1 ద్వారా భూసమీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. భూముల రకాలను బట్టి ఇళ్ల స్థలాలు, వాణిజ్య ప్లాట్లు, కౌలు పరిహారం ఇస్తామని నమ్మబలికారు. ఫారం 9.14 పై సంతకాలు చేయించుకున్నాక, రైతు తన భూమిపై సర్వహక్కులూ కోల్పోయాడు. సాగుకు వీలులేకుండా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తొలగించారు. మూడేళ్లలో ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తామన్న హామీ 2015–19 మధ్య కాలంలో అడుగు కూడా ముందుకు పడలేదు. 18 నెలలు గడుస్తున్నా పురోగతి శూన్యం. దారుణం ఏమిటంటే, పూలింగ్‌కు ఇవ్వని భూముల్లో, వాగులు, వంకలు వంటి లోతట్టు ప్రాంతాల్లో ప్లాట్లు కేటాయించడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అప్పట్లో అసైన్డ్ భూముల విషయంలో జరిగిన గందరగోళం మధ్య దళారులు లాభపడగా, రైతులు నష్టపోయారు.

జీవో నం.1 షెడ్యూల్ III, 1.3 ప్రకారం రాజధాని గ్రామాల్లోని ప్రజలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలి. వృద్ధాశ్రమాలు నిర్మించాలి. ప్రతి కుటుంబానికీ ఏడాది పొడవునా 365 రోజుల ఉపాధి హామీ పథకం అమలు చేయాలి. కానీ ఇవేవీ క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. ఏ ఒక్క విద్యార్థికీ ప్రభుత్వం నేరుగా ఫీజులు చెల్లించిన దాఖలాలు లేవు. వ్యవసాయం ఆగిపోయిన తరుణంలో రైతులకు ఈ సాయం ఎంతో అవసరమైనా పాలకులు పట్టించుకోలేదు. ఇక ఉచిత వైద్యం పేరిట ఇచ్చిన 'అమరావతి హెల్త్ కార్డు'ను ఏ ఆసుపత్రీ గుర్తించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుతోంది. కేంద్ర నిధులతో నడిచే ఉపాధి హామీ పథకంలో కేంద్ర నిబంధనలకు విరుద్ధంగా 365 రోజులు పని కల్పిస్తామనడం రైతులను నమ్మించడానికి ఆడిన పెద్ద అబద్ధం.

ప్రపంచస్థాయి రాజధాని అంటూ విదేశీ పర్యటనలు, సింగపూర్ గ్రాఫిక్స్ మాయాజాలంతో ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్ళించింది. భూముల ధరల పెరుగుదల చుట్టూ కృత్రిమమైన వాతావరణాన్ని సృష్టించింది. ఈ ప్రక్రియలో 84 శాతంగా ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోయారు. మూడు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులే ఈ భూసమీకరణ వల్ల అత్యధికంగా దెబ్బతిన్నారు.

◆ ఒకప్పుడు ప్రపంచస్థాయి నగరం అన్న నోళ్లే ఇప్పుడు చిన్న మున్సిపాలిటీ అంటున్నాయి. స్వయం సమృద్ధి (సెల్ఫ్ ఫైనాన్సింగ్) నగరం అని చెప్పి, ఇప్పుడు వేల కోట్ల అప్పులతో ఆంధ్రప్రదేశ్‌ను ఊబిలోకి నెడుతున్నారు.

రెండో విడతలోనూ అదే మోసం

2025 జూలై 1న విడుదలైన జీవో నం.118 ద్వారా మళ్లీ పాత మోసాన్నే పునరావృతం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం తన 'బాధ్యత'గా పేర్కొన్న విద్యా, వైద్య సదుపాయాలను, ఇప్పుడు ప్రజలు కేవలం 'అర్హులు'గా మాత్రమే పేర్కొంటూ బాధ్యత నుంచి తప్పుకొనే ప్రయత్నం చేస్తోంది. గ్రామసభల్లో మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు గతంలో లాగానే ప్లాట్లు, కౌలు, ఎన్నేళ్ళలో అభివృద్ధి చేసి ఇస్తారు వంటి అంశాల చుట్టూనే నడిపిస్తున్నారు. 'మీరు ప్రామిస్ చేసిన మూడేళ్ళలో ఇవ్వలేకపోతే, ఒకవేళ ప్రభుత్వం మారితే మా పరిస్థితేమిట'ని రైతులు అడిగితే... నీళ్ళు నములుతున్నారు.

ఒకప్పుడు ప్రపంచస్థాయి నగరం అన్న నోళ్లే ఇప్పుడు చిన్న మున్సిపాలిటీ అంటున్నాయి. అప్పుడు రాష్ట్ర ఖజానాపై భారం పడదు, స్వయం సమృద్ధి (సెల్ఫ్ ఫైనాన్సింగ్) అని చెప్పి, ఇప్పుడు వేల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని ఊబిలోకి నెడుతున్నారు. 1,500 ఎకరాల్లో రైల్వే స్టేషన్, 5,000 ఎకరాల్లో విమానాశ్రయం అంటూ ప్రస్తుతం ఉన్న 54 వేల ఎకరాలకు తోడు మరికొంత భూమిని సేకరించాలని కూటమి పాలకులు చూడటం చరిత్రలో అతిపెద్ద భూకుంభ కోణంగా మిగిలిపోనుంది.

వ్యాసకర్త రిటైర్డ్ ప్రొఫెసర్ – 'సెస్', హైదరాబాద్; ఏపీలో అభివృద్ధి వికేంద్రీకరణ చర్చా వేదిక కన్వీనర్

ప్రకృతి ఆరాధనకు మచ్చుతునక

భారతదేశ సాంస్కృతిక వైభవానికి, ఆధ్యాత్మిక చైతన్యానికి మారు పేరుగా నిలిచే ఉత్సవాల్లో మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర అగ్రస్థానంలో నిలుస్తోంది. కుంభమేళా తర్వాత దేశంలోనే అత్యంత భారీ జనసందోహం కలిగిన వేడుకగా, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా దీనికి విశిష్ట గుర్తింపు ఉంది. జానపదుల్లో ప్రచారంలో ఉన్న కథ ప్రకారం... కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడి పాలనలో గిరిజనులపై విధించిన అక్రమ పన్నులు, అణచివేతకు వ్యతిరేకంగా సమ్మక్క గళమెత్తింది. తన కుమార్తె సారలమ్మ, అల్లుడు గోవిందరాజులతో కలిసి రాజ్యాధికారాన్ని ధిక్కరించి న్యాయం కోసం పోరాడింది. ఈ పోరాటంలో వీరమరణం పొందిన వీరిని గిరిజనులు తమ ఆత్మ గౌరవ ప్రతీకలుగా భావించి దేవతలుగా ఆరాధించడం మొదలుపెట్టారు. ఒక సామాజిక ప్రతిఘటన కాలక్రమేణా ఆధ్యాత్మిక–సాంస్కృతిక మహా జాతరగా రూపాంతరం చెందింది.

జాతరలో ఎక్కడా సంప్రదాయ విగ్రహాలు కనిపించవు. వెదురు కర్రలు, చింత చెక్క, కుంకుమ, 'బంగారం'గా పిలిచే బెల్లం వంటి ప్రకృతి నుంచి గ్రహించినవే దైవ స్వరూపాలుగా పూజిస్తారు. ఈ వన దేవతలు కోయ తెగ కులదేవతలు. రెండేళ్లకోసారి జరిగే ఈ మహా జాతరకు సుమారు 1.5 కోట్లకు పైగా భక్తులు వస్తారని అంచనా. తెలంగాణతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలి వస్తారు. ఈ జనసందోహం స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇస్తోంది. రవాణా, తాత్కాలిక వ్యాపారాల ద్వారా స్థానిక ఆదాయం 30 నుండి 40 శాతం వరకు పెరుగుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన హస్తకళాకారులు, చిన్న వ్యాపారులకు ఇది ప్రధాన జీవనాధారంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం మేడారం జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. 2014 తర్వాత నిధుల కేటాయింపు పెరగడంతో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి.

అనేక విశ్వవిద్యాలయాలు మేడారాన్ని కేస్ స్టడీగా తీసుకుని పరిశోధనలు చేస్తున్నాయి. 2000వ సంవత్సరం తర్వాత గిరిజన సంస్కృతిపై జరుగుతున్న పరిశోధనల్లో ఈ జాతర ప్రస్తావన 60 శాతం పెరిగింది. గ్లోబలైజేషన్ ప్రభావంతో స్థానిక సంస్కృతులు అంతరిస్తున్న తరుణంలో, మేడారం జాతర ఒక రక్షణ కవచంలా నిలుస్తోంది. గిరిజన యువతలో తమ వారసత్వం పట్ల గర్వాన్ని, చైతన్యాన్ని నింపుతోంది. రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల్లో 25 శాతం మంది ఈ జాతర కోసమే ప్రయాణిస్తున్నారంటే దీని ప్రాముఖ్యం అర్థం చేసుకోవచ్చు.

– డా॥ రక్కిరెడ్డి ఆదిరెడ్డి । కాకతీయ యూనివర్సిటీ
(నేటి నుంచి ఈ నెల 31 వరకు మేడారం జాతర)

డేటా పాయింట్

మనకు పైలట్లు లేరు!

భారత విమానయాన రంగంలో పైలట్లకు డిమాండ్ విపరీతంగా ఉంది. 2024–26 కాలానికి 7,000కు పైగా పైలట్లు కావాల్సి ఉండగా, రానున్న దశాబ్ద కాలంలో ఆ సంఖ్య 25,000–30,000 ఉంటుంది. సగటున ఒక విమానానికి ఉండాల్సిన పైలట్ల సంఖ్య సాధారణంగా 20. ఈ లెక్కన ప్రధాన విమానయాన సంస్థల నిష్పత్తులు ఇలా ఉన్నాయి

ఎయిర్ లైన్స్‌ల వారీగా సగటున ప్రతి విమానానికీ ఉన్న పైలట్ల నిష్పత్తి

ఎయిర్ ఇండియా	36
ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్	15
ఇండిగో	14

ఆధారం: స్టాటిస్టా

మౌనంతో చెప్పడం!

జ్యోతిర్మయం

భారతదేశం అందించిన గొప్ప ఆధ్యాత్మికవేత్తలలో బోధిధర్ముడు ఒకరు. చైనాలో ఆయన కొంతకాలం ఉన్నారు. అంత్యదశలో ఒక రోజు 'నేను హిమాలయాలకు తిరిగి వెళ్ళే సమయం ఆసన్నమైంది. ఎందుకంటే మరణానికి సంబంధించి అంతకంటే మంచి ప్రదేశం ఈ ప్రపంచంలో మరెక్కడా లేదు. అది శాశ్వతంగా నిశ్శబ్దంగా ఉంటుంది. అక్కడ మరణాన్ని ప్రేమగా, ధ్యానపూర్వకంగా, చైతన్యంతో స్వీకరించవచ్చు. కానీ నేను వెళ్ళేముందు, నేను సృష్టించిన రహస్య ఆధ్యాత్మిక పాఠశాలను నా శిష్యులలో ఒకరికి అప్పగించాలనుకుంటున్నాను' అంటూ, ప్రతి శిష్యుడి కళ్ళలోకి చూశారు. ఆయన నలుగురిని గుర్తించారు. 'నేను ఒకే ఒక ప్రశ్న అడగబోతున్నాను. దాని సమాధానం నేను వెళ్ళిపోయిన తర్వాత నా ప్రతినిధి ఎవరు అవుతారో నిర్ణయిస్తుంది. నా మొత్తం ఆధ్యాత్మిక మార్గం సారాంశం ఏమిటి? కనీస పదాలను మాత్రమే ఉపయోగించండి' అన్నారు.

అప్పుడొక శిష్యుడు 'ధ్యానం' అని అన్నాడు. అయితే బోధిధర్ముడు 'నువ్వు నన్ను కేవలం పైపైన మాత్రమే అర్థం చేసుకున్నావు... వెళ్లి నీ స్థానంలో కూర్చో' అన్నారు. రెండవ శిష్యుడు 'జ్ఞానోదయం' అనగానే బోధిధర్మ 'నీకు నా ఎముకలు లభించాయి' అన్నారు. మూడవ శిష్యుడు తనకేమీ తెలియడం లేదన్నాడు. అయితే బోధిధర్ముడు 'నీకు నా మూలుగ లభించింది. అది మంచిదే, కానీ సరిపోదు' అన్నారు.

ఇక నాల్గవవాని కళ్ళలో కేవలం కన్నీళ్లు మాత్రమే కనిపించాయి. మాటలు లేవు. అతను బోధిధర్ముడి పాదాలపై పడ్డాడు. బోధిధర్ముడు అతనిని తన ప్రతినిధిగా ఎంపిక చేస్తూ 'నీకు నా అస్తిత్వం లభించింది. పదాలతో చెప్పలేని దానిని నువ్వు నీ మౌనంతో చెప్పావు' అన్నారు. కేవలం 'కృతజ్ఞత, కన్నీళ్లు, ఒక పాట, ఒక నృత్యం... వంటివి వర్ణించలేని దానిని వ్యక్తపరచడానికి మార్గాలు' అంటాడు ఓషో.

– యామిజాల జగదీశ్

మా భూములు ఇవ్వం

గ్రామసభలో తెగేసి చెప్పిన నాగరాజుపల్లి తండా రైతులు

అధికారుల ముందు విలపిస్తున్న మహిళా రైతులు

మార్టూరు: పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం తమ భూములు ఇచ్చే ప్రసక్తేలేదని బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లి తండావాసులు అధికారులకు స్పష్టం చేశారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న తమ భూముల్ని ఇవ్వబోమని మంగళవారం ముక్తకంఠంతో చెప్పారు. దీంతో గ్రామసభ నుంచి అధికారులు మౌనంగా వెనుదిరిగారు. తండా రెవెన్యూ పరిధిలోని 445, 453, 476 సర్వేనంబర్ల లోని 89.61 ఎకరాల కొండ పోరంబోకు భూమిలో తండాకు చెందిన 91 మంది రైతులకు గత ప్రభుత్వ హయాంలో పట్టాలు పంపిణీ చేశారు. వాస్తవానికి ఈ భూమిని ఆ రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం పట్టాలు, పాసుపుస్తకాలు పంపిణీ చేయడంతో వారికి ఆ భూమిపై శాశ్వతహక్కు ఏర్పడింది. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ఈ భూమి అనువుగా ఉంటుందని మండల రెవెన్యూ అధికారులు గతవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు చూపించారు. ఈ క్రమంలో తండావాసులు 20 మంది ఇటీవల బాపట్లలో కలెక్టర్‌ను కలిసి పార్కు నిర్మాణం కోసం తమ భూములు ఇవ్వబోమని చెప్పారు. దీంతో కలెక్టర్ బలవంతంగా భూమి సేకరించబోమని వారికి తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినప్పుడు అభిప్రాయాలు చెప్పుకోవచ్చని సూచించారు. దీన్లో భాగంగా మంగళవారం ఏపీఐఐసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఫణి, ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ ప్రశాంతి సిబ్బందితో కలిసి తండాలో గ్రామసభ నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించారు. పట్టాలు పొందిన రైతులంతా తమ భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు, పాసుపుస్తకాల వలన బ్యాంకు లోన్లు, సంక్షేమ పథకాలు పొందగలుగుతున్నామని, తమ కడుపు మీద కొట్టవద్దని పేర్కొన్నారు. తండా పరిధిలోని సర్వేనంబర్ 475లో గల 53 ఎకరాల్లో కొత్తగా పట్టాలిస్తామని, ఈ భూమిని పార్కు కోసం వదిలేయాలని అధికారులు అడిగారు. ఆ భూమిని పదేళ్ల కిందటే పార్కు ఏర్పాటు కోసం అధికారులు ప్రతిపాదించగా ఇప్పుడు మీరు వచ్చి కొత్తగా మా భూమిలో పార్కు నిర్మిస్తామనటం ఏమిటని రైతులు ప్రశ్నించారు. ఆ 53 ఎకరాల్లోనే పార్కు ఏర్పాటు చేసుకోవచ్చుగదా అని నిలదీశారు. ఒకదశలో అధికారులు రైతులను పట్టా, పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ జిరాక్స్ కార్డులను ఇవ్వాలని అధికారులు కోరారు. దీనికి రైతులు నిర్ద్వందంగా తిరస్కరించారు. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు రైతులు అధికారులకు అర్జీ సైతం ఇచ్చారు. దీంతో అధికారులు తిరుగుముఖం పట్టారు.

కల్యాణ వైభోగమే!

ఫిబ్రవరిలో మోగనున్న పెళ్లి బాజా

ఈ వేసవిలో పెళ్లి సందడి ఎక్కువే

ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అత్యధిక ముహూర్తాలు

జూలై నుంచి నవంబర్ వరకు చాతుర్మాస విరామం

సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఫిబ్రవరి (మాఘ మాసం) నుంచి పెళ్లి బాజాలు మోగించేందుకు ముహూర్తాలు ఖరారయ్యాయి. దాదాపు రెండు నెలలకుపైగా విరామం అనంతరం ముహూర్తాలు కుదరడంతో వధూవరుల తల్లిదండ్రులు పెళ్లి ఏర్పాట్లలో బిజీ అయ్యారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 5 నుంచి పెళ్లి సందడి ప్రారంభం కానుంది. వేసవి కాలంలో అత్యధిక ముహూర్తాలు ఉండటంతో పెళ్లి సందడి మోత మోగనుంది. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అత్యధికంగా ముహూర్తాలు ఉన్నాయి. జూలై 11 తర్వాత నవంబర్ 20 వరకు చాతుర్మాస విరామం కావడం (ఆషాడ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు) ముహూర్తాలు లేకపోవడంతో పెళ్లి బాజాలకు నాలుగు నెలల విరామం ఉంటుంది. హిందూ సంప్రదాయం ప్రకారం చాతుర్మాసంలో శుభ కార్యాలు నిర్వహించరు. ఈ ఏడాది చివరలో నవంబర్ చివరి వారం నుంచి డిసెంబర్ మధ్య తిరిగి పెళ్లి బాజాలు మోగనున్నాయి.

2026లో వివాహ ముహూర్తాలు ఇలా..

- **ఫిబ్రవరి:** 5, 6, 8, 10, 12, 14, 19, 20, 21, 24, 25, 26 తేదీలు
- **మార్చి:** 1, 3, 4, 7, 8, 9, 11, 12
- **ఏప్రిల్:** 15, 20, 21, 25, 26, 27, 28, 29
- **మే:** 1, 3, 5, 6, 7, 8, 13, 14
- **జూన్:** 21, 22, 23, 24, 25, 26, 27, 29
- **జూలై:** 1, 6, 7, 11 తేదీలు
- **నవంబర్:** 21, 24, 25, 26, 27, 30
- **డిసెంబర్:** 1, 2, 3, 4, 6, 11, 12, 13

చాతుర్మాసం కారణంగా ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వివాహ ముహూర్తాలు లేవు

పెళ్లంటే.. పెద్ద ఆడంబరమే

పెళ్లి అంటే అదే పెద్ద ఆడంబరం. వివాహ నిశ్చయ తాంబూలాల నుంచి ప్రీ వెడ్డింగ్, పెళ్లి, పెళ్లి తర్వాత తంతు అంటూ అనేక రకాలుగా వివాహ సంబరం అంబరాన్ని తాకేలా నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 46 లక్షల నుంచి 48 లక్షల వరకు వివాహాలు జరిగే అవకాశం ఉందని సీఏఐటీ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్) అంచనా వేసింది. ఈ వివాహాల ద్వారా సుమారు రూ.6.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని భావిస్తున్నారు. అదే ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డిసెంబర్ వరకు సుమారు నాలుగు లక్షల పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వివాహ వేడుకల సంఖ్య, వాటి సంబంధించిన సందడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో అతిపెద్ద ముహూర్తాలు ఉన్నాయని చెబుతున్నారు. పెళ్లిళ్లు కేవలం ఒక వేడుక మాత్రమే కాదు. ఎందరికో జీవనోపాధి కల్పిస్తూ.. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థను నడిపిస్తాయి. ముహూర్తాలు ఎక్కువగా ఉన్న రోజుల్లో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి చోట్ల ఫంక్షన్ హాళ్లు ఇప్పటికే అడ్వాన్స్‌గా బుక్ అయినట్టు సమాచారం. ఉభయ గోదావరి, ఏజెన్సీ, విశాఖ తీరాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు ఆలవాలంగా మారాయి. దుస్తులు, బంగారం(జ్యువెలరీ), క్యాటరింగ్, డెకరేషన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగాల్లో రాష్ట్రవ్యాప్తంగా రూ.25 వేల కోట్ల నుంచి రూ.35 వేల కోట్ల వరకు వ్యాపారం జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అందుకే ఇప్పటినుంచే ముహూర్తం ముందరున్నది అంటూ పెళ్లి వారు ఏర్పాట్లలో తలమునకలవుతున్నారు.

ముగిసిన బైబిల్ మిషన్ మహోత్సవాలు

పెదకాకాని: గుంటూరు జిల్లాలోని ఏఎన్‌యూ ఎదుట జరిగిన 88వ బైబిల్ మిషన్ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు మహోత్సవాల్లో బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ వాక్యోపదేశం చేస్తూ..దేవుని సన్నిధి ద్వారా ప్రతి కుటుంబానికి ఆశీర్వాదం లభిస్తుందని, ఆ దీవెనలు మహోత్సవాల రూపంలో ప్రతి ఇంటికి చేరాలని ఆకాంక్షించారు. దేవుని కృపతో గృహాలలో భద్రత, శాంతి చేకూరతాయన్నారు. దేవుని విశ్వాస సమాజం ఆకాంక్ష మేరకు బైబిల్ మిషన్ అధికారుల సమ్మతితో 2027 బైబిల్ మిషన్ మహోత్సవాలు నిర్వహణ తేదీల్లో స్వల్ప మార్పులు చేసినట్లు చెప్పారు. ఆది, సోమవారం దృష్టిలో పెట్టుకొని జనవరి 24 నుంచి 26 మధ్యాహ్నం వరకు సభ జరుగుతుందని తెలిపారు. మహోత్సవాలకు సహాయ, సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బైబిల్ మిషన్ యాజకులు రెవరెండ్. ఇమ్మానుయేల్ దేవదాస్, రెవరెండ్ లూథర్ బాబు, జాయింట్ సెక్రెటరీ రెవరెండ్ జె.ఆగమనరావు, రెవరెండ్ ఎం.రవి దైవ సందేశాలు అందించారు.

చీరాలలో దొంగల బీభత్సం

- హౌసింగ్ కాలనీలోని ఏపీపీ ఇంట్లోకి చొరబడిన దొంగలు
- మారణాయుధాలతో బెదిరించి సుమారు 8 సవర్ల బంగారు ఆభరణాలు దోపిడీ

మాస్కులు ధరించి సంచరిస్తున్న దుండగులు

చీరాల: దొంగలు మారణాయుధాలతో ఓ ఇంట్లోకి చొరబడి బెదిరించి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం తెల్లవారుజామున వెలుగు చూసింది. వివరాలు.. బాపట్ల జిల్లా చీరాలలోని మహాత్మాగాంధీ హౌసింగ్ కాలనీలో నివాసం ఉంటున్న బి.వెంకట లక్ష్మీకుమారి నెల్లూరు కోర్టులో ఏపీపీగా విధులు నిర్వహిస్తున్నారు. సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు కోర్టుకు వెళ్లేందుకు నిమగ్నమయ్యారు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో నలుగురు గుర్తుతెలియని దుండగులు ఇంటిలోకి చొరబడి ఆమె సోదరుడు సత్య రామాంజనేయులును మారణాయుధాలతో బెదిరించి దాడికి తెగబడ్డారు. అనంతరం బాధితుల వద్ద ఉన్న సుమారు 8 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకుని వెళ్లారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీయగా దాడికి ముందు నలుగురు దుండగులు మాస్కులు ధరించి చేతిలో మారణాయుధాలతో స్థానికంగా సంచరిస్తున్న దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. పోలీస్ డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ప్రాథమిక సమాచారం సేకరించారు. చీరాల డీఎస్పీ ఎండీ మోయిన్, సీఐ ఎస్.సుబ్బారావు పరిశీలించి సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. దుండగులను త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ సుబ్బారావు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఇద్దరి ప్రాణాలు తీసిన ఈత సరదా

కనపర్తి ఎత్తిపోతల పథకం కాలువలో ఘటన

మృతులు భరత్, సాంబాని వెంకటేష్

నాగులుప్పలపాడు : సరదాగా గడుపుదామని ఎత్తిపోతల పథకం కాలువలో ఈతకు దిగి ఇద్దరు యువకులు మృతి చెందగా, మరొకరిని స్థానికులు కాపాడిన ఘటన మంగళవారం సాయంత్రం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం వినోదరాయునిపాలెం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు... మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన నలగర్ల జయకృష్ణ అనే యువకుడు మూడేళ్ల నుంచి ఒంగోలులోని ఓ బంగారు దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో స్థానికంగా ఏర్పడిన పరిచయంతో ఒంగోలు గోపాల్‌నగర్‌కు చెందిన తోట భరత్ కుమార్ (21), మరాఠిపాలేనికి చెందిన సాంబాని వెంకటేష్ (23)తోపాటు నలగర్ల జయకృష్ణ సరదాగా గడపడానికి మండలంలోని వినోదరాయునిపాలెం సమీపంలో ఉన్న కనపర్తి ఎత్తిపోతల పథకం కాలువ వద్ద ఈతకు దిగారు. అయితే కాలువ లోతు ఎక్కువగా ఉండడంతో ముగ్గురూ గల్లంతయ్యారు. వారిలో జయకృష్ణను స్థానికులు గమనించి బయటకు లాగారు. అప్పటికే తోట భరత్ కుమార్, సాంబాని వెంకటేష్ మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

VISAKHAPATNAM | GMR

NOTICE INVITING TENDER (NIT)

GMR Vishakhapatnam International Airport Ltd. (GVIAL) invites tender for Package,

1. Hiring of Agency for Security Service at Bhogapuram International Airport for a period of 10 years and further extendable up to 5 years.
2. Deployment of Private Security Agency for undertaking non-core security functions at Bhogapuram International Airport for 3 years' contract period.

For details, interested parties may download the Tender document free of charge from gmrvisakhapatnamairport.com/tender.aspx between 28.01.2026 to 03.02.2026.

VIA/21/PREM ASSOCIATES

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ

నెం.12SE/2025-26, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు** తేది:23-01-2026

పని పేరు: గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, చిలువూరు గ్రామపరిధిలోని కి.మీ.0.600 నుండి 1.500 కి.మీ. వరకు పాత టి.బి డ్రెయిన్ పై రిటైనింగ్ వాల్ నిర్మాణం. **పని విలువ:** రూ.120.00 లక్షలు. టెండరు షెడ్యూల్స్ ఆన్‌లైన్‌లో లభ్యమగు తేది: 28-01-2026, ఉ.10.30 గం.ల నుండి 11-02-2026, మ.2.00 గం.ల వరకు. మిగతా వివరాలను https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు. ఫోన్ నెం.9440814947.

సం/- పర్యవేక్షక ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, గుంటూరు

DIPR RO No.18879/CL/Advt/1/1/2021-22, Dt: 27-01-2026

భారత ప్రభుత్వం
Government of India
అణుశక్తి శాఖ
Department of Atomic Energy
భారజల ప్లాంట్, మణుగూరు
Heavy Water Plant, Manuguru
ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన
Notice Inviting e-Tenders

భారత రాష్ట్రపతి తరపున జనరల్ మేనేజర్, భారజల ప్లాంట్, మణుగూరు వారు దిగువ తెలిపిన పని కోసం రెండు బిడ్ విధానంలో ఆన్‌లైన్ ఐటమ్ రేట్ బిడ్లు కోరుతున్నారు.

The General Manager Heavy Water Plant, Manuguru invites on behalf of President of India online item rate bids on two bid system for following work.

Tender No.: **HWPM/IU/204/25/W9** తేది: **08.01.2026**

Tender No.: **HWPM/IU/204/25/W9 Date: 08.01.2026**

పని పేరు: CPPలో TG ఇన్‌స్ట్రుమెంట్స్ కోసం నిర్వహణ కాంట్రాక్టు.

Name of Work: Maintenance Contract for TG Instruments of CPP.

అంచనా వ్యయం: **రూ. 16,86,000/-** GSTతో సహా Estimated cost: **Rs. 16,86,000/-** including GST;

బయానా: **రూ. 33,720/-** Earnest Money Deposit: **Rs. 33,720/-**

పూర్తిచేయు కాలవ్యవధి: **పని ఉత్తర్వు జారీ చేసిన తేది నుండి 24 క్యాలెండర్ నెలలలోగా పనిని పూర్తి చేయవలెను.**

Completion Period: **Work shall be completed within 24 Calendar Months from the date of issue of work order.**

గ్యారంటీ కాలవ్యవధి: **పని పూర్తి చేసిన తేది నుండి 3 నెలలు.**

Guarantee period: **3 months from the date of completion of the work.**

టెండరు డాక్యుమెంట్ల లభ్యత తేదీలు: 19.01.2026న 16.00 గం॥ నుండి 30.01.2026న 16.00 గం. వరకు

Dates of availability of tender documents: **19.01.2026** 16:00 hrs to **30.01.2026** 16:00 hrs

దాఖలు: టెండర్ల ఆన్‌లైన్ దాఖలుకు ఆఖరి తేది, ముగింపు సమయం: 02.02.2026న లేదా ఆలోగా 16.00 గం॥వరకు

Submission: Last date and time of closing of online submission of Tenders On or before **02.02.2026** Up to 16:00 Hrs.

టెక్నికల్ బిడ్ (పార్ట్-1) ఆన్‌లైన్‌లో తెరచు తేది, సమయం: 04.02.2026న 11.00 గం॥వరకు

Date & Time of online opening of Technical Bid (Part-1): on **04.02.2026** at 11:00 Hrs.

బిడ్ ఫారాలు మరియు ఇతర వివరాలను వెబ్‌సైట్ **https://eprocure.gov.in/eprocure/app** నుండి పొందవచ్చును. **e-NIT** వెబ్‌సైట్ **www.hwb.gov.in**లో చూసేందుకు మాత్రమే లభిస్తుంది.

The bid forms and other details can be obtained from the website **https://eprocure.gov.in/eprocure/app.** e-NIT is also avalible on website **www.hwb.gov.in for view only**

సం/- (జి.శ్రీనివాస్) (G.Srinivas)
జనరల్ మేనేజర్, GENERAL MANAGER
భారత రాష్ట్రపతి తరపున
For & On behalf of the President of India

CBC 48115/12/0047/2526

స్పష్టమైన మ్యాపింగ్!

కృష్ణ పదార్థం. ఈ అనంత విశ్వంలో అంతటా పరుచుకుని ఉన్న శక్తి. కంటికి కనిపించే గ్రహాలు, నక్షత్రాలు, నక్షత్ర మండలాలు తదితరాల ఉనికితో పాటు మనుగడకు కూడా మూల కారణంగా భావించే శక్తి. తద్వారా విశ్వ నిర్మాణంలోనే కీలకంగా మారిన కృష్ణ పదార్థం నిజానికి ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. అది కాంతితో ఏమాత్రం ప్రతిస్పందించకపోవడమే ఇందుకు కారణం. ఫలితంగా దాని ఉనికిని పరోక్ష ప్రమాణాల ద్వారానే సైంటిస్టులు నిర్ధారిస్తుంటారు. అందుకోసం శక్తిమంతమైన టెలిస్కోపుల ద్వారా వైశ్విక పదార్థాలను మ్యాపింగ్ చేయడం ఒక్కటే ప్రస్తుతానికి సైంటిస్టులు అనుసరిస్తున్న విధానం. ఆ క్రమంలో కృష్ణ పదార్థం స్వరూప స్వభావాలకు సంబంధించి స్పష్టతతో కూడిన మ్యాప్‌ను అంతరిక్ష పరిశోధకులు తాజాగా తయారు చేయగలిగారు! తద్వారా, కృష్ణ పదార్థం మన కంటికి కనిపించకపోయినా దాని ప్రభావం వల్ల వెలువడే గురుత్వాకర్షణ శక్తి తారలు, తారా మండలాలు, గ్రహాల ఆవిర్భావాన్ని ఎలా ప్రభావితం చేసిందన్న దానిపై సరికొత్త సమాచారం వెలుగులోకి వచ్చినట్టు చెబుతున్నారు. ఈ మ్యాప్‌ను జర్నల్ నేచర్ ఆస్ట్రోనమీలో తాజాగా ప్రచురించారు. నాసాకు చెందిన జేమ్స్ వెబ్ టెలిస్కోప్ అందజేసిన ఇమేజీల ఆధారంగా కృష్ణ పదార్థ మ్యాప్‌ను తయారు చేశారు. గతంలో హబుల్ టెలిస్కోప్ సాయంతో రూపొందించిన దానికంటే ఇది రెట్టింపు స్పష్టతతో కూడుకుని ఉన్నట్టు సైంటిస్టులు చెబుతున్నారు. ఇందుకోసం జేమ్స్ వెబ్ విశ్వంలో సుదూరాల దాకా, అంటే ఏకంగా 8 లక్షల పైచిలుకు గెలాక్సీల మేరకు చూపు సారించింది. వీటిలో చాలావరకు గతంలో మనిషి కంటికి చిక్కనివే కావడం విశేషం. కంటికి కనిపించని, కాంతితో స్పందించని కృష్ణ పదార్థం ఈ తారా మండలాల ఏర్పాటులో ఎలా కీలక పాత్ర పోషించిందన్న దానిపై తాజా మ్యాప్ మరింత స్పష్టత ఇచ్చిందని సైంటిస్టులు చెబుతున్నారు. దాన్ని లోతుగా అధ్యయనం చేస్తే కృష్ణ పదార్థానికి, కంటికి కనిపించే విశ్వానికి, అంటే మామూలు ద్రవ్యరాశికి మధ్య సంబంధం గురించి కూడా మరిన్ని విశేషాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని వారంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇంధన రంగంలో అద్భుత అవకాశాలు

- 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టొచ్చు
- ఈ దశాబ్దం ఆఖరు నాటికి 100 బిలియన్ డాలర్లు సాధిస్తాం
- ఇంధన వారోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- పెట్టుబడులతో ముందుకు రావాలని వ్యాపారవేత్తలకు పిలుపు

బేతుల్(గోవా): సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌పై మనదేశం పరుగులు తీస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఇంధన రంగంలో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. వేగవంతమైన సంస్కరణలు, విప్లవాత్మక చర్యలతో ఇంధన భద్రత నుంచి ఇంధన స్వతంత్రత దిశగా భారత్ ముందుకు సాగుతోందని వివరించారు. మంగళవారం గోవాలో 'భారత ఇంధన వారోత్సవం–2026'లో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఈ దశాబ్దం ఆఖరు నాటికి దేశ ఇంధన రంగంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాబట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. చమురు, సహజ వాయువు అన్వేషణ, వెలికితీత కోసం 10 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని గుర్తించినట్లు వెల్లడించారు. చమురు, గ్యాస్ వెలికితీత కోసం ఇప్పటికే 170 బ్లాక్‌లు కేటాయించామని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రంగా భారత్ అవతరించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అండమాన్ నికోబార్ బేసిన్ హైడ్రోకార్బన్ ఉత్పత్తి కేంద్రంగా మారబోతోందని అన్నారు. మనం ఉపయోగించుకుంటున్న మొత్తం ఇంధనంలో సహజ వాయువు వాటాను 2030 నాటికి 15 శాతానికి పెంచబోతున్నట్లు వివరించారు. దీనివల్ల ఎన్ఎన్‌జీ, పైపులైన్ల తయారీలో కొత్తగా అందుబాటులోకి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. మన ఆర్థిక వ్యవస్థ నానాటికీ బలోపేతం అవుతోందని, ఫలితంగా రాబోయే రోజుల్లో పెట్రోకెమికల్స్‌కు డిమాండ్ మరింత పెరుగుతుందని అన్నారు.

మాతో చేతులు కలపండి

భారత ఇంధన రంగంలో నేడు వ్యాపారాభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని దేశ విదేశాల పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా భారత్ రికార్డుకెక్కిందని, దేశంలో ఇంధన ఉత్పత్తులకు డిమాండ్ స్థిరంగా పెరుగుతోందని గుర్తుచేశారు. అంతర్జాతీయ డిమాండ్‌ను సైతం తీర్చేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ ప్రపంచంలో టాప్–5లో ఒకటిగా నిలుస్తోందన్నారు. 150కి పైగా దేశాలకు ఎగుమతు లు జరుగుతున్నాయని చెప్పారు. ఈ విషయంలో భారత సామర్థ్యం విదేశీ భాగస్వాములకు తోడ్పడుతుందని ఉద్ఘాటించారు. తమతో చేతులు కలపాలని, ఇక్కడున్న అవకాశాలు ఉపయోగించుకోవాలని విదేశీ పెట్టుబడిదారులకు సూచించారు. చమురు, గ్యాస్ అన్వేషణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, సముద్ర మంథన్ మిషన్‌లో భాగంగా సముద్రాల అంతర్భాగంలో వనరుల కోసం అన్వేషణ సాగిస్తున్నామని వివరించారు.

చమురు శుద్ధిలో గ్లోబల్ లీడర్‌గా..

పెట్టుబడిదారులకు లాభదాయకంగా ఉండేలా చట్టాలు, నిబంధనల విషయంలో పరిశ్రమ వర్గాల అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ప్రధానమంత్రి తెలియజేశారు. చమురు శుద్ధిలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. త్వరలో గ్లోబల్ లీడర్‌గా మారడం ఖాయమని తెలిపారు. ప్రతిఏటా 260 మిలియన్ టన్నుల చమురు శుద్ధి సామర్థ్యం ఉందని, దీన్ని 300 మిలియన్ టన్నులకు పెంచబోతున్నామని స్పష్టంచేశారు. దేశంలో గ్యాస్ పంపిణీలోనూ అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. పట్టణాలు, నగరాల్లో పైప్‌లైన్, గ్యాస్ పంపిణీ వ్యవస్థలు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. దేశంలో పారదర్శకమైన, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ఇంధన రంగం అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తేల్చిచెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా, ఇన్నోవేట్ ఇన్ ఇండియా, స్కేల్ ఇన్ ఇండియా, ఇన్వెస్ట్ ఇన్ ఇండియా' అంటూ ప్రపంచ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు.

వీబీ జీ రామ్‌జీపై చర్చ కుదరదు

- ఎస్ఐఆర్ సర్వే పైనా చర్చించడానికి ఏమీ లేదు
- స్పష్టంచేసిన మోదీ సర్కార్
- అఖిలపక్ష భేటీలో అన్ని పార్టీల సహకారం కోరిన కేంద్రం
- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్న రాష్ట్రపతి
- ఫిబ్రవరి ఒకటిన బడ్జెట్
- తొలిసారిగా ఆదివారం పద్దును ప్రవేశపెట్టనున్న మంత్రి నిర్మల

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ ఉపాధి హామీ పథకంలో సంస్కరణలే లక్ష్యంగా సవరణలో తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్(గ్రామీణ్)(వీబీ జీ రామ్ జీ) చట్టంపై పార్లమెంట్‌లో చర్చ ఉండబోదని మోదీ సర్కార్ కుండబద్దలు కొట్టింది. బుధవారం నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో సంప్రదాయం మేరకు ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసింది. పార్లమెంట్ సమావేశాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌జీనరేగా)పై చర్చించాలని భేటీలో విపక్షాలు పట్టుబట్టడంతో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు మాట్లాడారు. ''దేశంలో ఒక చట్టాన్ని అమల్లోకి తెచ్చాక దానిని మనందరం ఆచరించాల్సిందే. దాని నుంచి మళ్లీ రివర్స్‌గేర్‌లో వెళ్లలేం. వెనకడుగు వేసి మళ్లీ పాత చట్టాన్ని అమలుచేయబోం. అలా ఎన్నటికీ సాధ్యం కాదు. వీబీ జీ రామ్‌జీ చట్టంపై, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సర్వేపైనా చర్చించడానికి ఏమీ లేదు. గత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎన్నికల సంస్కరణలపై విస్తృతస్థాయిలో చర్చ జరిగింది. ఆనాడు విపక్ష సభ్యులు గంటల తరబడి మాట్లాడి మాట్లాడి అలసిపోయారు'' అని రిజిజు వ్యాఖ్యానించారు. ''ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఓటర్లు మమ్మల్ని ఎన్నుకున్నారు. అయితే విపక్ష సభ్యులందరికీ పార్లమెంట్‌లో తమ వాణిని వినిపించే వాక్ స్వాతంత్ర్యం ఉంది. రామ్‌జీ చట్టం, ఎస్ఐఆర్ ప్రక్రియ మినహా మిగతా అంశాలను విపక్షాలు ప్రస్తావించవచ్చు. వాళ్ల వాదనలను వినడమూ మా విధే. అంశాలపై చర్చ జరిగేలా చూడాలిగానీ రభస జరిగేలా చూడొద్దు'' అని వ్యాఖ్యానించారు. ''సభలో ఏఏ అంశాలపై చర్చిస్తారనే సభా కార్యకలాపాల జాబితాను మేం వెల్లడించట్లేమని విపక్షాలు ఆడిపోసుకుంటున్నాయి. వాస్తవానికి బడ్జెట్ సమావేశాల తొలిరోజున రాష్ట్రపతి ప్రసంగం తర్వాత సభాకార్యకలాపాల షెడ్యూల్‌ను విడుదల చేస్తాం'' అని రిజిజు స్పష్టం చేశారు.

ఉదయం 11 గంటలకు సమావేశాలు షురూ

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. 29న కేంద్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక సర్వే నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. గతానికి భిన్నంగా తొలిసారిగా ఆదివారం (ఫిబ్రవరి ఒకటో తేదీ) ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 2026–27 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. ఫిబ్రవరి రెండో తేదీన రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. రాజ్యసభ, లోక్‌సభలో దీనికి ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వనున్నారు.

వాడివేడిగానే చర్చలు

ఈ సమావేశాల్లో మోదీ సర్కార్‌ను నిలదీసేందుకు విపక్షాలు పదునైన అంశాల కత్తులు నూరుతున్నాయి. భారత్‌పై అమెరికా పాతిక శాతం అదనపు టారిఫ్‌ల భారం మోపడంతో దేశ వస్త్ర పరిశ్రమ, ఆహార ఎగుమతులు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయని, ఇతర రంగాలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయన్నాయని అఖిలపక్ష భేటీలో విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్చేసి ఎన్‌డీఏ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వీబీ జీ రామ్ జీ చట్టాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్, డీఎంకే తదితర పార్టీలు తప్పుబట్టాయి. ఈ అంశాలపై విపక్షాల ఆరోపణలతో పార్లమెంట్ అట్టుడికే అవకాశాలున్నాయి. వీటితోపాటు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల కష్టాలు, కేంద్ర–రాష్ట్ర సంబంధాలు, గవర్నర్ల తీరు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని కడిగి పారేయాలని విపక్షాలు నిర్ణయించాయి.

సహకరించాలన్న కేంద్రం

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం తరఫున పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీ, జేడీయూ, వైఎస్సార్‌సీపీ, డీఎంకే, టీడీపీ, టీఎంసీ, శివసేన షిండే, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీల ఫ్లోర్ లీడర్లు హాజరయ్యారు. ఉభయ సభలు సజావుగా సాగేందుకు ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్ర మంత్రులు కోరారు.

అన్ని అంశాలపై చర్చించాలన్న విపక్షాలు

భేటీ అనంతరం రాజ్యసభలో కాంగ్రెస్ ఉపనేత, పార్టీ ఎంపీ ప్రమోద్ తివారీ మీడియాతో మాట్లాడారు. ''బీజేపీ పాలనలో రాజ్యాంగం కల్పించిన హక్కులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. రాజ్యాంగ సంస్థలు బలహీనపడుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ప్రమాదం పొంచి ఉంది. రాజ్యాంగబద్ధ సంస్థల్లో ఒకే భావజాలానికి చెందిన వ్యక్తులను నియమించడం ద్వారా సంస్థల స్వతంత్రతను మోదీ సర్కార్ దెబ్బతీస్తోంది'' అని తివారీ మండిపడ్డారు. ''డాలర్‌తో మారకం విలువ ఏకంగా 92 రూపాయలకు పడిపోయింది. రష్యా చమురు కొనుగోళ్లు, అమెరికా టారిఫ్ దెబ్బ, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా, ఢిల్లీలో దారుణమైన వాయు కాలుష్యం, ఇండోర్ మరింత దారుణంగా నీటి కాలుష్యం.. ఇలా ఎన్నో అంశాలపై చర్చకు పట్టుబడతాం'' అని తివారీ అన్నారు.

15 ఏళ్లలోపు 'బ్యాన్'

- చిన్నారులు సోషల్ మీడియా వాడకుండా నిషేధం

ఫ్రాన్స్ దిగువసభలో బిల్లుకు ఆమోదముద్ర

పారిస్: సామాజిక మాధ్యమాల సుడిగుండంలో పడి విద్యారోగ్యాలను పాడుచేసుకుంటున్న చిన్నారులను కాపాడే లక్ష్యంతో ఫ్రాన్స్ ముందడుగువేసింది. 15 ఏళ్లలోపు చిన్నారుల సోషల్‌మీడియా వినియోగంపై నిషేధం విధిస్తూ ఫ్రాన్స్ చట్టసభ సభ్యులు సంబంధిత బిల్లుకు ఆమోదముద్ర వేశారు. సోమవారం అర్ధరాత్రి దాటాక ఫ్రాన్స్ పార్లమెంట్ దిగువసభలో జరిగిన ఓటింగ్‌లో 130–21 మెజారిటీతో బిల్లుకు సభ్యులు ఆమోదం తెలిపారు. సెప్టెంబర్‌లో మొదలయ్యే నూతన విద్యాసంవత్సరం నుంచి ఈ నిషేధాన్ని అమల్లోకి తేనున్నట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రకటించారు. అయితే ఈ బిల్లు ఇంకా ఎగువసభ అయిన సెనేట్‌లో ప్రవేశపెట్టాల్సి ఉంది. వచ్చే కొద్దివారాల్లో దీనిని సెనేట్‌లోనూ ఆమోదింపజేసుకుంటామని మేక్రాన్ ధీమా వ్యక్తంచేశారు. బిల్లు దిగువసభలో ఆమోదంపొందడంతో మేక్రాన్ సంతోషం వ్యక్తంచేశారు.

మంచు తుపాను గుప్పిట్లో అమెరికా

- వేలాది విమాన సర్వీసులు రద్దు
- విద్యుత్ సరఫరా అంతరాయంతో అంధకారంలో మగ్గిపోతున్న లక్షలాది కుటుంబాలు
- మంచు సంబంధ ఘటనల్లో 35 మంది మృతి

బోస్టన్‌లో కార్లను కప్పేసిన మంచును తొలగిస్తున్న యజమానులు

కెనుసా(యూఎస్): అమెరికాలోని పలు రాష్ట్రాలను మంచు తుపాను కమ్మేసింది. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తోడవడంతో లక్షలాది కుటుంబాలు అంధకారంలో, చలిలో ఉండిపోయాయి. 8 లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒక్క నాష్‌విల్లే పరిధిలోనే 1,50,000 ఇళ్లకు కరెంట్ సరఫరాలేక చలికి జనం అవస్థలుపడ్డారు. మిసిసిప్పీలోనూ ఇదే దారుణ పరిస్థితిని జనం చవిచూశారు. చాలా నగరాల్లో మంచు అర మీటర్‌కంటే ఎక్కువ ఎత్తులో పేరుకుపోయింది. దీంతో రహదారులపై వాహనాల ప్రయాణాలు ప్రాణాంతకంగా మారాయి. మంచు సంబంధ ఘటనల్లో ఇప్పటిదాకా 35 మంది ప్రాణాలు కోల్పోయారు. కన్సాస్‌లో ఒకావిడ కోటు ధరించకుండా బార్ నుంచి బయటికొచ్చి శీతలగాలులకు బలై మంచులో కూరుకుపోయారని అధికారులు తెలిపారు. జనం ఇళ్లకు పరిమితం కావాలని ప్రయాణాలు పెట్టుకోవద్దని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్చరించాయి. టెక్సాస్ రాష్ట్రం మొదలు మెనే రాష్ట్రం దాకా గల్ఫ్ ఆఫ్ మెక్సికో పరిధిలోని అమెరికా రాష్ట్రాల్లో మంచు విపరీతంగా కురుస్తూ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఇళ్లను వేడిగా ఉంచే వ్యవస్థలు విఫలమవడంతో అమెరికా పౌరుల చలి కష్టాలు మరింత తీవ్రతరమయ్యాయి. ''మంచు తుపాను ధాటికి మా ప్రాంతంలో చెట్లన్నీ కుప్పకూలిపోయాయి. బయటికెళ్లి చూస్తే మొత్తం యుద్ధక్షేత్రాన్ని తలపించింది. ఇక్కడ చాలా మంది ఇళ్లకు కరెంట్ లేదు. వేడి వ్యవస్థ లేదు. కనీసం తాగడానికి నీరు లేదు''అని మిసిసిప్పీలోని లూకా సిటీకి చెందిన ఆండ్రియన్ రోంకా హోన్ చెప్పారు. మిసిసిప్పీ, లూసియానా, ఓక్లహామా, అలబామా, సౌత్ కరోలినా, టెక్సాస్ రాష్ట్రాలనూ మంచు తుపాను ముంచెత్తింది.

మూగబోయిన ఫోన్లు..

మసాచుసెట్స్‌లోని స్టెర్లింగ్‌లో ఏకంగా 56.2 సెంటీమీటర్ల ఎత్తు వరకు మంచు కురిసింది. నాష్‌విల్లేలో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చార్జింగ్ అయిపోయి మొబైల్‌ఫోన్లు సైతం మూగబోయాయి. చివరకు అగ్నిమాపక, పోలీస్ స్టేషన్‌లలోనూ ఇదే పరిస్థితి కన్పించింది. ''మా ప్రాంతంలో చెట్లు నేలకూలాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయి. ఉరుములు మెరుపులతో జనం బయపడిపోయారు''అని మిసిసిప్పీలోని ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన మార్షల్ రామ్సే చెప్పారు. అర్కాన్సాస్ మొదలు న్యూ ఇంగ్లాండ్ రీజియన్‌దాకా నగరాలను మంచు దుప్పటి కప్పేసింది. దీంతో ఎయిర్‌పోర్ట్‌ల నుంచి విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. వేల సంఖ్యలో విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. పాఠశాలలను మూసేశారు. పిట్స్‌బర్గ్‌లో 20 అంగుళాల మేర మంచు కురిసింది. ఇక్కడ మైనస్ 25 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మిసిసిప్పీలో 1994 ఏడాది తర్వాత తొలిసారిగా భారీస్థాయిలో మంచు కురిసింది. తుపాను బాధితులను ఆదుకునేందుకు సహాయక బృందాలు రంగంలోకి దిగి దుప్పట్లు, తాగునీరు, జనరేటర్లను సరఫరా చేశారు. టోర్నడో(ప్రచండగాలి) మాదిరి తమ నగరంలో ప్రతి వీధిలో మంచు తుపాను వినాశనం సృష్టించిందని ఆక్స్‌ఫర్డ్ నగర మహిళా మేయర్ రాబిన్ తన్నాహిల్ ఆవేదన వ్యక్తంచేశారు.

అగ్నిగుండంలా ఆస్ట్రేలియా

వెల్లింగ్టన్: ఆస్ట్రేలియాలో ఉష్ణోగ్రతలు రికార్డ్ స్థాయిలో నమోదవుతున్నాయి. వడగాలుల ధాటికి ఆగ్నేయ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా 50 డిగ్రీ సెల్సియస్ స్థాయికి పెరిగిపోయాయి. ఎంతటి చలినైనా తట్టుకునే ఆస్ట్రేలియన్లను ఇంతటి భరించలేని వేడిమి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడుతున్నారు. విక్టోరియా రాష్ట్రంలోని హోప్‌టౌన్, వాల్ఫ్‌అప్‌లోని గ్రామీణ పట్టణాల్లో ఉష్ణోగ్రతలు 48.9 డిగ్రీ సెల్సియస్‌కు చేరుకున్నాయి. ఇవి బుధవారానికి మరింత పెరిగి 50 డిగ్రీ సెల్సియస్‌కు చేరుకునే అవకాశముందనే భయాందోళనలు నెలకొన్నాయి. 2009 ఏడాదిలోనూ ఇలాగే వడగాలుల ధాటికి 173 మంది ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం నమోదైన వడగాలుల కారణంగా ఇంతవరకు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని, కానీ సమీప అడవులు దహనమయ్యే ప్రమాదం పొంచి ఉందని అధికారులు హెచ్చరించారు. విక్టోరియా రాష్ట్రంలోని అతిపెద్ద నగరం మెల్‌బోర్న్‌లోనూ వేడిమి అత్యధికమైంది.

బీజేపీని ఢీకొడుతున్న ఏకైక ప్రతిపక్ష నేత మమత

- తృణమూల్ కాంగ్రెస్‌కు మద్దతిస్తాం
- సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ప్రశంసల వర్షం కురిపించారు. దేశంలో బీజేపీని ప్రభావవంతంగా ఎదుర్కొంటున్న ఏకైక ప్రతిపక్ష నాయకురాలు ఆమేనని పేర్కొన్నారు. బెంగాల్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి పరాజయం తప్పదని తేల్చిచెప్పారు. గౌరవప్రదమైన ఓటమి కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు. అఖిలేష్ యాదవ్ మంగళవారం కోల్‌కతాలో మమతా బెనర్జీతో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై వారు చర్చించుకున్నారు. అనంతరం అఖిలేష్ మీడియాతో మాట్లాడారు. బీజేపీని ఢీకొట్టడంలో మమతా బెనర్జీ ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలు అపూర్వం అని కొనియాడారు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు తమ మద్దతు ఉంటుందన్నారు. బీజేపీపై పోరాటంలో మమతా బెనర్జీకి ప్రజలు అండగా నిలుస్తున్నారని చెప్పారు.

కాంగ్రెస్‌పై తిరుగుబాటు!

మమతా బెనర్జీతో అఖిలేష్ యాదవ్ సమావేశం కావడం, ఆమెను ప్రశంసించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. విపక్ష 'ఇండియా' కూటమిలో తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ భాగస్వామ్య పక్షాలుగా కొనసాగుతున్నాయి. కూటమిలో కాంగ్రెస్ పెద్దన్న ధోరణిని ఆ రెండు పార్టీలు గతంలో వ్యతిరేకించాయి. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన పలు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. కూటమి విచ్ఛిన్నమయ్యే సూచనలు కూడా కనిపించాయి. ఈ నేపథ్యంలో అఖిలేష్ యాదవ్.. మమతా బెనర్జీని ఆకాశానికి ఎత్తేయడం చూస్తే కాంగ్రెస్ పార్టీపై పరోక్షంగా విమర్శలు చేసినట్లేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఒకరకంగా ఇది కాంగ్రెస్‌పై తిరుగుబాటేనని అంటున్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో ఎస్సీ, ఎస్టీ కోటా విచారణకు సుప్రీం నో

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన లాయర్లకు రిజర్వేషన్లు కల్పించాలంటూ దాఖలైన పిల్‌పై విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ మహదేవన్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం మంగళవారం దీనిపై విచారణ చేపట్టింది. న్యాయవాదుల చట్టం–1961లో రాష్ట్ర బార్ కౌన్సిళ్ల ఎన్నికల్లో రిజర్వేషన్లు, ప్రాతినిథ్యంపై ఎలాంటి ప్రస్తావన లేనప్పటికీ మహిళలకు రిజర్వేషన్లను తప్పనిసరి చేస్తూ ఇప్పటికే సుప్రీం ఆదేశాలు జారీ చేసినట్లు పిటిషనర్ తరఫు లాయర్లు వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం..'మీరు అంతటా ఉన్నారు. న్యాయవ్యవస్థలో, న్యాయవాదుల్లో, పార్లమెంటులోనూ ఉన్నారు. 1961 నుంచి బార్ కౌన్సిల్ ఉంది. అప్పటి నుంచి ఎవరూ రిజర్వేషన్‌లంటూ ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. కేవలం సుప్రీంకోర్టు మహిళల కోసం ఏదో ఒకటి చేసింది కాబట్టే మీరు ఇప్పుడు వచ్చారు! మీకు అన్నీ సిద్ధంగా కావాలి'అని వ్యాఖ్యానించింది. అదే సమయంలో, తమ మునుపటి ఆదేశాల పరిధిని వివరిస్తూ ధర్మాసనం.. 'మేం మహిళా న్యాయవాదులకు రిజర్వేషన్ ఇవ్వలేదు. బార్ కౌన్సిళ్లలో దశాబ్దాలుగా వారి ప్రాతినిథ్యం చాలా తక్కువగా ఉంది. ఆ పరిస్థితిని సరిచేయడానికి వారి ప్రాతినిథ్యాన్ని మాత్రమే తప్పనిసరి చేశాం. ఇది రిజర్వేషన్ కాదు. కేవలం ప్రాతినిథ్యం మాత్రమే'అని స్పష్టం చేసింది. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో బార్ కౌన్సిళ్ల ఎన్నికల ప్రక్రియ మొదలైందన్న ధర్మాసనం..పిటిషన్‌ను ఆలస్యంగా వేశారని పేర్కొంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో రిజర్వేషన్ సౌలభ్యం కల్పించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. మహిళా న్యాయవాదులకు లభించిన ఊరట దీర్ఘకాలం వారు చేసిన న్యాయపోరాటం వల్ల దక్కిన ఫలితమేనని సీజేఐ అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కోర్టును ఆశ్రయించినందుకు పిటిషనర్లను ఆయన తప్పుబట్టారు.

ఈయూ అతిథులకు రాష్ట్రపతి విందు

చవులూరించిన హిమాలయ రుచులు

న్యూఢిల్లీ: యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయన్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం ఘనంగా విందు ఇచ్చారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తదితరులు కూడా పాల్గొన్నారు. హిమాలయ ప్రాంతానికి చెందిన పలు ప్రత్యేక భారతీయ రుచులను అతిథులు ఈ సందర్భంగా రుచి చూశారు. కశ్మీర్, లద్దాఖ్ మొదలుకుని ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాల దాకా పలు ప్రాంతాలకు చెందిన వంటకాలు విందులో చోటుచేసుకున్నాయి. అతిథులకు సుందర్‌కళా తిచోనీ నూడుల్స్, హిమాలయ స్వర్ణ బియ్యంతో చేసిన అన్నం, మంచు ప్రాంతాల్లో దొరికే అరుదైన గుక్కీ పుట్టగొడుగుల కూర, గ్రీన్ టొమేటో చట్నీ, ఆవా ఆకులు, కశ్మీరీ వాల్‌నట్, కాల్చిన టొమేటోలతో చేసిన పచ్చళ్లు, జఖియా ఆలూ, ఝంగోరా కీ ఖీర్, యాక్ చీజ్ కస్టర్డ్, భాంగ్ మాత్రీ, బిచ్చూ బూటీ పట్టా, సొరకాయలతో చేసిన స్వీట్లు, క్యారెట్ కడీ తదితరాలను వడ్డించారు. చివరగా హిమాలయన్ రాగి మిఠాయి, కశ్మీరీ యాపిల్ కేక్, సీ బక్‌థోర్న్ క్రీం, కాఫీ కస్టర్డ్ తదితరాలను వారు రుచి చూశారు.

ఆరంభం మాత్రమే: ఉర్సులా

చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని భారత్, యూరోపియన్ యూనియన్ సంబంధాల్లో నిర్ణాయక క్షణంగా ఉర్సులా అభివర్ణించారు. ఈ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ప్రపంచానికి అవి గట్టి సందేశమిచ్చాయన్నారు. ద్వైపాక్షిక బంధంలో సువర్ణాధ్యాయానికి ఇది ఆరంభం మాత్రమేనని రాష్ట్రపతి విందు భేటీ సందర్భంగా ఆమె ధీమా వెలిబుచ్చారు.

యాసిడ్ దాడి కేసుల వివరాలివ్వండి

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: యాసిడ్ దాడి ఘటనలను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణిస్తోంది. ఇందుకు సంబంధించిన ఘటనల పూర్తి వివరాలను సంవత్సరాల వారీగా అందజేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. వివిధ కోర్టుల్లో ఈ కేసుల విచారణ పురోగతిని వెల్లడించాలని, బాధితుల పునరావాసానికి తీసుకున్న చర్యలను నాలుగు వారాల్లోగా తెలపాలని కోరింది. 'యాసిడ్ దాడి కేసులకు సంబంధించి దిగువ కోర్టుల్లో దాఖలైన చార్జిషీట్ల సంఖ్యను, దిగువ కోర్టుల్లో పరిష్కరించిన లేదా వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సమాచారాన్ని, హైకోర్టులు సహా అప్పిలేట్ కోర్టుల్లో దాఖలైన అప్పీళ్ల సంఖ్యను తెలపండి'అంటూ మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి బాధితురాలి విద్యార్హతలు, ఉద్యోగం, వివాహ స్థితి, వైద్య చికిత్స వివరాలు, అందుకు అయిన ఖర్చుల గురించిన సంక్షిప్త సమాచారం అందజేయాలని కోరింది. యాసిడ్ దాడుల బాధితుల పునరావాసానికి ప్రభుత్వ పరంగా అందించే సాయం గురించి కూడా తెలపాలంది. అంతేకాకుండా, ఒకవేళ బలవంతంగా యాసిడ్ తాగిన బాధితులుంటే ఆ కేసుల వివరాలను కూడా అందజేయాలని సూచించింది. యాసిడ్ దాడులకు పాల్పడిన వారికి అత్యంత తీవ్రమైన శిక్షలుండేలా చట్టంలో మార్పులు చేపట్టాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది. యాసిడ్ దాడి బాధితురాలైన షహీన్ మాలిక్ వేసిన పిల్‌పై విచారణ సందర్భంగా పైవిధంగా ధర్మాసనం స్పందించింది. తీవ్ర శారీరక వైకల్యం, అంతర్గత అవయవాలు దెబ్బతిన్న యాసిడ్ దాడుల బాధితులను కూడా దివ్యాంగుల జాబితాలో చేర్చేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ పిటిషన్‌లో ఆమె కోరారు. దీనివల్ల బాధితులకు తగురీతిలో పరిహారం, వైద్య సాయం వంటి సౌకర్యాలు అందుతాయన్నారు.

సాక్షి గుంటూరు

బుధవారం । 28 । జనవరి । 2026

ఎస్పీకి డైరీ అందజేత

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు మంగళవారం పోలీస్ అసోసియేషన్ డైరీ (2026)ని జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు అందించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 37.1406 టీఎంసీలు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.3,800, మోడల్ ధర రూ.3,400 వరకు పలికింది.

న్యూస్‌రీల్

కల్యాణ వేంకటేశ్వరుడికి హనుమంత వాహన సేవ

చిలకలూరిపేట: పట్టణంలోని పద్మావతి గోదా సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి హనుమంత వాహన సేవ గ్రామోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అగ్నిధ్యానం, నిత్యహోమం, బలిహరణ, మహాశాంతి హోమం వంటి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విజయకీలాద్రిపై బ్రహ్మోత్సవాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణం సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై 9వ వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో హయగ్రీవ హోమం, హనుమద్వామన సేవ ఘనంగా జరిగాయని, స్వామి వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారని తెలిపారు. సాయంత్రం 6.30 నుంచి 8.30 వరకు అశ్వవాహన సేవ నిర్వహించామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని వెంకటాచార్యులు తెలిపా రు.

2న బుద్ధునితో నా ప్రయాణం నాటిక ప్రదర్శన

రేపల్లె: పట్టణంలోని గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో ఫిబ్రవరి 2వ తేదీ సాయంత్రం ప్రదర్శించనున్న బుద్ధునితో నా ప్రయాణం, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ దృశ్య రూపకాన్ని ప్రతిఒక్కరూ తిలకించాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా బాపట్ల జిల్లా అధ్యక్షుడు న్యాయవాది దారం సాంబశివరావు, ది ఆది ఆంధ్ర నవ బుద్ధిస్ట్ సొసైటీ కార్యదర్శి దోవా రమేష్ రాంజీలు కోరారు. వీటికి సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. రేపల్లె ప్రాంతానికి చెందిన బౌద్ధ రచయిత బొర్రా గోవర్ధన్ సహకారంతో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సౌజన్యంతో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే ఈ దృశ్య రూపకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు ఆలూరి బిక్షాలు, నాయకులు బేతపూడి భాస్కరరావు, కూచిపూడి రవీంద్ర, కనపర్తి రవికిరణ్, బేతపూడి వెంకటేశ్వరరావు, రెబ్బా కోదండరాం, చెరుకూరి లక్ష్మణరావు, కర్రా బాబురావు, నలుకుర్తి శశి కుమార్, నీలా రాజ్ కుమార్, చందోలు సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లి కళాకారుడికి అంతర్జాతీయ అవార్డు

తాడేపల్లి రూరల్: ఉండవల్లిలో నివాసం ఉంటున్న ఓ కళాకారుడికి అంతర్జాతీయ అవార్డు ప్రకటించడంతో తోటి కళాకారులు మంగళవారం అతడిని అభినందించారు. ఉండవల్లికి చెందిన దర్శకుడు గాదె నాగభూషణం రూపొందించిన జీవనధార లఘు చిత్రంలో నటించిన పులిగడ్డ సత్యనారాయణకు ఈ అవార్డు లభించింది. ఈనెల 31వ తేదీన హైదరాబాద్‌లో ఈ అవార్డును అందుకోవాలని సూచిస్తూ లేఖ అందడంతో ఉండవల్లిలో కళాకారుల్లో నూతన ఉత్తేజం పెరిగింది. ఈ సందర్భంగా గాదె నాగభూషణం మాట్లాడుతూ త్రినేత్ర ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో జీవనధార అనే లఘు చిత్రాన్ని రూపొందించామని అందులో నటించిన పులిగడ్డ సత్యనారాయణకు ఈ అవార్డు రావడం చాలా ఆనందించదగ్గ విషయమని, రోటరీక్లబ్ కళాచైతన్యం అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలలో ఈ అవార్డు లభించిందని పేర్కొన్నారు.

భవతీ బిక్షాం దేహీ

అప్పుల్లో జెడ్పీ

- బడ్జెట్ కేటాయింపులకు మించి ఇష్టారాజ్యంగా పనులు మంజూరు
- జెడ్పీటీసీల అంగీకారం లేకుండా చైర్‌పర్సన్ ఏకపక్షంగా పనులు మంజూరు
- నిధులు లేకుండా పనులు మంజూరుపై అధికారుల్లో ఆందోళన
- స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి నిధులు విడుదల చేయని టీడీపీ సర్కారు
- కేంద్ర నిధులు మినహా పైసా విదల్చని చంద్రబాబు ప్రభుత్వం
- రూ.26 కోట్ల పనులకు నిధుల లభ్యత లేకుండా అనుమతులు
- ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న జిల్లా పరిషత్

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ అప్పుల్లో కూరుకుపోతోంది. జెడ్పీకి వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా పనులకు అనుమతులు ఇచ్చేస్తున్న కారణంగా ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తోంది. పాలకవర్గంలో భాగస్వాములుగా ఉన్న జెడ్పీటీసీలకు తెలియకుండా, వారి అంగీకారం లేకుండా చైర్‌పర్సన్ ఏకపక్షంగా ఇస్తున్న అనుమతులతో జెడ్పీ ఖజానా దివాళాకు చేరువైంది. జెడ్పీ ఆదాయ, వ్యయాలను పరిగణలోకి తీసుకుని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు, ఇతర ఆదాయ మార్గాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన అభివృద్ధి పనులను రాజకీయ ప్రయోజనాలు, సొంత అవసరాలకు వాడుకోవడంతో జెడ్పీ పరిస్థితి దారుణంగా మారుతోంది. బడ్జెట్ కేటాయింపులకు మించి మంజూరు చేస్తున్న కారణంగా బిల్లులు చెల్లించే సమయంలో నిధులు ఎక్కడి నుంచి తీసుకురావాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఆదాయ మార్గాలను పెంచుకోవడంలో విఫలం

సొంతంగా ఆదాయ మార్గాలను పెంచుకోవడంలో విఫలమవుతున్న జెడ్పీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు తెచ్చుకోవడంలోనూ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోంది. పాలకురాలి వ్యవహారశైలి కారణంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పడకేస్తోంది. ప్రజల ఓట్లతో గెలిచి, పాలకవర్గంలో భాగస్వాములుగా ఉన్న జెడ్పీటీసీలను పక్కనపెట్టి సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్న పాలకుల వైఖరి కారణంగా జెడ్పీని ప్రతిష్ట మసకబారుతోంది. ఫలితంగా వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు పనులు చేయలేక, ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకుంటున్నారు. మరోవైపు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సులకు పెద్దపీట వేసి వారికి ప్రాధాన్యత ఇవ్వడంతో జెడ్పీటీసీలు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. మూడు నెలలకోసారి కొలువుదీరే స్టాండింగ్, జనరల్ బాడీ సమావేశాలకు హాజరై అజెండా ఆమోదానికి పరిమితమవుతున్న పరిస్థితుల్లో గత్యంతరం లేక రాజ్యాంగం కల్పించిన హక్కులను అస్త్రంగా వాడుకుంటున్నారు. తమ మండలాల్లో తమను సంప్రదించకుండా టీడీపీ ప్రజాప్రతినిధుల సిఫార్సులకు ప్రాధ్యానం ఇస్తూ చైర్‌పర్సన్ సాగిస్తున్న ఏకపక్ష విధానాలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు సమావేశాలను అడ్డుకుంటున్నారు.

పైసా విదల్చని టీడీపీ సర్కారు

జెడ్పీ నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారశైలి మరింత ఆందోళనకరంగా ఉంది. జెడ్పీకి స్టాంప్ డ్యూటీ కింద ప్రభుత్వం నుంచి రూ.35 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం రూ.40 లక్షలు విదిల్చారు. జెడ్పీకి వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయంతో పాటు 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన బకాయిలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సర నిధులకు సైతం పనులు కేటాయించేశారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ నియోజకవర్గాల్లో వివిధ అభివృద్ధి పనులకు జెడ్పీటీసీలతో చర్చించకుండా చైర్‌పర్సన్ ముందస్తుగా అనుమతులు ఇచ్చేయడంతో జెడ్పీలో ఆర్థిక ప్రణాళిక దిగజారింది.

నిధుల లభ్యత, పనుల కేటాయింపుల్లో పొంతన శూన్యం

జెడ్పీలో నిధుల లభ్యత, కేటాయించిన పనులకు పొంతన ఉండటం లేదు. 15వ ఆర్థిక సంఘం సీపీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా చేపట్టాల్సిన పనులకు సంబంధించి జెడ్పీకి 2025–26 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రూ.19.51 కోట్లు కేటాయించింది. అయితే సీపీడబ్ల్యూఎస్ టైడ్, అన్‌టైడ్ కింద రూ.34.12 కోట్ల పనులకు ముందస్తు అనుమతులు ఇచ్చేశారు. ఈ విధంగా వచ్చే నిధులకు, మంజూరు చేసిన పనులకు పొంతన లేకపోవడం జెడ్పీని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వేస్తోంది. కేంద్రం నుంచి వచ్చిన నిధులు 8.84 కోట్లు కాగా, రూ.14.61 కోట్లు అదనంగా కేటాయింపులు జరిపారు. దీంతో సంబంధిత పనులకు చెల్లింపులు జరపడం సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. అలాగే జెడ్పీ సాధారణ నిధుల్లో సైతం భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో నిధుల లభ్యత కేవలం రూ.2.90 కోట్లుగా ఉండగా, రూ.11.27 కోట్ల పనులకు ముందస్తు అనుమతులు ఇచ్చేశారు.

స్తంభించిన బ్యాంక్ లావాదేవీలు

గుంటూరు నగరంలో జరిగిన సమ్మెలో వివిధ బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది

కొరిటెపాడు(గుంటూరు): బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా గుంటూరు జిల్లాలోని బ్యాంకు ఉద్యోగులు ఐదు రోజుల పని విధాన ఒప్పందం వెంటనే అమలు పరచాలని జీటీ రోడ్‌లోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా(యూబీఐ) రీజినల్ ఆఫీసు వద్ద మంగళవారం సమ్మె చేపట్టారు. పెద్ద ఎత్తున బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది హాజరై నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ఐదు రోజుల పని డిమాండ్ ఆవశ్యకత గురించి మాట్లాడుతూ తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బ్యాంకు యూనియన్‌ల నాయకులు మాట్లాడుతూ దాదాపు 2015 నుంచి అనేక రకాల పోరాటాల ఫలితంగా ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఐదు రోజుల పని విధానం ఒప్పందం జరిగి రెండు సంవత్సరాలు అయినప్పటికీ, ప్రభుత్వ అనుమతి కావాలని కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్థిక సంస్థలు అయినటువంటి ఆర్‌బీఐ, నాబార్డు, ఇన్సూరెన్స్, కేంద్ర ప్రభుత్వ సంస్థలు అన్నీ ఇప్పటికే ఐదు రోజుల పని విధానాన్ని పాటిస్తూ ఉన్నాయని తెలిపారు. ఒక్క బ్యాంకింగ్ రంగంలోనే ఒప్పందం అయినా కూడా అమలు జరగడం లేదన్నారు. బ్యాంకులలో సుమారు రెండు లక్షల ఖాళీలు ఉన్నప్పటికీ భర్తీ చేయకపోవడం వల్ల ఉన్న ఉద్యోగుల మీద విపరీతమైన ఒత్తిడి పెరిగి వారి వ్యక్తిగత జీవితం, వృత్తి పరమైన జీవితం మధ్య అసమతుల్యత ఏర్పడటంతో అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బ్యాంకులు నాలుగు రోజులు మూతపడ్డాయని, అమలు చేయకపోతే భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు. బ్యాంకులు సమ్మెబాట పట్టడంతో లావాదేవీలు పెద్ద ఎత్తున స్తంభించి పోయాయి. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు వెలుగూరి రాధాకృష్ణ, సీపీఎం నాయకుడు వై.నేతాజీ, మాల్యాద్రి, మేడా హనుమంతరావు, ఎల్ఐసీ నాయకుడు మస్తాన్ వలి, వివిధ బ్యాంక్‌ల ఉద్యోగ సంఘాల నాయకులు జయకుమార్, పి.కిషోర్‌కుమార్, సయ్యద్ భాషా, కోటిరెడ్డి, కళ్యాణ్, రామకృష్ణ, సాంబశివరావు, రవిచంద్రారెడ్డి, వీరారెడ్డి, నరేంద్ర పాల్గొన్నారు.

జిల్లాలో బార్ అండ్ రెస్టారెంట్‌లకు రీ నోటిఫికేషన్

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): జిల్లాలో బార్ అండ్ రెస్టారెంట్‌లకు ప్రభుత్వం రీ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఎక్సైజ్ శాఖ అధికారి బి.అరుణ కుమారి మంగళవారం తెలిపారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 26, మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆరు, తెనాలి మున్సిపాలిటీలో తొమ్మిది, పొన్నూరు మున్సిపాలిటీలో ఒకటి చొప్పున మొత్తం 42 బార్‌లకు రీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. బుధవారం నుంచి ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఓపెన్ కేటగిరి కింద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 5న డ్రా తీస్తామన్నారు.

ఫిబ్రవరి 7న జెడ్పీస్థాయీ సంఘ సమావేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఫిబ్రవరి 7న జరగనున్నాయి. ఈ మేరకు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఉదయం 10.30 గంటల నుంచి 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలు జరగనుండగా, జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన 3వ, తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి అధ్యక్షతన 5వ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన 6వ స్థాయీ సంఘాలు భేటీ కానున్నాయి. సమావేశాలకు సభ్యులు అందరూ హాజరుకావాలని సీఈఓ జ్యోతిబసు ప్రకటనలో కోరారు.

కమీషన్‌ల కోసం రోగులను బాదేస్తున్నారు

- అవసరం లేకుండానే వైద్య పరీక్షలు
- నియంత్రణలేని వైద్య పరీక్షల ఫీజులు
- కొంత మంది వైద్యుల్లో లోపిస్తున్న నైతిక ప్రాక్టీస్

గుంటూరు మెడికల్: గుంటూరు శ్రీనివాసరావుతోటకు చెందిన సాంబయ్య అనే వ్యక్తి జ్వరం, ఒళ్ళు నొప్పులతో బాధపడుతూ గుంటూరు కొత్తపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం కోసం చేరాడు. అతడికి సుమారు 15 రకాల వైద్య పరీక్షలు రాసి వారం రోజులకు రూ.లక్షన్నర బిల్లు వేయటంతో ఖంగుతిన్నాడు.

- పల్నాడు జిల్లాకు చెందిన ఖాసిం అనే వ్యక్తి తల నొప్పితో బాధపడుతూ స్పెషాలిటీ వైద్యుల కోసం గుంటూరు నగరంలోని ఓ వైద్యుడిని సంప్రదించాడు. ఖాసిం గదిలోపల ఉన్న వైద్యుడి వద్దకు వెళ్ళక ముందే అక్కడ పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులు ఎమ్మారై స్కాన్, రక్తపరీక్షలు చేయించుకు రావాలని కాగితంపై రాసి ఇచ్చారు. ఈ పరీక్షలకు రూ.15వేలు ఖర్చు కావడంతో ఖాసింకు తలతిరిగిపోయింది.

ఆ తరువాత డాక్టర్ ఫీజు, మందులు, అన్నీ కలుపుకుని ఒక్కరోజులోనే రూ.20 వేలు ఖర్చు కావడంతో గ్రామీణ ప్రాంతానికి చెందిన ఖాసిం బిక్కముఖం వేసుకుని వెళ్ళిపోయాడు. ఇలా ప్రతిరోజూ ఎంతో మంది రోగులు వివిధ రకాల స్పెషాలిటీ వైద్యుల వద్దకు వెళ్ళి జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. ఆస్పత్రి నిర్వాహకులకు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్స్ నిర్వాహకులు మధ్య కమీషన్ ఒప్పందం ఉండటంతో అవసరం లేకపోయినా వ్యాధి నిర్ధారణ పరీక్షలు రాసి రోగులకు వైద్యం తడిసి మోపెడయ్యేలా చేస్తున్నారని పలువురు సీనియర్ వైద్య నిపుణులే వాపోతున్నారు. కొంత మంది వైద్యులు కమీషన్ల కోసం కక్కుర్తి పడుతూ రోగి ముఖం కూడా చూడకుండానే వైద్య పరీక్షలు రాస్తున్నారు. కొంత మంది రోగులను వైద్యుల వద్దకు కూడా వెళ్ళనీయకుండా డాక్టర్ వద్ద పని చేసే అసిస్టెంట్లు వివిధ రకాల టెస్ట్‌ల పేరుతో దోచుకుంటున్నారు.

ఎమ్మారై, సిటీ స్కాన్‌లో సగానికి పైగా వైద్యులకే...

ఎమ్మారై, సిటీ స్కాన్ లాంటి వైద్య పరీక్షలకు రోగుల వద్ద నుంచి వసూలు చేసే ఫీజులో సగానికి పైగా రోగిని తమ వద్దకు పరీక్ష కోసం పంపిన వైద్యులకే అందజేస్తున్నామని స్కాన్ సెంటర్స్ నిర్వాహకులు తెలుపుతున్నారు. సిటీ స్కాన్ పరీక్ష కోసం రూ.5 వేలు నుంచి రూ.10వేలు వరకు ఫీజు తీసుకుంటున్నారు. అందులో సగానికి పైగా డాక్టర్లకు చెల్లిస్తున్నారు. ఎమ్మారై స్కానింగ్ కోసం రూ.10వేల నుంచి రూ. 20వేలు వరకు వసూలు చేసి సగం డబ్బులు వైద్యులకు కమీషన్ రూపంలో అందజేస్తున్నారు. ల్యాబ్‌లలో చేసే వివిధ రకాల రక్త పరీక్షలకు వసూలు చేసే ఫీజులో 40 నుంచి 60 శాతం వరకు వైద్యులకు ముట్టచెబుతున్నారు. సాయంత్రానికి వారికి కమీషన్ పంపించాలని లేకపోతే రెండో రోజు తమ స్కానింగ్ సెంటర్ లేదా ల్యాబ్‌కు సదరు వైద్యులు రోగులను పంపటం లేదని స్కానింగ్ సెంటర్స్ నిర్వాహకులు తెలిపారు. కమీషన్లు తీసుకోకుండా జీజీహెచ్ వైద్యులకు తాము పంపే రోగికి కేవలం రూ.3వేలకే సిటీ స్కాన్ పరీక్ష, రూ.5వేలకు ఎమ్మారై స్కానింగ్ పరీక్షలు ప్రైవేటు ల్యాబ్‌ల్లో చేస్తున్నారు.

జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి...

ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్, రెగ్యులేషన్) యాక్ట్–2002 ప్రకారం వైద్యులు ఏ రోగానికి ఎంత మేరకు ఫీజులు తీసుకుంటున్నారో నోటీస్ బోర్డులో తెలియజేయాల్సి ఉంది. చాలా ఆస్పత్రుల్లో అలాంటి బోర్డులు కనిపించటం లేదు. కొంత మంది వైద్యులు నోటీస్ బోర్డుల్లో ఫీజులు వివరాలు పెట్టినా వాటికి కంటే అధికంగా వసూలు చేస్తూ ప్రజలను పిండేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించి అల్లోపతిక్ చట్టం అమలు జరిగేలా, వైద్యుల అనైతిక ప్రాక్టీస్‌కు చెక్‌పెట్టి రోగులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని బాధితులు కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవ

మూడో విడత ఏది బాబు?

- సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులు
- కౌలు రైతులకు మొండిచేయి చూపిన చంద్రబాబు సర్కారు

కొరిటెపాడు(గుంటూరు): అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ సాయం కింద ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు సాయం అందిస్తామని టీడీపీ నేతలు గొప్పగా ఊరు వాడా ప్రచారం చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రూ.20 వేలు ఇస్తామని మాట మార్చారు. అది కూడా సకాలంలో ఇస్తున్నారా అంటే అదీ లేదు. మొదటి ఏడాది అన్నదాత సుఖీభవకు ఎగనామం పెట్టారు. రెండో ఏడాది కూడా రైతులకు సకాలంలో అన్నదాత సుఖీభవ సాయం అందలేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద మూడో విడత ఇవ్వాల్సిన రూ.4 వేలు సాయం ఇంతవరకూ ఇవ్వలేదు. మరోవైపు కౌలు రైతులకు పథకం అందని ద్రాక్షగా మారింది. అన్నదాత సుఖీభవ సాయంలో కూడా లబ్ధిదారుల్లో భారీగా కోత విధించింది. ఖరీఫ్ పంటల నూర్పిడులు, రబీ పంటలు సాగు వేళ పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారుల్లోనూ కోత..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలోని 1,26,030 మంది రైతులకు రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం అందేది. చంద్రబాబు ప్రభుత్వం వివిధ రకాల కారణాలతో లబ్ధిదారుల సంఖ్యను భారీగా తగ్గించేసింది. అన్నదాత సుఖీభవ కింద 1,06,329 మంది రైతులకు మాత్రమే సాయం అందిస్తోంది. అంటే 19,701 మంది రైతుల సంఖ్యను తగ్గించేసింది. మరోవైపు జిల్లాలో సుమారు 30 వేల మంది కౌలు రైతులకు పథకాన్ని దూరం చేసింది.

అప్పట్లో అనుకున్న సమయానికే..

జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం ఠంచన్‌గా ఖాతాలో జమయ్యేది. మే, అక్టోబర్, జనవరి నెలల్లో అనుకున్న సమయానికి సాయం అందేది. ప్రస్తుతం జనవరి నెల ముగుస్తున్నా సాయం అందలేదు.

–పేరం కృష్ణారెడ్డి, రైతు, గుంటూరు.

కౌలు రైతులకూ వర్తించేలా చూడాలి..

జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతులతో పాటు కౌలు రైతులకు రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందించేవారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం సాయం అందడం లేదు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చూడాలి.

– కంచుమాటి అజయ్‌కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

అనుమానంతో భార్యను హత్యచేసిన భర్త

తెనాలిరూరల్: అనుమానంతో కట్టుకున్న భార్యను భర్త గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం బస్టాండ్‌కు వెళ్లి పరారయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక రామలింగేశ్వరపేటలో నివాసం ఉంటున్న బండ్ల సాయి వంట పనులకు వెళుతుంటాడు. భార్య శిరీష(26) బ్యూటీ పార్లర్ నిర్వహించేది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతంలో వీరు హైదరాబాదులో ఉన్నారు. భార్య ప్రవర్తన సరిలేదన్న కారణంగా తరచూ గొడవలు పడుతుండేవారు. ఈ నేపథ్యంలో కొంతకాలం కిందట తెనాలికి మకాం మార్చారు. సాయి స్థానికంగా ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. భార్య బ్యూటీ పార్లర్‌లో విధులకు వెళ్లేది. తెనాలి వచ్చినా ఆమె ప్రవర్తనలో మార్పు లేదన్న కారణంగా ఇరువురి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో శిరీష గొంతు నులిమి చంపి బయటకు వెళ్లి పాత స్వరాజ్ టాకీస్ సెంటరులో తెలిసిన వ్యక్తిని ఫోన్ చేసుకోవాలని అడిగి తీసుకుని వెళ్లిపోయాడు. మార్గం మధ్యలో తన సోదరుడు కనబడగా బస్టాండ్ వద్ద దింపమని కోరాడు. శిరీష మృతి గురించి చుట్టుపక్కల వారి సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. పట్టణ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి ఆచూకీ గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

తెనాలి జిల్లా వైద్యశాలలో ఉన్న శిరీష మృతదేహం

భార్య, పిల్లలతో నిందితుడు సాయి(ఫైల్)

మిర్చి యార్డు సమాచారం
(మంగళ వారం ధరలు)

వచ్చిన బస్తాలు	80,039
అమ్మకాలు	77,055
నిల్వ	15,241

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500-22,000
నంబరు-5	13,500-22,000
341	14,000-25,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500-20,000
నంబరు-5	13,500-21,000
341	13,000-22,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000 - 20,000
బాడిగ-355	14,000 - 23,500
దేవనూరు డీలక్స్	14,000 - 25,000
ఆర్మూర్	12,000 - 17,000
తాలుకాయలు	8,000 - 11,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,500-19,500
బాడిగ - 355	13,500-21,500
తాలు	8,000 - 10,000

–కొరిటెపాడు (గుంటూరు)

అంజుమన్ ఆస్తుల పరిరక్షణే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ నేతల స్పష్టీకరణ
- ఈ నెల 30వ తేదీన గుంటూరు నగరంలో భారీ ర్యాలీ

గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశమైన వైఎస్సార్ సీపీ నేతలు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్) : అంజుమన్ ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా ఈ నెల 30వ తేదీన తలపెట్టిన భారీ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయం లో మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షతన ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ముడుగుల హను మంతరావు, పార్టీ నగర అధ్యక్షులు, తూర్పు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తాడికొండ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబులు భేటీ అయ్యారు. చినకాకానిలోని 71.57ఎకరాల అంజు మన్ భూములను కబ్జా చేసేందుకు చంద్రబాబు సర్కారు పావులు కదిపిన నేపథ్యంలో వాటిని రక్షించుకునే దిశగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మసీదుల వద్ద నిరసన కార్యక్రమాలు, సంతకాల సేకరణ జరుగుతున్న విషయం విదితమే. దానిలో భాగంగా ఈ నెల 30వ తేదీన చేపట్టిన భారీ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. గుంటూరు నగరంపాలెంలోని ఈద్గా నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం సేకరించిన సంత కాలతో జిల్లా కలెక్టర్‌ను కలిసి, మైనార్టీల మనోభా వాలను వెల్లడిస్తారు. ఈ సందర్భంగా జిల్లా నల మూలల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, మైనా ర్టీ విభాగం నేతలు, ముస్లింలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పఠాన్ సైదాఖాన్, అనుబంధ విభాగాల నేతలు కీసరి సుబ్బులు, షరీఫుద్దీన్, లియాఖత్, సుభాని, షేక్ రబ్బాని పార్టీ ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ లే అవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: జిల్లాలోని హౌసింగ్ లేఅవుట్లలో నిర్మించిన ఇళ్లలో నివసిస్తున్న ప్రజలకు అవసర మైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సం బంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మం గళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి హౌసింగ్ లేఅ వుట్స్, పీఎంఏవై ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ లే అవుట్లలో ప్రజలకు అవసరమైన తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర మౌలిక సదుపా యాలు ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటుకు సంబం ధిత అధికారులు వెంటనే ప్రతిపాదనలు అందించా లన్నారు. గతంలో వివిధ మౌలిక సదుపాయాలు అభివృద్ధికి వినియోగించిన నిధుల వివరాలను అందించాలన్నారు. లే అవుట్స్ వారీగా లబ్ధిదా రులకు కేటాయించినవి, కేటాయించిన వాటిలో నిర్మాణాలు ప్రారంభించినవి, పూర్తి అయినవి, కేటాయించకుండా ఖాళీగా ఉన్న ప్లాట్ల వివ రాలను మ్యాప్‌లతో సహా నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆప్షన్-3లో నిర్మించిన ఇళ్లలో ప్లేజ్, క్వాలిటీ డివియేషన్స్‌ను కాంట్రాక్టర్లతో వెంటనే సరి చేసేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, తెనాలి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఆర్డీవో కే.శ్రీనివాసులు, తెనాలి కమిషనర్ జెఆర్ అప్పలనాయుడు అధికారులు పాల్గొన్నారు.

31 నుంచి విజ్ఞాన్‌లో బాల మహోత్సవ్

విజ్ఞాన్ బాల మహోత్సవ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

- పోస్టర్లు ఆవిష్కరించిన చైర్మన్ లావు రత్తయ్య
- రాష్ట్రస్థాయిలో చిన్నారులకు మెగా పోటీలు

చేబ్రోలు: విజ్ఞాన్ యూనివర్సిటీలో చిన్నారుల ప్రతి భను వెలికి తీసేందుకు రెండవ ఎడిషన్ రాష్ట్రస్థాయి కార్యక్రమం 'విజ్ఞాన్ బాల మహోత్సవ్–2కే26'ను ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వ హిస్తున్నట్లు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ కేవీ క్రిష్ణకిషోర్ వెల్లడించారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సి టీలో నిర్వహిస్తున్న బాలమహోత్సవ్‌కు సంబంధిం చిన పోస్టర్లను చైర్మన్ లావు రత్తయ్య మంగళవారం ఆవిష్కరించారు.

- క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి సరైన వేదిక కల్పిం చడమే బాలమహోత్సవ్ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్ర మాల్లోనూ ప్రతిభ కనబరిచే విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

50కు పైగా ఈవెంట్లు

- బాల మహోత్సవ్‌లో జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో విద్యార్థుల కోసం మొత్తం 50కు పైగా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
- క్రీడలలో వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, చెస్, అథ్లెటిక్స్ వంటి విభాగాల్లో పోటీలు ఉంటాయి.
- నృత్య, సంగీత విభాగంలో క్లాసికల్ డాన్స్ సోలో, వెస్టర్న్, ఫోక్ గ్రూప్, వెస్టర్న్ డాన్స్ గ్రూప్ పోటీలు
- నాటక, సాహిత్య విభాగాలలో, సృజనాత్మక కళలు, ఫ్యాషన్ విభాగంలో పోటీలు జరగనున్నాయి.

ఈ కార్యక్రమంలో చైర్మన్ లావు రత్తయ్య, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ కేవీ క్రిష్ణకిషోర్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి , రిజిస్ట్రార్ పీఎంవీ రావు, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి గుంటూరులో వ్యవసాయంపై సదస్సు

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1న గుంటూరులోని టీటీడీ కళ్యాణ మండపంలో జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా జనవరి 29 నుంచి వ్యవసాయ ప్రదర్శన, వివిధ అంశాలపై సదస్సులు నిర్వహించను న్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గుం టూరులో మంగళవారం ఆయన విలేకరు లతో మాట్లాడారు. వ్యవసాయ రంగంలో పంటకు గిట్టుబాటు ధర లేని పరిస్థితి ఏర్ప డిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సమ స్యలపై జాతీయ కౌన్సిల్ సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. నాలుగు రోజులు పాటు 14 అంశాలపై సదస్సులు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సమావే శంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారుల జిల్లా సంఘం ఎన్నిక ఏకగ్రీవం

జిల్లా గ్రామ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గం

గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లా గ్రామ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ మరియు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యిందని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద రావు మంగళవారం ఒక ప్రటకనలో తెలిపారు. మంగ ళవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వ హించిన ఎన్నికల్లో ఎన్నికల అధికారులుగా పల్నాడు జిల్లా వీఆర్వోల సంఘ నాయకులు చారి, రామారావు వ్యవహరించారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా ఏపీఆర్‌ఎస్‌ఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, సెక్రటరీ వెంకట్రావు, ఏపీ రెవెన్యూ ఉద్యో గుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయప్రసాద్ (చంటి), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపమ హాజర య్యారన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం..

గుంటూరు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడిగా పిడుగు ఆనందరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా షేక్ అయూబ్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎం .కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పి.మాల్యాద్రి, కె.నాగేశ్వరరావు, కె.గోపి, వి.లీల, జనరల్ సెక్రటరీ లుగా టీసీహెచ్ రామారావు, టి.సుధాకర్ రావు, ఎస్. కోకిల రావు, పి.శ్రీనివాసరావు, కె.మల్లేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, నరేష్, బి.శిరీష, ఆర్గనైజింగ్ సెక్రట రీలుగా షేక్ మౌలాలి, కట్టా సత్యానందం, పులి భాస్క రరావు, బుస్సా వెంకటేశ్వరరావు, షేక్ రఫీ, సీహెచ్ ప్రభాకర్, కె.శివజ్యోతి, ట్రెజరర్‌గా వి.రాజశేఖర్, స్పోర్ట్స్' అండ్ కల్చరల్ సెక్రటరీగా టి.బోసుబాబు, ఈసీ మెంబర్లుగా ఎం.జగదీష్, సీహెచ్ బాబూరావు, పి.వీరయ్య, వి.సెబాస్టిన్, జె.తిరుపతి రాయుడు, జె.సంగీతరావు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కో–ఆర్డినేటర్‌గా బూసిరాజు శ్రీనివాసరావు ఎన్నిక య్యారు.

గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం జిల్లా కార్య వర్గం.. జిల్లా అధ్యక్షుడిగా మనోహర రాజన్, సహ అధ్యక్షుడిగా రవిబాబు, ఉపాధ్యక్షుడిగా మరియ దాసు, సెక్రటరీగా నాగేశ్వరరావు, ట్రెజర్‌గా షేక్ కరి మున్నిసా, జాయింట్ సెక్రటరీగా యశోద ఎన్నిక య్యారని తెలిపారు.

డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మికి పోస్టింగ్

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్) : గుంటూరు జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పనిచేసిన టీవీ విజయ లక్ష్మిని నెల రోజుల కిందట సెర్ప్ కార్యాలయం లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. తాజాగా ఆమెను ఏలూరు డీఆర్‌డీఏ పీడీగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి రూరల్ : ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాం తంలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు తాడేప ల్లి పోలీసులకు మంగళవారం సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లిన ఎస్ఐ అపర్ణ కృష్ణానది నీటిలో తేలియాడుతున్న మృ తదేహాన్ని వెలికితీసి పరిశీలించారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృ తుడి వయస్సు సుమారు 25 సంవత్సరాలు ఉం డవచ్చని, ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెంది ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. మృతుడి శరీరంపై నలుపు నిలువు చారలు కలిగిన చొక్కా, సిమెంట్ కలర్ ఫ్యాంటు ఉందని, చేతికి దారాలు ఉన్నాయని, ఎవరైనా ఈ మృతదేహాన్ని గుర్తిస్తే తాడేపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

హామీల సాధన కోసం దశల వారీ పోరాటం

కరపత్రాలను విడుదల చేస్తున్న జోసఫ్ సుధీర్ బాబు, ఎస్టీయూ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఎన్నిక లకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల సాధన కోసం రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) చేపట్టిన పోరాటాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు పిలుపునిచ్చారు. మం గళవారం గుంటూరులో పోరాట కార్యక్రమ కరప త్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సు దీర్‌బాబు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే పీఆర్సీ కమిటీ ఏర్పాటుతోపాటు సీపీఎస్‌కు ప్రత్యా మ్నాయంగా రోడ్‌మ్యాప్ ప్రకటించి, రూ.34 వేల కోట్ల పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని చంద్ర బాబు ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్నా ఆ ఊసే లేద న్నారు. అందుకే దశల వారీ ఉద్యమానికి ఎస్టీయూ పిలుపు ఇచ్చిందన్నారు. ఈనెల 30న మండల స్థాయిలో తహసీల్దార్లకు మెమొరాండం సమర్పించే కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఎస్టీయూ కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళలకు జైలు

గుంటూరు లీగల్: గంజాయి విక్రయిస్తున్న మహిళలకు నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరిం చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... పల్నాడు జిల్లా చిలకలూరిపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన మహిళలపై నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఏలూరు సత్రంపాడు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు చిలకలూరిపేట పరిసర ప్రాంతాల్లో గం జాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టు కున్నారు. వలుముల రమణ, గాలం గిరిజలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి నాలుగు సం వత్సరాలు జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ఒకటో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వి.ఎ.ఎల్. సత్యవతి తీర్పు చెప్పారు. రూ.వెయ్యి కట్టని పక్షంలో 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధిం చారు. కేసులో ప్రాసిక్యూషన్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్. వై.సీహెచ్.అశోక వాణి వాదనలు వినిపించారు.

మోతడక చలపతిలో 'ఉద్ఘోష్ -2026'

- ఫిబ్రవరి 20,21తేదీల్లో నిర్వహణ
- బ్రోచర్‌లు ఆవిష్కరించిన చైర్మన్ వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ తదితరులు

తాడికొండ: మోతడక చలపతిలో ఫిబ్రవరి 20–21 తేదీలలో ఉద్ఘోష్- 2026 పేరిట సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె మధుమూర్తి, విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆం జనేయులు అన్నారు. మంగళవారం ఈ మేరకు కళాశాలలో ఉద్ఘోష్ – 2026 బ్రోచ ర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ సంబరంలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు, డీన్ ఆఫ్ అడ్మిషన్స్, ఆపరేషన్స్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, డీన్‌లు డాక్టర్ పి.బాల మురళీకృష్ణ, డీన్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ వీవీ సుబ్బారావు, కన్వీనర్‌లు డాక్టర్ పి.రత్నబాబు, జి.రామచంద్రరావు వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత

లక్ష్మీపురం: గుంటూరు, అమరావతి రోడ్‌లోని జంపని టవర్స్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిష నర్ వేణుగోపాల్ రెడ్డిని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్లు కలిసి సార్వత్రిక సమ్మె నోటీసు మంగళవారం అందజేశారు. ఫిబ్రవరి నెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక ఒక్కరోజు సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్లు, మినీ టీచర్లు, పాల్గొంటున్నారని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో శారమ్మ, రమాదేవి, కె.సుబ్బారావమ్మ, జ్యోతి గంగాదేవి తదితరులు ఉన్నారు.

ఎంఈఓ కార్యాలయాల్లో సిబ్బంది లేక ఇబ్బందులు

గుంటూరు ఎడ్యుకేషన్: వివిధ మండలాల్లోని ఎంఈఓ కార్యాల యాల్లో తగినంత సిబ్బంది లేకపోవడం తో ఉపాధ్యాయులు పలు సమస్యలను ఎదు ర్కొంటున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.క శాధర్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీమ్‌బాషాను డీఈఓ కార్యాలయంలో కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈఓ కార్యాలయాల్లో ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్లు అప్ డేట్ కాకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. క్లోజర్‌లు, బకాయిలు, మెడికల్ బిల్లులను చేయాల్సి ఉన్నా సిబ్బంది లేక చేయడం లేద ని, సంబంధిత బిల్లులను ఉపాధ్యాయులతో చేయించుకోవాలని చెబుతు న్నారని అన్నారు. కొల్లిపర, తుళ్లూరు మండలాల్లో సిబ్బంది కొరత తీర్చాల న్నారు. డీఈవోని కలసిన వారిలో యూటీఎఫ్ నాయకులు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కె.కేదార్‌నాథ్, కాలేషావలి ఉన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు సహకరించాలి

నరసరావుపేట: జిల్లాలో కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్ల పేర్కొన్నారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు నిర్వహించే అవగాహన కార్యక్రమానికి చెందిన బ్రోచర్‌ను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నిర్మూలన అధికారి డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఈ పక్షోత్సవాల్లో జిల్లా వ్యాప్తంగా కాలనీలు, విద్యాల యాలు, హాస్టళ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో లెప్రసీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, డెప్యూటీ జిల్లా కుష్ఠు, టీబీ, ఎయిడ్స్ నిర్మూలన అధికారి డాక్టర్ ప్రభాకరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- గుండ్లపల్లి గ్రామంలో కార్డన్‌సెర్చ్
- 41 బైక్‌లు, రెండు ఆటోలు, 10 కత్తులు, రెండు కొడవళ్లు, ఒక గొడ్డలి స్వాధీనం

గ్రామంలో కార్డన్ సెర్చ్‌లో డీఎస్పీ ఎం.హనుమంతరావు, సీఐలు, ఎస్ఐలు

నకరికల్లు: గ్రామాల్లో అల్లర్లు సృష్టించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠినచర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి డీఎస్పి ఎం.హను మంతరావు హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామంగా పేరొందిన మండలంలోని గుండ్ల పల్లిలో మంగళవారం కార్డన్‌సెర్చ్ నిర్వహిం చారు. గ్రామమంతా జల్లెడ పట్టారు. అనుమా నిత గృహాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భం గా డీఎస్పీ మాట్లాడుతూ సరైనపత్రాలు లేని 41 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, 10 కత్తులు, రెండు కొడవళ్లు, ఒక గొడ్డలిని స్వా . దీనం చేసుకున్నట్లు తెలిపారు. గత ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంను ధ్వంసం చేసిన ఘట నతో పాటు 19మందిపై రౌడీషీట్ నమోదైంద న్నారు. భవిష్యత్‌లో శాంతిభద్రతల దృష్ట్యా గట్టి నిఘా పెట్టామన్నారు. గ్రామస్తులతో మాట్లా డుతూ గతంలో జరిగిన కొట్లాటల నేపథ్యంలో గ్రామంలో శాంతిభద్రతలు కాపాడేందుకు అన్ని విధాల చర్యలు తీసుకున్నామన్నారు. యువత పెడత్రోవ పట్టకుండా సన్మార్గంలో నడవాల న్నారు. అనవసర తగాదాలకు వెళ్లి అనర్థాలు కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. కార్యక్ర మంలో సీఐలు పి.కిరణ్, హైమారావు, వై.అ చ్చయ్య, నకరికల్లు ఎస్ఐతో పాటు మరో ఏడు గురు ఎస్ఐలు, 50మంది వరకు పోలీస్ సిబ్బం ది పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా
Bank of Baroda
గుంటూరు మెయిన్ బ్రాంచి
రాజీవ్ గాంధీ భవన్, హిందు కాలేజీ దగ్గర, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004.

అమ్మకానికి ముందు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం–2002 (SARFAESI Act-2002) లోని రూల్ 8(6) లోని నిబంధనల ప్రకారం జారీ చేయబడింది.

టు,
ఋణగ్రహీత: మెస్సర్స్ ధన లక్ష్మీ సిండికేట్, ప్రొప్రయిటర్: శ్రీ ముక్తా విజయ కుమార్. ఫ్యాక్టరీ చిరునామా: శ్రీ సాయి శ్రీ శ్రీనివాస జిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, డి.నెం. 19-9-176/బి, ప్లాట్ నెం. 255, రెవెన్యూ వార్డు నెం. 22, ఎన్.హెచ్-5, బొంతపాడు రోడ్డు, గుంటూరు-522003. 2. శ్రీ ముక్తా విజయ కుమార్, తండ్రి: ముక్తా సత్యనారాయణ, డోర్ నెం. 7-17-220, 2వ లైన్, శ్రీనగర్, గుంటూరు-522003. మరియు హామీదారులు: 1. శ్రీమతి ముక్తా పద్మావతి, భర్త: శ్రీ ముక్తా సత్యనారాయణ, డి.నెం. 1-113, అనంతవరప్పాడు, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా–522017. 2. శ్రీ ముక్తా సత్యనారాయణ, తండ్రి: శ్రీ సాంబయ్య, డి.నెం. 1-113, అనంతవరప్పాడు, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా-522017.

డియర్ సార్ / మేడమ్,
విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం–2002 (SARFAESI Act-2002) లోని రూల్ 8(6) లోని నిబంధనల ప్రకారం జారీ చేయబడింది.

బ్యాంక్ ఆఫ్ బరోడా, గుంటూరు మెయిన్ బ్రాంచ్ తరపున ఈ దిగువ తెలిపిన సంబంధిత ఋణ ఖాతాలకు సంబంధించిన ఋణగ్రహీతకు క్రింద తెలియజేసిన మొత్తములు చెల్లించవలసినదిగా చట్టం యు/సెక్షన్ 13(2) కు అనుబంధమైన రూల్ 3 తో చదవబడిన అధికారాలను వినియోగించుకుని ది.05.04.2021 న డిమాండ్ నోటీసు జారీ చేసినారు. ఋణగ్రహీత ద్వారా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరారు.

ఋణగ్రహీతలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, బ్యాంక్ ఆఫ్ బరోడా, అధీకృత అధికారి, ఆ చట్టంలోని యు/సెక్షన్ 13(4) మరియు నిబంధనలలోని రూల్ 4 మరియు / లేదా రూల్ 8 ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, ది.03.09.2021 నాటి స్వాధీన నోటీసులో పూర్తిగా వివరించిన విధంగా సెక్యూర్డ్ ఆస్తులను (ఇక్కడ పేర్కొన్న ఆస్తి / ఆస్తులు) స్వాధీనం చేసుకున్నారు మరియు SARFAESI చట్టం క్రింద పరిగణించబడిన నియమాలలోని రూల్ 8 (1) మరియు రూల్ 8 (2) కి అనుగుణంగా, ప్రాంతీయ భాష మరియు ఇంగ్లీషు వార్తా పత్రికలలో ఆయా తేదీలలో సదరు స్వాధీనతా ప్రకటన కూడా ప్రచురించడమైనది.

ఋణగ్రహీత/హామీదారు యొక్క స్థిరాస్తుల స్వాధీనానికి అనుగుణంగా, SARFAESI చట్టం 2002 యు/సెక్షన్ 13 (4) (ఎ) క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, ఈ దిగువ సంతకందారు క్రింద తెలిపిన ఆస్తులను విక్రయించడం ద్వారా బ్యాంక్ బకాయిలను వసూలు చేయాలని ప్రతిపాదిస్తున్నారు. కావున సబ్జెక్ట్ చట్టంలోని నిబంధనలు మరియు దాని క్రింద రూపొందించిన నియమాల ప్రకారం, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 (6) క్రింద అమ్మకానికి ముందు మొత్తం బాధ్యతను నిర్వర్తించడానికి ఈ 30 రోజుల నోటీసును నేను అందిస్తున్నాను.

మీ అందరికీ ఈ నోటీసు తేది నుండి 30 దినములలోగా దిగువ తెలిపిన పూర్తి బకాయి మొత్తమును ప్లస్ తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి, బ్యాంక్ స్వాధీనంలో నున్న దిగువ చెప్పబడిన ఆస్తిని విడిపించుకోవలసినదిగా చిట్టచివరి అవకాశం ఇవ్వడమైనది. అట్లు చేయడంలో విఫలమైనచో "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఎలా ఉన్నదో అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" పద్ధతి ద్వారా నిబంధనలలో పేర్కొన్న రూల్ 8(5) క్రింది పద్ధతుల్లో దేనినైనా అనుసరించడం ద్వారా ఆస్తులు విక్రయించబడతాయి:
(ఎ) ఇలాంటి భద్రతా ఆస్తులతో వ్యవహరించే వ్యక్తుల నుండి లేదా ఆస్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్న వ్యక్తుల నుండి కొటేషన్లు పొందడం ద్వారా లేదా
(బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా
(సి) ఈ-వేలం పద్ధతి ద్వారాతో పాటు బహిరంగా వేలం నిర్వహించుట ద్వారా లేదా
(డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా.

స్థిరాస్తుల వివరణ
గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్ జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గోరంట్ల గ్రామం, డి.నెం. 159లో మొత్తం విస్తీర్ణం ఎకరా 19-93 సెంట్లులలో ఎకరా 1-00 సెంట్లులలో మొత్తం 849.3/9 చదరపు గజములలో గల 499.3/9 చదరపు గజముల విస్తీర్ణం గల ఖాళీ నివాస స్థలం 1. శ్రీమతి ముక్తా పద్మావతి, భర్త: ముక్తా సత్యనారాయణ, 2. శ్రీ ముక్తా విజయ కుమార్, తండ్రి: ముక్తా సత్యనారాయణ గార్ల పేరున కలదు. హద్దులు: తూర్పు: 30 అడుగుల వెడల్పు రోడ్డు–107.00 అడుగులు, పడమర: తియ్యగూర శేషి రెడ్డి ఇతరులకు విక్రయించిన స్థలం – 42.00 అడుగులు, దక్షిణం: ఇతరుల ఆస్తి – 107.00 అడుగులు, ఉత్తరం: కన్నెగంటి పార్వతి గారి ఆస్తి – 42.00 అడుగులు ఈ హద్దులలో మొత్తం 849.3/9 చదరపు గజములలో నుండి కేవలం 499.3/9 చదరపు గజముల విస్తీర్ణం గల ఖాళీ నివాస స్థలం మాత్రమే.

సౌకర్యాల వివరములు	డిమాండ్ నోటీసు తేది:	స్వాధీనత నోటీసు తేది:	స్వాధీనత నోటీసు ప్రచురించిన తేది:
క్యాష్ క్రెడిట్ (05170500029662)	05-04-2021	03-09-2021	07-09-2021
	ది.22.12.2025 నాటికి చెల్లించాల్సిన బకాయి మొత్తం: రూ.74,91,197.20 (అక్షరాలా డెబ్బై నాలుగు లక్షల తొంభై ఒక్క వేల నూట తొంభై ఏడు రూపాయల ఇరవై పైసలు మాత్రమే) ది. 31.03.2021 నాటికి + ది. 01.04.2021 నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు ఏవైనా ఉంటే చెల్లించే వరకు.		
FITL 1 (05170600041104)	ది.31.03.2021 నాటికి చెల్లించాల్సిన బకాయి మొత్తం: రూ.3,68,920/- (అక్షరాలా మూడు లక్షల అరవై ఎనిమిది వేల తొమ్మిది వందల ఇరవై రూపాయలు మాత్రమే) మరియు ఇతర ఛార్జీలు ఏవైనా ఉంటే చెల్లించే వరకు.		

చట్టం నందు / అమలులోనున్న ఏదైనా ఇతర న్యాయ పరిధిలో బ్యాంక్‌కు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయటమైనది.
తేది: 27-01-2026 | చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
ప్రదేశము: గుంటూరు | బ్యాంక్ ఆఫ్ బరోడా.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
LAND FOR SALE
■ 60 అ॥రోడ్డుని ఆనుకుని 4 ఎకరాలు. గన్న వరం ఎయిర్‌పోర్ట్‌నుండి 12 కి.మీ. ఇండస్ట్రి యల్ జోన్ వీరవల్లి గూడెంకి 1 కి.మీ. 4 ఎకరాలు. రూ. 5 కోట్లు ✆ 83175 28192

SERVICES
GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071
■ Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారా న్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబ డును. Nlr Dt. 9150011538, 9750497504

WANTED
■ గుంటూరులో గల కాలేజీ నందు పనిచేయుటకు 25 సంవత్సరాల పైబడిన ఇంటర్, డిగ్రీ చదివిన రెసిడెన్షియల్ లేడి వార్డెన్ కావలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 81224 61164
■ శ్రీకాంతి హోమ్‌కేర్ నందు పనిచేయుటకు ఆయాలు, నర్సులు, కేర్‌టేకర్స్ (M/F) కావలెను. జీతం: 18,000/- సంప్రదించండి. 7995123705 / 9618485329
■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665
■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, వ:18–28 సం॥లోపు ✆ 9133444985 / 89
■ తాడేపల్లి, కుంచనపల్లి, పాతూరు పరిసర ప్రాం తాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావ లెను. 8 hrs. డ్యూటీ, జీతం:12000, భోజనం ఫ్రీ.Q. 10th, 50సం॥ లోపు ✆ 88014 97487
■ ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్, గుంటూ రు నందు పనిచేయుటకు ఇంటర్ విద్యార్హ తతో వివాహిత స్త్రీలకు మార్కెటింగ్ మరి యు ఆఫీసు జాబు చేయుటకు పోస్టులు కల వు ✆ 90309 93895, 86396 89939
■ Hydలోపెద్దవారికి సేవచేయుటకు బేబీకేర్,ఇంటి /వంటపనికి హెల్పర్స్,ఆయాలు, కేర్‌టేకర్స్ స్త్రీ /పు కావలెను.జీతం:18,000 to 30,000/ రూం + మీల్స్ ఫ్రీ. 8977182524, 9347335969
■ త్రివేణిహోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధుల ను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సు లు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 18k - 20k, Ph: 9640400073, 9160900024

క్లుప్తంగా

కేఎల్‌యూ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఆక్టివిటీస్ (సీఈఏ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ–2) విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో స్వస్థ్య (హెల్త్ అండ్ ఫిట్‌నెస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు ఆరోగ్యకరమైన జీవన శైలి, శారీరక వ్యాయామం ప్రాముఖ్యత, సమతుల్య ఆహారం అవసరం, రోజువారీ అలవాట్ల వల్ల ఆరోగ్యంపై కలిగే ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ–2 విభాగాధిపతి డాక్టర్ తిరుపతి రెడ్డి, సీఈఏ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ నాగమణి, ప్రొఫెసర్ ఇన్‌చార్జి శ్రీకాంత్ రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అధ్యాపకులను, విద్యార్థి వలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, విద్యార్థుల విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, అడ్వయిజర్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు అభినందించారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

మంగళగిరి టౌన్: మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి ఇందిరానగర్ సెంటర్‌లో జాతీయ ఎలక్ట్రీషియన్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రభాకరరావు ముఖ్యఅతిథిగా హాజరై యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభాకరరావు మాట్లాడుతూ.. లేబర్ డిపార్ట్‌మెంట్ యూనియన్‌ల మధ్య మంచి సంబంధాలు ఉంటాయని, యూనియన్‌ల వల్ల సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే ప్రతి ఒక్కరూ భవన నిర్మాణ కార్మికుడే అని, వారు లేబర్ ఆఫీస్‌లో పేరును నమోదు చేసుకుని ప్రభుత్వం అందించే పథకాలను పొందాలని సూచించారు. అనంతరం యూనియన్ నాయకులు లేబర్ ఆఫీసర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అంకరాజు, శ్రీనివాసరావు, శ్రీహరి, భాస్కరరావు, బాషా, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన కంటిచూపుతో ప్రమాదాలు దూరం

మంగళగిరి టౌన్: కంటిచూపు సక్రమంగా ఉంటే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని మంగళగిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మంగళగిరి రవాణాశాఖ కార్యాలయంలో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గుంటూరు డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో డ్రైవర్లకు నేత్రపరీక్షలు చేశారు. సుమారు 125 మంది స్కూల్ బస్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, సమస్యలు ఉన్న వారికి వైద్యులు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా మోటార వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో స్పష్టమైన దృష్టి ఎంతో కీలకమని, కంటిచూపులో లోపాల కారణంగా కొన్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. వాహన చోదకులు అప్రమత్తంగా ఉండి క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సంధ్య, అగర్వాల్ ఐ హాస్పిటల్ సిబ్బంది వంశీ, సుధాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో మంగళవారం నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో పశు ఆరోగ్యశిబిరం నిర్వహించారు. 25 పశువులకు చూడి పరీక్షలు, ఎద పరీక్షలు, గర్భకోశ పరీక్షలు చేశారు. 55 దూడలు, 250 పశులుకు నట్టల నివారణ మందును పశువైద్యాధికారి పీర్ అహ్మద్ అందజేశారు. వీటితో పాటు 14 పశువులకు సాధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఆర్.వినీల, నాయకులు మాబు సాహెబ్, జిలాని, నాగుల్, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా అక్రమ మట్టి తవ్వకాలు!

- యథేచ్ఛగా రేయింబవళ్లు మట్టి తరలింపు
- 9 వాహనాలను పట్టుకున్న పోలీసులు

యర్రబాలెంలోని జగనన్న కాలనీలో తవ్విన మట్టి (ఫైల్ ఫొటో)

పూలింగ్‌కు ఇవ్వని భూముల్లో మట్టి తవ్వకాలు (ఫైల్ ఫొటో)

తాడేపల్లిలో మంగళవారం పోలీసులు సీజ్ చేసిన లారీలు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలో ఏ రహదారిలో చూసినా పగలు, రాత్రి అనే తేడా లేకుండా రాజధాని గ్రామాల నుంచి వేలాది లారీలు మట్టితో తరలి వెళుతున్నాయి. మొక్కుబడిగా తాడేపల్లి పోలీసులు మంగళవారం తెల్లవారుజామున ఏడు లారీలను సీజ్ చేశారు. సాయంత్రం వరకు కేసు నమోదు చేయలేదు. ఆ లారీలను వదిలివేస్తారా.. లేక కేసు నమోదు చేస్తారా అనేది వేచి చూడాలి. లారీలు సీజ్ చేసిన సిబ్బందిపై పలువురు మట్టి మాఫియా రాజకీయ నాయకులతో ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. ప్రతిరోజు మట్టితరలించే లారీ యజమానులు ఒకరి మధ్య ఒకరికి విభేదాలు రావడంతో ఏడు లారీలను సీజ్ చేశారని తెలియవచ్చింది. నిజంగా పోలీసులు అక్రమ మట్టి రవాణాను నివారించాలనుకుంటే మిగలిన లారీలను ఎందుకు వదిలేస్తారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

రాజకీయ నాయకుల రంగ ప్రవేశం..

రాజధానిలోని పెనుమాక గ్రామంలో చెరువు తవ్వకాలు నిర్వహిస్తున్నారు. వారికి అవసరాలకు మించి నల్లమట్టి ఉండడంతో రాజధాని చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలు అవసరాలను బట్టి ఉచితంగా తీసుకువెళ్లాలని సదరు కాంట్రాక్టర్ సూచించారు. ఇక్కడే కొంతమంది రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేసి తమ అనుచరులతో లోడింగ్ దగ్గర లారీకి రూ.1,000 నుంచి రూ.1,500 వసూలు చేస్తున్నారు. ఒకవేళ ఎవరైనా లారీ యజమానులు ఎదురు తిరిగితే తన అధికారాన్ని, రాజకీయ బలాన్ని ఉపయోగించి సదరు లారీ యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రాజధానిలో పలుచోట్ల చెరువు తవ్వకాలు నిర్వహిస్తుండడంతో కొందరు మట్టి మాఫియా వారి దగ్గరకు మనం వెళ్లేది ఏమిటంటూ ఇష్టారాజ్యంగా పూలింగ్‌కు ఇచ్చిన, ఇవ్వని పొలాల్లో రాత్రి సమయాల్లో తవ్వకాలు భారీగా నిర్వహిస్తున్నారు.

అర్ధరాత్రుళ్లు తరలింపు..

కొండవీటి వాగు, సారపాక వాగు, ఇతర వాగులు సీఆర్డీఏ పూడిక తీసి ఆ మట్టిని వాగులకు ఇరువైపులా కట్టలాగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ మట్టిని సైతం ఈ మాఫియా అర్ధరాత్రి సమయంలో తరలిస్తున్నారు. చెరువు తవ్వకాలు నిర్వహించే దగ్గర కాంట్రాక్టర్లు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఏ లారీలు ఎక్కడ తిరుగుతున్నాయో తెలియకపోవడంతో మట్టి మాఫియా రెచ్చిపోతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో అక్రమ మట్టి తవ్వకాలు నివారిచేందుకు కృష్ణాయపాలెం, మందడం సమీపంలో పోలీసులు, కాంట్రాక్టర్లు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. కాపలాగా ఉన్న కాంట్రాక్టర్ల సిబ్బందిపై మట్టి మాఫియా దాడులకు పాల్పడుతోంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం.

కేసులు నమోదు చేస్తాం..

మంగళవారం జరిగిన ఘటనపై తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ సోమవారం అర్ధరాత్రి వాహనాల తనిఖీల్లో భాగంగా ఉండవల్లి సెంటర్ స్క్రూ బిడ్జి వద్ద తనిఖీలు చేస్తున్నప్పుడు 9 లారీలను పట్టుకున్నామని తెలిపారు. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనుల నిమిత్తం నల్లమట్టిని వినియోగిస్తున్నారని.. అనుమతులు ఉన్నాయన్న సమాచారం మేరకు పట్టుకున్న లారీల వివరాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత శాఖ అధికారులతో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

స్పేస్ టెక్నాలజీ సమ్మిట్‌లో ద్వితీయ స్థానం

మంగళగిరి టౌన్: గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన యూనివర్సిటీలో ఈనెల 22 నుంచి 25 వరకు జరిగిన ఏపీ స్పేస్ టెక్నాలజీ సమ్మిట్–2026లో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీకి చెందిన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి లభించినట్లు మంగళవారం వర్సిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. విజ్ఞాన్ ఫౌండేషన్ ఫర్ స్పేస్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మిట్‌కు పలు యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరై వివిధ ప్రాజెక్టులపై పోస్టర్ ప్రజంటేషన్ అందించారు. ఎస్ఆర్ఎం వర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థులు సుమయ, నిత్యలు ప్రజెంట్ చేసిన రాపిడ్ సర్ఫేస్ వాటర్ క్వాలిటీ అసెస్మెంట్ పోస్టర్‌కు ద్వితీయ బహుమతి లభించింది. హైదరాబాద్ ఏఐఎంఎస్ సీఎస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరామన్, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ, విజ్ఞాన్స్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు, ఏపీ స్పేస్ టెక్ అకాడమి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.శేషగిరిరావు చేతుల మీదుగా విద్యార్థులు బహుమతిని అందుకున్నారు. నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసినట్లు వర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ హరీష్, డాక్టర్ ప్రణవ్‌లు తెలిపారు. విజేతలను వర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్‌కుమార్ అభినందించారు.

అధికారులకు సమ్మె నోటీసు అందజేత

సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

తాడేపల్లిలో సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: ఫిబ్రవరి 12న జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళగిరి పట్టణంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అధికారులను కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు, ఉద్యోగులను ఎటువంటి హక్కులు లేని బానిసలుగా చేయాలనే ఉద్దేశ్యంతో చంద్రబాబు సర్కార్ అసెంబ్లీలో 8 గంటల పని విధానాన్ని 13 గంటలుగా మార్చి తీర్మానం చేసిందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తీసివేసి చట్టాన్ని నీరుగార్చే విధంగా నిధులు లేకుండా చేసిందని పేర్కొన్నారు. దీంతో గ్రామాల్లో ఉపాధి తగ్గి గ్రామీణ వ్యవసాయ కార్మికులు పనులు లేక పట్టణాలకు వలస వెళుతున్నారని వాపోయారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ, రైతు సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, బాలాజీ, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ తాడేపల్లిలోని పలు షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్ యజమానులకు మంగళవారం సీఐటీయూ నాయకులు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు దుర్గారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల భారత కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, బర్నబాస్, వైఎస్సార్‌టీయూ నాయకులు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కుమార్‌పంప్స్ అధినేతకు తెనాలిబంధు బిరుదు

సుబ్రహ్మణ్యంకు పత్రాన్ని అందజేస్తున్న రాజకుమారి

తెనాలిటౌన్: మానవతా విలువలు కలిగి ధార్మిక చింతనతో సమాజానికి తనవంతు సేవలందిస్తున్న కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యంకు తెనాలి బంధు బిరుదు ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి కొనియాడారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కళ్యాణ మండపంలో సోమవారం రాత్రి శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమం నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం కు తెనాలి బంధు బిరుదును, ప్రశస్థి పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని తెనాలి బంధు ప్రశస్తి పత్రాన్ని అందజేశారు. ధార్మిక చింతనతో కొత్త సుబ్రమణ్యం చేస్తున్న సేవలను గుర్తు చేశారు. నేటి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సమాజానికి ఆయన వంతు సేవలందిస్తున్నారని తెలిపారు. సంపాదించిన దానిలో కొంత భాగం సమాజానికి ఇవ్వడం అందరి వల్ల కాదన్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, ఆయనలోని మానవతా దృక్పథం సమాజానికి ఇన్ని సేవలందించేలా తోడ్పడుతుందని వెల్లడించారు. ఇకనుంచి కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యంను తెనాలి బంధు సుబ్రహ్మణ్యంగా పిలుచుకుందామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు బిరుదు, ప్రశస్తి పత్రంతో పాటు, మె మెంటో బహూకరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాకతీయ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, నిజాముద్దీన్, పావులూరి శ్రీనివాసరావు, నన్నపనేని ముకుందరావు, కొలసాని రాంచంద్, పావులూరి నరసింహారావు, కొత్త వసుంధర, లక్క రాజు సాయి, గుంటూరు కృష్ణ , నాగభూషణం, అయినాల మల్లేశ్వరరావు, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వంలో రైతు వ్యతిరేక విధానాలు

తాడికొండలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

తాడికొండ: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 29, 30, 31 తేదీల్లో జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం తాడికొండలో కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సాహిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో హక్కుల సాధనలో భాగంగా జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం కర్నూల్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, రైతు సంఘం నాయకులు హనుమంతు, భాస్కరరావు, బాణావత్ భద్రయ్య, జోషి, రైతులు పాల్గొన్నారు.

జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలి

ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న శివశంకరరావు

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు గుంటూరులో జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో ప్రచార జాతను నిర్వహించారు. కార్యక్రమానికి తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. శివశంకరావు మాట్లాడుతూ.. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగాన్ని దివాలా తీసేవిధంగా చట్టాలు చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్లచట్టాలు దేశవ్యాప్తంగా రైతాంగానికి ఉరితాళ్లుగా మారాయని పేర్కొన్నారు. అనంతరం ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వరరావు, కౌలురైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, పట్టణ నాయకులు బి.గోపిరెడ్డి, కుంచనపల్లి గ్రామ రైతులు రాంబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ సైనిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి డాడ్జ్‌బాల్ సీనియర్ చాంపియన్‌షిప్‌నకు 13 మంది ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో తులసి విష్ణుప్రసాద్

తెనాలి: ఒంగోలులోని చీమకుర్తి భాష్యం హైస్కూల్‌లో ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించిన 18వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి డాడ్జ్‌బాల్ సీనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో చిలుమూరులోని శ్రీరామ సైనిక్ స్కూల్ విద్యార్థులు బాపట్ల, గుంటూరు జిల్లాలకు ప్రాతినిధ్యం వహించి విశేష ప్రతిభ కనబరిచారు. రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ జిల్లాలు పాల్గొన్న ఈ పోటీల్లో బాలుర విభాగంలో బాపట్ల జిల్లా ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, గుంటూరు జిల్లా మూడవ స్థానం సాధించింది. అలాగే మిక్స్‌డ్ విభాగంలో బాపట్ల జిల్లా ద్వితీయ స్థానం దక్కించుకుందని సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ కొలసాని శ్రీకాంత్ మంగళవారం తెలియజేశారు.

జాతీయ పోటీలకు 13 మంది ఎంపిక

ఉత్తమ ప్రదర్శన కనబరిచిన శ్రీరామ సైనిక్ స్కూల్ విద్యార్థులు 13 మంది కె.ధీరజ్, యు.జిష్ణునాథ్, యు.జస్వంత్, జి.విహాన్, డి.జస్వంత్, కె. అవినాష్ రెడ్డి, కె.సుదర్శన్ రెడ్డి, కె.హేమంత్, బి.షణ్ముఖ తేజ, టి.సందీప్, జి.లోకేష్ నాయక్, ఎస్.కె. మాకిల్ షోయబ్, జస్విన్‌లు జాతీయస్థాయి డాడ్జ్ బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని స్కూల్ డైరెక్టర్ కొలసాని తులసి విష్ణుప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

కిసాన్ సభలకు రైతులు హాజరుకావాలి

రైతుసంఘం నేతల ప్రచారం

మార్కెట్‌యార్డులో ప్రదర్శనగా శివసాంబిరెడ్డి

తెనాలి: 'వ్యవసాయాన్ని కాపాడుకుందాం... రైతును రక్షించుకుందాం' అనే నినాదంతో జరిగే అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు రైతులు హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. మంగళవారం తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ప్రదర్శనగా వెళ్లి, నిమ్మ రైతులు కౌలు రైతులతో మాట్లాడారు. ఢిల్లీ రైతు ఉద్యమంలో కీలక భూమిని పోషించిన 300 మంది అఖిలభారత నాయకులు జనవరి 29 నుండి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కబంధహస్తాలకు అప్పగించటం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రమాదకరమైన చట్టాలను చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాల రద్దు కోసం 540 రైతు సంఘాలు తిరిగి పోరాటానికి సమాయత్తమవుతున్న సమయంలో ఈ సమావేశాలు జరుగుతున్నాయని వివరించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం 2014 ఎన్నికలలో సీటు ప్లస్ 50 శాతం ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేస్తామని, 2022 నాటికి రైతులు ఆదాయం పెట్టింపు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. భారత రైతాంగానికి నష్టకరమైన రీతిలో అమెరికాతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంటు చేసుకుంటోందని తెలిపారు. ఇది అమల్లోకి వస్తే పాడి ఆహార వాణిజ్య ఉద్యాన పంటలు, ఆక్వా, పౌల్ట్రీకి తీవ్రంగా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రైతు వ్యతిరేక చట్టాలు రద్దుకు పోరాట రూపాలను రూపొందించడం కోసం జరిగే ఈ సమావేశాలను జయప్రదం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. వీరితో అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, నల్లగర్ల నాగేశ్వరరావు, మేరెమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

మంగళగిరి టౌన్: పోలియో రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు అందరూ బాధ్యతగా కృషి చేయాలని కేఎల్ వర్సిటీ డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్, సీఎస్ఐటీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు బాలల ఆరోగ్యంపై ఆధారపడి ఉందని వివరించారు. పిల్లలను ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధుల్లో పోలియో ఒకటని.. దీనిని నిర్మూలించేందుకు 0–5 సంవత్సరాల లోపు పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. సరైన సమయంలో పోలియో చుక్కలు, టీకాలు అందించడం ద్వారా పోలియోను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.ప్రవీణ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. మంగళవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు వై.సాంబశివరావు, అంకయ్య, సూర్యప్రకాష్‌లతో కలిసి స్టీవెన్ ప్రారంభించారు. 420 రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం మిన్నకుండిపోవడం సరికాదని నాయకులు పేర్కొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర క్రిష్టినా ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప, స్థల దాత బచ్చు లక్ష్మీనారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కుటుంబ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ బసీరున్నీసా, మధు, మాజీ సర్పంచ్ కోటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూద స్థావరాలపై దాడి

తాడికొండ: తాడికొండ మండలం బేజాత్పురంలో జూద స్థావరాలపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న 11 మంది వ్యక్తుల వద్ద నుంచి రూ.6,240 నగదును స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జీత్యా నాయక్ తెలిపారు.

బండారుపల్లిలో పశు వైద్యశిబిరం

తాడికొండ: బండారుపల్లిలో మంగళవారం నిర్వహించిన పశు వైద్యశిబిరానికి పశుపోషకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 85 పశువులు, 40 దూడలు, 100 జీవాలకు నట్టల మందు పంపిణీ చేశారు. అలానే 7 పశువులకు చూడి పరీక్షలు, 2 పశువులకు ఎద ఇంజెక్షన్‌లు చేశారు. 11 పశువులలో సాధారణ వ్యాధులకు, 6 పశువులకు గర్భకోశ వ్యాధులకు డాక్టర్ పి.స్వాతిదేవి పరీక్ష చేసి చికిత్స అందించారు. శిబిరంలో 26 మంది రైతులు లబ్ధిపొందినట్లు వైద్యాధికారిణి తెలిపారు.

ఏపీ ఎన్జీవో జిల్లా క్యాలెండర్ విడుదల

తాడికొండ: ఏపీ ఎన్జీవో జిల్లా క్యాలెండర్‌లను మంగళవారం తాడికొండలో అధికారులు విడుదల చేశారు. అమరావతి ఏపీ ఎన్జీవో యూనిట్ తరపున తాడికొండ మండల అధికారులు ఎంపీడీవో కె.సమతావాణి, తహసీల్దార్ మెహర్‌కుమార్‌ల సమక్షంలో ఏపీ ఎన్జీవో అమరావతి యూనిట్ అధ్యక్షులు బి.అశోక్‌కుమార్, కార్యదర్శి షేక్ కరీంలతో పాటు పలువురు అధికారులు క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రెజరర్ ఎ.పూర్ణయ్య, పలువురు ఏపీ ఎన్జీవో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి

దుగ్గిరాల: విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరుచుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వ్యక్తిగత వికాస నిపుణులు డాక్టరు సుబ్బారావు తెలిపారు. మంగళవారం దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయి రామస్వామి యాదవ్ ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కలిగించే విధంగా సుబ్బారావు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

సాక్షి జాబ్ పాయింట్

“ఏదైనా పని ముఖ్యమైందని భావిస్తే.. పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా ఆ పనిని పూర్తిచేయండి.

- ఎలాన్ మస్క్, టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈవో

‘మన దేశానికి ఉన్న అత్యంత బలమైన ఆయుధం యువత. రానున్న 25 ఏళ్లలో కోట్ల మంది ఉన్నత విద్యను పూర్తి చేసుకుని ఆయా రంగాల్లో అడుగు పెట్టనున్నారు. అంటే భవిష్యత్తులో దేశాభివృద్ధికి యువత కీలకంగా నిలవనున్నారు. నేటి యువత అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి దోహదపడేలా కృషి చేయాలి’ అని అంటున్నారు నీతి ఆయోగ్ ఉన్నత విద్య విభాగం డైరెక్టర్ డాక్టర్ శశాంక్ షా. దేశ విదేశాల్లో మేనేజ్‌మెంట్ రంగంలో ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన.. పలు కార్పొరేట్ కంపెనీల్లో విశేష అనుభవం గడించారు. గ్లోబల్ థాట్ లీడర్‌గా గుర్తింపు పొందిన డాక్టర్ శశాంక్ షాతో ఈ వారం ఇంటర్వ్యూ..

డిజిటల్ నైపుణ్యాలతోపాటు పర్సనల్ స్కిల్స్ కూడా ముఖ్యమే!

డాక్టర్ శశాంక్ షా

యూనివర్సిటీలు పరిశోధన కేంద్రాలుగా రాణించాలి

అభివృద్ధికి దోహదం చేసే ఏఐ అవసరం

నీతి ఆయోగ్ ఉన్నత విద్య విభాగం డైరెక్టర్ డాక్టర్ శశాంక్ షా

దేశంలో మేనేజ్‌మెంట్ విద్యా రంగం పరిస్థితి ఎలా ఉంది?

మన దేశంలో మేనేజ్‌మెంట్ విద్య ఎంతో ప్రాశస్త్యం పొందుతోంది. ఇక్కడ బోధిస్తున్న అంశాలు, అనుసరిస్తున్న టీచింగ్ విధానాల ఫలితంగా.. మన మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్లు విదేశాల్లో సైతం ఉన్నత ఉద్యోగాలు సొంతం చేసుకుంటున్నారు. అయితే ఇలాంటి గుర్తింపు పొందేలా అన్ని స్థాయిల ఇన్‌స్టిట్యూట్స్ కృషి చేయాలి. ప్రస్తుతం ట్రిపుల్ క్రౌన్ గుర్తింపు ఉన్న ఐఐఎం, ఇతర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ విద్యార్థులకు మాత్రమే విదేశీ అవకాశాలు లభిస్తున్నాయి. ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో కూడా బోధన విధానాలు బాగున్నప్పటికీ.. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు అనుసరిస్తే అవి కూడా గుర్తింపు పొందుతాయి.

మన దేశంలో పరిశోధనలపై మీ అభిప్రాయం?

గత పదేళ్ల కాలంలో దేశంలో పరిశోధనలు పెరిగాయి. ఎన్నో ఆవిష్కరణలు తెరమీదికొస్తున్నాయి. అయితే ఇవి మరింత విస్తృతంగా సాగాల్సిన అవసరం ఉంది. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే.. ఇది ఎంతో ముఖ్యం. ఇందుకోసం యూనివర్సిటీలు కూడా తమ విధానాలను రీసెర్చ్ ఓరియెంటెడ్‌గా మార్చాలి. వర్సిటీలు బోధన కేంద్రాలుగానే మిగలకుండా.. పరిశోధన కేంద్రాలుగా మారాల్సిన అవసరం ఉంది. అప్పుడే అకడమిక్ స్థాయిలోనే ఔత్సాహిక యువతకు రీసెర్చ్ మార్గాలు ఏర్పడతాయి. కొత్త ఆవిష్కరణలకు మరింత ఊతం లభిస్తుంది. యూనివర్సిటీ విద్య పూర్తి చేసుకున్నాక రీసెర్చ్ చేయాలంటే సరైన వేదికలపై అవగాహన లేక ఇబ్బంది పడే ప్రమాదం ఉంది.

మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో డిజిటల్ స్కిల్స్ అవసరం ఉందా?

అన్ని బిజినెస్ ప్రాక్టీసెస్‌లోనూ డిజిటల్ స్కిల్స్ ప్రమేయం పెరుగుతోంది. ముఖ్యంగా డేటా డ్రివెన్ ప్రాక్టీసెస్, హెచ్ఆర్ ప్రాక్టీసెస్‌లో ఏఐ, ఐటీ స్కిల్స్ ప్రాధాన్యం అధికమవుతోంది. దీనికి అనుగుణంగా మేనేజ్‌మెంట్ విద్యార్థులు అకడమిక్స్‌తో సమాంతరంగా.. తమ స్పెషలైజేషన్స్‌లో వస్తున్న న్యూ ఏజ్ టెక్నాలజీస్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇన్‌స్టిట్యూట్స్ కూడా ఈ అంశాలను కరిక్యులంలో భాగంగా బోధించే విధంగా చర్యలు తీసుకోవాలి.

విద్యార్థుల్లో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ లోపించడానికి కారణం?

దీనికి సంబంధించి రెండు ప్రధాన అంశాలను పరిగణించాలి. అవి.. డొమైన్ స్కిల్స్, పర్సనల్ స్కిల్స్. జాబ్ మార్కెట్‌లో, కెరీర్‌లో రాణించాలంటే.. ఈ రెండు కూడా ముఖ్యమే. డొమైన్ స్కిల్స్ లేకపోవడం అనేది మొదటి సమస్య. దీనికి ప్రధాన కారణం.. సరైన ప్రాక్టికల్ నైపుణ్యాలు లేకపోవడం. దీంతో.. లేటెస్ట్ టెక్నాలజీస్‌పై పట్టు లభించదు. ఉదాహరణకు.. అకడమిక్‌గా ఇంజనీరింగ్‌కు ఎంతో కీలకమైన కోడింగ్, ప్రోగ్రామింగ్‌లో సైతం వెనుకబడడానికి కారణం కాలేజ్ స్థాయిలో వనరులను వినియోగించుకోకపోవడమే. కేవలం సర్టిఫికెట్ పొందాలనే ఉద్దేశమే లక్ష్యంగా పుస్తకాలను బట్టీ పడితే గ్రేడ్ పాయింట్లు వస్తాయి తప్ప రియల్ టైమ్ నాలెడ్జ్ లభించదు. దీన్ని గుర్తించి రియల్ టైమ్ నాలెడ్జ్ పెంచుకునేలా కృషి చేయాలి.

పీపుల్ స్కిల్స్ ఆవశ్యకత గురించి చెప్పండి?

ప్రతి విద్యార్థికి డొమైన్ స్కిల్స్‌తోపాటు పీపుల్ స్కిల్స్, బిహేవియరల్ స్కిల్స్ ఎంతో అవసరం. అంతర్జాతీయంగా డబ్ల్యూఈఎఫ్, వరల్డ్ లేబర్ ఆర్గనైజేషన్ వంటి పలు సంస్థల సిఫార్సుల్లో సైతం ఇది ప్రస్ఫుటమైంది. ఉద్యోగ జీవితంలో రాణించాలంటే.. కమ్యూనికేషన్, క్రిటికల్ థికింగ్, క్రియేటివిటీ, నెగోషియేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్, డెసిషన్ మేకింగ్, ఎథికల్ ఓరియెంటేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యం. యువత విద్యార్థి దశలోనే ఈ స్కిల్స్ పెంచుకునేలా కృషి చేయాలి.

మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్లు పెంపొందించుకోవాల్సి నైపుణ్యాలు?

వీరికి అనలిటికల్ స్కిల్స్ ఎంతో ముఖ్యం. ఒక సందర్భం లేదా సమస్యను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేసే నైపుణ్యం రావాలి. అందుకే మేనేజ్‌మెంట్ పీజీలో కేస్ స్టడీస్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా యూకే, యూఎస్ వంటి దేశాల్లో కేస్ స్టడీస్ అనాలిసిస్ కోసం విద్యార్థులు ఫీల్డ్ విజిట్స్ కూడా చేస్తారు. మన దగ్గర కూడా ఆ విధానం రావాలి. ఇప్పటికీ టైర్-2, 3 ఇన్‌స్టిట్యూట్స్‌లో కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ వర్క్ అంటే మార్కులకు మార్గాలుగానే భావిస్తున్నారు తప్ప.. స్కిల్ డెవలప్‌మెంట్ కోణంలో ఆలోచించడం లేదు. పర్యవసానంగా జాబ్ మార్కెట్‌లో, విధుల నిర్వహణలో తక్షణ నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు.

మన వర్సిటీ ఎడ్యుకేషన్ విధానంలో మార్పులు అవసరమా?

యూనివర్సిటీలు.. సొసైటీ డెవలప్‌మెంట్ కోణంలో ఆలోచించాలి. విద్యార్థులను, ఫ్యాకల్టీని రీసెర్చ్ వైపు అడుగులు వేయించాలి. తద్వారా వారిలోని ఆలోచనలు.. కొత్త ఆవిష్కరణలకు రూపమిస్తాయి. ఫలితంగా దేశ అభివృద్ధికి మార్గం ఏర్పడుతుంది. ఉద్యోగాలు సాధించగలిగే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా కరిక్యులంలో మార్పులు తేవాలి.

విద్యార్థులకు మీ సలహా?

ఏ విభాగంలో చేరినా వాస్తవ పరిస్థితులపై అవగాహన పెంచుకోవడం ముఖ్యమని గుర్తించాలి. హ్యూమానిటీస్ విభాగంలో సైతం వాస్తవ పరిస్థితులపై అవగాహన ఏర్పరచుకుంటూ చదివితేనే నాలెడ్జ్ పెరుగుతుంది. దీన్ని గుర్తించి ప్రాక్టికల్ అప్రోచ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. మేనేజ్‌మెంట్, టెక్నికల్ డొమైన్ విద్యార్థులు, ఉద్యోగార్థులు ఈ విషయంలో మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలి.



టెక్ స్కిల్స్

నేడు టాప్ టెన్ కొలువుల్లో ఒకటిగా నిలుస్తోంది.. ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్. ముఖ్యంగా సంస్థల వెబ్ అప్లికేషన్స్‌కు సంబంధించి ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ విభాగాల్లో కోడింగ్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు తప్పనిసరి. దీంతో ఇందుకు అవసరమైన అప్లికేషన్స్, ప్రోగ్రామింగ్ స్కిల్స్ నేర్చుకుంటే.. చక్కటి ఆఫర్స్ సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, తాజా ట్రెండ్స్, లభిస్తున్న అవకాశాలు, అవసరమైన నైపుణ్యాలు, వేతనాలు తదితర వివరాలు

ఫుల్ స్టాక్.. జాబ్స్ ఫుల్

టాప్ జాబ్ ప్రొఫైల్‌గా ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్, అప్లికేషన్ డెవలపర్స్‌కు డిమాండ్

నిపుణుల కోసం అన్వేషిస్తున్న స్టార్టప్స్, ఎంఎన్‌సీలు

ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ సమన్వయం

- కంప్యూటర్ స్క్రీన్‌పై యూజర్స్ చూసేది, చేసేది ఫ్రంట్ ఎండ్. అలాగే బ్యాక్ ఎండ్ అంటే.. సర్వర్స్, లాజిక్, డేటాబేసెస్, ఏపీఐఎస్ వంటివి వస్తాయి.
- ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్, బ్యాక్ ఎండ్ డెవలప్‌మెంట్.. ఈ రెండు విభాగాలను సమన్వయం చేసుకుంటూ సాగితేనే ఫుల్ స్టాక్ డెవలపర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుంది.
- ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్ అంటే.. ఒక ప్రొడక్ట్ లేదా సంస్థకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారుల కళ్ల ముందుంచడం. టెక్నికల్ స్పెసిఫికేషన్స్, కలర్స్, సైజ్.. ఇలా అన్నింటినీ చూడడానికి వీలుగా నేవిగేషన్ విధానం అందుబాటులో ఉంచాలి. ఇలా యూజర్లకు అత్యంత అనువైన విధానంలో వెబ్ సైట్‌ను రూపొందించడమే ఫ్రంట్ ఎండ్ అప్లికేషన్‌గా పిలుస్తున్నారు.
- బ్యాక్ ఎండ్ అంటే.. వెబ్‌సైట్ రూపకల్పనకు అవసరమైన టెక్నికల్ అంశాలను సమర్థంగా అమలు చేయడమే.

ఫుల్ స్టాక్ అంటే ఇదే

- ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ అంటే.. ఒక సంస్థ వెబ్ అప్లికేషన్స్‌కు సంబంధించి ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్‌లో.. ప్రోగ్రామింగ్, అప్లికేషన్ టూల్స్, కోడింగ్‌లను రూపొందించడం! ఒక సంస్థ వెబ్‌సైట్ రూపొందించాలని భావిస్తే.. దాని రూపకల్పనకు బ్యాక్ ఎండ్‌లో పీహెచ్‌పీ, సీ++, జావా, పైథాన్, నోడ్.జేఎస్‌ల ఆధారంగా కోడింగ్, ప్రోగ్రామింగ్ చేసి సదరు వెబ్‌సైట్‌ను సిద్ధం చేస్తారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఎలాంటి సాంకేతిక అవరోధాలు ఏర్పడకుండా.. నిరంతరం బ్యాక్ ఎండ్‌లో వాటి టెక్నికల్ అంశాలను పర్యవేక్షిస్తూ ఉండాలి.
- అదేవిధంగా ఫ్రంట్ ఎండ్‌లో... సదరు వెబ్‌సైట్‌ను యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఇందుకోసం హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావా స్క్రిప్ట్ వంటి లాంగ్వేజ్‌ల ఆధారంగా వెబ్‌సైట్‌ను సరళంగా నేవిగేట్ చేసే విధంగా, సులువుగా సమాచారం పొందేలా సిద్ధం చేయాలి.

అప్లికేషన్ డవలపర్స్

ఇటీవల కాలంలో స్టార్టప్ నుంచి ఎంఎన్‌సీ కంపెనీల వరకు వ్యాపార విస్తరణలో వెబ్‌సైట్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. దీంతో వాటి రూపకల్పన, నిర్వహణలో కీలకమైన ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ డవలప్‌మెంట్ నిపుణులకు ఎంతో డిమాండ్ నెలకొంది. ఈ విధులను నిర్వర్తించే వారినే.. ఫుల్ స్టాక్ డెవలపర్స్ అంటారు. వీరినే అప్లికేషన్ డవలపర్స్ అని కూడా పిలుస్తారు. సంబంధిత నైపుణ్యాలుంటే సగటున నెలకు రూ.50 వేల వేతనంతో కొలువులు దక్కించుకోవచ్చు.

హాట్ జాబ్ ప్రొఫైల్‌గా..

ప్రస్తుతం ఫుల్ స్టాక్ డెవలపర్స్‌కు విస్తృత డిమాండ్ నెలకొంది. స్టార్టప్ సంస్థలు మొదలు బహుళ జాతి సంస్థలు, ప్రొడక్ట్ కంపెనీల్లో ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ నైపుణ్యాలున్న వారికి డిమాండ్ నెలకొంది. వీరికి రూ.లక్షల వేతనంతో ఆఫర్లు ఇచ్చేందుకు సంస్థలు సిద్ధపడుతున్నాయి. పలు స్టాఫింగ్ సంస్థలు, రిక్రూట్‌మెంట్ సర్వేల ప్రకారం–ఈ ఏడాది టాప్–10 జాబ్ ప్రొఫైల్స్‌లో ఒకటిగా ఫుల్ స్టాక్ డెవలపర్ నిలుస్తోంది.

జాబ్ ప్రొఫైల్స్

ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ విభాగంలో పలు హోదాల్లో కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి. ఫుల్‌స్టాక్ డవలపర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, వెబ్‌డవలప్, బ్యాక్‌ఎండ్ ఇంజనీర్, ఫ్రంట్ ఎండ్ ఇంజనీర్, ప్రొడక్ట్ ఇంజనీర్ వంటి జాబ్ ప్రొఫైల్స్ ఉన్నాయి.

ఏఐ నైపుణ్యాలతో దీటుగా

- ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలతో మరింత దీటుగా రాణించొచ్చు. వాస్తవానికి ఇప్పటికే వెబ్ అప్లికేషన్స్ రూపకల్పనలో ఏఐ ప్రమేయం పెరుగుతోంది. గిట్ హబ్ కో పైలట్ వంటి టూల్స్ ఆధారంగా ఆటోమేట్ కోడ్స్ సూచనలు, సలహాలు లభిస్తున్నాయి. చాట్ జీపీటీ, లాంగ్‌చైన్ టూల్స్.. బ్యాక్ ఎండ్ పనితీరును క్రమబద్ధం చేస్తున్నాయి. ఫిగ్మా ఏఐ ఇంటర్‌ఫేస్ అంశాలను, డిజైన్‌లను ఆటోమేటిక్‌గా జనరేట్ చేస్తోంది. దీంతో.. ఏఐ నైపుణ్యాలు సైతం సొంతం చేసుకుంటే ఈ విభాగంలో మరింత సమర్థంగా రాణించే అవకాశం ఉంటుంది.

నైపుణ్యాలు ఇవే

- ఫుల్ స్టాక్ డెవలపర్‌గా కెరీర్ ప్రారంభించాలంటే.. అందుకు అవసరమైన నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. నిర్దిష్టంగా ఒక అప్లికేషన్‌కు సంబంధించి ప్రోగ్రామింగ్, డిజైన్, డేటా బేసెస్, డీబగ్గింగ్ వంటి నైపుణ్యాలు, యూజర్ ఎక్స్‌పీరియెన్స్, బిజినెస్ లాజిక్, అప్లికేషన్ లుక్, ఫంక్షనింగ్ విషయాల్లో నైపుణ్యం సాధించాలి. వెబ్ అప్లికేషన్స్, ప్రోగ్రామ్స్‌కు సంబంధించి.. బేసిక్ టూల్స్‌పై అవగాహనతోపాటు ఆపరేటింగ్ సిస్టమ్, వెబ్ బ్రౌజర్, టెక్స్‌ట్ ఎడిటర్, ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ టూల్స్, ప్యాకేజ్ మేనేజర్స్, డేటా బేసెస్‌పై పరిపూర్ణ అవగాహన పెంచుకోవాలి.
- ఫ్రంట్ ఎండ్ కోసం బూట్‌స్ట్రాప్, యాంగ్యులర్.జేఎస్ ఫౌండేషన్, పైథాన్, జావా స్క్రిప్ట్, ఎలిక్సిర్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్‌పై పట్టు పెంచుకోవాలి. అదేవిధంగా బ్యాకెండ్ టూల్స్‌గా పేర్కొనే డీజాంగో, ఎంబర్.జేఎస్, లొదాష్ డీ3.జేఎస్ వంటి అంశాల్లో నైపుణ్యం పొందాలి. అలాగే డేటాబేస్ నిక్షిప్తం చేసే నైపుణ్యాలైన ఒరాకిల్, రెడిస్, ఎస్‌క్యూఎల్ సర్వర్ వంటి నైపుణ్యాలు అవసరం.
- బ్యాక్ ఎండ్‌కు సంబంధించి జావా, పైథాన్, నోడ్‌జేఎస్, ఎస్‌క్యూఎల్, డిజాంగో లాంటి లాంగ్వేజెస్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా ఏదైనా ఒక అప్లికేషన్‌కు సంబంధించి లాంగ్వేజ్‌తోపాటు ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు కూడా సొంతం చేసుకోవాలి.

వేతనాలు ఆకర్షణీయం..: ప్రస్తుతం హాట్ జాబ్ ప్రొఫైల్‌గా మారిన ఫ్రంట్ ఎండ్ డెవలపర్స్‌కు సంస్థలు ఆకర్షణీయ వేతనాలు అందిస్తున్నాయి. ఇండీడ్, గ్లాస్‌డోర్, పేస్కేల్ తదితర సంస్థల గణాంకాల ప్రకారం–ఫుల్ స్టాక్ డెవలపర్లకు రూ.5.2–7.5 లక్షల మధ్య వార్షిక ప్యాకేజీలు లభిస్తున్నాయి. రెండేళ్ల లోపు అనుభవం ఉన్న వారికి ఏడాదికి రూ.4.5 లక్షల నుంచి వేతనాలు ప్రారంభమవుతున్నాయి. ఫుల్‌స్టాక్ డవలప్‌మెంట్ ఇంజనీర్లు ఐదారేళ్ల అనుభవంతో రూ.9 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు వేతనం పొందొచ్చు.

సీఎస్ఈకి అనుకూలం..: బీటెక్ సీఎస్ఈ/ఐటీ, బీసీఏ, ఎంసీఏ, అదేవిధంగా ఏదైనా డిగ్రీతో కోడింగ్, ప్రోగ్రామింగ్‌పై పట్టున్న వారు ఫుల్‌స్టాక్ డెవలపర్‌గా రాణించే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రాడ్యుయేషన్ స్థాయిలో కంప్యూటర్ సైన్స్ కోర్సు చదివిన వారికి ఈ విభాగం అనుకూలంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రోగ్రామింగ్, కోడింగ్‌లపై పట్టుతో మంచి ఉద్యోగావకాశాలు అందుకునేందుకు ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ దోహదపడుతుందని చెబుతున్నారు.

ఉపాధి వేదికలు..: ఫుల్ స్టాక్ డెవలపర్స్‌కు ఆన్‌లైన్, ఈ–కామర్స్ సంస్థలే కాకుండా.. ఐటీ సంస్థలు కూడా ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. గూగుల్, ఐబీఎం, ఒరాకిల్, యాక్సెంచర్, డెల్, వీఎం వేర్ తదితర కంపెనీలు ఫుల్‌స్టాక్ డెవలపర్లను నియమించుకుంటున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ సంస్థల విషయంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మింత్రా డాట్ కామ్ వంటివి టాప్ రిక్రూటర్స్‌గా నిలుస్తున్నారు.

ఉద్యోగ సమాచారం

సీసీఎంబీ, హైదరాబాద్‌లో 10 పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ).. తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 10.
- పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ మేనేజర్–01, రీసెర్చ్ అసోసియేట్ 3–01, రీసెర్చ్ అసోసియేట్1–01, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్–02, ప్రాజెక్ట్ సీనియర్ రీసెర్చ్ ఫెలో–02, ప్రాజెక్ట్ అసోసియేట్1–02, టెక్నీషియన్–01.
- అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ/ఎండీ/ఎండీఎస్/ఎంఎస్ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం ఉండాలి.
- వయసు: ప్రాజెక్ట్ మేనేజర్‌కు 55 ఏళ్లు, రీసెర్చ్ అసోసియేట్–3కు 45 ఏళ్లు, రీసెర్చ్ అసోసియేట్–1, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్, టెక్నీషియన్‌కు 40 ఏళ్లు, ప్రాజెక్ట్ సీనియర్ రీసెర్చ్ ఫెలో, ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 35 ఏళ్లు ఉండాలి.
- ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 29.01.2026.
- వెబ్‌సైట్: https://www.ccmb.res.in/

ఈసీహెచ్ఎస్ తిరువనంతపురంలో 172 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

తిరువనంతపురంలోని ఎక్స్–సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్(ఈసీహెచ్ఎస్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 172.
- పోస్టుల వివరాలు: పాలిక్లినిక్ ఇన్‌ఛార్జ్ ఆఫీసర్–05, గైనకాలజిస్ట్–04, మెడికల్ స్పెషలిస్ట్(జనరల్ మెడిసిన్)–05, రేడియాలజిస్ట్–02, మెడికల్ ఆఫీసర్–32, డెంటల్ ఆఫీసర్–14, డెంటల్ హైజీనిస్ట్–11, రేడియోగ్రాఫర్–04, ఫిజియోథెరపిస్ట్–02, నర్సింగ్ అసిస్టెంట్–06, ఫార్మసిస్ట్–19, ల్యాబొరేటరీ అసిస్టెంట్–09, ల్యాబొరేటరీ టెక్నీషియన్–08, డ్రైవర్–09, సఫాయివాలా–11, మహిళా అటెండెంట్–09, చౌకీదార్–03, ప్యూన్–03, క్లర్క్/డేటా ఎంట్రీ ఆపరేటర్–16.
- అర్హత: సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి పదో తరగతి/ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- వేతనం: నెలకు మెడికల్ స్పెషలిస్ట్/గైనకాలజిస్ట్‌కు రూ.1,00,000 నుంచి రూ.30,000. ఆఫీసర్–ఇన్‌ఛార్జ్/మెడికల్–డెంటల్ ఆఫీసర్‌కు రూ.95,000. ఫార్మసిస్ట్/నర్సింగ్ అసిస్టెంట్/ల్యాబ్ టెక్నీషియన్‌కు రూ.28,100 నుంచి రూ.36,500, డ్రైవర్‌కు రూ.19,700 నుంచి రూ.25,600, ప్యూన్/సఫాయివాలాకు రూ.16,800 నుంచి రూ.21,800.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును స్టేషన్ హెడ్ క్వార్టర్స్ (ఈసీహెచ్ఎస్), పాన్‌గోడే, తిరుమల–పీవో, తిరువనంతపురం–695006 చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 10.02.2026.
- వెబ్‌సైట్: https://www.echs.gov.in

యూసీఐఎల్, జార్ఖండ్‌లో 364 అప్రెంటిస్‌లు

జార్ఖండ్‌లోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(యూసీఐఎల్).. వివిధ విభాగాల్లో ఐటీఐ ట్రేడ్, డిప్లొమా టెక్నీషియన్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 364.
- ఖాళీల వివరాలు: ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్–269, డిప్లొమా టెక్నీషియన్–60, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–35.
- విభాగాలు: మైనింగ్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, టర్నర్, కార్పెంటర్, ప్లంబర్, మేట్.
- అర్హత: పోస్టును అనుసరించి ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
- వయసు: 28.02.2026 నాటికి 18 నుంచి 25 ఏళ్లు
- ఎంపిక విధానం: మెరిట్ ఆధారంగా
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.02.2026.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 28.02.2026.
- వెబ్‌సైట్: https://ucil.gov.in

ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్‌లో వివిధ ఉద్యోగాలు

ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్(ఈఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 09
- పోస్టుల వివరాలు: డిప్యూటీ మేనేజర్–03, ఇంజనీర్–01, ఆఫీసర్–02, అసిస్టెంట్–01, జూనియర్ అసిస్టెంట్–02.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్/బీఈ, ఎంబీఏ, పీజీ, సీఏ, ఐసీడబ్ల్యూఏలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- వయసు: 38 నుంచి 49 ఏళ్లు ఉండాలి.
- వేతనం: నెలకు డిప్యూటీ మేనేజర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000, ఇంజనీర్/ఆఫీసర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, అసిస్టెంట్‌కు రూ.32,000 నుంచి రూ.1,28,000, జూనియర్ అసిస్టెంట్‌కు రూ.29,000 నుంచి రూ.1,20,000.
- ఎంపిక విధానం: స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 21.01.2026.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 04.02.2026.
- వెబ్‌సైట్: https://recruitment.eil.co.in

ముంబై పోర్ట్ అథారిటీలో జూనియర్ ప్రొఫెషనల్ ఇంటర్న్స్

ముంబై పోర్ట్ అథారిటీ తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ ప్రొఫెషనల్ ఇంటర్న్(ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 16.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిప్లొమా, బీటెక్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- వేతనం: నెలకు రూ.40,000.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.02.2026.
- వెబ్‌సైట్: https://mumbaiport.gov.in

బీటెక్ తర్వాత ఏంటి?

ఇంజనీరింగ్ విద్యార్థుల అసలైన ‘డ్రీమ్’ ఏది.? ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ మాటల్లో...!

బీటెక్ పూర్తి చేసిన విద్యార్థుల భవిష్యత్తు, కెరీర్ దిశానిర్దేశంపై ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి.. ‘సాక్షి ఎడ్యుకేషన్’తో ప్రత్యేక ఇంటర్వ్యూలో విలువైన సూచనలు అందించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల అసలైన లక్ష్యం ఎలా ఉండాలి, ఐఐటీల్లో ఉండే విద్యా అనుభవాలు ఏ విధంగా జీవితాన్ని మారుస్తాయి, మారుతున్న భవిష్యత్ టెక్నాలజీలకు అనుగుణంగా విద్యార్థులు తమను తాము ఎలా సిద్ధం చేసుకోవాలనే అంశాలపై ఆయన విపులంగా చర్చించారు. ముఖ్యంగా విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా నూతన ఆవిష్కరణలవైపు అడుగులు వేయాలని సూచించారు. కెరీర్ అవకాశాలకు సంబంధించిన అనేక సందేహాలను నివృత్తి చేశారు. ఇంటర్వ్యూ చూడడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

State which pair of triangles are similar ?



TRIANGLES

- **Congruent figures:** The figures that have the same shape and size are called congruent figures

Ex:
- Circles with same radius are congruent
- Squares with same side are congruent
- The two triangles are congruent if the sides and angles of one triangle are equal to the corresponding sides and angles of the other triangles.
  If ΔPQR is congruent to ΔABC, we write ΔPQR ≅ ΔABC
- **Similar figures:**
  Two figures having the same shape but not necessarily the same size are called similar figures

Ex: 1. All squares are similar
2. All equilateral triangles are similar
3. All circles are similar
4. All regular polygons having the same number of sides are always similar

- All the congruent figures are similar but the similar figures need not be congruent
- Two polygons of the same number of sides are similar if
  i) Their corresponding angles are equal and
  ii) Their corresponding sides are in the same ratio.

CONCEPTS AND PROBLEMS

There are 4 important concepts in this chapter.

i) Basic Proportionality Theorem (Thales Theorem)
ii) Criteria for similarity of Triangles
iii) Areas of Similar Triangles
iv) Pythagoras Theorem (Baudhayan Theorem)

- Construction of a triangle similar to a given triangle as per given scale factor is also a important construction problem in this chapter.
  Similar Triangles: Two triangles are said to be similar, if their
  i) Corresponding angles are equal and
  ii) Corresponding sides are proportional
- **Basic proportionality Theorem (Thales Theorem):** If a line is drawn parallel to one side of a triangle intersecting the other two sides, then it divides the two sides in the same ratio.



A triangle ABC in which DE||BC, and intersects AB in D.

AC in E, then $\frac{AB}{DB}=\frac{AE}{EC}$ or $\frac{AB}{DB}=\frac{AC}{EC}$

conversely if a line divides two sides of a triangle in the same ratio, then the line is parallel to the third side.

In ΔABC if a line DE is drawn such that

$\frac{AD}{DB}=\frac{AE}{EC}$ then DE||BC

Criterion for similarity of triangles

- **SSS - Criterion for similarity of triangles**
  If in two triangles, sides of one triangle are proportional to (i.e. in the same ratio of) the sides of the other triangle, then their corresponding angles are equal and hence the two triangles are similar
- **AAA - criterion for similarity of triangles:**
  If in two triangles, corresponding angles are equal, then their corresponding sides are in the same ratio and hence the two triangles are similar.
- **SAS - criterion for similarity of triangles:**
  If one angle of a triangle is equal to one angle of another triangle and the sides including these angles are in the same ratio (proportional), then the triangles are similar.

1 MARK QUESTIONS

1. **Statement I: Any two similar figures are congruent**
   Statement II: Any two congruent figures are similar
   choose the correct answer
   A) Only statement I is true
   B) Only statement II is true
   C) Both I and II statements are true
   D) Both I and II statement are false

Ans: B

2. **State SAS criterion of similarity of two triangles**

Sol: If one angle of a triangle is equal to one angle of another triangle and the sides including these angles are in the same ratio (proportional), then the triangles are similar.

2 MARKS QUESTIONS

1. **State SSS criterion in similarities of triangles. Using this find ∠F, from the given figure**



Sol: SSS criterion for similarity: If in two triangles sides of one triangle are proportional to the sides of the other triangle, then their corresponding angles are equal and hence the two triangles are similar.

From the Δ ABC,

Δ DEF

$\frac{AB}{DF}=\frac{3.8}{7.6}=\frac{1}{2}$

$\frac{BC}{EF}=\frac{6}{12}=\frac{1}{2}$

$\frac{AC}{ED}=\frac{3\sqrt{3}}{6\sqrt{3}}=\frac{1}{2}$

i.e.. $\frac{AB}{DF}=\frac{BC}{EF}=\frac{AC}{ED}=\frac{1}{2}$

therefore, by SSS- criterion of similarity, we have

ΔABC~ΔDEF

$\angle A=\angle D,\ \angle B=\angle F,\ \angle C=\angle E$

$\Rightarrow \angle F=\angle B=60^\circ\ \therefore \angle F=60^\circ$

2. **The perimeters of two similar triangles ΔABC, ΔPQR are respectively 36 cm, 24 cm. If PQ = 10 cm, then find AB.**

Sol: Since the ratio of the corresponding sides of similar triangles is same as the ratio of their perimeters.

ΔABC~ΔPQR

$\Rightarrow \frac{AB}{PQ}=\frac{BC}{QR}=\frac{AC}{PR}=\frac{36}{24}$

$\Rightarrow \frac{AB}{PQ}=\frac{36}{24} \Rightarrow \frac{AB}{10}=\frac{36}{24}$

$AB=\frac{36\times 10}{24}=15cm$

3. **Give two different examples of pair of**
   i) Similar figures
   ii) non- similar figures

Sol: Similar figures:
1) All circles 2) All squares
3) All equilateral triangles
Non- similar figures:
1) Triangles 2) Polygons

4. **State basic proportionality theorem. Find the AD in the given figure if DE||BC**

Sol: ***Basic proportionality theorem (Thales theorem) :*** If a line is drawn parallel to one side of a triangle intersecting the other two sides, then it divides the two sides in the same ratio.



Given that DE || BC

By basic proportionality theorem

$\frac{AD}{DB}=\frac{AE}{EC}$

$\frac{AD}{7.2}=\frac{1.8}{5.4}$

$AD=\frac{1.8}{5.4}\times 7.2$

∴ AD = 2.4 cm

5. **In the figure, if PQ || RS, prove that** ΔPOQ ~ ΔSOR



Sol: PQ || RS (Given)
∠P = ∠S (Alternate angles)
∠Q = ∠R (Alternate angles)
∠POQ = ∠ROS (Vertically opposite angles)
∴ ΔPQR ~ ΔSOR
(∵ AAA similarity criterion)

8 MARKS QUESTIONS

1. **ABCD is a trapezium with AB|| DC. E and F are points on non-parallel sides AD and BC respectively such that EF is parallel to AB. show that** $\frac{AE}{ED}=\frac{BF}{FC}$



Continued on next page..

Sol: Let us join AC to intersect EF at G
Given that AB || DC
i.e. AB || EF, EF || Cd
In ΔADC, EG || DC

$So, \frac{AE}{ED} = \frac{AG}{GC}$ ___(i)

(∴ By basic proportionality theorem)
Similarly, From ΔCAB, FG || AB

$\frac{CG}{AG} = \frac{CF}{BF}$ ___(ii) from (i, ii) $\frac{AE}{ED} = \frac{BF}{FC}$

2. ABCD is a trapezium in which AB || DC and its diagonals intersect each other at the point O. show that $\frac{AO}{BO} = \frac{CO}{DO}$



Sol: Given trapezium ABCD, AB || DC
and diagonals AC, BD intersect at O.
Draw a line OP such that
OP || CD, OP || AB
In ΔADB OP || AB
By basic proportionality theorem

$\frac{AP}{PD} = \frac{BO}{DO} \rightarrow (i)$

In, ΔACD, OP || CD
By basic proportionality theorem

$\frac{AP}{PO} = \frac{AO}{CO} \rightarrow (ii)$

From (i) + (2) we get

$\frac{AO}{CO} = \frac{BO}{DO}$

$\frac{AO}{BO} = \frac{CO}{DO}$

Proved

3. In the given figure ΔKMN, PQ||MN. If $\frac{KP}{PM} = \frac{4}{13}$, KN = 20.4 cm then find KQ.



Sol: In ΔKMN, given that
PQ||MN,

$\frac{KP}{PM} = \frac{4}{13}$, KN = 20.4 cm

By basic proportionality theorem

$\frac{KP}{PM} = \frac{KQ}{QN}$ (∵ In Δ KMN PQ||MN)

$\Rightarrow \frac{KP}{PM} = \frac{KQ}{KN - KQ}$

$\Rightarrow \frac{4}{13} = \frac{KQ}{20.4 - KQ}$ (∵ Given)

By simplifying we get

$KQ = \frac{81.6}{17} = 4.8cm$

4. In the given figure, LM||AB
AL = x – 3,
AC = 2x,
BM = x – 2,
BC = 2x +3 Find the value of x ?



Sol: ΔABC, LM||AB
By basic Proportionality theorem

$\frac{AL}{LC} = \frac{BM}{MC}$

$\frac{AL}{AC - AL} = \frac{BM}{BC - BM}$

$\frac{x-3}{2x-(x-3)} = \frac{x-2}{(2x+3)-(x-2)}$

$\frac{x-3}{x+3} = \frac{x-2}{x+5}$

$(x - 3)(x + 5) = (x - 2)(x + 3)$
$x^2 + 2x - 15 = x^2 + x - 6$
$2x - 15 = x - 6$
$2x - x = -6 + 15$
$x = 9$

5. In ΔPQR, ST is a line such that $\frac{PS}{SQ} = \frac{PT}{TR}$ and also ∠TSP = ∠PRQ prove that ΔPQR is an is a scalar triangle

Sol: In ΔPQR, ST is a line such that $\frac{PS}{SQ} = \frac{PT}{TR}$



$Since = \frac{PS}{SQ} = \frac{PT}{TR}, ST \parallel QR$

(By, converse of basic proportionality theorem)

$\lfloor PST = \lfloor PQR \rightarrow$ (1)(*corresponding angles*)

given that $\lfloor TSP = \lfloor PRQ \rightarrow (2)$

From (1), (2)
$\lfloor PQR = \lfloor PRQ$
⇒ PR = PQ
(∵ Sides opposite to equal angles are equal)
Now in ΔPQR, PR = PQ
∴ ΔPQR is an isosceles triangle

6. In the figure LM||CB and LN||CD .
prove that $\frac{AM}{AB} = \frac{AN}{AD}$



Sol: In ΔACB, LM || CB
By basic proportionality theorem

$\frac{AL}{LC} = \frac{AM}{MB} \rightarrow (1)$

In ΔACD, LN || CD

$\therefore \frac{AL}{LC} = \frac{AN}{ND} (By\ BPT) \rightarrow (2)$

From eq (1) & (2)

$\frac{AM}{MB} = \frac{AN}{ND}$ *proved*

7. In the figure DE|| AC and DF || AE
Prove that $\frac{BF}{FE} = \frac{BE}{EC}$

Sol:



In Δ ABC, DE || AC

$\therefore \frac{BD}{DA} = \frac{BE}{EC} (\because by\ BPT) \rightarrow (1)$

In ΔAEB, DF|| AE

$\therefore \frac{BD}{DA} = \frac{BF}{FE} (\because by\ BPT) \rightarrow (2)$

From (1) & (2)

$\frac{BE}{EC} = \frac{BF}{FE}$ proved

8. In the figure A, B and C are points on OP, OQ and OR respectively such that AB || PQ and AC || PR. Show that BC || QR.

Sol:



In ΔOPQ, AB || PQ

$\frac{OA}{AP} = \frac{OB}{BQ} (\because By\ BPT) \rightarrow (1)$

In ΔOPR, AC || PR

$\frac{OA}{AP} = \frac{OC}{CR} (\because By\ BPT) \rightarrow (2)$

From (1) + (2)

$\frac{OB}{BQ} = \frac{OC}{CR}$

⇒ BC || QR (∵ converse of BPT)
Hence proved

9. State which pair of triangles are similar. write the similarity criterion.



Sol: a) $\frac{AB}{QR} = \frac{2}{4} = \frac{1}{2}$

$\frac{BC}{PR} = \frac{2.5}{5} = \frac{1}{2}$ $\frac{AC}{PQ} = \frac{3}{6} = \frac{1}{2}$

∴ΔABC~ΔQRP (∵ SSS similarity criterion)
b) ∠D + ∠E + ∠F = 180°
70° + 80° + ∠F = 180 °
∠F = 180 – 150 = 30°
∠P + ∠Q + ∠R = 180°
∠P+ 80°+ 30° = 180°
∠P = 180° – 110° = 70°
∴ in ΔDEF, ΔPQR
∠D = ∠P = 70°
∠E = ∠Q = 80°, ∠F=∠R = 30°
∴ ΔDEF, ΔPQR (∵ AAA similarity criterion)

Y. Vanamraj
Subject Expert
Kurnool

Daily Quiz

1) **When the manager finally__, the employees ___the report.**
A) arrived/ were writing
B) arrived/ had written
C) had arrived/ were writing
D) was arriving/ had written

2) **After the storm __, the villagers ____ their homes.**
A) stopped/ repaired
B) stopped/ had repaired
C) had stopped/ repaired
D) was stopping/ had repaired

3) **If you __him at 5.00 p.m, he __ the presentation.**
A) meet/ will finish
B) meet/ will be finishing
C) will meet/ finishes
D) met / will be finishing

4) **By the time the movie ___, the audience __ the ending.**
A) ended/ guessed B) ended/ had guessed
C) had ended/ guessed
D) was ending/ had guessed

5) **After the chef ___ the dish, the guests ____it.**
A) cooked/ tasted B) cooked/ had tasted
C) had cooked/ tasted
D) was cooking/ had tasted

సమాధానాలు రాయడానికి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

● శోధన-సాధన

జీవశాస్త్రం అంతా తెలిసినట్లుగానే ఉంటుంది. ఏమీ తెలియనట్లుగా కూడా ఉంటుంది. ఈ దోబూచులాటలో సమాధానం దొరకని ప్రశ్నలెన్నో ఉన్నాయి. ఆ సమాధానాల కోసం వెయ్యి కళ్లతో, వెయ్యి ఆలోచనలతో నిరంతరం శోధిస్తుంటారు శాస్త్రవేత్తలు. అలాంటి శాస్త్రవేత్తలలో **యమున కృష్ణన్** ఒకరు. రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, వైద్యశాస్త్రాల మధ్య వారధిగా గుర్తింపు తెచ్చుకున్న యమున డీఎన్ఏ నానోటెక్‌తో మానవ కణాల లోపల దాగి ఉన్న రహస్యాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు...

డైనమిక్ డీకోడర్

జీవశాస్త్రంలో జవాబు దొరకని కొన్ని పెద్దప్రశ్నలకు ఇంకా సమాధానాలు దొరకాల్సి ఉంది. అవయవాలు, కణజాలాలను అర్థం చేసుకోవడంలో ఆధునిక వైద్యం అద్భుతమైన పురోగతి సాధించినప్పటికీ, ప్రతికణాన్ని సజీవంగా ఉంచే 'ఆర్గానెల్స్' అని పిలిచే చిన్న కంపార్ట్‌మెంట్ లోపల ఏమి జరుగుతోందో అనేది శాస్త్రవేత్తలకు తెలిసింది తక్కువ. ఆ అదృశ్య ప్రపంచ రహస్యాలు తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు డీఎన్ఏ ఆధారిత నానోటెక్నాలజీ విధానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఆ శాస్త్రవేత్తలలో షికాగో యూనివర్శిటీలోని ప్రొఫెసర్ యమున కృష్ణన్ ఉన్నారు.

జీవకణాల లోపల పనిచేయగల అల్ట్రా-స్మాల్ డీఎన్ఏ నానో పరికరాలను అభివృద్ధి చేశారు యమున.

లైసోసోమ్‌ను తట్టుకునేలా...

'మనం జీవశాస్త్రానికి సంబంధించిన ఉపరితలాన్ని మాత్రమే చూస్తున్నాం. ఇప్పటికే ఉన్న చాలా మందులు కణం బయటి పొరలనే లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఈ ఉపరితలం మొత్తం పొర వ్యవస్థలో 2–5 శాతం మాత్రమే ఉంటుంది. మిగిలిన అంతర్గత వ్యవస్థ ఇప్పటికీ సరిగ్గా అర్థం కాలేదు' అంటున్నారు యమున.

అధ్యయనం చేయడానికి అత్యంత సవాలు విసిరే కణాంగం (జీవకణాల లోపల నిర్దిష్టమైన పనులు నిర్వహించే చిన్న ప్రత్యేక నిర్మాణం)... లైసోసోమ్. ఇది వ్యర్థాలను తొలగించడంలో, సెల్యులార్ పదార్థాన్ని రీసైకిలింగ్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. లైసోసోమ్ అనేది అల్జీమర్స్, పార్కిన్సన్స్ లాంటి న్యూరోడీజెనరేటివ్ రుగ్మతలతో ముడిపడి ఉంటుంది. దీనిలోని తీవ్రమైన రసాయన వ్యవస్థ సంప్రదాయ సెన్సింగ్ సాంకేతికతకు ప్రతికూలంగా మారి అంతరాయం కలిగిస్తుంది.

యమున బృందం దాదాపు 35 కిలోడాల్టన్‌ల బరువు ఉన్న చిన్న డీఎన్ఏ డ్యూప్లెక్స్‌లను రూపొందించింది. కఠినమైన లైసోసోమ్ వాతావరణాన్ని తట్టుకొని దానిలోని రసాయన అసమతుల్యతలను తెలుసుకోవడానికి ఇవి ఉపకరిస్తాయి.

ఒక వారధి

న్యూరో డీజెనరేటివ్ వ్యాధులను ముందుగానే గుర్తించడం చాలా కష్టం. డీఎన్ఏ ఆధారిత నానోడివైజ్ పరీక్షలు వ్యాధి లక్షణాలను చాలా ముందుగానే గుర్తించడంలో సహాయపడతాయి. నష్టాన్ని తగ్గించడానికి, మెరుగైన చికిత్స అందించడానికి వైద్యులకు వీలైనంత సమయాన్ని ఇస్తాయి. రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, వైద్యం మధ్య వారధిగా పనిచేస్తున్నారు యమున కృష్ణన్.

'ఎస్యా ల్యాబ్స్' పేరుతో ఒక బయోటెక్ స్టార్టప్‌ను స్థాపించారు యమున. తన ప్రయోగశాల ఆవిష్కరణలను రోగనిర్ధారణ సాధనాలుగా మార్చే స్టార్టప్ ఇది. మైఖేల్ జె.ఫాక్స్ ఫౌండేషన్, గేట్స్ ఫౌండేషన్ ఈ స్టార్టప్‌కు సహకారం అందిస్తున్నాయి.

'డీఎన్ఏ అనేది అత్యంత ప్రాచీన భాష' అంటారు యమున.

ఆ భాషను ఉపయోగించి కణానికి సంబంధించిన లోతైన రహస్యాలను నానో పరికరాల సహాయంతో ఛేదించడానికి ప్రయత్నిస్తున్నారు యమున కృష్ణన్.

అలా...అనుకోకుండా!

చిన్నప్పుడు మా ఇంటి వంటగది, తోట నా ప్రయోగశాలలు. వంటగది కత్తులు కూడా నా ప్రయోగాలలో భాగమే! పువ్వులు, కప్పలపై ప్రయోగాలు చేసేదాన్ని! సైన్స్ అంటే ఉత్సాహం ఉండే వ్యక్తులతో మాట్లాడడం, కలిసి పనిచేయడం నాకు ఇష్టం. జీవశాస్త్ర విస్తృతిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం, సందేహాలకు సమాధానాలు అన్వేషించడం నాకు చాలా ఇష్టం. మొదట్లో ఏమీ తెలియకపోయినా అమితమైన ఆసక్తితో ఒక్కో విషయాన్ని నేర్చుకుంటూ శాస్త్రవేత్తలుగా మారిన వారు అంటే ఇష్టం.

నేను కెమిస్ట్రీలోకి రావడం అనుకోకుండా జరిగింది. ఆర్కిటెక్చర్ చేయాలనుకున్నాను. కానీ ఒక కీలకమైన పరీక్షలో ఆర్కిటెక్చర్ కోర్సులో చేరడానికి సరిపడా మార్కులు రాకపోవడంతో కెమిస్ట్రీలోకి రావలసి వచ్చింది. ఆర్కిటెక్చర్ చేయనందుకు చాలా సంతోషిస్తున్నాను!

- యమున కృష్ణన్

ప్రయోగాల బాటలో...

కేరళలోని పరప్పనంగడిలో పుట్టిన యమున చెన్నైలో పెరిగారు. చిన్నప్పుడెప్పుడో అప్పటి కామరాజ్ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ అయిన ఎస్.కృష్ణస్వామి మాటలు విన్నారు. ఆ ప్రభావంతో శాస్త్రీయ విషయాలపై అమిత ఆసక్తి పెంచుకున్నారు. చిన్నప్పటి నుంచే తన ఇంట్లో ఏవేవో ప్రయోగాలు చేస్తుండేవారు. చెన్నైలోని ఉమెన్స్ క్రిస్టియన్ కాలేజీలో కెమిస్ట్రీలో బ్యాచిలర్స్ డిగ్రీ చేసిన యమున కెమికల్ సైన్సెస్‌లో మాస్టర్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేశారు. 2001 నుంచి 2004 వరకు యూకేలోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలో. బెంగళూరులోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్)లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2014లో షికాగో విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర ప్రొఫెసర్‌గా చేరారు. న్యూక్లిక్ ఆమ్లాల నిర్మాణం, డైనమిక్స్. న్యూక్లిక్ యాసిడ్, నానోటెక్నాలజీ, సెల్యులార్, సబ్ సెల్యులార్ టెక్నాలజీకి సంబంధించిన అంశాలపై పరిశోధనలు చేస్తున్నారు.

కల్లోల మానసం

'మనసే అందాల బృందావనం' అనేది కవి మాట. అయితే ఆ బృందావన అందాలు, ప్రశాంతతకు చాలామంది మహిళలు దూరం అవుతున్నారు. వ్యక్తిగత సమస్యల నుంచి పని ప్రదేశాలలో ఒత్తిడి వరకు.... రకరకాల కారణాలు మహిళల్లో మానసిక సమస్యలకు కారణం అవుతున్నాయి.

40% మన దేశంలో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువగా డిప్రెషన్‌తో బాధ పడుతున్నారు. దాదాపు 40 శాతం మంది మహిళలు కుంగుబాటు(డిప్రెషన్) సమస్యను ఎదుర్కొంటున్నారు.

47% 47 శాతం మంది మహిళలు నిద్రలేమితో బాధపడుతున్నారు. నిద్రలేమి వారి ఐక్యూని, జ్ఞాపకశక్తిని (కాగ్నెటివ్ హెల్త్) ప్రభావితం చేస్తోంది.

38% దాదాపు 38 శాతం మంది మహిళలు కెరీర్, ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన విషయాలలో ఆందోళన చెందుతున్నారు.

2-1 ప్రతి ఇద్దరు భారతీయ మహిళలలో ఒకరు దీర్ఘకాలిక ఒత్తిడితో బాధ పడుతున్నారు.

18-38 భారతదేశంలో ఆత్మహత్య చేసుకుంటున్న మహిళలలో 18–38 సంవత్సరాల వయసు వారు ఎక్కువగా ఉంటున్నారు.

1.3 భారతదేశంలో 1.3 మిలియన్‌ల మంది మహిళలపై సర్వే నిర్వహించి, వారి మానసిక ఆరోగ్య సమస్యలపై 'అన్వీలింగ్ ది సైలెంట్ స్ట్రగుల్' పేరుతో ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ నివేదిక విడుదల చేసింది.

42% ● నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం...కార్పొరేట్ రంగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులలో 42 శాతం మందిలో కుంగుబాటు, ఆందోళన లక్షణాలు కనిపించాయి.
● 80 శాతం మంది మహిళలు ప్రసూతి సెలవులు, కెరీర్ పురోగతికి సంబంధించి వివక్ష ఎదుర్కొంటున్నారు.

63.3 ఆహార సంబంధిత రుగ్మతలు(ఈటింగ్ డిజార్డర్స్) కేసులలో 63.3 శాతం మహిళలు ఉండగా, 36.7 శాతం మంది పురుషులు ఉన్నారు.

29.8 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్' నివేదిక ప్రకారం నిరాశ, నిస్పృహలకు సంబంధించిన రుగ్మతలు 29.8 శాతం, ఆందోళనకు సంబంధించిన రుగ్మతలు 27.9 శాతం పెరిగాయి.

మెంటల్ హెల్త్ కేసుల్లో సగానికి పైగా కేసులు ఆఫీస్ సమస్యల కంటే వ్యక్తిగత సమస్యలకు సంబంధించినవే!

1. డ్రైవ్ అండ్ మోటివేషన్
2. జ్ఞానం, అవగాహన
3. మైండ్–బాడీ కనెక్షన్
4. మూడ్ అండ్ ఔట్‌లుక్
5. సామాజిక గుర్తింపు, సామాజిక ప్రవర్తన
6. సమస్యలను ఎదుర్కొనే శక్తి



● పురస్కారం

ఆమె శారద

● అవార్డు అందుకుంటున్న శారద

'ఊర్వశి' శారద (80) చాలా రోజుల తర్వాత ప్రేక్షకుల ముందుకు వచ్చారు. అదీ తెలుగు నేలలో కాదు. కేరళలోని తిరువనంతపురంలో. ఆదివారం అక్కడ ఘనంగా జరిగిన 'కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డ్స్' (2024) బహూకరణ వేడుకలో ఆమె కరతాళధ్వనుల మధ్య వీల్‌చైర్‌లో వేదిక మీదకు వచ్చారు. ప్రసిద్ధ నటుడు మమ్ముట్టి చేయి అందించగా లేచి ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతుల మీదుగా ఆ రాష్ట్ర సర్వోన్నత సినీ పురస్కారం 'జె.సి.డేనియల్' అవార్డు అందుకున్నారు. మనకు రఘుపతి వెంకయ్యానాయుడు ఎలాగో అక్కడ జె.సి.డేనియల్ అలాగ. జె.సి. డేనియల్ తొలి మలయాళ సినిమా దర్శకుడు.

1965 నుంచి శారద మలయాళ సినిమాలలో నటించడం మొదలుపెట్టారు. 2015 వరకూ ఆమె నటన కొనసాగింది.

'శారద మలయాళ రంగానికి మొదటి జాతీయ అవార్డు తీసుకు వచ్చారు. ఆమె మలయాళ రంగానికి చేసిన సేవలు విశిష్టమైనవి. ఆమె తన లోతైన, నిండైన అభినయంతో ప్రేక్షకులపై చెరగని ముద్ర వేశారు' అని పినరయి విజయన్ శారద నటనను కొనియాడారు.

శారద మలయాళంలో 125 చిత్రాలలో నటించారు. 'తులాభారం' (1968) మలయాళ చిత్రానికి ఆమె మొదటి జాతీయ అవార్డు తీసుకున్నారు. ఈ సినిమా తెలుగులో ఆమె ముఖ్య పాత్రగా 'మనుషులు మారాలి' పేరుతో రీమేక్ అయ్యింది. శారద ఆ వెంటనే 'స్వయంవరం' (1972) మలయాళ సినిమాతో మరోసారి జాతీయ అవార్డు గెలిచారు. అదూర్ గోపాలకృష్ణన్ దర్శకత్వంలో నిర్మితమైన ఈ సినిమా మలయాళంలో పార్లల్ సినిమాకు మొదటి అడుగుగా వ్యాఖ్యానిస్తారు. ఆ తర్వాత శారద 'నిమజ్జనం' (1977) తెలుగు సినిమాతో మూడోసారి జాతీయ అవార్డు గెలిచారు.

అందుకే ఆమెకు జె.సి.డేనియల్ అవార్డుతో పాటు ఐదు లక్షల నగదును అందించారు. శారద ఈ సందర్భంగా తను నటించిన మలయాళ చిత్రంలోని పాట పాడి ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. తెలుగులో ఆమె 'శారద', 'బలిపీఠం', 'కార్తీక దీపం', 'న్యాయం కావాలి', 'జస్టిస్ చౌదరి' తదితర ఎన్నో చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆ తర్వాత పరుచూరి బ్రదర్స్ రాసిన 'ప్రతిధ్వని', 'లారీ డ్రైవర్', 'బొబ్బిలి బ్రహ్మన్న' తదితర చిత్రాల పాత్రలలో నటించారు. నటుడు బాలకృష్ణకు 'అత్తగారి' పాత్రలో 'నారీ నారీ నడుమ మురారి', 'అనసూయమ్మ గారి అల్లుడు' తదితర చిత్రాలలో అలరించారు. 'అమ్మ రాజీనామా' చిత్రం ఆమె నటనకు మరో కలికితురాయి. ప్రస్తుతం శారద చెన్నైలోని తన సోదరుడి కుటుంబంతో నివసిస్తున్నారు.

● ముఖ్యమంత్రి పినరయి విజయన్, మమ్ముట్టిలతో...

● లీగల్

ఆ ఆస్తిలో వారికి కూడా వాటా ఇవ్వాల్సి ఉంటుంది!

నేను నా భార్యతో విడాకులు తీసుకున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. పిల్లలు నా మాజీ భార్య వద్దనే ఉంటారు. అయితే మా నాన్న గారు ఇటీవలే చనిపోయారు. ఆయన ద్వారా నాకు వచ్చిన ఆస్తిలో నా పిల్లలకి వాటా ఇవ్వాల్సి వస్తుందా?

– కృష్ణమూర్తి, విశాఖపట్నం

మీ తండ్రిగారి దగ్గర నుంచి మీకు సంక్రమించిన ఆస్తి మీ తండ్రి గారి స్వార్జితమైవుండి, వీలునామా ప్రకారం మీకు సంక్రమించి వుంటే, సదరు ఆస్తిలో మీకు తప్ప మరెవరికీ ఎటువంటి హక్కు ఉండదు. మీ తదనంతరం వీలునామా రాయకపోతే మాత్రమే అది మీ పిల్లలకి చెందుతుంది. మీ తండ్రి గారు ఒకవేళ వీలునామా రాయకుండా మరణించినట్లయితే తన స్వార్జితం మొత్తం క్లాస్–1 వారసులు; అంటే చనిపోయిన వ్యక్తి సంతానానికి (ఎంత మంది వుంటే అన్ని భాగాలు), భార్యకి – తల్లిగారికి సమానమైన హక్కు ఉంటుంది.

అలా కాకుండా ఒకవేళ అది మీ తండ్రి గారికి కూడా వారి పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తి అయివుంటే, కేవలం అలాంటి పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తి వరకు మాత్రమే మీ పిల్లలకు హక్కు ఉండే అవకాశం ఉంది. అలాంటి సందర్భంలో మీ పిల్లలు మీ వద్ద ఉంటున్నారా లేదా విడిపోయిన మీ మాజీ భార్య వద్ద ఉంటున్నారా అనేది అప్రస్తుతం. అలాగే మీ తండ్రి గారికి ఎంతమంది సంతానం వున్నారో మీరు చెప్పలేదు. ఒకవేళ మీతోపాటు అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లు, మీ తల్లిగారు, అలాగే మీ తండ్రి గారి తల్లిగారు (మీ నాన్నమ్మ) ఉంటే వారికి కూడా మీతోపాటు సమానమైన వాటా లభిస్తుంది.

స్త్రీల హక్కులను గౌరవిస్తూ వారికి రావలసిన న్యాయమైన వాటాని స్వచ్ఛందంగా ఇచ్చే పురుషులు తక్కువే! అందుకని తమ న్యాయమైన వాటా కోసం వేల సంఖ్యలో స్త్రీలు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. 'తనకు పెళ్లి చేసేటప్పుడు కట్నం ఇచ్చాము, కాబట్టి అక్కాచెల్లెళ్లకు ఇచ్చేది ఏమీ లేదు' అనే ధోరణి సాధారణంగా కనిపిస్తూ ఉంటుంది. అది తప్పు! హిందూ వారసత్వ చట్టం 2005 సవరణ తర్వాత కొడుకులకు–కూతుళ్లకు ఆస్తిలో సమానమైన హక్కు ఉంటుంది. ఒకవేళ మీకు గనక అక్క చెల్లెళ్లు ఉంటే వారికి చెందవలసిన న్యాయమైన వాటాను వారు అడగకముందే వారికి ఇచ్చేయండి. మీ పిల్లలకి మీ స్వార్జితం – మీ తండ్రిగారి స్వార్జితం ఇవ్వాలి అని నిబంధన లేదు కానీ, వారు మైనర్లు అయితే మాత్రం వారికి చట్టరీత్యా మీనుంచి మెయింటెనెన్స్ పొందే హక్కు వుంటుంది.

- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది
మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

అలవోకగా అధిరోహించాడు

అమెరికన్ రాక్ క్లైంబర్ అలెక్స్‌హోనాల్డ్ ప్రపంచంలోనే 11వ ఎత్తైన తైపీ 101 భవనాన్ని అధిరోహించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. 508 మీటర్ల ఎత్తున్న ఈ ఆకాశ హర్మ్యాన్ని అలవోకగా అధిరోహించి అందరిచే ఔరా అనిపించాడు. ఎటువంటి రక్షణ పరికరాలు లేకుండా భవనాన్ని ఎక్కడం మరో అద్భుతం.

తైవాన్ తైపీ సిటీలో ఉన్న ఈ భవనం ఎత్తు 1667 అడుగులు. కొలిస్తే సుమారుగా అరకిలోమీటరు దూరం ఉంటుంది. భవనం ఎల్ షేప్‌కార్నర్ నుంచి కేవలం తన చేతులు, పాదాల సాయంతో బీమ్స్‌ని ఆధారంగా చేసుకుని ఎక్కడం ప్రారంభించిన అలెక్స్ .. ఎడ్జ్‌లలో ఉండే డెకరేటివ్ ఆకృతులనే మెట్లుగా మార్చుకున్నాడు. ఒకానొక దశకు చేరుకున్న తరువాత భవనం పైకి చేరుకోవడానికి గ్రిప్ కూడా దొరకదు. అలాంటి పరిస్థితుల్లోనూ ఎంతో ధైర్యంతో అలెక్స్ భవనంపైకి చేరుకోవడం గొప్ప సాహసం. అక్కడే వున్న ప్రేక్షకులు చప్పట్లు కొడుతూ అతన్ని ప్రోత్సహించారు. ఆ సమయంలో హోనాల్డ్ కూడా కింద వున్న ప్రేక్షకులను చిరునవ్వుతో చూడడం అతని ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ సాహసాన్ని నెట్‌ఫ్లిక్స్ లైవ్ టెలికాస్ట్ చేసింది. అలెక్స్ హోనాల్డ్ సాహసంపై ప్రపంచ వ్యాప్తంగ ప్రశంసల జల్లు కురుస్తోంది.

హోనాల్డ్‌కు ఇలాంటి సాహసాలు కొత్తేమీ కాదు. 2017లో 3 వేల అడుగుల ఎత్తున్న శిఖరాన్ని కేవలం 3 గంటల 56 నిమిషాల్లో అధిరోహించి రికార్డు సృష్టించాడు. అయితే అడవుల్లో కొండల్లో ఇలాంటి సాహసాలు చేయడం వేరు, ప్రేక్షకుల మధ్య భవంతులు ఎక్కడం వేరు. ఈ సందర్భంగా అలెక్స్ మాట్లాడుతూ ప్రజలు తమ లక్ష్యాలను, సవాళ్లను చేరుకోవడానికి కావల్సిన స్ఫూర్తిని ఇతరుల సాహసాల ద్వారా పొందుతారని తాను భావిస్తున్నట్లు తెలిపాడు. జీవితంలో ఏదైనా సాధించాలని అనుకునే వారికి ఇవి ప్రేరణను, ప్రోత్సాహాన్నీ ఇస్తాయని అన్నాడు అలెక్స్. తైపీ 101 భవనాన్ని అధిరోహించిన అలెక్స్ హోనాల్డ్ ఘనత నిజంగా అద్భుతం.

'రీల్స్' ముదిరి రైల్ ఆపేశారు!

యువత రీల్స్ పిచ్చి పీక్స్‌కి చేరింది. పాపులర్ కావడం కోసం ఏం చేస్తున్నారో కూడా సోయి లేకుండా పోతోంది. వందలాది మంది ప్రయాణికులు ఉన్న వందే భారత్ రైలును కొంత మంది యువకులు పట్టాలు తప్పించే ప్రయత్నం చేశారు. రైలు పట్టాలపై అడ్డంగా చెక్కదుంగలను ఉంచి వందలాది మంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేశారు. ట్రెన్ ఆగిన వెంటనే రైలు ఎక్కడానికి ప్రయత్నిస్తున్నట్లు నటించిన ఆ యువకులు.. ఆ తరువాత వీడియో కోసమే ఇలా చేశామని చెప్పడం రైల్వే అధికారులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. వందేభారత్‌ను ఆపేశాం.. అంటూ గొప్పగా చెప్పుకోవడం వారి అజ్ఞానాన్ని, నేరపూరిత మనస్తత్వాన్ని సూచిస్తోంది.

ఈ విస్తుగొలిపే సంఘటన ఎప్పుడు, ఎక్కడ జరిగిందో స్పష్టత లేకపోయినప్పటికీ ఈ చర్యపై నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ వంటి వారిని ట్యాగ్ చేస్తూ నెటిజనులు ఆందోళన చేయడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

● ఇంటిప్స్

ఎసిడిటీ తగ్గించే యాలక్కాయ

యాలకులను సువాసన కోసం వాడే వంట దినుసుగానే పరిగణిస్తాం. కానీ ఇందులో అనేక ఆరోగ్యప్రయోజనాలు దాగి ఉన్నాయి.

● తిన్న ఆహారం త్వరగా అరగడానికి యాలకులు బాగా పనిచేస్తాయి. కడుపు ఉబ్బరం, ఎసిడిటీ వంటి వాటిని తగ్గిస్తాయి.
● భోజనానంతరం ఒక యాలక్కాయను నమలడం వల్ల నోటి దుర్వాసన పోయి, నోరు తాజాగా ఉంటుంది.
● తల తిరుగుతున్నప్పుడు యాలక్కాయను నమిలి తింటే సాంత్వన కలుగుతుంది.
● యాలకులు రక్తపోటును నియంత్రించి, గుండె పనితీరు మెరుగుపరచడంలో సహాయపడుతాయి.
● గొంతు నొప్పి, దగ్గు ఉన్నపుడు యాలకులతో చేసిన కషాయం తాగితే ఉపశమనం లభిస్తుంది.

● బ్యూటిప్స్

● చెంచా తేనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. 15 నిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో కడిగితే చర్మంపై ఉన్న ట్యాన్ తొలగిపోయి ముఖం కాంతిమంతమవుతుంది.
● తేనెలో ఉండే యాంటీ–సెప్టిక్ గుణాలు మొటిమలను తగ్గించడంలో సహాయపడతాయి. ఒక చెంచా తేనెలో అరచెంచా దాల్చిన చెక్కపొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని మొటిమలున్న చోట రాసి, 10 నిమిషాల తరువాత కడిగేయాలి.
● పెదవులు నల్లగా మారినా, పగిలినా తేనె అద్భుతంగా పనిచేస్తుంది. కొద్దిగా తేనె, చక్కెర కలిపి పెదవులపై నెమ్మదిగా స్క్రబ్ చేయాలి. ఇది మృతకణాలను తొలగించి పెదవులను గులాబీ రంగులోకి మారుస్తుంది.
● చెంచా తేనెతో పాలు లేదా పెరుగు కలపాలి. దీనిని ముఖానికి పట్టించి 20 నిమిషాల తరువాత కడగాలి. ఇది చర్మానికి కావాల్సిన తేమను అందించి ముఖచర్మాన్ని మృదువుగా మారుస్తుంది.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
జనవరి 27న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,62,920	1,64,250	1,61,950	1,64,250	1,65,500	1,63,200
బంగారం (22 క్యారెట్లు)	1,43,220	1,48,450	1,48,450	1,52,900	1,52,260	1,49,600
వెండి	3,62,000	3,61,500	3,87,000	3,61,500	3,58,000	3,87,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

జాతీయ సీనియర్ మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ ప్రారంభం

30 జట్లు... 464 మంది క్రీడాకారిణులు...పలువురు అంతర్జాతీయ స్టార్స్... తమ అదృష్టాన్ని పరీక్షించు కునేందుకు హైదరాబాద్ విచ్చేశారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జాతీయ సీనియర్ మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు ఈ ప్రతిష్టాత్మక చాంపియన్‌షిప్ జరగ నుంది. తొలి రోజు జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో రాజస్తాన్ 44-21తో తెలంగాణపై, ఢిల్లీ 61-14తో జమ్మూ కశ్మీర్‌పై, హిమాచల్‌ప్రదేశ్ 49-24తో అస్సాంపై, హరియాణా 62-16తో జార్ఖండ్‌పై నెగ్గాయి. తెలంగాణ జట్టుకు మహేశ్వరి కెప్టెన్‌గా, గట్టయ్య, బండారి మాధవి కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ప్రారంభోత్సవంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్, కాసాని జ్ఞానేశ్వర్, జగదీశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నీలో రాణించిన క్రీడాకారిణులను ఈ ఏడాది జరిగే ఆసియా క్రీడల్లో, కబడ్డీ ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టు ప్రాబబుల్స్‌గా ఎంపిక చేస్తారు.

విశాఖలో భారత్‌ను ఆపతరమా!

నేడు న్యూజిలాండ్‌తో నాలుగో టి20

- 4–0పై టీమిండియా గురి
- తీవ్ర ఒత్తిడిలో కివీస్
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూజిలాండ్ చేతిలో వన్డే సిరీస్ కోల్పోయిన తర్వాత భారత్ ఆ కసినంతా టి20ల్లో చూపిస్తోంది. ఎక్కడా ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయి ఇప్పటికే సిరీస్‌ను గెలుచుకుంది. అయినా సరే ఉదాసీనతకు తావు ఇవ్వకుండా అదే జోరు కొనసాగించాలని జట్టు భావిస్తోంది. వరల్డ్ కప్‌కు ముందు మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో తమ బలాన్ని మరోసారి ప్రదర్శించుకునేందుకు జట్టు సిద్ధమైంది. మరో వైపు సిరీస్‌లో ఒక్క విజయంతోనైనా ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని భావిస్తున్న కివీస్ ఏమాత్రం పోరాడుతుందో చూడాలి.

సామ్సన్

గంభీర్, సూర్యకుమార్, సితాన్షు కొటక్

సాక్షి, విశాఖపట్నం: భారత్, న్యూజిలాండ్ టి20 సిరీస్‌లో మరో పోరుకు రంగం సిద్ధమైంది. వైజాగ్‌లోని ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో నేడు ఇరు జట్ల మధ్య నాలుగో టి20 మ్యాచ్ జరుగుతుంది. సిరీస్ భారత్ సొంతమైన నేపథ్యంలో ఫలితం పరంగా ఈ మ్యాచ్‌కు ప్రాధాన్యత లేదు. అయితే మరోసారి చెలరేగి ఆధిక్యాన్ని 4–0కు పెంచుకోవాలని సూర్య బృందం పట్టుదలగా ఉంది. వన్డేల్లో చక్కటి ప్రదర్శన కనబర్చిన కివీస్ టి20ల్లో పూర్తిగా చేతులెత్తేసింది. వరల్డ్ కప్‌కు ముందు ఇది ఆందోళన కలిగిస్తుండటంతో తమ లోపాలు సరిదిద్దుకోవడంపై జట్టు దృష్టి పెట్టింది.

సామ్సన్‌కు చివరి చాన్స్!

తొలి మూడు టి20ల్లో భారత జట్టు ప్రదర్శన చూస్తే జట్టులో లోపాలేమీ కనిపించడం లేదు. వరల్డ్ కప్‌కు ముందు టీమ్ కూర్పుపై కూడా చాలా స్పష్టత వచ్చింది. అయితే ఓపెనర్ సంజు సామ్సన్ ఫామ్ మాత్రమే ఆందోళన కలిగిస్తోంది. గిల్‌పై వేటు వేయడంతో ఓపెనర్‌గా వరల్డ్ కప్ టీమ్‌లో కూడా చోటు దక్కించుకున్న సామ్సన్ తగిన న్యాయం చేయలేకపోతున్నాడు. మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 10, 6, 0 పరుగుల తర్వాత అతనిపై తీవ్ర ఒత్తిడి ఉంది. తిలక్ వర్మ గాయంతో మూడో స్థానంలో ఆడిన ఇషాన్ కిషన్ రెండు మ్యాచ్‌లలో చెలరేగిపోయాడు. తిలక్ తిరిగి వస్తే ఇషాన్ ఓపెనర్‌గా వెళితే సామ్సన్‌పై వేటు వేయడం ఖాయం. అదృష్టవశాత్తూ తిలక్ కోలుకోకపోవడంతో సామ్సన్‌కు మరో రెండు అవకాశాలు దక్కుతున్నాయి కాబట్టి అతను దీనిని వాడుకొని భారీ ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. మరోవైపు అభిషేక్ శర్మ అసాధారణ బ్యాటింగ్‌ను నిలువరించడం కివీస్ వల్ల కావడం లేదు. భారత అభిమానుల కోణంలో చూస్తే అభిషేక్ ఇంకా ఎంతగా విధ్వంసం సృష్టిస్తాడనేదే ప్రస్తుతం చర్చనీయాంశం. గత మ్యాచ్‌లో అతనితో పాటు సూర్య కూడా చెలరేగిపోవడంతో అతి సులువుగా భారత్ గెలిచింది. పాండ్యా, దూబే, రింకూ తమ స్థాయిలో సత్తా చాటుతుండటంతో భారత్ తిరుగులేని జట్టుగా కనిపిస్తోంది. బౌలింగ్‌లో రొటేషన్‌లో ఆటగాళ్లను ప్రయత్నించే క్రమంలో మరోసారి బుమ్రాకు విశ్రాంతిచ్చే అవకాశం ఉంది. బుమ్రా, బిష్ణోయ్ స్థానాల్లో అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి రావడం ఖాయం.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌తో భారీ స్కోర్లకు అవకాశం ఉంది. మంచు ప్రభావం కూడా కాస్త ఉండవచ్చు. ఈ మైదానంలో 4 టి20లు ఆడిన భారత్ 3 గెలిచి ఒకటి ఓడింది. 2023 నవంబర్‌లో ఆఖరి మ్యాచ్ జరగ్గా... ఆసీస్‌పై 209 పరుగుల లక్ష్యాన్ని భారత్ 19.5 ఓవర్లలో ఛేదించింది.

రెండు మార్పులతో...

న్యూజిలాండ్ పరిస్థితి చూస్తే ఏ ఆటగాడు కూడా ఒంటి చేత్తో మ్యాచ్ గెలిపించేలా కనిపించడం లేదు. ఒక్కో మ్యాచ్‌కు జట్టు ప్రదర్శన మరింత పేలవంగా మారుతూ వచ్చింది. తొలి పోరులో 190 పరుగులు చేసి కాస్త పోటీనిచ్చినట్లు కనిపించినా...ఆ తర్వాత భారత్ 209 పరుగుల లక్ష్యాన్ని 15.2 ఓవర్లలో... 154 పరుగుల లక్ష్యాన్ని 10 ఓవర్లలోనే ఛేదించడం కివీస్ పరిస్థితిని చూపిస్తోంది. ఈ మ్యాచ్ కోసం టీమ్‌లో రెండు కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. రాబిన్సన్, క్లార్క్ స్థానాల్లో పేసర్ ఫెర్గూసన్, ఆల్‌రౌండర్ నీషమ్ తుది జట్టులోకి వస్తారు. గాయం నుంచి కోలుకున్న తమ ప్రధాన పేసర్ ఫెర్గూసన్ ప్రత్యర్థి బ్యాటర్లను నిలువరించగలడని కివీస్ ఆశిస్తోంది. మూడు మ్యాచ్‌లలో కలిపి జట్టు నుంచి ఒకే ఒక అర్ధసెంచరీ నమోదైంది. ఫిలిప్స్ మాత్రమే ఫర్వాలేదనిపించగా, వన్డేల్లో చెలరేగిన మిచెల్ ఇక్కడ ప్రభావం చూపలేకపోతున్నాడు. కెప్టెన్ సాంట్నర్ కూడా విఫలమయ్యాడు. శుభారంభాలు లేకపోవడం జట్టును దెబ్బ తీస్తోంది. టీమ్ బౌలింగ్ చెత్తగా కనిపిస్తోంది. టీమ్‌లో ఒక బౌలర్ నమోదు చేసిన అతి తక్కువ ఎకానమీ 10 ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి స్థితి నుంచి కివీస్ ఎలా కోలుకుంటుందనేది కీలకం.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, సామ్సన్, ఇషాన్ కిషన్, పాండ్యా, దూబే, రింకూ, హర్షిత్, కుల్దీప్, అర్ష్‌దీప్, వరుణ్. **న్యూజిలాండ్:** సాంట్నర్ (కెప్టెన్), సీఫెర్ట్, కాన్వే, రచిన్, ఫిలిప్స్, మిచెల్, చాప్‌మన్, నీషమ్, హెన్రీ, ఫెర్గూసన్, సోధి.

వారెవ్వా విహాన్

- మెరిసిన వైభవ్, అభిజ్ఞాన్
- 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో జింబాబ్వేపై 204 పరుగుల తేడాతో భారత్ విజయం
- ఆదివారం పాకిస్తాన్‌తో యువ భారత్ పోరు

విహాన్

బులవాయో (జింబాబ్వే): అండర్–19 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన యువ భారత్... మంగళవారం 'సూపర్ సిక్స్ గ్రూప్–2' తొలి పోరులోనూ నెగ్గింది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఆయుశ్ మాత్రే కెప్టెన్సీలోని భారత జట్టు 204 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విహాన్ మల్హోత్రా (109 నాటౌట్; 7 ఫోర్లు) అజేయ శతకంతో అదరగొట్టాడు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (30 బంతుల్లో 52; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), అభిజ్ఞాన్ కుందు (61; 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీలతో రాణించారు. ఒకదశలో 100/1తో పటిష్టంగా కనిపించిన భారత్... ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయినా ఏమాత్రం తడబడని విహాన్... అభిజ్ఞాన్‌తో కలిసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఈ జంట ఐదో వికెట్‌కు 113 పరుగులు జోడించింది. ఖిలాన్ పటేల్ (30; 1 ఫోర్, 3 సిక్స్‌లు), ఆరోన్ జార్జ్ (23; 2 ఫోర్లు, 1 సిక్స్), ఆయుశ్ (21; 1 ఫోర్, 2 సిక్స్‌లు), అంబరీశ్ (21) తలా కొన్ని పరుగులు చేశారు. అనంతరం భారీ లక్ష్యఛేదనలో జింబాబ్వే 37.4 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటైంది. లీరాయ్ చివాలా (62; 7 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో ఆయుశ్, ఉధవ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. మరో 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలుపొందింది. ఆదివారం జరిగే తమ చివరి 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది.

గుజరాత్‌ను గెలిపించిన సోఫీ డివైన్

- ఆఖరి ఓవర్లో 5 పరుగులిచ్చి 2 వికెట్లు తీసిన జెయింట్స్ బౌలర్
- 3 పరుగుల తేడాతో ఓడిన ఢిల్లీ

సోఫీ

వడోదర: అప్పుడు ముంబైలో... ఇప్పుడు వడోదరలో... ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్‌ల మధ్య ఆఖరి బంతిదాకా ఉత్కంఠ రేపిన పోరులో గుజరాతే పైచేయి సాధించింది. ఈ రెండు సందర్భాల్లోనూ సోఫీ డివైన్ చివరి ఓవరే గెలవాల్సిన ఢిల్లీని ఓడించింది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో జెయింట్స్ 3 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిచింది. ముందుగా గుజరాత్ జెయింట్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఓపెనర్ బెత్ మూనీ (58; 7 ఫోర్లు) రాణించింది. ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి (4/31) తిప్పేసింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసి ఓడింది. ఢిల్లీ విజయానికి ఆఖరి 24 బంతుల్లో 60 పరుగులు కావాల్సిన దశలో నికీ ప్రసాద్ (24 బంతుల్లో 47; 9 ఫోర్లు), స్నేహ్ రాణా (15 బంతుల్లో 29; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేశారు. డివైన్ 17వ ఓవర్లో 23 పరుగులు, గార్డ్‌నర్ 19వ ఓవర్లో 20 పరుగులు వచ్చాయి. దాంతో ఢిల్లీ గెలవాలంటే ఆఖరి ఓవర్లో 9 పరుగులు చేయాలి. కానీ సోఫీ డివైన్ ఆఖరి ఓవర్లో 5 పరుగులే ఇచ్చి నికీ, స్నేహ్‌లను అవుట్ చేయడంతో గుజరాత్ ఓటమి కోరల్లోంచి బయటపడి గెలిచింది. **నేడు విశ్రాంతి దినం. గురువారం జరిగే మ్యాచ్‌లో బెంగళూరు జట్టుతో యూపీ వారియర్స్ ఆడుతుంది.**

స్కోరు వివరాలు

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: మూనీ (సి) జెమీమా (బి) నందిని 58; సోఫీ డివైన్ (బి) కాప్ 13; అనుష్క (సి) మిన్నుమణి (బి) శ్రీచరణి 39; గార్డ్‌నర్ (సి) స్నేహ్ రాణా (బి) మిన్నుమణి 2; వేర్‌హమ్ (బి) శ్రీచరణి 11; భారతి (బి) చినెల్లి హెన్రీ 3; కనిక (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రీచరణి 4; కాశ్వీ (బి) శ్రీచరణి 2; తనూజ (సి) శ్రీచరణి (బి) చినెల్లి హెన్రీ 21; రేణుక (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 174. వికెట్ల పతనం:** 1–19, 2–73, 3–96, 4–128, 5–131, 6–135, 7–139, 8–151, 9–174. **బౌలింగ్:** కాప్ 4–0–34–1, చినెల్లి 4–0–38–2, నందిని 4–0–26–1, శ్రీచరణి 4–0–31–4, స్నేహ్ రాణా 1–0–11–0, మిన్ను మణి 3–0–23–1. **ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్:** షఫాలీ (సి) గార్డ్‌నర్ (బి) రాజేశ్వరి 14; లిజెల్లీ (సి) గార్డ్‌నర్ (బి) సోఫీ 11; వోల్వార్డ్ (బి) రాజేశ్వరి 24; జెమీమా (బి) సోఫీ 16; కాప్ (బి) గార్డ్‌నర్ 0; చినెల్లి (సి) గార్డ్‌నర్ (బి) రాజేశ్వరి 9; నికీ ప్రసాద్ (సి) గార్డ్‌నర్ (బి) డివైన్ 47; స్నేహ్ రాణా (సి) వేర్‌హమ్ (బి) సోఫీ 29; మిన్ను మణి (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1–26, 2–51, 3–82, 4–83, 5–85, 6–100, 7–170, 8–171. **బౌలింగ్:** రేణుక 1–0–16–0, కాశ్వీ గౌతమ్ 2–0–18–0, రాజేశ్వరి 4–0–20–3, సోఫీ డివైన్ 4–0–37–4, తనూజ 4–0–26–0, ఆష్లే గార్డ్‌నర్ 4–0–37–1, వేర్‌హమ్ 1–0–12–0.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిసారి సెమీఫైనల్ చేరిన అల్‌కరాజ్
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

మోహన్‌బాబుకి అరుదైన గౌరవం

మంచు మోహన్‌బాబు, సీవీ ఆనంద బోస్

ప్రముఖ నటుడు, నిర్మాత డా. మంచు మోహన్ బాబు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక గవర్నర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కోల్‌కత్తాలోని లోక్ భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ డా. సీవీ ఆనంద బోస్ చేతులమీదుగా ఈ అవార్డును తీసుకున్నారాయన. ''మోహన్ బాబుగారు 50 సంవత్సరాల సినీ జీవితంలో కళామతల్లికి చేసిన సేవ, అట్టడుగు స్థాయి నుండి భారతదేశం గర్వించదగ్గ నటుడిగా ఎదగడం, విద్య, దాతృత్వంలో సమాజంపై చెరగని ముద్ర వేశారు. ఆయన సినీ, వ్యక్తిగత జీవితం, క్రమశిక్షణ లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది. ప్రస్తుతం భారతదేశం అంతటా తెలుగు సినిమా ప్రభావం కనిపిస్తోంది. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఒక తెలుగు నటుడికి ఇటువంటి గౌరవాన్ని ప్రదానం చేయడం ప్రత్యేకమైన చరిత్రను సృష్టించినట్టుగా నిలిచింది. కళకు, కళాకారులకు హద్దులు, భాషా సరిహద్దులు ఉండవని మరోసారి నిరూపించారు'' అని మోహన్ బాబు తనయుడు, 'మా' అధ్యక్షుడు, హీరో విష్ణు మంచు తెలిపారు.

మేలో స్టార్ట్

ఎన్టీఆర్

'దేవర 2' సినిమా ఈ ఏడాది సెట్స్‌పైకి వెళ్లనుంది. హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందిన పీరియాడికల్ యాక్షన్ సినిమా 'దేవర'. ఈ సినిమాలో ఎన్టీఆర్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు. తండ్రి దేవర, కొడుకు వర పాత్రల్లో నటించారు ఎన్టీఆర్. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్, శ్రీకాంత్, ప్రకాష్ రాజ్, షైన్ టామ్ చాకో ఇతర కీలక పాత్రల్లో నటించారు. నందమూరి కల్యాణ్‌రామ్, మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ నిర్మించిన ఈ చిత్రం 2024 సెప్టెంబరులో విడుదలై విజయం సాధించింది. ఈ సినిమా ఎండింగ్‌లో 'దేవర 2' ఉంటుందని మేకర్స్ స్పష్టం చేశారు. తాజాగా ఈ సినిమా అప్‌డేట్‌ను వెల్లడించారు నిర్మాత మిక్కిలినేని సుధాకర్. ''దేవర' సీక్వెల్ పనులు ఈ ఏడాది మేలో ప్రారంభం అవుతాయి. 2027లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అంటూ వెల్లడించారు. కాగా ప్రస్తుతం ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) సినిమాతో బిజీగా ఉన్నారు ఎన్టీఆర్. ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

అలాంటి పరిస్థితులు ఇప్పుడు లేవు - చిన్మయి శ్రీపాద

''కమిట్‌మెంట్' అంటే వృత్తి పట్ల నిబద్ధత అని అనుకుంటే పొరపాటే. చిత్ర పరిశ్రమలో ఆ పదానికి అర్థం వేరు. మహిళలు తమ శరీరాన్ని అప్పగించకపోతే ఇక్కడ అవకాశాలు రావు. మహిళల నుంచి పురుషులు లైంగిక ప్రయోజనాలను ఆశించడం ఇక్కడ సర్వసాధారణం'' అంటూ గాయని చిన్మయి శ్రీపాద ఘాటుగా స్పందించారు. 'చిత్ర పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ అనేది లేదు.. ఇండస్ట్రీలో కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుంది' అంటూ 'మన శంకర వరప్రసాద్ సినిమా సక్సెస్ మీట్‌లో చిరంజీవి మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా చిన్మయి శ్రీపాద స్పందిస్తూ.. సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు.

''ఒక ప్రముఖ వ్యక్తి ఒక మహిళా సంగీత దర్శకురాలిని స్టూడియోలో లైంగికంగా వేధించడానికి ప్రయత్నించాడు. ఆమె భయంతో సౌండ్ బూత్‌లో తనను తాను లాక్ చేసుకుంది. మరొక సీనియర్ వచ్చి కాపాడే వరకు ఆమె అక్కడే ఉండిపోయింది. ఆ తర్వాత ఆమె సంగీత రంగాన్నే వదిలేసింది. అలాగే ఒక ప్రముఖ గాయకుడు లైంగిక కోర్కెలు తీర్చాలని వేధించేవాడు. ఇలాంటి నేరస్తులకు సొసైటీ ఎర్ర తివాచీ వేస్తోంది. పాటల రచయిత వైరముత్తు కూడా నన్ను లైంగికంగా వేధించినప్పుడు నా తల్లి కూడా అక్కడే ఉన్నారు. తల్లి పక్కనే ఉన్నా మగవారి బుద్ధి మారదు అనడానికి ఈ ఘటన నిదర్శనం. నాపై లైంగిక దాడి చేయమని నేను కోరలేదు. సీనియర్ నటి షావుకారు జానకి వంటి వారు కూడా 'మీటూ' ఉద్యమాన్ని అర్థం చేసుకోకుండా బాధితులను అవమానించడం బాధాకరం. ఇండస్ట్రీ అద్దం లాంటిది కాదు.. ఇక్కడ పని కావాలంటే మహిళల శరీరాన్ని కోరుకునే పురుషుల ఆలోచనా ధోరణే పెద్ద సమస్య. చిరంజీవిగారి తరంలో నటీనటులంతా ఒకరితో ఒకరు స్నేహభావంతో ఓ కుటుంబంలా ఉండేవారు. అలాగే పరస్పరం గౌరవించుకునేవారు. అయితే ఇండస్ట్రీలో ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు'' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు చిన్మయి శ్రీపాద.

క్యాట్ విజయం సాధించాలి - బుచ్చిబాబు

వెంకటేశ్వర్లు, బుచ్చిబాబు, జీవీ నాయుడు, సుకేష్

''దర్శకుడు, యాక్టర్ అయిన జీవీ నాయుడుగారు నాకు ఎప్పటి నుంచో తెలుసు. ఆయన చెప్పిన 'క్యాట్' కథ విన్నప్పుడు వినూత్నంగా, ఆసక్తిగా అనిపించింది. ఈ సినిమా మంచి విజయం సాధించి, యూనిట్‌కి పేరు తీసుకురావాలి'' అని 'ఉప్పెన, పెద్ది' చిత్రాల ఫేమ్ డైరెక్టర్ బుచ్చి బాబు అన్నారు. జీవీ నాయుడు, వీజే బాలు, లావణ్య, కళ్యాణి రాణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'క్యాట్'. వై. గంగాధర్(ఐపీఎస్) సమర్పణలో వీఆర్‌జీఆర్ మూవీస్ బ్యానర్‌పై రజనీ గొంగటి నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని బుచ్చిబాబు విడుదల చేశారు.

గాయకుడు అర్జిత్ సింగ్ రిటైర్మెంట్

ప్రముఖ బాలీవుడ్ గాయకుడు అర్జిత్ సింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్లేబ్యాక్ సింగింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించి, తన అభిమానులకు షాక్ ఇచ్చారు. ప్లే బ్యాక్ సింగింగ్ నుంచి తప్పుకుంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు అర్జిత్ సింగ్. ''అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఇప్పటి వరకు నాకు అండగా నిలిచి, ప్రేమను పంచిన అభిమానులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ఇక నుంచి ప్లే బ్యాక్ సింగర్‌గా నేను కొత్త సినిమాలు ఒప్పుకోవట్లేదు అని సంతోషంగా ప్రకటిస్తున్నాను. నా రిటైర్మెంట్ నిర్ణయం చాలా మందిని బాధపెట్టినప్పటికీ అందరూ అర్థం చేసుకుంటారనుకుంటారని ఆశిస్తున్నాను. ఇప్పటి వరకు నా ప్రయాణం అద్భుతంగా సాగింది. ఇకముందు కూడా అలాగే కొత్తప్రయాణం మొదలు పెడతాను'' అని చెప్పారు అర్జిత్ సింగ్. సినిమాలతోపాటు ప్రైవేట్ ఆల్బమ్స్, ఈవెంట్స్‌తోనూ అలరించారాయన. హిందీతో పాటు తెలుగు, కన్నడ, మరాఠీ, గుజరాతి.. ఇలా పలు భాషల్లో ఎన్నో పాటలు పాడి.. విశేషమైన అభిమానులను సంపాదించుకున్నారాయన. బాలీవుడ్‌లో 'ఆషికీ–2' సినిమాలో 'తుమ్ హి హో', బ్రహ్మాస్త్ర' చిత్రంలో 'కేసరియా...' పాటలతో ఆకట్టుకున్న అర్జిత్.. తెలుగులో 'మనం, కేడీ, దోచెయ్, నాపేరు సూర్య నా ఇల్లు ఇండియా, ఉయ్యాల జంపాల, స్వామి రారా, నీ జతగా నేనుండాలి, కేశవ, హుషారు, హిట్, ఓం భీమ్ బుష్' వంటి పలు సినిమాలకు పాటలు పాడారు. రెండు జాతీయ అవార్డులు అందుకోవడంతో పాటు పద్మశ్రీ పురస్కారం అందుకున్నారాయన. సింగర్‌గా ఫుల్ ఫామ్‌లో ఉన్న సమయంలో, కేవలం 38 ఏళ్లకే అర్జిత్ సింగ్ రిటైర్మెంట్ ప్రకటించడంతో అందరూ షాక్‌కి గురవుతున్నారు.

ఆ తర్వాత చాలా బాధపడ్డాను - విశ్వక్ సేన్

విశ్వక్ సేన్, తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా

''ఫలక్‌నుమా దాస్' చిత్రంలో సైదులు క్యారెక్టర్‌ని తరుణ్ భాస్కర్‌తో చేయించడానికి చాలా కష్టపడ్డాను. అయితే ఆ తర్వాత చాలా బాధపడ్డాను. ఎందుకంటే తను నటుడిగా చాలా బిజీ అయిపోయాడు. 'ఈ నగరానికి ఏమైంది 2' మూవీ స్టార్ట్ చేస్తారా? లేదా? అనే టెన్షన్ వచ్చింది. తను నటించిన 'ఓం శాంతి శాంతి శాంతిః' కథ నాకు తెలుసు. ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లోనే చూసి, ఆదరించాలి'' అని విశ్వక్ సేన్ కోరారు. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జోడీగా ఏఆర్ సజీవ్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఎస్ ఒరిజినల్స్– మూవీ వెర్స్ స్టూడియోస్‌పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనూప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి విశ్వక్ సేన్ అతిథిగా హాజరయ్యారు. **తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ–**''ఓం శాంతి శాంతి శాంతిః' తప్పకుండా నవ్విస్తుందనే నమ్మకం ఉంది'' అని చెప్పారు. ''చాలా నిజాయతీగా తీసిన సినిమా ఇది'' అన్నారు ఏఆర్ సజీవ్. ''అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ ఇది'' అని సృజన్ యరబోలు, అనూప్ చంద్రశేఖరన్, వివేక్ కృష్ణని తెలిపారు.

క్రైమ్ థ్రిల్లర్

ఆకాశ్ పూరి, సూర్య

సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జమాన'. భాస్కర్ జక్కుల దర్శకత్వంలో తేజస్వి అడప నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన హీరో ఆకాష్ పూరి మాట్లాడుతూ–''క్రైమ్ అండ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న జమాన' ట్రైలర్ బాగుంది. మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ మూవీని అందరూ థియేటర్స్‌లో చూసి, విజయం అందించాలి'' అని చెప్పారు. ''మా సినిమాలో ఆద్యంతం వినోదంతో పాటు ఊహించని ట్విస్ట్‌లు ఉంటాయి'' అన్నారు భాస్కర్ జక్కుల. ''యూనిట్ అంతా ప్రాణం పెట్టి ఈ సినిమా చేశాం. మా చిత్రం అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాం'' అని సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ కేశవ కిరణ్ పేర్కొన్నారు.

నా గుండె గాలిపటం..

సుధాకర్, ఎంఎ నాయుడు, శైలి, అమర్ దీప్

అమర్‌దీప్, శైలి చౌదరి హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'సుమతీ శతకం'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో ఎంఎం నాయుడు దర్శకత్వంలో సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'నా గుండె గాలిపటం... దారం నీ చేతుల్లో ఎగరేస్తావో... ఏమ్ చేస్తావో..' అంటూ మొదలై, 'నా కుట్టీ కుట్టీ సుమతీ, నా చిట్టీ చిట్టీ సుమతీ' అంటూ సాగే 'సుమతి సుమతి' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ స్వరకల్పనలో కృష్ణ మాదినేని ఈ పాట రాయగా, గోల్డ్ దేవరాజ్ ఆలపించారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
320	127
81,857	25,175

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,844	▲	242
డోజోన్స్	49,127	▽	285
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,209	▲	60
డాక్స్	24,968	▲	34
షాంఘై	4,139	▲	7
నికాయ్	53,333	▲	448

అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	89.89	92.91
£	బ్రిటన్ పౌండ్	123.20	127.67
€	యూరో	106.81	110.85
¥	జపాన్ యెన్(100)	48.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	61.13	65.08
S$	సింగపూర్ డాలర్	70.04	73.81
SAR	సౌదీ రియాల్	23.56	25.07
UAE	యూఏఈ దిర్హమ్	24.08	25.35
¥	చైనా యువాన్	12.31	14.13

సిల్వర్ సునామీ

- ఒక్కరోజే రూ.40,500 ర్యాలీ
- రూ.3.7 లక్షలకు వెండి
- రూ.1,66,000కు బంగారం
- రూ.7,300 జంప్

న్యూఢిల్లీ: భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య బంగారం, వెండి ధరల్లో రికార్డుల పరుగు కొనసాగుతున్నాయి. మంగళవారం ఈ రెండు మరో కొత్త జీవిత కాల గరిష్టానికి దూసుకెళ్లాయి. బంగారం 10 గ్రాములకు రూ.7,300 లాభపడి రూ.1,66,000కు చేరుకుంది. గణతంత్రదినోత్సవం సందర్భంగా సోమవారం బులియన్ మార్కెట్లు పనిచేయలేదు. వెండి కిలోకి రూ. 40,500 ఎగసి (12.3 శాతం) రూ.3,70,000 మార్క్‌ను తాకింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో వెండి ఔన్స్‌కు 8.55 డాలర్లు పెరిగి (8.24%) 112.41 డాలర్లకు చేరింది. బంగారం 79 డాలర్లు ఎగసి (1.58%) 5,087.48 డాలర్ల మార్క్‌ను తాకింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న క్రమంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా నెలకొన్న డిమాండ్‌తో వెండి దేశీ మార్కెట్లో మరో కొత్త రికార్డు 3,70,000కు చేరినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ విభాగం సీనియర్ అనలిస్ట్ సామిల్ గాంధీ తెలిపారు. పెట్టుబడులకు తోడు పారిశ్రామిక డిమాండ్ సైతం వెండి ధరలకు తోడైనట్టు చెప్పారు. ''సమీప కాలంలో లాభాల స్వీకరణ, స్థిరీకరణకు అవకాశం ఉంది. కానీ, అంతర్జాతీయంగా రిస్క్ సామర్థ్యం బలహీనంగా ఉన్నంత కాలం, డాలర్ ఒత్తిళ్లు ఎదుర్కొన్నంత కాలం మొత్తం మీద వెండి ధరలకు సానుకూలమే''అని లెమన్ మార్కెట్స్ డెస్క్ రీసెర్చ్ అనలిస్ట్ గౌరవ్ గార్గ్ తెలిపారు.

తీపితో సీక్రెట్ లాక్

బడ్జెట్ ప్రింట్ స్టార్ట్
- హల్వా వేడుకతో ఆర్థిక పండుగకు శ్రీకారం
- బడ్జెట్ ముద్రణకు అధికారిక ఆరంభం
- లాక్–ఇన్ పీరియడ్ ప్రారంభం
- పాల్గొన్న ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌కు ముందు కీలక సంప్రదాయ కార్యక్రమం బడ్జెట్ హల్వా సెరమనీ న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో మంగళవారం ఘనంగా, సందడిగా జరిగింది. ఈ కార్యక్రమంతో బడ్జెట్ పత్రాల ముద్రణ ప్రక్రియకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, సీనియర్ అధికారులు, బడ్జెట్ తయారీలో పాల్గొన్న సిబ్బంది కలిసి హల్వాను పంచుకున్నారు. భారత సంప్రదాయంలో శుభారంభానికి తీపి పంచుకోవడం ఆనవాయితీ కావడంతో, బడ్జెట్ ప్రక్రియ ప్రారంభానికి ఇది ప్రతీకగా కొనసాగుతోంది. వచ్చే నెల (ఫిబ్రవరి)1 న ఆర్థిక మంత్రి పార్లమెంట్‌కు బడ్జెట్‌ను సమర్పించనున్నారు. హల్వా వేడుక తర్వాత ఆర్థిక మంత్రి సీతారామన్ బడ్జెట్ ముద్రణ విభాగాన్ని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. మొత్తం బడ్జెట్ బృందానికి ఈ సందర్భంగా ఆమె అభినందనలు తెలియజేశారు.

బడ్జెట్ వరకు దిగ్బంధం

బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం ముగిసే వరకు నార్త్ బ్లాక్‌లోనే (లాకిన్) ఉండిపోతారు. బాహ్య ప్రపంచంతో వారికి ఎలాంటి సమాచార, సంబంధాలు ఉండవు. బడ్జెట్ తుది పత్రాలు ఎట్టి పరిస్థితుల్లోనూ లీక్ అవ్వకుండా ఈ విధానాన్ని పాటిస్తుంటారు. ఇలా లాకిన్‌లో ఉండే అధికారులు, సిబ్బందికి అభినందన పూర్వకంగా హల్వా వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నార్త్‌బ్లాక్ బేస్‌మెంట్‌లోని ప్రింటింగ్ ప్రెస్‌లోనే 1980 నుంచి 2020 వరకు బడ్జెట్ ప్రతులను ముద్రించే వారు. ఆ తర్వాత నుంచి పరిమితంగా కొన్ని పత్రాలను ముద్రించి, మిగిలిన మొత్తం డిజిటల్ రూపంలోకి మారింది. 1950కు పూర్వం రాష్ట్రపతి భవన్‌లో బడ్జెట్ పత్రాల ముద్రణ నడిచింది. డాక్యుమెంట్లు లీక్ అవ్వడంతో 1950లో మింట్‌రోడ్‌కు మార్చారు. ఆ తర్వాత 1980లో నార్త్‌బ్లాక్‌కు మారింది.

వెలిసిన రంగులు

- తగ్గిన ఏషియన్ పెయింట్స్ లాభాలు
- క్యూ3లో రూ. 1,074 కోట్లు

ముంబై: ప్రయివేట్ రంగ దేశీ దిగ్గజం ఏషియన్ పెయింట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం క్షీణించి రూ. 1,074 కోట్లకు పరిమితమైంది. అయితే ఇందుకు అనుబంధ సంస్థకు చెందిన అనుకోని పద్దుసహా.. కొత్త కార్మిక చట్టాల అమలు ప్రభావం చూపాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,128 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 4 శాతం పుంజుకుని రూ. 8,867 కోట్లను అధిగమించింది. గత క్యూ3లో రూ. 8,549 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 3 శాతం పెరిగి రూ. 7,447 కోట్లను దాటాయి. వైట్ టీక్ కొనుగోలు నేపథ్యంలో రూ. 94 కోట్ల నష్టాన్ని నమోదు చేయడంతోపాటు.. గ్రాట్యుటీ కేటాయింపులు రూ. 64 కోట్లు పెరగడం లాభాలను ప్రభావితం చేసినట్లు కంపెనీ వెల్లడించింది. టర్నోవర్‌లో దేశీ ఆదాయం 3% పెరిగి రూ. 7,602 కోట్లకు చేరగా.. అంతర్జాతీయ బిజినెస్ 6% వృద్ధితో రూ. 870 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 2,625 వద్ద ముగిసింది.

యూరప్ షాపింగ్ కార్ట్‌లో
మేడిన్ ఇండియా బ్రాండ్స్

- టెక్స్‌టైల్స్‌కు టర్నింగ్ పాయింట్
- ఈయూతో ఎఫ్‌టీఏ.. గేమ్ ఛేంజర్
- రూ. 22.9 లక్షల కోట్ల ఎగుమతుల మార్కెట్లో దూకుడుకు చాన్స్

న్యూఢిల్లీ: భారత్, యూరోపియన్ యూనియన్(ఈయూ) మధ్య తాజాగా కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) ప్రధానంగా దేశీ వస్త్ర(టెక్స్‌టైల్స్) పరిశ్రమకు గేమ్‌ఛేంజర్ కానుంది. 27 దేశాల ఈయూతో ఎఫ్‌టీఏ కారణంగా దేశీ టెక్స్‌టైల్స్ ఎగుమతులకు బూస్ట్ లభించనుంది. టారిఫ్‌ల ప్రభావంతో బంగ్లాదేశ్, పాకిస్తాన్, టర్కీ తదితర దేశాలతో పోటీలో భారత్ సవాళ్లు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. తాజా ఒప్పందంతో దాదాపు జీరో డ్యూటీల ద్వారా 264 బిలియన్ డాలర్ల(రూ. 22.9 లక్షల కోట్లు) విలువైన ఈయూ మార్కెట్‌కు భారత్ ఎగుమతులు ఊపందుకునే వీలున్నట్లు కేంద్ర జౌళి శాఖ పేర్కొంది. ప్రస్తుతం దేశీ టెక్స్‌టైల్స్, దుస్తుల ఎగుమతులకు యూఎస్ తదుపరి ఈయూ రెండో పెద్ద మార్కెట్‌గా నిలుస్తోంది. దేశీ టెక్స్‌టైల్స్, దుస్తుల ఎగుమతుల ఆదాయంలో 28 శాతం వాటా ఆక్రమిస్తున్న యూఎస్.. భారత్ గూడ్స్‌పై 50 శాతం టారిఫ్‌లను విధించిన విషయం విదితమే. కాగా.. టారిఫ్‌లవల్ల పోటీ దేశాలతో సవాళ్లు ఎదుర్కొంటున్న దేశీ వస్త్ర పరిశ్రమకు ఎఫ్‌టీఏ జోష్‌నివ్వనున్నట్లు జౌళి శాఖ పేర్కొంది. ఇది శ్రామిక ఆధారిత రంగం కాగా.. ఎఫ్‌టీఏ ప్రభావంతో ధరలతో పోటీ పడటమేకాకుండా మరిన్ని మార్కెట్లలో విస్తరించేందుకు వీలు కలగనున్నట్లు తెలియజేసింది. దీంతో 264 బిలియన్ డాలర్ల(రూ. 22.9 లక్షల కోట్లు) విలువైన ఎగుమతుల మార్కెట్లో మరింతగా పోటీ పడేందుకు దారి ఏర్పడనున్నట్లు వెల్లడించింది. ప్రత్యక్షంగా టెక్స్‌టైల్స్ రంగం 4.5 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం భారత్ నుంచి 36.7 బిలియన్ డాలర్ల(రూ. 3.19 లక్షల కోట్ల) విలువైన గ్లోబల్ టెక్స్‌టైల్, దుస్తుల ఎగుమతులు నమోదవుతున్నాయి. వీటిలో ఈయూ వాటా 7.2 బిలియన్ డాలర్లుకాగా.. తాజా ఒప్పందంతో యార్న్, కాటన్ యార్న్, రెడీమేడ్ గార్మెంట్స్ తదితర ప్రొడక్టులకు భారీ అవకాశాలు ఏర్పడనున్నట్లు జౌళి శాఖ వివరించింది.

ఫార్మా ఎగుమతులకు దన్ను

ఈయూతో ఎఫ్‌టీఏ కారణంగా దేశీ ఫార్ములేషన్లు, ఏపీఐలు, విలువైన ఔషధాల ఎగుమతులు బలపడనున్నట్లు ఫార్మాక్సిల్ చైర్మన్ నమిత్ జోషీ పేర్కొన్నారు. దేశీ ఫార్మాస్యూటికల్ రంగానికి నిర్మాణాత్మక పోటీతత్వాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. ప్రధానంగా నాణ్యతా సామర్థ్యాలుగల దేశీ ఫార్మా ఎంఎస్ఎంఈలకు దన్ను లభిస్తుందని తెలియజేశారు.

మైలురాయిగా..

భారత్, ఈయూ మధ్య ఎఫ్‌టీఏను మైలురాయిగా లగ్జరీ బ్రాండ్ల ఆటో రంగ దిగ్గజాలు మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, స్కోడా ఆటో, ఫోక్స్‌వేగన్, ఆడి, స్టెల్లాంటిస్ అభివర్ణించాయి. దీంతో సాంకేతిక ఆవిష్కరణలకు ప్రోత్సాహాన్నివ్వడమేకాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు సైతం దన్నుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డాయి.

ట్రేడ్ డీల్ జోష్

- బ్యాంకులు, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు
- సెన్సెక్స్ లాభం 320 పాయింట్లు
- 127 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

ముంబై: ఐరోపా సమాఖ్య(ఈయూ)తో మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ మంగళవారం లాభాలతో ముగిసింది. బ్యాంకులు, మెటల్ షేర్లకు భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా సెన్సెక్స్ 320 పాయింట్లు పెరిగి 81,857 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 127 పాయింట్లు బలపడి 25,175 వద్ద నిలిచింది.

- దేశీయ ఆటో రంగ కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. భారత్–ఈయూల మధ్య కుదిరిన స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందంతో ఐరోపా దేశాల నుంచి దిగుమతి అయ్యే లగ్జరీ కార్లు చౌకగా లభించనున్నాయి. దీంతో మార్కెట్లో మరింత పోటీతత్వం పెరుగుతుందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఫలితంగా మహీంద్రా అండ్‌మహీంద్రా 4%, హ్యుందాయ్ మోటార్స్ 4% పతనమయ్యాయి. మారుతీ సుజుకీ 1.50%, టాటా మోటార్స్ పీవీ 1.22%, ఎంఅండ్‌ఎఫ్ 1.20%, అశోక్ లేలాండ్ 0.50% నష్టపోయాయి.
- ఈయూతో స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందంతో రెడీమేడ్ గార్మెంట్స్, కాటన్, హోమ్ టెక్స్‌టైల్స్ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గి ఎగుమతులు మరింత పెరగొచ్చనే ఆశావహ అంచనాలతో దేశీయ టెక్స్‌టైల్స్ కంపెనీ షేర్లకు డిమాండ్ నెలకొంది. ఇండో కౌంట్ ఇండస్ట్రీస్, కేఆర్‌పీ మిల్స్ 6% ర్యాలీ చేశాయి. వెల్‌స్పన్ లివింగ్ 4.22%, అలోక్ ఇండస్ట్రీస్ 2.50%, ట్రిడెంట్ 2%, అరవింద్ అరశాతం లాభపడ్డాయి. భారత టెక్స్‌టైల్, రెడీమేడ్ వస్త్రాల ఎగుమతులకు అమెరికా తర్వాత యూరోపియన్ యూనియన్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉంది.

ఐదురోజుల పని దినాలను అమలు చేయాలి

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న కాశీ విశ్వనాథ్

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథ్, అసోసియేషన్ అధ్యక్షుడు వి.విజయ శేఖర్ డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు బ్యాంకు ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. బ్యాంకింగ్ రంగానికి చెందిన తొమ్మిది ఉద్యోగ సంఘాల బ్యాంకు ఉద్యోగుల ఐక్యవేదిక, యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అమలు చేస్తున్న ఐదు రోజుల పని దినాలను మన దేశంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2023లో ఎంఓయూ కుదిరినా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉచిత ఇసుక బూటకం

- ప్రభుత్వ ధర కంటే ఐదు రెట్లకుపైగా వసూలు
- యథేచ్ఛగా దోచుకుంటున్న టీడీపీ నేతలు
- విరువూరు, సూరాయపాళెం రీచ్‌లో అక్రమ దందా
- ఒక్కో రీచ్ నుంచి కూటమి ఎమ్మెల్యేలకు నెలకు రూ.3 కోట్లు
- రూ.వంద కోట్ల దోపిడీకి సోమిరెడ్డి స్కెచ్
- ఆధారాలతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉచిత ఇసుక పెద్ద బూటకమని, ఆ పేరుతో కూటమి నేతలు సహజ వనరులను దోచుకొని జేబులు నింపుకొంటున్నారని మాజీ మంత్రి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఐదు రెట్లకుపైగా వసూలు చేస్తూ ఒక్కో రీచ్ నుంచి కూటమి ఎమ్మెల్యేలు నెలకు రూ.మూడు కోట్లకుపైగా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. విరువూరు రీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి ఇసుకను తవ్వి తరలిస్తున్న ఫొటో ఆధారాలను ప్రదర్శించారు. సీఎం చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న కూటమి నేతలకు బేడీలేసి నడిరోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఇసుకను అక్రమార్కులు దొరికితే అరెస్ట్ చేసి శిక్షించాల్సిన పోలీసులు మంత్రి పర్మిషన్ అడగడమేమిటని మండిపడ్డారు. కూటమి నేతల ఇసుక దందాను బయటపెట్టేందుకు వెళ్తుంటే పోలీసులు

అర్ధరాత్రి ఇసుక తవ్వకాలు

అడ్డుకోవడాన్ని చూస్తుంటే వారి దందాకు కలెక్టర్, ఎస్పీ లైసెన్స్ ఇచ్చినట్లుగా ఉందని దుయ్యబట్టారు. కూటమి నేతలు పెన్నా నదీ గర్భంలోకి నేరుగా రోడ్లు వేసి యంత్రాలతో తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిబంధనల ప్రకారం ..ఇసుక టెండర్లను నిర్వహించి ఏడాదికి రూ.700 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.3,500 కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి తీసుకొచ్చామని గుర్తుచేశారు. ఒక్క సూరాయపాళెం రీచ్ ద్వారానే రూ.100 కోట్ల దోపిడీకి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్కెచ్ వేశారని కాకాణి విమర్శించారు. ఏకంగా సాయి శ్రీనివాస్ అనే వ్యక్తికి చెందిన బ్యాంక్ అకౌంట్‌కి నగదు వెళ్లేలా క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి నేరుగా కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఇసుక అక్రమ తవ్వకాలతో ఏర్పడిన గోతుల్లో పడి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని కాకాణి విమర్శించారు.

అక్రమార్కుల అరెస్టుకు మంత్రి నారాయణ అనుమతి కావాలా?

సూరాయపాళెం రీచ్‌ను కేస్ స్టడీగా తీసుకొని టీడీపీ నేతల ఇసుక దోపిడీపై కూలంకషంగా స్టడీ చేశామని కాకాణి చెప్పారు. రీచ్‌పై నెలకు ఏకంగా రూ.మూడు కోట్లను దోచేస్తున్నారన్నారు. రూ.1,400 వసూలు చేయాల్సిన టిప్పర్‌కు రూ.8 వేలు.. 12 టైర్ల లారీకి రూ.1,600 వసూలు చేయాల్సి ఉంటే రూ.12 వేలు.. 14 టైర్ల లారీకి రూ.2,024 వసూలు చేయాల్సి ఉంటే, రూ.15 వేల మేర వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇసుక దోపిడీని ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసులకే కమీషన్లు ఇస్తున్నామని అక్రమార్కులు బాహాటంగానే చెప్పుకొంటున్నారన్నారు. ఇసుక దోపిడీని పోలీసులు తన దృష్టికి తీసుకొచ్చారని మంత్రి నారాయణ కూడా చెప్తూ.. నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించకుండా.. రాత్రి వేళ టిప్పర్లలో కాకుండా ట్రాక్టర్లలో తరలించుకోమని ఉచిత సలహాలిస్తున్నారంటూ మంత్రి మాటల ఆడియోను వినిపించారు. ఇసుక దొంగలు దొరికితే వారిని అరెస్ట్ చేయకుండా పోలీసులు మంత్రి నారాయణను అనుమతి అడగడాన్ని చూస్తుంటే వారు ఎవరి కోసం పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని కాకాణి విమర్శించారు.

సచివాలయాలు దరిద్రాలయాలు

- అందులో ఉద్యోగులెవరికీ పనుల్లేవు.. అసలు ఈ వ్యవస్థే దండగ
- టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచిత వ్యాఖ్యలు
- భగ్గుమన్న జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ, ఎంపీపీలు

ఎమ్మెల్యే రవికుమార్‌ను చుట్టుముట్టిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు

అరసవల్లి: శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ఎందుకూ పనికిరానిదని, సచివాలయాలు దరిద్రాలయాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలోనే ఆయన ఇలా మాట్లాడటంతో జెడ్పీటీసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ హయాంలో అందిన సేవలను, పించన్ల వివరాలను ప్రస్తావిస్తుండగా రవికుమార్ ఆగ్రహంతో ఊగిపోయారు. నాడు పింఛన్‌దారుల వివరాలు సచివాలయాల్లో ప్రదర్శించేవారని, ఇప్పుడెందుకు ప్రదర్శించడం లేదని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ప్రశ్నించడంతో రవికుమార్ 'సచివాలయాల్లో ఉద్యోగులెవ్వరికీ పనులు లేవని, అసలు సచివాలయ వ్యవస్థే దండగ' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఒక్కసారిగా జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఎమ్మెల్యే రవికుమార్‌పై ధ్వజమెత్తారు. ఆయన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయ స్పందిస్తూ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. వంగర ఎంపీపీ ముఖర్జీ, కంచిలి ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. 'అధికారంలో మీరే ఉన్నారు కదా.. దమ్ముంటే సచివాలయాలను, సచివాలయ వ్యవస్థను రద్దు చేయండి చూద్దాం' అని సవాల్ విసిరారు. 'సచివాలయాలపై తన వ్యాఖ్యలు సొంత అభిప్రాయమని, ప్రభుత్వం ఇలాగే అనుకుంటే వాటిని రద్దు చేస్తుందేమో' అని ఎమ్మెల్యే రవి అన్నారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమ స్థాయీ సంఘ సమావేశాల తొలి సెషన్‌ను ముగిస్తున్నట్లుగా జెడ్పీ చైర్‌పర్సన్ ప్రకటించారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం

ముఖ్యమంత్రి చంద్రబాబు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పూర్వోదయ, సాస్కీ పథకాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగాన్ని సమన్వయం చేసుకుంటూ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 10 జిల్లాలను ఉద్యాన రంగానికి కేంద్ర బిందువుగా చేపట్టే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం క్యాంప్ కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు.

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారు

పవిత్రమైన తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారని సీఎం చంద్రబాబు మరోసారి ఆరోపించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో పార్టీ పార్లమెంటరీ కమిటీల నాయకులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే రద్దు చేశామని చెప్పారు. లోపభూయిష్టమైన చట్టాన్ని గత ప్రభుత్వంలో తెచ్చారని ఆరోపించారు.

రాజధాని ముసుగులో అంతులేని దోపిడీ

- దేశంలో ఎక్కడా లేని విధంగా నిర్మాణ వ్యయం
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ధ్వజం
- అమరావతి పేరుతో సాగుతున్న దోపిడీని ప్రశ్నిస్తే తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- రాష్ట్ర సమగ్రాభివృద్ధి తమ పార్టీ లక్ష్యమని వెల్లడి

సాక్షి, అమరావతి/ఇబ్రహీంపట్నం: రాజధాని అమరావతి నిర్మాణం ముసుగులో సీఎం చంద్రబాబు అంతులేని దోపిడీకి పాల్పడుతున్నారని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'మొదటి దశలో భూములిచ్చిన రైతులకు న్యాయం చేయని చంద్రబాబు ప్రభుత్వం... ఎప్పుడో కట్టిన రెండు బిల్డింగులను చూపించి రాజధాని నిర్మాణం వేగంగా జరుగుతోందంటూ ఎల్లో మీడియా ద్వారా కట్టుకథలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా పాత పనులకు నిర్మాణ వ్యయం అంచనాలు భారీగా పెంచేసి మళ్లీ టెండర్లు పిలిచి దోపిడీ చేస్తున్నారు. మొదటి విడతలో భూములిచ్చిన రైతులందరికీ ఇంతవరకు ప్లాట్లు ఇచ్చిన పాపాన పోలేదు. అయినా మళ్లీ రెండో దశ భూసమీకరణ పేరుతో మరింత భూదోపిడీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అమరావతి రాజధాని నిర్మాణం పేరుతో నిత్యం కంపచెట్ల తొలగింపు, నీళ్ల తోడే పనులు మాత్రమే జరుగుతున్నాయి. ఆ పనులకు దండిగా బిల్లులు చెల్లిస్తున్నారు. అంతకు మించి జరుగుతున్న ప్రచారం అంతా అబద్ధం. భవిష్యత్తులోనూ అమరావతి అభివృద్ధి జరగదని తెలుసు కాబట్టే సాఫ్ట్‌వేర్ కంపెనీలకు అమరావతి కాకుండా, విశాఖ పేరు చెబుతున్నారు. విశాఖలో ఎంతో ఖరీదైన భూమిని కేవలం 99 పైసలకు ఇచ్చినట్లు అమరావతిలో ఎందుకు ఇవ్వడం లేదు?' అని కేతిరెడ్డి ప్రశ్నించారు.

అడ్డగోలు దోపిడీని ప్రశ్నిస్తే మాపై విష ప్రచారం

'అమరావతి పేరుతో అడ్డగోలుగా సాగుతున్న దోపిడీని, రైతులకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తే వైఎస్సార్‌సీపీ రాజధాని అమరావతికి వ్యతిరేకమని విష ప్రచారం చేస్తున్నారు. మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలని, తద్వారా రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే మా పార్టీ లక్ష్యం' అని కేతిరెడ్డి స్పష్టంచేశారు. 'చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి 20 నెలల్లో ఏ ఒక్క సంక్షేమ పథకం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయకుండానే ఏకంగా రూ.3 లక్షల కోట్లకు పైగా అప్పు చేశారు. ఎన్నికల్లో ఆర్భాటంగా ప్రచారం చేసిన సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ పథకాలను కూడా గాలికొదిలేశారు. మరి అప్పు తెచ్చిన డబ్బులన్నీ ఎక్కడికి పోయాయి?' అని ఆయన నిలదీశారు.

అందుకే డైవర్షన్ పాలిటిక్స్ ...

'పాలనలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారు. ప్రజలకు ఒక్క మేలు చేయలేదు. అందుకే రకరకాల అబద్ధాలు, తప్పుడు కేసులతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. నిత్యం జగన్ నామస్మరణ చేయడం, ఆయనపై బురద చల్లడం, దుష్ప్రచారం చేయడం చంద్రబాబుకు ఒక తంతుగా మారింది. చివరకు రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పవిత్రమైన తిరుమల లడ్డూను కూడా వివాదంలోకి లాగారు. వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి పనులన్నింటినీ చంద్రబాబు నిర్లజ్జగా తన ఖాతాలో వేసుకుంటూ, క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు. ఎన్నికల ముందు భూముల రీసర్వేపై అడ్డగోలుగా విషప్రచారం చేశారు. వాస్తవానికి భూముల రీసర్వేకు డిజైన్ చేసిన అధికారి సాయిప్రసాద్ ఇప్పుడు మీ దగ్గరే ఉన్నారు. రేపో మాపో ఆయన చీఫ్ సెక్రటరీ అవుతారని చెప్పుకొంటున్నారు కదా.. రీసర్వే అనేది అద్భుతమైన పథకం అని సాయిప్రసాద్ కితాబిచ్చారు. ఇప్పుడు అయనను అడిగితే రీసర్వే గురించి మీకు చెబుతారు చంద్రబాబు' అని కేతిరెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా చంద్రబాబు చెబుతున్నట్లు 2027నాటికి రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరిస్తే తాను ఎన్నికల్లో పోటీ చేయనని ఆయన సవాల్ విసిరారు.

చంద్రబాబు జిల్లాలోనే కల్తీ మద్యం తయారీ

'సీఎం చంద్రబాబు సొంత జిల్లాలోనే కల్తీ మద్యం తయారవుతోంది. ధర్మవరం నియోజకవర్గంలో 70శాతం కల్తీ మద్యమే దొరుకుతోంది. వేలంపాటలో బెల్ట్ షాపులు పాడుకున్నవారు గిట్టుబాటుకాక కల్తీ మద్యం అమ్ముతున్నారు.' అని కేతిరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రామును ఆయన మంగళవారం పరామర్శించారు. అనంతరం కేతిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు వైఎస్సార్ సీపీ నేతలు భయపడబోరని స్పష్టంచేశారు. కాగా, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రుహుల్లా, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కూడా జోగి రమేష్‌ను పరామర్శించారు.

తిరుమల నెయ్యి కేసు డైరీని మా ముందుంచండి

సీబీఐకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: తిరుమల నెయ్యి వ్యవహారంలో దర్యాప్తు పూర్తి చేసి కింది కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశామని, దానిని సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని, దానిని పరిశీలించి చిన్నప్పన్న బెయిల్‌పై నిర్ణయం తీసుకోవాలని సీబీఐ న్యాయవాది పీఎస్‌పీ సురేష్‌కుమార్ మంగళవారం హైకోర్టుకు నివేదించారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ఈ కేసు డైరీని తమ ముందుంచాలని సీబీఐని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీ చేశారు.

స్కిల్ కేసులో తీర్పు వాయిదా

విజయవాడ లీగల్: స్కిల్ కేసులో ఫైనల్ రిపోర్ట్, సర్టిఫైడ్ కాపీలను కోరుతూ వేము కొండలరావు దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో తీర్పు వచ్చే నెల 3కి వాయిదా పడింది. స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట సీఎం చంద్రబాబు ప్రజాధనాన్ని లూటీ చేసి, తనపై నమోదైన కేసును కొట్టివేయించుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో ఎఫ్ఐఆర్‌తోపాటు రిమాండ్ రిపోర్ట్, ఫైనల్ రిపోర్ట్, సర్టిఫైడ్ కాపీలు కావాలని రైల్వే మాజీ ఉద్యోగి వేము కొండలరావు పిటిషన్ దాఖలు చేశారు.

క్లుప్తంగా...

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

పల్నాడు జిల్లాలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఘటన

బాలకోటిరెడ్డి(ఫైల్)

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని రావిపాడు రోడ్డులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థి మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని మృతుడి బంధువులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించి మృతుడి కుటుంబ సభ్యులు అందించిన వివరాలు.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన కూరాకుల బాలకోటిరెడ్డి (18) ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం ఉదయం హాస్టల్ గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. తోటి విద్యార్థులు గమనించి వార్డెన్‌కు సమాచారం ఇవ్వడంతో బాలకోటిరెడ్డిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉసురు తీసిన ఆన్‌లైన్ ట్రేడింగ్

పీజీ హాస్టల్‌లో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రదీప్ రామ్ (ఫైల్)

నారాయణవనం: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బు పోగొట్టుకున్న ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తిరుపతి జిల్లా నారాయణవనంలో ఓ ప్రైవేటు కాలేజీ పీజీ హాస్టల్ గదిలో ఇంజినీరింగ్ విద్యార్థి ప్రదీప్ రామ్(19) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు ప్రదీప్‌రామ్ నారాయణవనం మండలంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ తొలి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు సమీపంలోని పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. మంగళవారం 3.30 గంటలకు తన గదికి చేరుకున్నాడు. కొద్ది సేపటికే తన గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. 4.30 గంటలకు గుర్తించిన హాస్టల్ విద్యార్థులు నిర్వాహకులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పుత్తూరు ఆస్పత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు.

మంత్రి పీఏ మానసికంగా వేధిస్తున్నారు

కలెక్టర్ ఎదుట ధర్మవరం ఐసీడీఎస్ ఉద్యోగి కన్నీళ్లు

కలెక్టర్‌కు విన్నవిస్తున్న నరేంద్రరెడ్డి

ప్రశాంతి నిలయం: 'మంత్రి సత్యకుమార్ పీఏ హరీష్ నన్ను మానసికంగా వేధిస్తున్నారు. వారి అక్రమాలకు అడ్డుగా ఉన్న నన్ను ధర్మవరం నుంచి పంపించేసేందుకు కార్యాలయానికి రౌడీలను పంపి బెదిరిస్తున్నారు. చివరకు నేను అయ్యప్ప మాలలో ఉన్నా కూడా.. 'లం.. కొడకా' అంటూ బూతులు తిడుతూ అందరి ముందు అవమానించారు. ఆయనపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. మీరైనా నాపై దయచూపండి' అంటూ ధర్మవరం ఐసీడీఎస్ కార్యాలయంలో కో–ఆర్డినేటర్ టి.నరేంద్రరెడ్డి మంగళవారం కలెక్టర్ శ్యాంప్రసాద్ ఎదుట కన్నీటిపర్యంతమయ్యాడు. దీనిపై పలుమార్లు కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'ల్లో ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. రౌడీషీటర్‌లా ప్రవర్తిస్తున్న హరీష్‌పై, ఆయన అనుచరులు, అసత్యాలు రాసిన విలేకరిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌ను నరేంద్రరెడ్డి వేడుకున్నారు.

ఇచ్చిన సొమ్ము అడిగినందుకు చంపేశారు

కాలిబూడిదైన వృద్ధుడు రామన్నదొర

సాక్షి, పాడేరు: అప్పుగా ఇచ్చిన సొమ్మును తిరిగి ఇవ్వమన్నందుకు ఓ వృద్ధుడిని అతని ఇంటికే నిప్పు పెట్టి సజీవ దహనం చేసిన ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. అల్లూరి జిల్లా పాడేరు మండలంలో ఈనెల 23వ తేదీన ఈ దారుణ హత్య జరిగింది. ఐనాడ పంచాయతీ చింతలపాలెంకి చెందిన కొర్రా రామన్నదొర(65), ఇదే గ్రామానికి చెందిన సోమన్న, దేవి దంపతులకు కొన్ని నెలల కిందట రూ.6,500 అప్పు ఇచ్చాడు. ఇటీవల రామన్నదొర కుమారుడు చిన్నబాబు భార్య మృతి చెందింది. పెద్దకర్మకు డబ్బు అవసరం కావడంతో సోమన్న, దేవిని అప్పు చెల్లించమని అడిగాడు. వారు అప్పు తీర్చకపోగా ఈనెల 23న రామన్నదొర, కుమారుడు చిన్నబాబుపై దాడి చేసి, ఈ సమయంలో ఎవరూ లేకపోవడంతో గాయపడిన రామన్నదొరను గుడిసెలోకి చేర్చి నిప్పంటించారు. గుడిసె పూర్తిగా కాలిపోగా రామన్నదొర సజీవ దహనమయ్యాడు. హత్యకు పాల్పడిన సోమన్న, దేవి దంపతులు పరారయ్యారు. ఘటనపై గ్రామస్తులు పోలీసులకు ఆలస్యంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

'కారుణ్య' అభ్యర్థనను ఏకపక్షంగా తిరస్కరించరాదు

కారుణ్య నియామకం హక్కు కాకున్నా.. దరఖాస్తును న్యాయబద్ధంగా పరిశీలించాలి

న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు

సాక్షి, అమరావతి: కారుణ్య నియామకం అనేది హక్కు కానప్పటికీ, దరఖాస్తుదారుడి అభ్యర్థనను ఏకపక్షంగా తిరస్కరించడానికి వీల్లేదని, న్యాయబద్ధంగా పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. కారుణ్య నియామకంపై అధికారులు నిర్ణయాన్ని తీసుకునేటప్పుడు యాంత్రికంగా కాకుండా, ఆ కుటుంబం ఎదుర్కొంటున్న వాస్తవ ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలని తేల్చి చెప్పింది. దరఖాస్తు చేయడంలో జాప్యం ఉందన్న కారణంతో కారుణ్య నియామకాన్ని తిరస్కరించడానికి వీల్లేదంది. ఐదేళ్ల జాప్యం అన్నది అసాధారణ జాప్యం కానే కాదంది. తనకు, తన తండ్రికి రైల్వే శాఖలో కారుణ్య నియామకానికి సంబంధించిన నిబంధనల గురించి తెలియదని పిటిషనర్ చెప్పిన దాంతో హైకోర్టు ఏకీభవించింది. కారుణ్య నియామకం కోసం పిటిషనర్ నారాయణమ్మ పెట్టుకున్న దరఖాస్తును మూడు నెలల్లో పరిగణనలోకి తీసుకోవాలని రైల్వే అధికారులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ గేదెల తుహిన్ కుమార్ ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

అసలు కేసు ఏంటంటే..!

విజయనగరం జిల్లా, కొత్తవలస గ్రామానికి చెందిన బి.రాములు రైల్వే శాఖలో గ్యాంగ్‌మెన్‌గా పనిచేసేవారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనారోగ్యంతో గ్యాంగ్‌మెన్‌గా ఉద్యోగం చేసే పరిస్థితిలో లేకపోవడంతో 1999లో రాములుకు రైల్వే అధికారులు ప్రత్యామ్నాయ ఉద్యోగాన్ని (డీకేటగిరైజేషన్) ఇవ్వదలిచారు. అయితే రాములు 2000లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. రూ.1895లను పెన్షన్‌గా, రూ.1.50 లక్షలను పీఎఫ్, గ్రాట్యుటీ కింద రైల్వే అధికారులు చెల్లించారు. ఇదిలా ఉండగా 2006లో రాములు కుమార్తె నారాయణమ్మ కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకున్నారు. రాములు కుటుంబ ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన డివిజనల్ రైల్వే అధికారులు కారుణ్య నియామకం కోసం నారాయణమ్మ దరఖాస్తును ఉన్నతాధికారులకు సిఫారసు చేయగా, వారు దానిని తిరస్కరించారు. నిబంధనల ప్రకారం ఐదేళ్ల లోపు దరఖాస్తు చేయలేదంటూ నారాయణమ్మ దరఖాస్తును వారు తోసిపుచ్చారు. దీనిపై ఆమె కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. క్యాట్ ఆమె పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో హైకోర్టులో ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ధర్మాసనం అధికారులు నారాయణమ్మ దరఖాస్తును ఏకపక్షంగా తిరస్కరించడాన్ని తప్పుబట్టింది. ఉద్యోగి మరణం .. ఆ కుటుంబానికి ఆర్థిక మరణం కాకూడదని వ్యాఖ్యానించింది. క్యాట్ తీర్పును రద్దు చేసింది. నారాయణమ్మ దరఖాస్తును మూడు నెలల్లో పరిగణనలోకి తీసుకోవాలని రైల్వే అధికారులను ధర్మాసనం ఆదేశించింది.

విశాఖలో భూ దోపిడీపై పెద్ద ఎత్తున పోరాడతాం

- నచ్చిన వారికి అడ్డగోలుగా భూములు కట్టబెడుతున్న సీఎం చంద్రబాబు
- లోకేశ్ తోడల్లుడు భరత్‌కు చెందిన గీతం వర్సిటీకి రూ.వేల కోట్ల విలువైన భూముల ధారాదత్తం
- రేపు ఆక్రమిత భూమిని పరిశీలిస్తాం
- 30న కౌన్సిల్‌లో తీర్మానానికి వ్యతిరేకంగా గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేస్తాం
- విశాఖలో కబ్జాలను బీజేపీ, జనసేన సమర్థిస్తున్నాయా? వ్యతిరేకిస్తున్నాయా?
- శాసనమండలిలో విపక్ష నేత బొత్స, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ కన్నబాబు

మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ. పక్కన కన్నబాబు, కేకే రాజు, అమర్‌నాథ్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం: గీతం యూనివర్సిటీకి ప్రభుత్వ భూములను అడ్డగోలుగా కట్టబెడుతూ చంద్రబాబు సర్కారు సాగిస్తున్న భూదోపిడీపై వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు చెప్పారు. లోకేశ్ తోడల్లుడు, టీడీపీ ఎంపీ భరత్‌కు చెందిన గీతం యూనివర్సిటీ కబ్జా చేసిన రూ.వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని అడ్డగోలుగా క్రమబద్ధీకరించేందుకు వీలుగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసేందుకు అజెండాలో పెట్టారని తెలిపారు. బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసి కౌన్సిల్‌లో గీతం వర్సిటీకి భూముల క్రమబద్ధీకరణపై తీర్మానం పెట్టడానికి వీల్లేదంటూ వినతిపత్రం అందజేస్తామన్నారు. గీతం యూనివర్సిటీ కబ్జా చేసిన 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని గురువారం పరిశీలిస్తామన్నారు. ఈ నెల 30న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తమ పార్టీ కార్పొరేటర్లతో తీర్మానానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే... కౌన్సిల్ సమావేశం జరిగినంతసేపూ జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద తమ పార్టీ ముఖ్య నాయకులమంతా శాంతియుత నిరసన దీక్ష చేపడతామన్నారు. విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్యక్షతన జీవీఎంసీ కార్పొరేటర్లు, సమన్వయకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

గతంలో 72 ఎకరాలు... ఇప్పుడు 54.79 ఎకరాలు

ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. చంద్రబాబు గతంలో ఇదే గీతం యూనివర్సిటీకి 72 ఎకరాల ప్రభుత్వ భూమి దోచిపెట్టారని చెప్పారు. ఇప్పుడు అదే రీతిలో 54.79 ఎకరాలను ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. పేదవాడు ఒక చిన్న ఇల్లు కట్టుకుంటే ఈ ప్రభుత్వం కూలదోస్తోందని, రోడ్డు పక్కన చిన్న బడ్డీ పెట్టుకుంటే నేలమట్టం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. గీతం యూనివర్సిటీకి ఎదురుగా ఉన్న రుషికొండపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల అవసరాల కోసం ప్రభుత్వ భవనాలను నిర్మిస్తే నానా రాద్ధాంతం చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఇప్పుడు గీతం భూదోపిడీ కనపడలేదా..? అని ప్రశ్నించారు. గీతం భూదోపిడీని జనసేన, బీజేపీలు సమర్థిస్తున్నాయా..? వ్యతిరేకిస్తున్నాయా..? అనే విషయాన్ని స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. ఐదుసార్లు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశానికి వెళ్లిన తననే ఈ నెల 30న సమావేశానికి రావొద్దని చెప్పడం సరికాదన్నారు.

భూములు దోచుకోవడానికి మీకు అధికారమిచ్చారా: కన్నబాబు

కురసాల కన్నబాబు మాట్లాడుతూ... చంద్రబాబు అతి పెద్ద భూ స్కామ్‌కు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పెట్టుబడులు తీసుకొస్తున్నామంటూ విశాఖలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను చంద్రబాబు తన బినామీ సంస్థలైన ఉర్సా, లులు, సత్వా వంటి సంస్థలకు 99 పైసలకే ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను దోచుకోవడానికే మీకు అధికారం ఇచ్చారా.. అని చంద్రబాబును ప్రశ్నించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ గీతం యూనివర్సిటీకి భూ కేటాయింపులపై సీబీఐతో విచారణ జరిపించాలని, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ కింద ఎంపీ భరత్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు ప్రభుత్వం వేధిస్తోంది

- ఎయిడెడ్ పాఠశాలల్లో నియామకాలను చేపట్టనీయడం లేదు
- సుప్రీం, హైకోర్టుల ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదు
- ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలను టీడీపీ ప్రభుత్వం నాశనం చేస్తోంది
- ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాల సమాఖ్య ఆగ్రహం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలను టీడీపీ ప్రభుత్వం వేధిస్తోందని, చట్టపరంగా తమ హక్కులను కాలరాస్తోందని ఏపీ ప్రైవేట్ రికగ్నైజ్డ్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన జీవోలను సైతం అమలు చేయకుండా ఇబ్బందులు పెడుతోందని, అడిగితే విద్యాశాఖ అధికారులు చులకనగా మాట్లాడుతున్నారని వాపోయారు. చివరికి ఉద్యోగాల నియామకంపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సైతం అమలు చేయడం లేదని మండిపడ్డారు. తమ హక్కులను కాలరాసి, విద్యాశాఖ ద్వారా పోస్టుల భర్తీ చేసేందుకు పరీక్ష నిర్వహిస్తున్నారని, దీనితో తమకెలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు మంగళవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.రవిచంద్ర శేఖర్, ఉపాధ్యక్షుడు ఎం.రవిచంద్రబాబు మాట్లాడుతూ.. ఎయిడెడ్ స్కూళ్లను తమ సొంత ఆస్తులు వెచ్చించి నడుపుతున్నామని, వీటిని ఆదాయం కోసం కాకుండా తమ తాతతండ్రుల ఆశయం, పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పుడు చట్టబద్ధంగా తమకు రావాల్సిన హక్కులను టీడీపీ ప్రభుత్వం కాలరాస్తోందని దుయ్యబట్టారు. సుప్రీం, హైకోర్టుల ఆదేశాల మేరకు ప్రైవేట్ గుర్తింపు పొందిన ఎయిడెడ్ పాఠశాలలలో ఉపాధ్యాయ నియామకాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వచ్చిన జీవో నం.1 ప్రకారం జరగాలని, అయితే, ఎన్నికల అనంతరం విధానపరమైన కారణాలు చూపిస్తూ చంద్రబాబు ప్రభుత్వం దాదాపు 5 నెలల పాటు నియామక ప్రక్రియను నిలిపివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యాలకు ముందస్తు సమాచారం లేకుండానే గతేడాది ఫిబ్రవరిలో ఎయిడెడ్ స్కూళ్లలో కూడా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ద్వారా నియామకాలు చేపడతామని ప్రకటించారన్నారు. ఇలా చేయడం చట్టవిరుద్ధమని, ఈ విద్యాశాఖ చేపట్టే నియామకాలతో తమకు సంబంధం లేదంటూ ప్రభుత్వం తీరుపై తాము మరోసారి హైకోర్టుకు వెళ్లగా సీబీటీని రద్దు చేసి యాజమాన్యాలే పోస్టుల భర్తీ చేసుకునేలా తీర్పు వచ్చిందన్నారు. కానీ ఇప్పటి వరకు టీడీపీ ప్రభుత్వం హైకోర్టును తీర్పును అమలు చేయకుండా ఇబ్బంది పెడుతోందన్నారు. తమ యాజమాన్య పాఠశాలల్లో నియామకాలు చేపట్టే అధికారం ప్రభుత్వానికి గాని, విద్యాశాఖకు గాని లేదని స్పష్టం చేశారు. పాలకుల తీరు ప్రభుత్వ స్కూళ్లను, ఎయిడెడ్ స్కూళ్లను నాశనం చేసి ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు మేలు చేసేలా ఉందని, ఇదే విధానం కొనసాగితే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

నలుగురు బెట్టింగ్ ప్రిడిక్షన్ అనలిస్టుల అరెస్ట్

వీరిలో ఇద్దరిది తిరుపతి, ఇద్దరిది గుంటూరు

క్రికెట్ బెట్టింగ్ ముఠాగుట్టు రట్టుచేసిన విశాఖ పోలీసులు

సుమంత్

గణేష్

మురళి

బద్రేశ్వరరెడ్డి

విశాఖ సిటీ: తెలుగు రాష్ట్రాల్లో టెలిగ్రామ్ చానళ్ల వేదికగా సాగుతున్న భారీ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టును విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టుచేశారు. క్రికెట్ ప్రిడిక్షన్స్ పేరుతో టెలిగ్రామ్ చానళ్ల ద్వారా క్రికెట్ బెట్టింగ్ యాప్స్, వెబ్‌సైట్స్‌ను ప్రమోట్‌చేస్తున్న నలుగురు.. తిరుపతికి చెందిన దేశినేని సుమంత్ అలియాస్ నాని, లంకిపల్లి గణేష్, గుంటూరుకు చెందిన కొప్పోలు మురళి, మేడం బద్రేశ్వర్‌రెడ్డిలను మంగళవారం విశాఖపట్నంలో అరెస్టు చేశారు. బెట్టింగ్‌లలో ఒక్కొక్కరు రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు నష్టపోయిన వీరు ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి ఏకంగా ప్రిడిక్షన్ అనలిస్టులుగా అవతారమెత్తారు. సోషల్ మీడియాలో నెట్‌వర్క్ నిర్మించుకున్నారు. ప్రధాన నిందితుడు దేశినేని సుమంత్ నిర్వహించే నాని క్రికెట్ ప్రిడిక్షన్ చానల్‌కు 1.49 లక్షలమంది ఫాలోవర్లున్నారు. అతడు కేవలం ప్రమోషన్ల ద్వారానే నెలకు రూ.20 లక్షల వరకు సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మరో నిందితుడు లంకిపల్లి గణేష్‌కి చెందిన వినయ్‌రెడ్డి క్రికెట్ కింగ్ చానల్‌కు 60 వేలమంది సబ్‌స్క్రైబర్లున్నారు. వీరు దుబాయ్ కేంద్రంగా పనిచేసే బుకీలతో చేతులు కలిపి స్కైఎక్స్ఛేంజ్, మురుగన్ బుక్, ఫెయిర్‌ప్లే, విన్‌బజ్, వాజిర్‌విన్ వంటి బెట్టింగ్ సైట్‌లను ప్రమోట్ చేస్తూ నెలకు రూ.లక్షల్లో కమీషన్లు గడిస్తున్నారు. వీరి ప్రచారాన్ని నమ్మి వేలాదిమంది యువకులు తమ కష్టార్జితాన్ని బెట్టింగ్ యాప్స్‌లో పోగొట్టుకుంటున్నారు. విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు వీరిపై నిఘాపెట్టి సాంకేతికత సహాయంతో నలుగురిని అరెస్ట్ చేశారు. వారినుంచి మొబైల్ ఫోన్లు, మైక్‌లు, ల్యాప్‌టాప్, ఫార్చ్యూనర్ కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారు. బెట్టింగ్‌లకు సంబంధించి సంతోష్‌రెడ్డి, కీర్తిలను ఇంతకుముందే అరెస్టు చేయడం తెలిసిందే.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

సహకార సంఘ ఉద్యోగుల ఆందోళన, వంట, వార్పు

వంటా–వార్పులో సహకార సంఘాల నాయకులు, ఉద్యోగులు

కొరిటెపాడు(గుంటూరు): దీర్ఘకాలంగా పేరుకుపోయిన వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుంటూరులోని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన, వంట–వార్పు కార్యక్రమం చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ వెంటనే జీవో నంబర్ 36ను అమలు చేసి వేతన సవరణ చేయాలన్నారు. అప్పటి వరకు మధ్యంతర భృతిని ఇవ్వాలని కోరారు. అలాగే ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ సీలింగ్‌ను ఎత్తి వేయాలన్నారు. ఉద్యోగులకు రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా, రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్‌ను చేయించాలని విజ్ఞప్తి చేశారు. జీతభత్యాల్లో కోత సరికాదన్నారు. ఉద్యోగులందరికీ వేతనాలు పెంచాలని, ప్రతి ఉద్యోగికి కనీస వేతనం తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. 30 వరకు నిరసన, వంట వార్పు కార్యక్రమాలు చేపడతామన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే ఫిబ్రవరి 13న రాష్ట్రంలోని పీఏసీఎస్ ఉద్యోగులందరితో సహకార శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తామని, ఫిబ్రవరి 16 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు చెప్పారు.

బంగ్లాదేశ్ చెర నుంచి మత్స్యకారుల విడుదల

- అక్టోబర్ 14వ తేదీ అర్ధరాత్రి దారి తప్పి బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డ్ పరిధిలోకి ప్రవేశం
- మొత్తం 23 మందిని అరెస్ట్ చేసిన బంగ్లాదేశ్
- భారత ప్రభుత్వం చర్చలు జరపడంతో ఎట్టకేలకు విడుదల
- వీరిలో 9 మంది విజయనగరానికి చెందిన మత్స్యకారులు
- మరో నాలుగైదు రోజుల్లో ఇక్కడకు వచ్చే అవకాశం

విడుదలైన మత్స్యకారులతో వైఎస్సార్‌సీపీ నేత వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట: బంగ్లాదేశ్ చెరలో ఉన్న 23 మంది భారతీయ మత్స్యకారులు మంగళవారం విడుదలయ్యారు. అక్టోబర్ 13న బయలు దేరిన మత్స్యకారులు 14న అర్ధరాత్రి దారి తప్పి బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డ్ పరిధిలోకి వెళ్లిపోయారు. అప్పటి నుంచి బంగ్లాదేశ్ దేశ్ చెరలో ఉన్నారు. దీంతో భారత ప్రభుత్వం చర్చలు జరపడంతో మత్స్యకారుల విడుదలకు బంగ్లా దేశ్ ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు మంగళవారం బాగాహాట్ జైలు నుంచి మత్స్యకారులను విడుదల చేశారు. భారత ప్రభుత్వం తరఫున డిప్యూటీ హై కమిషన్ చంద్ర జీత్ దగ్గర ఉండి మత్స్యకారుల విడుదలకు సంబంధించిన డాక్యుమెంటేషన్‌ను ఈస్ట్ కోస్ట్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్‌తో కలిసి పూర్తి చేశారు. సమావేశం అనంతరం భారతీయ మత్స్యకారులను బాగాహాట్ జైల్ నుంచి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య మోంగ్లా పోర్టుకు తరలించారు. మోంగ్లా పోర్టుకు చేరుకున్న తర్వాత మోంగ్లా పోలీసుల కస్టడీలో ఉన్న బోట్ల వద్దకు మత్స్యకారులను తీసుకొని వచ్చి ఇండియాకు పంపడానికి ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ పోలీసులు సీజ్ చేసిన బోట్లను మరమ్మతులు చేస్తున్నారు. బుధవారం నాటికి బోట్ల రిపేర్లు పూర్తి చేసి మత్స్యకారులను వారి సొంత ప్రాంతాలకు పంపించనున్నారు.

కృతజ్ఞతలు తెలిపిన మత్స్యకారులు

మత్స్యకారుల విడుదల కోసం ప్రయత్నం చేసిన భారతదేశంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులకు మత్స్యకారుల తరఫున వైఎస్సార్ సీపీ నేత వాసుపల్లి జానకీరామ్ కృతజ్ఞతలు తెలిపారు. మోంగ్లా పోర్టుకు చేరుకున్న తర్వాత 9 మంది ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. నాలుగు, ఐదు రోజుల్లో విశాఖపట్నం చేరుకుంటారని అంతవరకు కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని జానకీరామ్ తెలియజేశారు.

జడ్జి అనుమతి లేకుండా కోర్టులోకొచ్చి ఎలా అరెస్ట్ చేస్తారు?

- హైకోర్టులో కూడా ఇలాగే అరెస్ట్ చేస్తారా?
- పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని డీజీపీ, డీఐజీ తదితరులకు ఆదేశం
- కోర్టులోకి చొరబడిన పోలీసులకు వ్యక్తిగత నోటీసులు
- కర్నూలు జిల్లా పత్తికొండ న్యాయవాదుల సంఘం పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: ఒక కేసులో లొంగిపోవడానికి వచ్చిన నిందితుడిని జడ్జి అనుమతి లేకుండానే కోర్టు హాల్లోకి చొరబడి ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు పోలీసు అధికారులను ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని డీజీపీ, కర్నూలు రేంజ్ డీఐజీ, డీఎస్పీ తదితరులను ఆదేశించింది. చిప్పగిరి ఎస్ఐ సతీష్‌కుమార్, పత్తికొండ ఎస్ఐ ఆర్.విజయ్‌కుమార్ నాయక్, చిప్పగిరి కానిస్టేబుళ్లు షబ్బీర్, రామోజీలకు వ్యక్తిగత నోటీసులు జారీచేసింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. లొంగిపోవడానికి వచ్చిన నిందితుడిని జడ్జి అనుమతి లేకుండానే కోర్టు హాల్లోకి చొరబడి మరీ బలవంతంగా అరెస్ట్ చేయడమే కాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించిన న్యాయవాదులను తోసేసి వెళ్లిపోయిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కర్నూలు జిల్లా పత్తికొండ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.భాస్కర్ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ లక్ష్మణరావు విచారణ జరిపారు.

పోలీసుల దౌర్జన్యంపై వీడియో ఆధారాలున్నాయి

పిటిషనర్ తరఫున న్యాయవాది కె.వి.రఘువీర్ వాదనలు వినిపించారు. 'చిప్పగిరి మండలం డేగులపాడుకి చెందిన శివయ్య గంజాయి సాగుచేస్తుండటంతో అతడిపై చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో అతడు లొంగిపోయేందుకు గతనెల 24న పత్తికొండ కోర్టుకు వచ్చారు. తన న్యాయవాది ద్వారా సరెండర్ పిటిషన్ దాఖలు చేయించారు. ఈ పిటిషన్‌పై జడ్జి నిర్ణయం కోసం శివయ్య కోర్టులో వేచిచూస్తుండగా పోలీసులు మఫ్టీలో కోర్టు హాల్లోకి దూసుకొచ్చి బలవంతంగా శివయ్యను లాక్కెళ్లి అరెస్ట్ చేశారు. దీన్ని అడ్డుకోబోయిన న్యాయవాదులను సైతం తోసేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా సర్క్యులేట్ అయింది. కోర్టు హాల్లోకి ప్రవేశించేందుకు ఆ కోర్టు న్యాయాధికారి అనుమతి తీసుకోలేదు. దౌర్జన్యపూరితంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పత్తికొండ న్యాయవాదుల సంఘం సమర్పించిన వినతిపై పోలీసులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు' అని రఘువీర్ నివేదించారు.

పోలీసులు ఏమైనా చేస్తారు

ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ.. పోలీసులు ఇదేరీతిలో హైకోర్టులోకి వచ్చి నిందితులను అరెస్ట్ చేయగలరా? రిజిస్ట్రీ అనుమతి తీసుకోకుండా అరెస్ట్ చేస్తారా? మరి కింది కోర్టులో కూడా జడ్జి అనుమతి లేకుండా నేరుగా కోర్టు హాల్లోకి వచ్చి మరీ ఎలా అరెస్ట్ చేస్తారు?.. అని ప్రశ్నించారు. బాధ్యులైన పోలీసులపై ఏం చర్యలు తీసుకున్నారు? వారిని బదిలీ చేశారా లేదా? అని అడిగారు. ఇలాంటివాటిని అనుమతిస్తే పోలీసులు ఏమైనా చేస్తారు.. అని ఘాటుగా వ్యాఖ్యానించారు. పోలీసుల తరఫున ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ) స్పందిస్తూ.. ఆ పోలీసులకు చార్జ్‌మెమోలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ ఘటనపై సంబంధిత కోర్టు మేజిస్ట్రేట్ జిల్లా ఎస్పీకి రాసిన లేఖ ఆధారంగా బాధ్యులైన పోలీసులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టామని తెలిపారు. బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేశారా? లేదా? అని ప్రశ్నించిన న్యాయమూర్తి.. సస్పెండ్ చేసి ఉండరులే అంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. కోర్టు హాల్లోకి చొరబడి మరీ అరెస్ట్ చేసిన పోలీసులకు వ్యక్తిగత నోటీసులు జారీచేశారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

కొబ్బరి రైతు ఖుషీ..

- మేడారం.. మహాశివరాత్రి ఉత్సవాలతో ఆశాజనకంగా పెరిగిన ధరలు
- వెయ్యి కాయ ధర రూ.20 వేలు
- రెండు రోజుల్లో రూ.4 వేల వరకు పెరుగుదల
- గండేరా వెయ్యి కాయ ధర రూ.31,500
- ఊపందుకున్న ఎగుమతులు

అంబాజీపేటలో నిల్వ ఉన్న నీటి కొబ్బరి కాయ రాశులు

కురిడీ కొబ్బరి కాయలు

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: నాలుగు నెలలుగా ధరలేక దిగాలుగా ఉన్న కొబ్బరి రైతుల్లో ఒక్కసారిగా జోష్ వచ్చింది. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా జరిగే సమ్మక్క, సారక్క (మేడారం) జాతర.. ఉత్తరాదిన మహాశివరాత్రి ప్రభావంతో కొబ్బరి ధరలకు రెక్కలొచ్చాయి. పచ్చి కొబ్బరి.. కురిడీ కొబ్బరి ధరలు పెరగడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొబ్బరి ఎగుమతులు ఊపందుకున్నాయి.

గత ఏడాది దీపావళి తర్వాత కొబ్బరి ధరలు తగ్గడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రైతులు నిరాశలో ఉన్నారు. అంతకు ముందు వెయ్యి కాయల ధర రూ.24 వేల నుంచి రూ.27 వేల వరకూ ఉంది. రాష్ట్ర కొబ్బరి మార్కెట్ చరిత్రలోనే ఇది రికార్డు స్థాయి ధర. అయితే దీపావళి నుంచి ధర తగ్గుతూ వచ్చింది. వారం రోజుల క్రితం అంబాజీపేట మార్కెట్‌లో పచ్చి కాయ ధర రూ.15 వేల నుంచి రూ.16 వేలు మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు సాగే మేడారం జాతర పుణ్యమా అని లక్షలాదిగా తరలివచ్చే ఈ ఉత్సవాలకు భక్తులు బెల్లంతో పాటు కొబ్బరికాయలను పెద్ద ఎత్తున మొక్కుబడిగా చెల్లించుకుంటారు. దీంతో జిల్లాలోని కొబ్బరికి డిమాండ్ వచ్చింది. కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల నుంచి మేడారానికి కొబ్బరి ఎగుమతులు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో వచ్చే నెల మహాశివరాత్రి పర్వదినం రానుండడంతో ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతులు సాగుతున్నాయి. దీంతో డిమాండ్ పెరిగి కొబ్బరి మార్కెట్‌లో వెయ్యి కొబ్బరికాయల ధర రూ.19 వేల నుంచి రూ. 20 వేలకు చేరింది. మూడు జిల్లాల నుంచి రోజుకు సుమారుగా 60 నుంచి 70 లారీల పచ్చికొబ్బరి (నీటి కాయ) ఎగుమతి అవుతోందని వ్యాపారులు చెప్తున్నారు. కొబ్బరి ధరలు, మళ్లీ పెరగడంతో రైతులకు ఊరట లభించింది. మాఘమాసం ప్రారంభం కానుండడంతో స్థానికంగా కూడా కొబ్బరి ధర మరింత పెరిగే అవకాశం ఉందనే అంచనాతో రైతులు ఆచితూచి అమ్మకాలు సాగిస్తున్నారు. అంబాజీపేట మార్కెట్ పచ్చి కొబ్బరితో పాటు కురిడీ కాయల ధరలు సైతం ఆశాజనకంగా పెరిగాయి. కురిడి కొబ్బరిలో పాతకాయ గండేరా రకం (పెద్ద కాయ) వెయ్యింటికి రూ.32,500, గటగట రకం (చిన్న కాయ) రూ.29 వేలు, కొత్తకాయ గండేరా రూ.29,500, గటగట రూ.27 వేలు పలుకుతోంది.

ధర పెరిగి ఊరటనిచ్చింది

వరుస శుభకార్యాలు, శివరాత్రి సందర్భంగా కొబ్బరి కాయ ధరలు పెరడం కొంత ఊరటనిచ్చింది. కొబ్బరి కాయకు ధర ఉన్నప్పుడు దిగుబడులు ఉండటం లేదు. ఈ సమయంలో ధరలు పెరగడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. రానున్న రోజుల్లో నీటి కొబ్బరి కాయ ధరలు పెరిగే అవకాశం ఉందని ఆశిస్తున్నాం.

– మట్టపర్తి బాలాజీ, రైతు, గంగలకుర్రు అగ్రహారం

అనంతపురం జిల్లా ఆత్మకూరు సమీపంలో విరబూసిన పూతతో రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్న మామిడి చెట్లు

విరబూసిన ఆశలు

ఈ ఏడాది ఉమ్మడి అనంతపురం జిల్లాలో మామిడి చెట్లకు పూత విపరీతంగా పూసింది. దీంతో రైతులు పంటపై ఆశలు పెంచుకున్నారు. గత ఏడాది సరైన ధరలు లేక నష్టాలు చవిచూశారు. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పూత విరబూసింది. చాలాచోట్ల ముందస్తుగా మామిడి కాయలు కూడా కాశాయి. గత ఏడాది టన్ను రూ.10 వేలకు మించి అమ్ముడుపోలేదు. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే మార్కెట్‌లో టన్ను మామిడి కాయల ధర రూ.80 వేలకుపైగా పలుకుతోంది. తమ దిగుబడి మార్కెట్‌కు వచ్చే వరకు ఆ స్థాయిలో ధర ఉంటే లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. – ఆత్మకూరు

మామిడి చెట్టుపై ఆకులు కన్నా పూతనే ఎక్కువగా కనిపిస్తున్న దృశ్యం

క్లుప్తంగా...

ఏప్రిల్ నాటికి అందుబాటులోకి 13 ల్యాబ్‌లు

- మంత్రి సత్యకుమార్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏప్రిల్ నాటికి 13 ఇంటిగ్రేటెడ్ హెల్త్ లేబొరేటరీలు అందుబాటులోకి వస్తాయని వైద్యశాఖమంత్రి సత్య కుమార్ తెలిపారు. ఇవి అందుబాటులోకి వస్తే పరీక్షల నాణ్యత మరింత పెరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైక్రో బయాలజీ, హెమటాలజీ, క్లినికల్ బయో కెమిస్ట్రీ, పెథాలజీ వంటి విభాగాల్లో పరీక్షలు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

84 మంది వైద్యుల నామినేషన్‌ల దాఖలు

- ఫిబ్రవరి 9న మెడికల్ కౌన్సెల్‌లో 13 స్థానాలకు ఎన్నిక

సాక్షి, అమరావతి: ఏపీ మెడికల్ కౌన్సెల్‌లో 13 మంది సభ్యుల ఎన్నికకు నామినేషన్‌ల గడువు మంగళవారంతో ముగిసింది. గడువు ముగిసే సమయానికి 84 మంది వైద్యులు నామినేషన్‌లు దాఖలు చేసినట్లు కౌన్సెల్ రిజిస్ట్రార్ డాక్టర్ రమేశ్ తెలిపారు. 28,29 తేదీల్లో నామినేషన్‌ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులను ఫిబ్రవరి 2న ప్రకటిస్తామన్నారు. 9న కౌన్సెల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 55,504 మంది ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా 13 మంది సభ్యులను ఎన్నుకుంటారని చెప్పారు. 10న ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

435 ఆలయాలకు మరమ్మతులు, అభివృద్ధికి ప్రణాళిక

సాక్షి, అమరావతి: గోదావరి పుష్కరాల సందర్భంగా పాత ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని గోదావరి నదికి ఇరువైపున 5 కి.మీ పరిధిలో 435 ఆలయాలకు మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు దేవదాయశాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. దీనికి అవసరమయ్యే నిధులను కామన్ గుడ్ ఫండ్ నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించారు. 35 ఆలయాలకు ఒక్కోదానికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి చొప్పున ఖర్చుచేసి పునః నిర్మించనున్నారు. మరో 400 ఆలయాలకు ఒక్కో దానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల చొప్పున ఖర్చు చేసి మరమ్మతులతో పాటు రంగులు వేయాలని నిర్ణయించారు.

ఇనుమూరు గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధి బృందం

సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని ఇనుమూరు గ్రామ గిరిజనులకు న్యాయం చేయాలని, 20 మంది గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆదివాసి గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కోయ తెగ(ఎస్టీ)కి చెందిన 57 కుటుంబాలు ఇనుమూరులో సర్వే నెంబర్ 218లోని భూమిలో వేసిన మొక్కజొన్న, ఇతర పంటలను ధ్వంసం చేసి, అడ్డొచ్చిన గిరిజన మహిళలపై దాడికి పాల్పడిన ఎస్ఐ, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డిని మంగళవారం కలిసిన ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎ.రవి, ఎ.అశోక్, ఉపాధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, ఏలూరు జిల్లా నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, కారం ముత్యాలరావు, పి.శేఖర్ బృందం ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసి గతేడాది డిసెంబర్ 23న జరిగిన ఘటన వివరాలు తెలిపారు.

యూఎల్బీల్లో ప్రామాణిక పారిశుధ్య విధానాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు ఒకే తరహా విధానాలు అమలు చేయనున్నట్టు పురపాలక పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. వరదల నివారణ, ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కాల్వల నుంచి వ్యర్థాల తొలగింపులో ఈ విధానాలు అనుసరించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (ఎస్‌ఓపీ)ని ప్రవేశపెడుతున్నట్టు మంగళవారం తెలిపారు. శాస్త్రీయ, సాంకేతిక విధానాలతో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అన్ని డ్రెయిన్లు శుభ్రం చేసి, డిజిటల్‌గా పర్యవేక్షిస్తారన్నారు. ఈ పనులకు స్థానిక మునిసిపల్ కమిషనర్లు వ్యక్తిగతంగా జవాబుదారీగా ఉంటారని, అన్ని చోట్లా యాంత్రీకరణ చేసి కార్మికుల భద్రతకు ప్రాధాన్యమిస్తామని వివరించారు. పారిశుధ్య కార్మికుల కోసం వ్యక్తిగత రక్షణ పరికరాల (పీపీఈ)తోపాటు ఆధునిక పరికరాలను వినియోగిస్తామని తెలిపారు. చెత్త, నిర్మాణ శిథిలాలను కాలువల్లో వేసే వారికి జరిమానాలు విధిస్తామని సురేష్ కుమార్ హెచ్చరించారు.

పారిశ్రామికవేత్తలుగా మహిళలు రాణించాలి

సాక్షి, న్యూఢిల్లీ : మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం 4 క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలి పారు. ఏపీలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఏప్రిల్‌లో అమలు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గణతంత్ర వేడుకలకు హాజరైన వివిధ రంగాలకు చెందిన 57 మంది మహిళలతో మంగళవారం సాయంత్రం న్యూఢిల్లీలోని తన నివాసంలో కేంద్ర మంత్రి సమావేశం నిర్వహించి విందు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళలు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ ప్రధాన కార్యదర్శి టీఎన్ స్నేహన్, స్త్రీనిధి బ్యాంక్ డైరెక్టర్ తోట కృపా స్నేహన్, గ్రామీణాభివృద్ధిశాఖ అండర్ సెక్రటరీ భరద్వాజ్, సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్‌రావు, ఏపీఎంలు బత్తుల బాజీరెడ్డి, జగజీవన్, తదితరులు పాల్గొన్నారు.

సరెండర్ లీవ్ బిల్లులను విడుదల చేయండి: ఏపీఎస్టీఏ

సాక్షి, అమరావతి: పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఎన్నో ఏళ్లుగా దాచుకున్న బిల్లులు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను ఉన్నత విద్యకు పంపించలేక, ఆడపిల్లలకు పెళ్లి చేయలేక, గృహ నిర్మాణం వంటి కీలకమైన పనులు పూర్తికాక తల్లడిల్లుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సరెండర్ లీవ్‌తో పాటు తమకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

స్వచ్ఛ హరిత పాఠశాలల హెచ్‌ఎంలకు సత్కారం

సాక్షి, అమరావతి: 'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్–2025' కార్యక్రమంలో జాతీయ స్థాయికి ఎంపికైన 20 ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలను సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మంగళవారం విజయవాడలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్రశంసాపత్రాలతో సత్కరించారు. పాఠశాలల్లో సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన టాయిలెట్లు, సబ్బుతో చేతులు కడుక్కొనే అలవాట్లు, తదితర అంశాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన స్కూళ్లకు కేంద్రం పురస్కారాలను ప్రదానం చేస్తుంది. దేశవ్యాప్తంగా ఎంపికయ్యే 200 పాఠశాలలకు రూ.1 లక్ష చొప్పున నగదు పురస్కారాన్ని మంజూరు చేస్తుంది. ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలను విజ్ఞాన యాత్రకు తీసుకువెళుతుంది. కార్యక్రమంలో సీమ్యాట్ డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలను అభినందిస్తున్న ఎస్పీడీ శ్రీనివాసరావు

నిర్లక్ష్యపు 'నీడ'లో..

- ఖగోళ, జ్యోతిష శాస్త్రాల ఆధారంగా రత్నగిరిపై సూర్య గడియారం
- 80 సంవత్సరాల క్రితం నిర్మాణం
- నీడ ఆధారంగా కచ్చితమైన సమయం తెలుసుకునే వీలు
- అరిగిపోయి అస్పష్టంగా మారిన సమయ పట్టిక
- భక్తుల్లో అయోమయం

రత్నగిరిపై సూర్య గడియారం

అన్నవరం: సత్యదేవుడు వెలసిన రత్నగిరిపై ఏర్పాటు చేసిన పలభా యంత్రం (సూర్య గడియారం) నిర్లక్ష్యపు నీడలో వెలవెలబోతోంది. ఖగోళ, జ్యోతిష శాస్త్రాల ఆధారంగా సుమారు 80సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ గడియారం ద్వారా సూర్యుని నీడ ఆధారంగా కచ్చితమైన సమయం తెలుసుకోవచ్చు. సత్యదేవుని ఆలయానికి ఈశాన్య భాగాన, స్వామివారి నిత్య కల్యాణ మండపం వద్ద ఈ సన్ డయల్ ఉంది.

ఇలా ఏర్పాటైంది

సూర్యుడి గమనం ఆధారంగా సమయం తెలుసుకునేలా ఈ సూర్య గడియారాన్ని 1943లో అప్పటి ఆలయ ధర్మకర్త ఇనుగంటి వేంకట రాజగోపాల రామసూర్యప్రకాశరావు కోరిక మేరకు ఖగోళ, జ్యోతిష శాస్త్రాల్లో నిష్ణాతుడైన రాజమహేంద్రవరానికి చెందిన పిడమర్తి కృష్ణమూర్తిశాస్త్రి రూపొందించారు. 12 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పు కలిగిన గ్రానైట్ పలక మీద త్రికోణాకారంలో తూర్పు దిక్కుకు అభిముఖంగా మరో చిన్న పలకను నిలువుగా అమర్చారు. సూర్యకాంతి పడి దీని నీడ పెద్ద పలక మీద పడుతుంది. అలా నీడ పడే చోట అర్ధచంద్రాకారంగా గడియారంలో మాదిరిగా అంకెలుంటాయి. ఆ నీడ పడిన అంకెలకు ఆయా నెలలు, తేదీలను అనుసరించి కొంత సమయం కలపడం లేదా తీసివేయడం చేయాలి. తద్వారా కచ్చితమైన సమయం తెలుస్తుంది. ఉదాహరణకు జనవరి 25 మధ్యాహ్నం సూర్య గడియారంపై నీడ 12.25 గంటల మీద పడిందని అనుకుంటే అక్కడి సూచనల ప్రకారం ఆ తేదీకి 10 నిమిషాలు కలపాలి. అంటే అప్పుడు సమయం మధ్యాహ్నం 12.35 గంటలు అయినట్టు. ఇండియన్ స్టాండర్డ్ టైమ్(ఐఎస్‌టీ) కూడా కచ్చితంగా అదే సమయాన్ని చూపిస్తుంది. అంత కచ్చితంగా దీనిని రూపొందించారు. ఎప్పుడు ఎంత సమయం కలపాలి, ఎప్పుడు తీసివేయాలనే విషయాలను అక్కడి సూచనల పట్టికలో తెలిపారు.

ప్రాభవం కోల్పోతూ..

సత్యదేవుని దర్శనం పూర్తయ్యాక భక్తులు చూసేందుకు రత్నగిరిపై ఉన్న ఏకైక ఆకర్షణ ఈ సూర్య గడియారం. ఎంతో విశిష్టత కలిగిన ఈ సూర్య గడియారం ఆలనా పాలనా చూసేవారే కరువయ్యారు. ఈ గడియారంలో సమయం చూసుకునేందుకు అక్కడి పలకపై వేసిన అంకెలు, సూచనలు, ప్లస్, మైనస్ గుర్తులు అరిగిపోయి స్పష్టంగా కనిపించడం లేదు. దీంతో, ఇది ఓ పట్టాన అర్థం కాక భక్తులు అయోమయానికి గురవుతున్నారు. వీటిని దేవస్థానం అధికారులు మళ్లీ స్పష్టంగా రాయించేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే, గతంలో ఇక్కడ 'సూర్య గడియారం' అని రాసి ఉన్న పెద్ద ఫ్లెక్సీ ఉండేది. ప్రస్తుతం చిన్న బోర్డు మాత్రమే మిగిలింది. అక్కడ శాశ్వతంగా రథంపై సూర్య భగవానుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే సూర్య గడియారానికి మరింత ఆకర్షణ చేకూరుతుంది. అలాగే, సన్ డయల్ గోడలకు రంగులు కూడా వేయించాలి. దీంతోపాటు అక్కడ సమయం ఎలా తెలుసుకోవాలో తెలిపే వివరాలతో ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేయాలి.

సూర్య గడియారంలో అరిగిపోయిన పట్టిక

'పట్టాలు' తప్పిన ఏయూ

- మూడేళ్లుగా నిర్వహించని స్నాతకోత్సవం
- పట్టాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న పట్టభద్రులు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న ఏయూ పాలకులు
- వాయిదాలతో నెట్టుకొస్తున్న అధికారులు
- చిన్న చిన్న యూనివర్సిటీలే ఏటా కాన్వొకేషన్ నిర్వహణ
- ప్రతిష్టాత్మక ఏయూ నిర్వహించకపోవడంపై విద్యార్థుల ఆందోళన

విశాఖ సిటీ : ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిస్థితులు తీసికట్టుగా మారుతున్నాయి. శతాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్న యూనివర్సిటీ పాలన గతి తప్పుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా వేల సంఖ్యలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న వర్సిటీ.. పట్టాలు అందజేయడంలో మాత్రం విఫలమవుతుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గత మూడేళ్లుగా ఏయూ స్నాతకోత్సవం నిర్వహించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ పట్టాలను అందుకోవడానికి ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి రావడం శోచనీయం.

పాలకుల నిర్లక్ష్యం?

సాధారణంగా ఏటా జరగాల్సిన స్నాతకోత్సవం వరుసగా మూడేళ్ల నుంచి వాయిదా పడుతూనే ఉంది. చిన్న చిన్న విశ్వవిద్యాలయాలు సైతం ఏటా క్రమం తప్పకుండా కాన్వొకేషన్ నిర్వహించుకుంటున్నాయి. విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్నాయి. శత వసంతాలు పూర్తి చేసుకున్న ఆంధ్రా యూనివర్సిటీ మాత్రం ఈ విషయంలో వెనుకబడటం గమనార్హం. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కోవిడ్ కారణంగా మూడేళ్లు పట్టాల పండుగ జరగలేదు. దీంతో 2023లో 87 నుంచి 90 బ్యాచ్‌ల వరకు స్నాతకోత్సవాన్ని నిర్వహించి విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఆ తర్వాత 2024లో ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రెండు విద్యా సంవత్సరాలు పట్టాల ప్రదానోత్సవాన్ని నిర్వహించలేదు. గతేడాది డిసెంబర్ 30న 90, 91వ సంయుక్త స్నాతకోత్సవాలను నిర్వహిస్తామని అధికారులు ఆర్భాటంగా ప్రకటించారు. కానీ, ఆ ప్రకటన చేసిన కొద్ది రోజుల్లోనే అనివార్య కారణాలంటూ దానిని వాయిదా వేయడం విద్యార్థులను నిరాశకు గురిచేసింది.

పాలనా వైఫల్యం.. విద్యార్థులకు ఆర్థిక భారం

వందేళ్ల చరిత్ర కలిగిన ఏయూ వంటి ప్రతిష్టాత్మక సంస్థ.. స్నాతకోత్సవాల నిర్వహణలో విఫలమవుతుండడంపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు వాయిదాలు వేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది వర్సిటీ అడ్మినిస్ట్రేషన్, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ సమన్వయ లోపాన్ని బయటపెడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టాల పండుగను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తుండడంతో విద్యార్థులు ఆర్థికంగా కూడా నష్టపోతున్నారు. విదేశాల్లో ఉంటున్న పీహెచ్‌డీ స్కాలర్లు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న పట్టభద్రులు స్నాతకోత్సవం కోసం విమాన టికెట్లు, హోటల్ రూమ్స్ బుక్ చేసుకున్నారు. చివరి నిమిషంలో వాయిదా పడటంతో టికెట్లకు వెచ్చించిన డబ్బును నష్టపోయారు. కొందరు విద్యార్థులు సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, ఈ జాప్యం తమ కెరీర్‌పై కూడా ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టభద్రుల ఆవేదన

పట్టా చేతికి వస్తేనే తమ విద్యాభ్యాసానికి ఒక పరిపూర్ణత లభిస్తుందని విద్యార్థులు భావిస్తారు. స్నాతకోత్సవం జరగకపోవడం వల్ల వారు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో పట్టా తీసుకోవాలనే విద్యార్థుల కల కలగానే మిగిలిపోతోంది. యూనివర్సిటీ పాలకులు ఇప్పటికైనా దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థులు కోరుతున్నారు. తక్షణమే స్నాతకోత్సవ తేదీని ప్రకటించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పాలనాపరమైన కారణాలు చూపుతూ కాలయాపన చేయడం వల్ల వర్సిటీ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, వేలమంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతోందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఏయూ యంత్రాంగం మొద్దునిద్ర వీడి, త్వరగా వేడుకలు నిర్వహించి పట్టభద్రుల ఆశలను నెరవేర్చాల్సిన అవసరం ఉందని పట్టుబడుతున్నారు.

మంత్రి నారాయణ యూకే, దోహా పర్యటన

- ఆ దేశాల నుంచి అనుమతి తీసుకోవాలని సూచన

సాక్షి, అమరావతి: అమరావతిలో స్పోర్ట్స్ సిటీ అభివృద్ధికి అంతర్జాతీయ విధానాల గురించి తెలుసుకోవడానికి మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణను యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), దోహా పర్యటనకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దేశాల పర్యటనకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఇతర కేంద్ర ప్రభుత్వ విభాగాల నుంచి అవసరమైన అనుమతులు తీసుకోవాలని సూచించారు. మంత్రితో పాటు ఆ దేశాల పర్యటనకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ వెళ్లనున్నారు. వచ్చే నెల 2 నుంచి 5 వరకు పర్యటనకు అనుమతిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ ఉత్తర్వులు జారీచేశారు.

ఫార్మసీ కౌన్సిల్ ఇన్‌చార్జ్‌గా చక్రధర్‌బాబు

సాక్షి, అమరావతి: ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఇన్‌చార్జ్‌గా సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎస్.చక్రధర్‌బాబుకు ప్రభుత్వం బాధ్యతలు అప్పజెప్పింది. ఈ మేరకు వైద్య శాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్ ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు.

నేహా శర్మ

వరలక్ష్మి

స్టార్ట్ కెమెరా... యాక్షన్ అంటూ మెగాఫోన్ పట్టుకుని, కెప్టెన్ ఆఫ్ ది సినిమా బాధ్యతను స్వీకరించే లేడీ డైరెక్టర్స్ చాలా తక్కువ. ఏడాదికి ఇద్దరు... ముగ్గురు మహిళా దర్శకులు పరిచయం కావడం ఎక్కువ అనే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నలుగురైదుగురు లేడీ డైరెక్టర్స్ పరిచయం కానుండటం విశేషం. ఈ ఏడాది ఆరంభంలోనే ఒక లేడీ డైరెక్టర్ వెబ్ సిరీస్‌తో ప్రతిభను నిరూపించుకుని, ఓ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఇక... 2026లో డైరెక్టర్స్‌గా సత్తా చాటుకోనున్న 'లేడీ డైరెక్టర్స్' గురించి తెలుసుకుందాం.

స్టార్ట్ కెమెరా

● మెగాఫోన్ పట్టిన హీరోయిన్లు

డైరెక్షన్... యాక్షన్

కథానాయికగా, ప్రతినాయికగా... ఇలా నెగటివ్, పాజిటివ్ ఏ రోల్ అయినా నటిగా తన సత్తా చాటుకున్నారు వరలక్ష్మీ శరత్‌కుమార్. నటిగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తున్నారామె. పన్నెండేళ్లకు పైగా సిల్వర్ స్క్రీన్‌పై షైన్ అవుతున్న వరలక్ష్మి ఇప్పుడు తెరవెనక డైరెక్షన్ బాధ్యతను చేపట్టారు. 'సరస్వతి' సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు వరలక్ష్మి లీడ్ రోల్‌లో నటించారు. ఇటు డైరెక్షన్ అటు యాక్షన్ మాత్రమే కాదు... తన సోదరి పూజాతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు కూడా. వాస్తవ ఘటనల నేపథ్యంలో థ్రిల్లర్ మూవీగా 'సరస్వతి'ని తెరకెక్కించారు. దోసె డైరీస్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఇంకా విడుదల తేదీ ఖరారు కాలేదు. జీవా, ప్రకాశ్‌రాజ్, నాజర్, ప్రియమణి, రాధిక తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: ఎ.ఎం. ఎడ్విన్ సకాయ్.

రెండో సినిమాకే దర్శకురాలిగా...

'బెస్ట్ కపుల్' (2021) చిత్రంతో వెండితెరకు పరిచయం అయ్యారు ఫ్యాషన్ డిజైనర్ షగ్నశ్రీ వేణున్. ఆ తర్వాత 'ప్రభుత్వ జూనియర్ కళాశాల' (2024) చిత్రంతో హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు షగ్న. నటిగా రెండు చిత్రాల అనుభవం ఉన్న ఆమె దర్శకురాలిగా మారారు. ప్రస్తుతం వరుణ్ సందేశ్ హీరోగా 'హలో ఇట్స్ మీ' అనే చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారామె. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కూడా నటిస్తున్నారు షగ్నశ్రీ. హృదయానికి హత్తుకునే ప్రేమకథతో యువతకు కనెక్ట్ అయ్యేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు షగ్నశ్రీ పేర్కొన్నారు. షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం విడుదల తేదీ ఖరారు కావాల్సి ఉంది.

మానస

● షగ్నశ్రీ

రాకాసతో రాక

సంగీత్ శోభన్ నటించిన 'ఒక చిన్న ఫ్యామిలీస్టోరీ (2021)' సిరీస్‌తో రచయితగా పరిచయమై, మంచి పేరు సంపాదించుకున్నారు మానసా శర్మ. మహేశ్ ఉప్పల దర్శకత్వంలో నిహారిక కొణిదెల నిర్మించిన ఈ సిరీస్ 'జీ 5' ఓటీటీలో 2021 నవంబరు నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సిరీస్‌కు వ్యూయర్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. దీంతో 'బెంచ్ లైఫ్' సిరీస్‌కు దర్శకత్వం వహించే చాన్స్ మానసా శర్మకు లభించింది. వైభవ్ నటించిన ఈ సిరీస్ సోనీలివ్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుండగా, మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు 'రాకాస' చిత్రంతో ఫీచర్ ఫిల్మ్ దర్శకురాలిగా మానస పరిచయం అవుతున్నారు. మానస రైటర్‌గా పని చేసిన 'ఒక చిన్న ఫ్యామిలీస్టోరీ' హీరో సంగీత్ శోభన్ ఈ 'రాకాస' చిత్రంలోనూ హీరోగా నటిస్తుండగా, ఈ సిరీస్ నిర్మాత నిహారిక కొణిదెల కూడా ఈ చిత్ర నిర్మాణంలో అసోసియేట్ కావడం విశేషం. ఉమేష్ కుమార్ బన్సల్ ఈ సినిమాకు మరో నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. నయన్ సారిక ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ కామెడీ ఫ్యాంటసీ ఫిల్మ్ ఏప్రిల్ 3న థియేటర్స్‌లో విడుదల కానుంది.

డైరెక్టర్ నేహా

రామ్‌చరణ్ హీరోగా పరిచయమైన 'చిరుత' సినిమాతో నేహా శర్మ కూడా హీరోయిన్‌గా ఫిల్మ్ ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు. ఆ తర్వాత నటిగా వీలైనప్పుడల్లా సినిమాలు చేస్తూనే ఉన్నారు. నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' చిత్రం 2023లో విడుదల కాగా, ఈ చిత్రంలో నటించారు నేహా. అయితే నేహా ఇప్పుడు దర్శకురాలిగా మెగాఫోన్ పట్టనున్నారు. 1945 నేపథ్యంలో సాగే ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామాకు నేహా శర్మ దర్శకత్వం వహించనున్నారని, ఆల్రెడీ ఈ సినిమాకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయనే టాక్ కొన్ని రోజులుగా బాలీవుడ్‌లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. అజయ్ దేవగన్ ఈ సినిమాను నిర్మించనున్నారని సమాచారం.

● కీర్తి సురేష్

హీరోయిన్‌గా కీర్తి సురేష్ ఎంత సక్సెస్‌ఫుల్లో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఒకవైపు కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా, మరోవైపు ఉమెన్ సెంట్రిక్ చిత్రాల్లో మెయిన్ లీడ్‌గా యాక్ట్ చేస్తూ కెరీర్‌ను భలే బ్యాలెన్స్ చేస్తున్నారు కీర్తి. అయితే ఇప్పుడు ఆమె దర్శకురాలిగానూ, తన కీర్తిని పెంచుకోవాలనుకుంటోంది. మెగాఫోన్ పట్టేందుకు కథలు రాస్తున్నారు కీర్తి సురేష్. ఆమె టైటిల్ రోల్‌లో నటించిన 'రివాల్వర్ రీటా' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా, తన దర్శకత్వ లక్ష్యాలను గురించి, కీర్తి చెప్పకొచ్చారు. "భవిష్యత్‌లో నాకు దర్శకత్వం వహించే ఆలోచన ఉంది. గత ఐదు సంవత్సరాలుగా కొన్ని కథలను రాస్తున్నాను. ఈ కథలను డెవలప్ చేసుకునే విషయమై కొంతమంది అసిస్టెంట్ డైరెక్టర్స్‌తోనూ నేను మాట్లాడుతున్నాను. నా ట్రావెల్ టైమ్‌లోనూ కొత్త ఐడియాలను ఆలోచిస్తున్నాను. ఆసక్తిగా అనిపించినవాటిని నోట్ చేసుకుంటున్నాను" అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పకొచ్చారు కీర్తి సురేష్.

ఇటీవల విడుదలైన 'నయనం' వెబ్‌సిరీస్ వీక్షకుల దృష్టిని ఆకర్షించింది. వరుణ్ సందేశ్, ప్రియాంకా జైన్, ఉత్తేజ్ ప్రధాన తారాగణంగా నటించిన ఈ సిరీస్‌తో స్వాతి ప్రకాష్ మంత్రిప్రగడ దర్శకురాలిగా పరిచయం అయ్యారు. రామ్ తాళ్లూరి, రజనీ తాళ్లూరి ఈ సిరీస్‌ను నిర్మించగా, జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సిరీస్‌కి మంచి ఆదరణ లభిస్తోంది.

నేనే హీరో.. నేనే విలన్

రణ్‌బీర్‌కపూర్

'యానిమల్:పార్క్' సినిమా చిత్రీకరణ వచ్చే ఏడాది ప్రారంభం అవుతుందని తెలిపారు బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్‌కపూర్ హీరోగా నటించిన హిందీ చిత్రం 'యానిమల్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా, బాబీ డియోల్ విలన్‌గా, ఓ కీలక పాత్రలో త్రిప్తి దిమ్రీ నటించారు. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, మురాద్ ఖేతని, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన ఈ చిత్రం 2023 డిసెంబరు 1న విడుదలై, బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించింది. అయితే ఈ చివర్లో 'యానిమల్' చిత్రానికి సీక్వెల్‌గా 'యానిమల్:పార్క్' రానున్నట్లుగా మేకర్స్ తెలిపారు. తాజాగా ఈ 'యాని మల్' సినిమా సీక్వెల్‌పై ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో రణ్‌బీర్‌కపూర్ స్పందించారు. ''సందీప్‌రెడ్డి వంగా 'యానిమల్' సినిమాను ఓ ఫ్రాంచైజీలా మూడు భాగాలుగా తీయాలని నాతో అన్నారు. తొలి భాగం ఆల్రెడీ వచ్చేసింది. రెండోభాగం 'యానిమల్: పార్క్' సినిమా చిత్రీకరణను 2027లో స్టార్ట్ చేస్తాం. ఈ సినిమాలో నేను రెండు పాత్రల్లో కనిపిస్తాను. హీరోగా నటించడంతో పాటుగా, విలన్‌గానూ కనిపిస్తాను. చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది'' అని చెప్పుకొచ్చారు రణ్‌బీర్‌కపూర్. ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్ 'రామాయణ: పార్టు 1, రామాయణ: పార్టు 2' చిత్రాలతో పాటుగా, 'లవ్ అండ్ వార్' అనే సినిమా చేస్తున్నారు. ఇక ఈ దీపావళికి 'రామాయణ: పార్టు 1, వచ్చే దీపావళికి రామాయణ:పార్టు 2' చిత్రాలు రిలీజ్ కానున్నట్లుగా ఆల్రెడీ మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే 'లవ్ అండ్ వార్' చిత్రం 2027లో రిలీజ్ కానుంది.

రాణీముఖర్జీ గొప్ప నటి: రణ్‌బీర్ కపూర్

నటిగా బాలీవుడ్ హీరోయిన్ రాణీముఖర్జీ ఇండస్ట్రీలో 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విషయంపై కూడా రణ్‌బీర్‌కపూర్ స్పందించారు. ''భారతదేశంలోని గొప్ప నటీమణుల్లో రాణీముఖర్జీ ఒకరు. నా తొలి చిత్రం 'సావరియా'లో రాణీతో కలిసి నటించాను నేను. కష్టపడి నటించాలని నాకు చెబుతూ, నన్ను ప్రోత్సహించిన తొలి వ్యక్తి తనే. ఆ సినిమా చిత్రీకరణ సమయంలో ఆమెతో నాకు జరిగిన సంభాషణలను నేను ఎప్పటికీ మర్చిపోలేను. రాణీ ముఖర్జీ 30 ఏళ్ళ సినీ జర్నీని సెలబ్రేట్ చేసుకోవడం నిజంగా అద్భుతం. ఇప్పటికీ ఆమె ఎంచుకునే పాత్రలు, సినిమాలు సిల్వర్‌స్క్రీన్‌పై మహిళలను గొప్పగా చూపించేలా ఉంటాయి'' అని పేర్కొన్నారు. ఇక రాణీముఖర్జీ నటించిన 'మర్దానీ 3' చిత్రం ఈ నెల 30న రిలీజ్ కానుంది.

డబ్బింగ్ స్టార్ట్

'గబ్బర్ సింగ్' వంటి హిట్ మూవీ తర్వాత హీరో పవన్ కళ్యాణ్, దర్శకుడు ఎస్. హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ చిత్రంలో రాశీఖన్నా, శ్రీలీల హీరోయిన్స్‌గా నటించారు. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా వేసవిలో రిలీజ్ కానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. కాగా, ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరింత ఊపందుకున్నాయి. ప్రస్తుతం డబ్బింగ్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పవన్ కళ్యాణ్ కూడా డబ్బింగ్ స్టార్ట్ చేయనున్నారు. ''శుభ ముహూర్తంలో డబ్బింగ్ పను లను ప్రారంభించాము. ఈ సినిమాను గురించి త్వరలోనే ఇతర వివరాలను వెల్లడిస్తాం'' అని యూనిట్ తెలిపింది. ఈ సినిమాకు సంగీతం దేవి శ్రీ ప్రసాద్.

● డబ్బింగ్ పనులు ప్రారంభిస్తున్న రవిశంకర్, హరీష్ శంకర్..

● 'గాంధీ టాక్స్' పోస్టర్

మాటలు అవసరం లేదు!

విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి, అదితీరావు హైదరి, సిద్ధార్థ్ జాదవ్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'గాంధీ టాక్స్'. కిషోర్ పాండురంగ్ బెలేకర్ దర్శకత్వంలో ఉమేష్ కుమార్ బన్సాల్, మీరా చోప్రా, కిషోర్ బి బెలేకర్ నిర్మించిన ఈ సైలెంట్ సినిమా ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''ప్రతి కథకు మాటలు అవసరం లేదు. కొన్ని కథలను ఫీలవ్వాలి. ఈసారి సిల్వర్‌స్క్రీన్ మాట్లాడదు. అది మిమ్మల్నీ వినేలా చేస్తుంది'' అని అంటూ ఈ సినిమాను ఉద్దేశించి, తన సోషల్ మీడియా 'ఎక్స్' ఖాతాలో 'గాంధీ టాక్స్' సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు విజయ్ సేతుపతి. ఈ ట్రైలర్‌లో ప్రధాన తారాగణం ఎక్స్‌ప్రెషన్స్, యాక్టింగ్ మాత్రమే ఉన్నాయి. ఒక్క డైలాగ్ కూడా లేదు. సినిమాలో కూడా డైలాగ్స్ ఉండవు. ట్రైలర్‌లో నటీనటుల భావోద్వేగాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

ఖైదీ సీక్వెల్ ఉంటుంది

లోకేష్ కనగరాజ్

'ఖైదీ 2' సినిమా ఆగిపోలేదని చెప్పారు దర్శక–నిర్మాత, నటుడు లోకేష్ కనగరాజ్. కార్తి హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఖైదీ (2019)'. లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఖైదీ 2' చిత్రాన్ని ప్రకటించారు మేకర్స్. కానీ ఈ సినిమా ఇప్పటివరకు సెట్స్ పైకి వెళ్లలేదు. 'ఖైదీ 2' సినిమాకు లోకేష్ కనగరాజ్ ఎక్కువ పారితోషికాన్ని డిమాండ్ చేశారని, దీంతో ఈ ప్రాజెక్ట్ విషయంలో ఏకాభిప్రాయం కుదరక, లోకేష్ ఈ సినిమా నుంచి తప్పుకున్నారనే టాక్ కోలీవుడ్ లో వినిపిస్తోంది. తాజాగా ఈ విషయంపై లోకేష్ కనగరాజ్ స్పందించారు. ''రజనీకాంత్‌గారితో 'కూలీ' సినిమా చేశాక, 'ఖైదీ 2' సినిమానే చేయాలనుకున్నాను. కానీ రజనీకాంత్ –కమల్‌హాసన్‌గార్లు నాతో మాట్లాడి, వారి కోసం ఓ కథను రెడీ చేయాలన్నట్లుగా చెప్పారు. లైఫ్ ఓ మంచి అవకాశంగా భావించి, నెలన్నర కష్టపడి ఓ యాక్షన్ కథను రెడీ చేసి, వారికి వినిపించగా బాగుందని చెప్పారు. కానీ తమకు ఓ లైట్‌హార్టెడ్ కథ కావాలని చెప్పారు. నాకు ఈ తరహా కథ రాదని చెప్పి, ఈ సినిమా నుంచి తప్పుకున్నాను. అయితే నా ప్రస్తుత ప్రయారిటీస్ వల్ల అల్లు అర్జున్‌గారితో సినిమా చేస్తున్నాను. ఈ చిత్రం తర్వాత నా డైరెక్షన్‌లో 'ఖైదీ 2'నే వస్తుంది'' అని చెప్పుకొచ్చారు లోకేష్ కనగరాజ్. అలాగే హీరోగా లోకేష్ కనగరాజ్ 'డీసీ' అనే సినిమా చేస్తున్నారు. ఇంకా తమిళ హీరో విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జననాయకుడు')లో లోకేష్ ఓ గెస్ట్‌రోల్ చేశారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. హెచ్.వినోద్ డైరెక్షన్‌లోని 'జన నాయగన్' సినిమా విడుదల తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది.

విక్రమ్ సినిమాలో...!

● శ్రుతీహాసన్

విక్రమ్ సినిమాలో నటించనున్నారు హీరోయిన్ శ్రుతీహాసన్. విక్రమ్ హీరోగా బీకే రాజ్‌కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా రూపుదిద్దుకుంటోంది. విక్రమ్ కెరీర్‌లోని ఈ 63వ సినిమాను శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో హీరోయిన్‌గా శ్రుతీహాసన్ నటించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు. ఈ సినిమా కథ, కథలోని తన పాత్ర నచ్చి, ఈ సినిమా చేసేందుకు శ్రుతీహాసన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ సమాచారం. వీలైనంత తొందరగా ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేసి, ఈ వేసవిలోనే ఈ సినిమాను రిలీజ్ చేయాలని విక్రమ్ అండ్ టీమ్ ప్లాన్ చేస్తున్నారని కోలీవుడ్ టాక్. ఇక ఈ సినిమాకు తొలుత మడోన్నా అశ్విన్‌ను దర్శకుడిగా అనుకున్నారు. కానీ, కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ నుంచి అశ్విన్ తప్పుకోవడంతో ఈ ప్లేస్‌లోకి బీకే రాజ్‌కుమార్ వచ్చారు. మరోవైపు విక్రమ్ హీరోగా సి.ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా ప్రకటన వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందనే ప్రచారం కోలీవుడ్‌లో జరుగుతోంది.

కోలీవుడ్ ఎంట్రీ

'సీతారామం, ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ సుపరిచితురాలే. అయితే మృణాల్ ఠాకూర్‌కు కోలీవుడ్ నుంచి కబురు వచ్చిందట. శింబు హీరోగా తమి ళంలో 'ఓ మై కడవులే, డ్రాగన్ (తెలుగులో 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'గా విడుదలైంది)' వంటి సక్సెస్‌ఫుల్ సినిమాలకు దర్శకత్వం వహించిన అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు మృణాల్ ఠాకూర్‌ను ఎంపిక చేసుకున్నారట చిత్రం యూనిట్. మృణాల్‌కు ఆల్రెడీ మేకర్స్ ఈ సినిమా కథ వినిపించారని, ఆమె ఈ సినిమాలో నటించేందుకు ఆల్మోస్ట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఒకవేళ ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ నటించనున్న విషయం అధికారికంగా వెల్లడైతే, మృణాళ్‌కు తెలుగులో ఇదే తొలి చిత్రం అవుతుంది. మరి..ఈ సినిమాతోనే మృణాల్ కోలీవుడ్ ఎంట్రీ జరుగుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న సినిమా, అడవి శేష్ హీరోగా చేస్తున్న 'డెకాయిట్' చిత్రాలతో మృణాల్ ఠాకూర్ బిజీగా ఉన్నారు. అలాగే ఆమె హిందీలో నటించిన 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఈ ఫిబ్రవరి 20న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ చిత్రాలే కాదు..మరికొన్ని హిందీ చిత్రాల్లోనూ ఆమె నటిస్తున్నారు.

ప్రియాంకా చోప్రా లైఫ్ జర్నీ నాకు స్ఫూర్తి: మృణాల్ ఠాకూర్

బాలీవుడ్ సక్సెస్‌ఫుల్ టాప్ హీరోయిన్ ప్రియాంకా లైఫ్ జర్నీ అంటే తనకు ఎంతో ఇష్టమని చెబుతున్నారు మృణాల్ ఠాకూర్. ఈ అంశంపై ఇటీవల ఆమె ఇంటర్వ్యూలో స్పందించారు. ''సినీ ఇండస్ట్రీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండ సినిమాల్లోకి వచ్చారు ప్రియాంకా చోప్రా. ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని, కష్టపడి గ్లోబల్ రేంజ్ హీరోయిన్‌గా రాణిస్తున్నారు. అలాగే ప్రియాంక చోప్రా యువతకు ఇచ్చే సూచనలు, సలహాలు నాకు చాలా ఇష్టం. ఇలా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన ప్రియాంకా చోప్రా నాకు కూడా స్ఫూర్తి. నా ప్రయాణం, ప్రియాంకచోప్రా ప్రయాణం పూర్తిగా భిన్నమైనవి. కానీ మా ఇద్దరి మధ్యలో ఓ కామన్ పాయింట్ ఉంది. ఇద్దరం కూడా కష్టకాలంలో ఎక్కడా వెనకడుగు వేయకుండా కృషి, పట్టుదలతో ముందుకు వెళ్తున్నాం'' అని చెప్పారు మృణాల్.

● మృణాళ్ ఠాకూర్

మెయిన్ 'డ్రా'కు అష్మిత అర్హత

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ అష్మిత చాలిహా మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ రెండు మ్యాచ్‌ల్లో అష్మిత ప్రత్యర్థులను ఓడించింది. గువాహటికి చెందిన 26 ఏళ్ల అష్మిత తొలి మ్యాచ్‌లో 21-15, 12-21, 21-12తో హుంగ్ యి టింగ్ (చైనీస్ తైపీ)పై గెలిచింది. ఆ తర్వాత రెండో మ్యాచ్‌లో 21-11, 10-21, 21-16తో కిమ్ జూ యున్ (దక్షిణ కొరియా)పై నెగ్గి మెయిన్ 'డ్రా'లో చోటు సంపాదించింది. మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో భారత్‌కే చెందిన దేవిక సిహాగ్‌తో అష్మిత ఆడుతుంది. పురుషుల క్వాలిఫయింగ్ సింగిల్స్‌లో భారత ప్లేయర్లు రిత్విక్, సనీత్ దయానంద్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. మహిళల డబుల్స్, పురుషుల డబుల్స్ విభాగం మెయిన్ 'డ్రా'లో భారత జోడీల పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. అశ్విని భట్-శిఖా గౌతమ్ 14-21, 12-21తో ఫెబ్రియానా కుసుమ-మెలీసా (ఇండోనేసియా) చేతిలో... రుతపర్ణ-శ్వేతాపర్ణ పాండా 12-21, 5-21తో బావో లీ జింగ్-లీ యి జింగ్ (చైనా) చేతిలో... పృథ్వీ కృష్ణమూర్తి రాయ్-సాయిప్రతీక్ 20-22, 20-22తో నూర్ అజ్రియాన్-టాన్ వీ కియోంగ్ (మలేసియా) చేతిలో ఓడిపోయారు.

అల్‌కరాజ్ తొలిసారి...

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరిన స్పెయిన్ స్టార్

- క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ డిమినార్‌పై విజయం
- టోర్నీలో ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోని వరల్డ్ నంబర్‌వన్
- మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో సబలెంకా, స్వితోలినా

మెల్‌బోర్న్: తనకు అచ్చిరాని గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ తొలిసారి క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అధిగమించాడు. గత రెండేళ్లు క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగిన ఈ స్పెయిన్ స్టార్ ఈసారి మాత్రం సాధికారిక ఆటతీరుతో తొలిసారి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 7-5, 6-2, 6-1తో ఆరో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు. 2 గంటల 16 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తొలి సర్వీస్‌లో 48 పాయింట్లకు 37... రెండో సర్వీస్‌లో 35 పాయింట్లకు 19 పాయింట్లు సంపాదించాడు. 26 విన్నర్స్ కొట్టిన ఈ స్పెయిన్ స్టార్ 32 అనవసర తప్పిదాలు చేశాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. నెట్ వద్దకు 22 సార్లు దూసుకొచ్చి 18 సార్లు పాయింట్లు సాధించాడు. సెమీఫైనల్ చేరే క్రమంలో అల్‌కరాజ్ తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం. ఫైనల్లో చోటు కోసం సెమీఫైనల్లో మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో అల్‌కరాజ్ ఆడతాడు. మరో క్వార్టర్ ఫైనల్లో జ్వెరెవ్ 6-3, 6-7 (5/7), 6-1, 7-6 (7/3)తో లెర్నర్ టియెన్ (అమెరికా)పై విజయం సాధించాడు. 3 గంటల 10 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జ్వెరెవ్ ఏకంగా 24 ఏస్‌లు సంధించడం విశేషం. ఒక్క డబుల్ ఫాల్ట్ మాత్రమే చేసిన జ్వెరెవ్ 56 విన్నర్స్ కొట్టాడు. 22 అనవసర తప్పిదాలు చేశాడు. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని జ్వెరెవ్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. నెట్ వద్దకు 31 సార్లు దూసుకొచ్చి 23 సార్లు పాయింట్లు గెలిచాడు. మరోవైపు లెర్నర్ 53 విన్నర్స్ కొట్టి, 43 అనవసర తప్పిదాలు చేశాడు. 11 ఏస్‌లు కొట్టిన లెర్నర్ 9 డబుల్ ఫాల్ట్‌లు చేసి మూల్యం చెల్లించుకున్నాడు.

కోకో గాఫ్‌కు షాక్

మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్), 12వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. క్వార్టర్ ఫైనల్లో సబలెంకా 6-3, 6-0తో ఇవా జోవిచ్ (అమెరికా)ను అలవోకగా ఓడించగా... స్వితోలినా 6-1, 6-2తో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా)ను బోల్తా కొట్టించడం విశేషం. కోకో గాఫ్‌తో 59 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో స్వితోలినా ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. వరుసగా నాలుగో ఏడాది సెమీఫైనల్ చేరిన సబలెంకా క్వార్టర్ ఫైనల్లో కేవలం మూడు గేమ్‌లు కోల్పోయింది.

10 గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సెమీఫైనల్‌కు చేరడం అల్‌కరాజ్‌కిది పదోసారి. ఓపెన్ శకంలో (1968 నుంచి) పది గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సెమీఫైనల్‌కు చేరిన రెండో అతి పిన్న వయస్కుడిగా అల్‌కరాజ్ (22 ఏళ్ల 258 రోజులు) గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో రాఫెల్ నాదల్ (2009లో: 22 ఏళ్ల 7 నెలల 25 రోజులు) అగ్రస్థానంలో ఉన్నాడు.

3 టెన్నిస్‌లోని నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ సెమీఫైనల్ చేరిన మూడో అతి పిన్న వయస్కుడిగా అల్‌కరాజ్ నిలిచాడు. ఈ జాబితాలో నొవాక్ జొకోవిచ్ (20 ఏళ్ల 237 రోజులు), రాఫెల్ నాదల్ (22 ఏళ్ల 83 రోజులు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

కోకో గాఫ్

స్వితోలినా

2 మిర్యానా లూసిచ్ (2017లో: 34 ఏళ్ల 313 రోజులు) తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో సెమీఫైనల్ చేరిన రెండో అతి పెద్ద వయస్కురాలిగా స్వితోలినా (31 ఏళ్ల 218 రోజులు) నిలిచింది.

13 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 13వ ప్రయత్నంలో స్వితోలినా తొలిసారి సెమీఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. ఎలీనా దెమెంతియెవా (రష్యా: 2009లో 11వ ప్రయత్నంలో) పేరిట ఉన్న రికార్డును స్వితోలినా అధిగమించింది.

మద్యం మత్తులో...

మూడు కార్లను ఢీకొట్టిన భారత మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్



వడోదర: మద్యం మత్తులో రాష్ డ్రైవింగ్ చేసిన భారత మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్‌ను వడోదర పోలీసులు అరెస్టు చేశారు. 53 ఏళ్ల ఈ మాజీ బ్యాటర్ టీమిండియా తరఫున 10 అంతర్జాతీయ వన్డేలు ఆడాడు. మంగళవారం తెల్లవారు జామున ఇక్కడి అకోటా ప్రాంతంలోని పునిత్ నగర్ సొసైటీ సమీపంలో మార్టిన్ లగ్జరీ ఎస్‌యూవీ కారును నడుపుతున్నాడు. ఎక్కువ మోతాదులో మద్యం తాగిన అతను కారుపై నియంత్రణ కోల్పోయాడు. ఇంటి బయట నిలిపి ఉంచిన మూడు కార్లను తన ఎస్‌యూవీ కారుతో ఢీకొట్టాడు. అతని కారు బీభత్సంతో మూడు కార్లూ ధ్వంసమయ్యాయి. దీంతో మూడు కార్ల యజమానులు అకోటా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మార్టిన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారత న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్ల కింద మద్యం తాగి వాహనం నడపడం, రాష్ డ్రైవింగ్‌తో ప్రమాదానికి కారణం కావడం తదితర కేసులు నమోదు చేసినట్లు అకోటా పోలీసులు తెలిపారు. గతంలో బరోడా రంజీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మార్టిన్‌ను మానవ అక్రమ రవాణా కేసు కింద 2011లో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు.

'సమయం రాగానే తప్పుకుంటా'

రిటైర్మెంట్‌పై కేఎల్ రాహుల్ ● కెరీర్‌ను సాగదీయనని వ్యాఖ్య

న్యూఢిల్లీ: క్రికెట్ నుంచి తప్పుకునే సమయం వచ్చిందని తనకు అర్థం కాగానే వెంటనే రిటైర్మెంట్ తీసుకుంటానని... బలవంతంగా కెరీర్‌ను సాగదీసే ఉద్దేశం తనకు లేదని భారత బ్యాటర్ కేఎల్ రాహుల్ వ్యాఖ్యానించాడు. అయితే దానికి ఇంకా సమయం ఉందని, రిటైర్ కావడం కష్టమైన నిర్ణయం కాబోదని అతను అన్నాడు. 2014లో టీమిండియా తరఫున తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన 34 ఏళ్ల రాహుల్ 67 టెస్టులు, 94 వన్డేలు, 72 టి20ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. మూడేళ్ల క్రితమే టి20 టీమ్‌కు దూరమైన అతను ప్రస్తుతం టెస్టులు, వన్డేల్లోనే రెగ్యులర్ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. 'రిటైర్మెంట్ ఆలోచనలు నా మనసులో కూడా వచ్చాయి. ఆట నుంచి తప్పుకోవడం అంత కష్టం ఏమీ కాదు. మన గురించి మనం నిజాయితీగా ఉంటే ఎప్పుడు రిటైర్ కావాలో తెలిసిపోతుంది. కెరీర్‌ను ఇంకా సాగదీయడంలో అర్థం లేదు. అయితే నా ప్రస్తుత స్థితిని బట్టి చూస్తే రిటైర్మెంట్‌కు ఇంకా సమయం ఉంది' అని రాహుల్ స్పష్టం చేశాడు. తాను ఎంతో ప్రాధాన్యత ఉన్న వ్యక్తిగా, సూపర్ స్టార్‌గా భావించుకోవడం లేదు కాబట్టి భవిష్యత్తుకు సంబంధించి రిటైర్మెంట్ నిర్ణయం తీసుకోవడం చాలా సులువని అతను అభిప్రాయ పడ్డాడు. 'ఒక్కసారి అనుకుంటే వెంటనే వదిలేయాలి. అప్పటి వరకు లభించినదానికి సంతోషించాలి. జీవితంలో ఇంతకంటే ముఖ్యమైన విషయాలు ఎన్నో ఉన్నాయి. మనకంటూ ఒక కుటుంబం ఉంది. పాప పుట్టాక నేను జీవితాన్ని చూసే తీరు కూడా మారిపోయింది. మున్ముందు ఎన్నో ఏళ్లు బాగా బతికేంత డబ్బు క్రికెట్ నుంచి పొందడం అదృష్టం. మనం లేకపోయినా దేశంలో, ప్రపంచంలో క్రికెట్ సాగిపోతూనే ఉంటుంది. ఈ విషయం అర్థమైతే చాలు' అని రాహుల్ వివరించాడు.

విజేత కళింగ లాన్సర్స్

- రెండోసారి హాకీ ఇండియా లీగ్ ట్రోఫీ కైవసం
- ఫైనల్లో రాంచీ రాయల్స్‌పై గెలుపు
- హైదరాబాద్ తూఫాన్స్‌కు మూడో స్థానం

భువనేశ్వర్: పురుషుల హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో కళింగ లాన్సర్స్ రెండోసారి విజేతగా నిలిచింది. ఫైనల్లో కళింగ లాన్సర్స్ జట్టు 3-2 గోల్స్ తేడాతో రాంచీ రాయల్స్‌పై గెలుపొంది 2017 తర్వాత మళ్లీ టైటిల్ సాధించింది. కళింగ లాన్సర్స్ తరఫున అలెగ్జాండ్రా హెండ్రిక్స్ (4వ, 27వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో సత్తా చాటగా... దిల్‌ప్రీత్ సింగ్ (25వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. రాంచీ రాయల్స్ తరఫున అరిజీత్ సింగ్ హుండల్ (9వ నిమిషంలో), టామ్ బూన్ (59వ నిమిషంలో) ఒక్కో గోల్ కొట్టారు. ఫైనల్ కంటే ముందు నిర్వహించిన వర్గీకరణ మ్యాచ్‌లో హైదరాబాద్ తూఫాన్స్ 4-3 గోల్స్ తేడాతో హెచ్ఐఎల్ గవర్నింగ్ కౌన్సిల్ జట్టుపై విజయం సాధించి మూడో స్థానం దక్కించుకుంది. హైదరాబాద్ తూఫాన్స్ తరఫున అమన్‌దీప్ లక్రా (30వ, 53వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించగా... నీలకంఠ శర్మ (24వ నిమిషంలో), జాకబ్ అండర్సన్ (33వ నిమిషంలో) చెరో గోల్ కొట్టారు. హెచ్ఐఎల్ గవర్నింగ్ కౌన్సిల్ టీమ్ తరఫున సామ్ వర్డ్ (14వ, 52వ నిమిషాల్లో) రెండు గోల్స్... కేర్ రసెల్ (55వ నిమిషంలో) ఓ గోల్ సాధించాడు. విజేతగా నిలిచిన కళింగ లాన్సర్స్‌కు రూ. 3 కోట్ల ప్రైజ్‌మనీ లభించింది. రన్నరప్‌గా నిలిచిన రాంచీ రాయల్స్‌కు రూ. 2 కోట్లు దక్కాయి. మూడో స్థానం దక్కించుకున్న హైదరాబాద్ తూఫాన్స్‌కు కోటి రూపాయల నగదు బహుమతి లభించింది. హెచ్ఐఎల్ గవర్నింగ్ కౌన్సిల్ జట్టుకు 'ఫెయిర్ ప్లే' అవార్డు దక్కింది. తమిళనాడు డ్రాగన్స్ గోల్‌కీపర్ ప్రిన్స్ దీప్ సింగ్‌కు 'బెస్ట్ గోల్ కీపర్' అవార్డు లభించింది. హెచ్ఐఎల్ గవర్నింగ్ కౌన్సిల్ జట్టు సభ్యుడైన టాలెమ్ ప్రియోబర్టా 'అప్‌కమింగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డు దక్కించుకున్నాడు. వీరిద్దరికీ రూ. 10 లక్షల చొప్పున నగదు పురస్కారం లభించింది. రాంచీ రాయల్స్ కెప్టెన్ టామ్ బూన్ ఈ టోర్నీలో అత్యధిక (19) గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచి 'టాప్ స్కోరర్' ట్రోఫీతో పాటు రూ. 10 లక్షల బహుమతి అందుకున్నాడు. హైదరాబాద్ తూఫాన్స్ ప్లేయర్ అమన్‌దీప్ లక్రాకు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డుతో పాటు రూ. 20 లక్షల నగదు బహుమతి లభించింది.


హైదరాబాద్ తూఫాన్స్ జట్టు

బ్రూక్
రూట్

'శత'క్కొట్టిన రూట్, బ్రూక్

మూడో వన్డేలో ఇంగ్లండ్ జయభేరి ● శ్రీలంకపై 2-1తో వన్డే సిరీస్ కైవసం

కొలంబో: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్ జట్టు... శ్రీలంకపై వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 53 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకను ఓడించి 2-1 తేడాతో సిరీస్‌ను చేజిక్కించుకుంది. 2023 తర్వాత ఇంగ్లండ్ జట్టుకు ఇదే తొలి విదేశీ వన్డే సిరీస్ విజయం కావడం విశేషం. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (66 బంతుల్లో 136 నాటౌట్; 11 ఫోర్లు, 9 సిక్స్‌లు), మాజీ కెప్టెన్ జో రూట్ (108 బంతుల్లో 111 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీలతో కదంతొక్కారు. బెథెల్ (72 బంతుల్లో 65; 8 ఫోర్లు) హాఫ్‌సెంచరీతో రాణించాడు. ఓపెనర్లు బెన్ డకెట్ (7), రేహాన్ అహ్మద్ (24) విఫలమవడంతో ఇంగ్లండ్ జట్టు 40 పరుగులకే 2 వికెట్లు కోల్పోగా... మూడో వికెట్‌కు బెథెల్‌తో కలిసి రూట్ 126 పరుగులు జోడించాడు. బ్రూక్ రాకతో ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. అప్పటి వరకు నెమ్మదిగా సాగుతున్న పరుగుల ప్రవాహం ఒక్కసారిగా రాకెట్ వేగాన్ని అందుకుంది. అబేధ్యమైన నాలుగో వికెట్‌కు రూట్‌తో కలిసి బ్రూక్ 113 బంతుల్లోనే 191 పరుగులు జతచేశాడు. ఈ క్రమంలో 40 బంతుల్లో హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకున్న బ్రూక్... 57 బంతుల్లోనే శతకం ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు రూట్ 100 బంతుల్లో మూడంకెల స్కోరు అందుకున్నాడు. శ్రీలంక బౌలర్లలో హసరంగ, ధనంజయ, వండర్సే తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 46.4 ఓవర్లలో 304 పరుగులకు ఆలౌటైంది. పవన్ రత్నాయకే (115 బంతుల్లో 121; 12 ఫోర్లు, 1 సిక్స్) చక్కటి పోరాటం కనబర్చాడు. 8వ ఓవర్‌లో క్రీజులోకి వచ్చిన అతడు చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. ఓపెనర్ పాథుమ్ నిసాంక (25 బంతుల్లో 50; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు అర్ధశతకంతో జట్టుకు శుభారంభం ఇవ్వగా... పవన్ ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచాడు. అయితే అతడికి సహచరుల నుంచి తగినంత సహకారం లభించలేదు. కమిల్ మిశ్రా (22), కుశాల్ మెండిస్ (20), కెప్టెన్ చరిత అసలంక (13), జనిత్ లియనాగె (22), దునిత్ వెల్లలాగె (22) ఎక్కువసేపు నిలవలేకపోయారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓవర్టన్, డాసన్, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', రూట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య శుక్రవారం నుంచి మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ ప్రారంభం కానుంది.

అమెరికాలోని బోస్టన్‌లో మెయిల్ బాక్సు చుట్టూ పేరుకున్న మంచును తొలగిస్తున్న పోస్టల్ ఉద్యోగి

మంగళవారం శ్రీనగర్‌లో దట్టంగా కురుస్తున్న మంచు

శ్వాస ఆగింది.. విశ్వాసం సాగింది

యజమాని మృతదేహంతో పిట్‌బుల్ నిరీక్షణ

చంబా లోయ.. చుట్టూ ఎత్తైన కొండలు, అంతకంటే ఎత్తులో పరుచుకున్న మంచు తెరలు. ఇద్దరి ప్రాణాలు ఆ మంచు తుపానులో కలిసి పోయాయి. వారికోసమే సహాయక బృందాలు గాలిస్తున్నాయి. హెలికాప్టర్ శబ్దం తప్ప అక్కడ మరో అలికిడే లేదు. కానీ, ఒక మృతదేహం దగ్గరకు వెళ్తుంటే సహాయక బృందానికి ఊహించని అడ్డంకి ఎదురైంది.

మంచులో నాలుగు రోజులు

హిమాచల్ ప్రదేశ్‌లో మంచు పడుతుంటే వీడియోలు తీయడానికి.. పీయూష్ అనే వ్యక్తి తన సోదరుడితో కలిసి ట్రెకింగ్‌కు వెళ్లారు. అయితే, అకస్మాత్తుగా విరుచుకుపడిన మంచు తుపానులో వారు చిక్కుకుపోయారు. దురదృష్టవశాత్తూ, సహాయక చర్యలు అందేలోపే ఆ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. సహాయక బృందం ఘటనా స్థలానికి చేరుకున్నప్పుడు, పీయూష్ మృతదేహం పక్కనే అతని పెంపుడు కుక్క (పిట్‌బుల్) కూర్చుని ఉండటం చూసి వారు ఆశ్చర్యపోయారు.

మృత్యువుతో పోరాటం

నాలుగు రోజులు.. అక్షరాలా నాలుగు పగళ్లు, నాలుగు రాత్రులు ఆ మంచు తుపానులో అది ఎలా ప్రాణాలతో ఉందో ఎవరికీ అర్థం కాలేదు. కానీ దాని కళ్లలో ఉన్నది భయం కాదు, తన యజమానిని రక్షించుకోవాలనే తపన. సహాయక బృందం మృతదేహాన్ని తాకడానికి ప్రయత్నిస్తే, ఆ కుక్క తీవ్రంగా ప్రతిఘటించింది. తన యజమాని గాఢ నిద్రలో ఉన్నాడనుకుందో ఏమో, ఎవరినీ రానివ్వలేదు. చివరకు బలవంతంగా శునకానికి గంతలు కట్టి, యజమాని మృతదేహంతో పాటు దాన్ని హెలికాప్టర్‌లో తరలించాల్సి వచ్చింది.

యజమాని లేచి వస్తాడనుకుని..

సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాక కూడా, ఆ కుక్క తన తోక ఆడిస్తూ.. యజమాని ఇప్పుడే లేచి తనతో ఆడతాడన్నట్టు అమాయకంగా చూస్తుండటం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మంచు కొండల్లో ఆ మూగజీవి చూపిన ప్రేమ అందరినీ కన్నీరు పెట్టిస్తోంది.

ముచ్చట్లు పెట్టుకుంటే మూడినట్లే

బెంగళూరు కేఫ్‌లో గంట దాటితే రూ. వెయ్యి!

ముచ్చట్లన్నాక ముగింపు ఉండాలి, కానీ బెంగళూరు కేఫ్‌లలో కూర్చునే 'జ్ఞానులకి'కాలజ్ఞానమే ఉండదు. కప్పు కాఫీ ఆర్డర్ ఇచ్చి, ఆ ఆవిరి ఆరిపోయేలోపే ప్రపంచ సమస్యలన్నీ పరిష్కరించేద్దామని ఫిక్స్ అయిపోతారు. స్టార్టప్ చర్చలకు, ఆఫీస్ మీటింగ్‌లకు అడ్డాగా మార్చేస్తారు. ఇలాంటి 'మీటింగ్'రాయుళ్లకి చుక్కలు చూపిస్తూ ఒక కేఫ్ యజమాని అదిరిపోయే చెక్ పెట్టాడు. శోభిత్ బక్లీవాల్ అనే వ్యక్తి 'ఎక్స్'లో ఈ నోటీసు ఫొటోను షేర్ చేశారు.

నోటీసు సారాంశం ఏమనగా..

'మీటింగ్స్ నాట్ అలౌడ్..'.. అంటే ఇకపై అక్కడ 'స్టార్టప్ ఐడియాల'గురించి తీవ్ర చర్చోపచర్చలు పెట్టుకోవడానికి వీల్లేదు. ఒకవేళ మీ ముచ్చట్లు గంట దాటితే.. నిమిషానికి ఒక లెక్క కాదు, ఏకంగా గంటకు రూ.1000 వదిలించుకోవలసిందే.. దీనిపై సోషల్ మీడియాలో విపరీతంగా సెటైర్లు పేలుతున్నాయి. కేఫ్‌కి వెళ్లేది కాఫీ తాగడానికి కాదు, నెట్ ఫ్రీగా వస్తుందని ల్యాప్‌టాప్ ఓపెన్ చేసి 'యూనికార్న్'కంపెనీలు పెట్టేయడానికి! గంటల తరబడి టేబుల్ ఆక్రమించేసి, పాపం యజమాని కళ్లల్లో నీళ్లు తెప్పిస్తుంటారు. రాజకీయాలు, సినిమాలు, ఆఫీస్ గాసిప్స్.. వీటన్నింటినీ ఒక చిన్న కాఫీ కప్పు సాక్షిగా గంటల తరబడి తెగ చర్చించేసుకోవడం వీరికి అలవాటు. ఇప్పుడు ఆ ముచ్చట్లు సాగాలంటే.. ముచ్చట తీరాలంటే.. వెయ్యి రూపాయలు వదలాల్సిందే.

కప్పు కాఫీ.. కబుర్లు బోలెడు

కొందరికైతే ఆ కేఫ్ టేబులే వాళ్ల ఆఫీస్ డెస్క్.. ఆర్డర్ ఇచ్చేది చిన్న సమోసా, కానీ బిల్డప్ మాత్రం బిల్‌గేట్స్ రేంజ్‌లో ఉంటుంది. దీనిపై నెటిజన్లు విపరీతంగా స్పందిస్తున్నారు. 'గంటకు వెయ్యి అంటే.. ఆ బిల్లు చూశాక ముచ్చట్లు పెట్టుకునే వారికి గుండె ఆగిపోవడం ఖాయం!'.. అని ఒకరంటే.. 'పాపం కేఫ్ యజమాని ఎంత కసి మీద ఉన్నాడో.. ఆ వెయ్యి రూపాయల చార్జి చూస్తేనే అర్థమవుతోంది!'.. అని ఇంకొకరు నవ్వుకున్నారు. మొత్తానికి, ఆ కేఫ్‌కి వెళ్లేవారు ఇకపై 'వాచ్'చూసుకుంటూ ముచ్చట్లు పెట్టుకోవాలి. లేదంటే కాఫీ కంటే ఎక్కువ బిల్లు ముచ్చట్లకే కట్టాల్సి వస్తుంది సుమా..

- సాక్షి, నేషనల్ డెస్క్

'దివ్య'మైన భారతీయం!

కెనడా గడ్డపై మెరిసిన 'నౌవారీ'చీర

దివ్య లోట్లికర్.. కెనడాలో నివసిస్తున్న భారతీయ మహిళ. తన పౌరసత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంప్రదాయ మరాఠీ నౌవారి చీరను ధరించి హాజరయ్యారు అక్కడ అందరూ పాశ్చాత్య సూట్లు, ఫార్మల్ డ్రెస్సుల్లో మెరుస్తుంటే, దివ్య మాత్రం తన అస్తిత్వాన్ని వెతుక్కుంది. అచ్చమైన మరాఠీ 'నౌవారీ'(తొమ్మిది గజాల చీర) ధరించి, సంప్రదాయ ఆభరణాలు, చంద్రవంక బొట్టుతో ఆ సభలోకి అడుగుపెట్టింది. ఆమె అడుగులో భారతీయం, ఆమె చూపులో ఆత్మవిశ్వాసం ఉట్టిపడ్డాయి.

వేర్లు మర్చిపోని విత్తు

'నేను ఎక్కడున్నానన్నది ఎంత గర్వకారణమో.. ఎక్కడి నుండి వచ్చానన్నది మర్చిపోకపోవడం అంతకంటే ముఖ్యం'.. అంటూ ఆమె ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేసిన వీడియో నెటిజన్ల హృదయాలను తాకింది. ఇది కేవలం వస్త్రం కాదు, ధైర్యానికి ప్రతీక. వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి సమరంలో ధరించిన ఈ శైలి, స్త్రీ శక్తిని, సంప్రదాయాన్ని ఏకకాలంలో ఆవిష్కరించింది.

తొమ్మిది గజాల ఆత్మగౌరవం

పౌరసత్వ పత్రం అందుకుంటున్న ఆ క్షణంలో, ఆమె ధరించిన చీర ఒక సంస్కృతికి రాయబారిలా నిలిచింది. కొత్త ఆకాశం కింద రెక్కలు విప్పుకున్నా, తనను ఎదిగేలా చేసిన మట్టి వాసనను ఆమె విస్మరించలేదు. దేహం కెనడా పౌరసత్వాన్ని స్వీకరిస్తున్నా, ఆత్మ మాత్రం భారతీయ మూలాల్లోనే సేద దీరుతోందని ఆమె వేషధారణ నిరూపించింది. ఇది కేవలం ఒక వేడుక కాదు.. ప్రపంచ కుగ్రామంపై 'స్వదేశీ'సంతకం. దేశం ఒక భూభాగం మాత్రమే కాదు.. అది మనం ధరించే సంస్కృతి.. మనం మోసే జ్ఞాపకం..

సహకారం బలోపేతం చేసుకుంటాం

భారత్‌తో కలిసి పని చేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం

- కెనడా ఇంధన శాఖ మంత్రి టిమ్ హడ్గ్‌సన్ వెల్లడి

బేతుల్(గోవా): భారత్–యూరోపియన్ యూనియన్(ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం పట్ల కెనడా ఇంధన, సహజ వనరుల శాఖ మంత్రి టిమ్ హడ్గ్‌సన్ హర్షం వ్యక్తంచేశారు. టారిఫ్‌లు, ఆంక్షలతో ఇతర దేశాలపై కక్ష సాధించాలని చూస్తున్న నాయకులకు ఇది సరైన సమాధానం అవుతుందని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరును పరోక్షంగా తప్పుపట్టారు. భారత్‌తో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని చెప్పారు. భారత్‌కు ఇంధన ఎగుమతులు మరింత పెంచాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. అమెరికాకు చేసే ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడడం తగ్గించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. నచ్చని దేశాలపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఇంధనాన్ని ఆయుధంగా వాడే ప్రసక్తే లేదన్నారు. మంగళవారం గోవాలో భారత ఇంధన వారోత్సవం–2026లో టిమ్ హడ్గ్‌సన్ ప్రసంగించారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ భారీగా ఒడిదొడుకులకు లోనయ్యే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ప్రపంచం ఎలా ముందుకు సాగాలన్నది తామే నిర్ణయించాలని కొన్ని పెద్దదేశాలు ఆరాటపడుతున్నాయని ఆక్షేపించారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్–ఈయూ మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడం సంతోషకరమని అన్నారు. స్వేచ్ఛా వాణిజ్యం, విశ్వసనీయ భాగస్వామ్యాలకు అనుకూలంగా ఇది బలమైన సంకేతం ఇస్తోందన్నారు. 'నో'అని ఎలా చెప్పాలో తెలియజేయడానికి ఇదొక ప్రతీక అని స్పష్టంచేశారు. అందరిపైనా విచ్చలవిడిగా టారిఫ్‌లు వేస్తామంటే కుదరదని ట్రంప్‌కు పరోక్షంగా హితవు పలికారు. స్వేచ్ఛా వాణిజ్యం, విశ్వసనీయ భాగస్వామ్యాలు కలిగిన ప్రపంచం నేడు కావాలన్నారు. కెనడాకు చెందిన ఇంధనంలో 98 శాతాన్ని అమెరికాకు ఎగుమతి చేస్తుండడం వ్యూహాత్మక తప్పిదమని మంత్రి టిమ్ హడ్గ్‌సన్ పేర్కొన్నారు. భారత్‌తో కలిసి పని చేయడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నామని స్పష్టంచేశారు. ఎల్‌ఎన్‌జీ, ఎల్‌పీజీ, చమురు, ఉరేనియం, అరుదైన ఖనిజాల విషయంలో భారత్‌తో సహకారం బలోపేతం చేసుకుంటామని వివరించారు. భారత్ అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌గా ఎదుగుతోందని తెలిపారు. కెనడా సూపర్‌పవర్‌గా మారాలంటే భారత్‌తో కలిసి వ్యాపారం చేయాలని వ్యాఖ్యానించారు.

హడ్గ్‌సన్

కెనడాలో ఖనిజాలపై పెట్టుబడులు: హర్దీప్‌సింగ్ పురి

కెనడాలో అరుదైన ఖనిజాల వెలికితీతపై పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్లు కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి చెప్పారు. ఖనిజాల రంగంలో ఉమ్మడి సహకారంపై త్వరలో చర్చలు ప్రారంభిస్తామని తెలిపారు. ఇందకోసం ప్రతినిధి బృందాన్ని పంపించబోతున్నట్లు వెల్లడించారు. ఇంధన వారోత్సవం సందర్భంగా ఆయన కెనడా మంత్రి టిమ్ హడ్గ్‌సన్‌తో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. భారత్–కెనడా ద్వైపాక్షిక ఇంధన వాణిజ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని తాము నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఎల్‌ఎన్‌జీ, ఎల్‌పీజీతోపాటు ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను భారత్‌కు ఎగుమతి చేయడానికి కెనడా సుముఖంగా ఉన్నట్లు తెలిపారు.

ఉగ్ర కుట్రను భగ్నం చేసిన గుజరాత్ ఏటీఎస్

ఉత్తరప్రదేశ్ యువకుడి అరెస్టు

అహ్మదాబాద్: గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్(ఏటీఎస్) అధికారులు ఉగ్రవాద కుట్రను భగ్నం చేశారు. నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మొహమ్మద్ సిద్ధాంతాల ప్రభావంతో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఫైజాన్ షేక్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఇక పిస్తోల్, ఆరు తూటాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు మంగళవారం చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌కు చెందిన 22 ఏళ్ల ఫైజాన్ షేక్ దర్జీగా పని చేస్తున్నాడు. జైషే మొహమ్మద్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడయ్యాడు. ప్రస్తుతం గుజరాత్‌లోని నవసారిలో నివసిస్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌లో కొందరు వ్యక్తులు మహ్మద్ ప్రవక్తను అవమానించారంటూ కక్ష పెంచుకున్నాడు. వారిని హత్య చేయడానికి పథకం రచించాడు. ఆయుధం సమకూర్చుకున్నాడు. అతడి గురించి సమాచారం అందుకున్న గుజరాత్ ఏటీఎస్ సిబ్బంది ఆదివారం అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఉన్నత స్థాయి వ్యక్తులను హత్య చేయడానికి కుట్ర పన్నాడని అధికారులు తెలిపారు. అలాగే భారతదేశం నుంచి జమ్మూకశ్మీర్‌ను, లద్దాఖ్‌ను విడదీసేలా అక్కడి ప్రజలను ప్రేరేపించాలన్నదే అతడి పన్నాగమని వెల్లడించారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

విఫలమైతే మళ్లీ అధికారంలోకి రావడం కల్ల

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక

అహ్మదాబాద్: దేశంలో సనాతన ధర్మం విలువలను పరిరక్షించడంతో విఫలమైన ఏ ప్రభుత్వం కూడా మళ్లీ ఎప్పటికీ అధికారంలోకి రాదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తేల్చిచెప్పారు. మంగళవారం గుజరాత్‌లోని గాంధీనగర్‌లో స్వామి నారాయణ భక్తుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 1826లో భగవాన్ స్వామినారాయణ 212 సంస్కృత శ్లోకాలతో రచించిన ప్రవర్తనా నియమావళి 'శిక్షాపాత్రి'కి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత సనాతన సంప్రదాయాలను పాటించడానికి ప్రజలు చాలాకాలం వేచి చూడాల్సి వచ్చిందని అమిత్ షా అన్నారు. సనాతన సూత్రాల ప్రకారం పరిపాలన సాగించాలని ప్రభుత్వాలకు సూచించారు. మన ధర్మానికి సరైన ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. 550 ఏళ్ల క్రితం విధ్వంసానికి గురైన అయోధ్య రామ మందిరాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మళ్లీ నిర్మించుకున్నామని తెలిపారు. దేశ ప్రజల శతాబ్దాల ఆకాంక్షను మోదీ ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం గత ఏళ్లుగా ఎన్నో చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఆర్టికల్ 370ని రద్దు చేశామని, ట్రిపుల్ తలాక్ విధానం తొలగించామని, ఉమ్మడి పౌరస్మృతికి శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. ప్రాచీన సంప్రదాయాలను పునరుద్ధరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. యోగా, ఆయుర్వేదం, గో సంరక్షణ వంటి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బద్రీనాథ్, కేదార్‌నాథ్, కాశీ విశ్వనాథ్, సోమనాథ్ వంటి ఆలయాలకు పూర్వవైభవం వస్తోందన్నారు. భారతీయ సమాజానికి.. ప్రధానంగా గుజరాత్‌కు స్వామి నారాయణ అందించిన సేవలను అమిత్ షా ప్రశంసించారు. సమాజాన్ని సంస్కరించిన మహోన్నత వ్యక్తి అంటూ కొనియాడారు.

ప్రభుత్వాధికారులపై ఫిర్యాదుకు అఫిడవిట్ తప్పనిసరి: సుప్రీం

న్యూఢిల్లీ: ప్రభుత్వ అధికారులు విధి నిర్వహణలో తప్పిదాలకు పాల్పడ్డారంటూ వచ్చే ఫిర్యాదులకు అఫిడవిట్ తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయాధికారులపై వచ్చే ఫిర్యాదులను అఫిడవిట్ లేనిదే తీసుకోరాదంటూ గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హైకోర్టులకు పంపిన లేఖను ప్రస్తావించింది. ఓ మహిళను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలున్న ముగ్గురు పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్‌మోహన్ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పైవిధంగా స్పష్టతనిచ్చింది. న్యాయాధికారులపై వచ్చే ఆరోపణల ప్రామాణికతకు అఫిడవిట్ అవసరమైనప్పుడు.. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఇదే నిబంధన వర్తింపజేయడం సమంజసమని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రభుత్వ ఉద్యోగులపై వచ్చే తప్పుడు ఫిర్యాదులకు చెక్ పెట్టడం, బాధ్యులను శిక్షించడం, ఉద్యోగులను అనవసర న్యాయపరమైన వేధింపుల నుంచి రక్షించడం మధ్య సమతుల్యతను కాపాడటమే ఈ నిబంధన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమని ధర్మాసనం వివరించింది.

తగ్గిన అమెరికా జనాభా వృద్ధి రేటు

ఓర్లాండో(యూఎస్): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అవలంబిస్తున్న వలస వ్యతిరేక విధానాలతో ఆ దేశంలో జనాభా వృద్ధి రేటు తగ్గిపోయింది. ఈ వివరాలను అమెరికా జనాభా బ్యూరో మంగళవారం వెల్లడించింది. 2024 ఏడాదిలో ఒక శాతంగా ఉన్న జనాభా వృద్ధి రేటు 2025 ఏడాదిలో ఏకంగా 0.5 శాతానికి పడిపోయింది. 2024లో 28 లక్షల మంది వలస రాగా 2025లో కేవలం 13 లక్షల మంది వలసవచ్చారు. వీరిలో చట్టబద్ధ వలసలెన్ని? అక్రమ వలసలెన్ని? అనే వివరాలను బ్యూరో స్పష్టంగా పేర్కొనలేదుగానీ వలసలు, స్థానికులతో కలిసి ప్రస్తుతం అమెరికా జనాభా 34.2 కోట్లకు చేరుకుందని ప్రకటించింది. ''లాస్ ఏంజెలెస్, పోర్ట్‌ల్యాండ్, ఒరెగాన్‌లలో ఫెడరల్ బలగాలతో ట్రంప్ అక్రమవలసదారుల కోసం వేట మొదలెట్టడంతో అమెరికా నుంచి చాలా మంది అక్రమవలసదారులు తరలిపోయారు. కఠిన చట్టాల కారణంగా అమెరికాలోకి రాకలు తగ్గిపోయాయి. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి అక్రమ చొరబాట్లను సైతం ట్రంప్ సర్కార్ గణనీయ స్థాయిలో అడ్డుకుంది. దీంతో అమెరికాలోకి వచ్చేవారికంటే వదిలి వెళ్లిపోయే వాళ్ల సంఖ్య ఎక్కువైపోయింది. దీంతో దేశంలో జనాభా తగ్గి జననాలూ తగ్గాయి. చివరకు జనాభా వృద్ధి రేటు పడిపోయింది''అని సెన్సస్ బ్యూరోలో సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ ఎరిక్ జెన్సెన్ విశ్లేషించారు.

వలసదారులందరికీ చట్టబద్ధ హోదా

స్పెయిన్ ప్రభుత్వం ప్రకటన

బార్సిలోనా: తమ దేశంలో ఎలాంటి అనుమతులు లేకుండా నివసిస్తున్న, పనులు చేసుకుంటున్న వారికి చట్టబద్ధ హోదా కల్పిస్తామని స్పెయిన్ ప్రభుత్వం ప్రకటించింది. యూరోప్‌లోని చాలా దేశాలతోపాటు అమెరికా వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న వేళ స్పెయిన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అనుమతి లేకుండా స్పెయిన్‌లో నివసిస్తున్న వలసదారులకు ఒక సంవత్సరం వరకు చట్టబద్ధమైన నివాస హోదాను, పని చేసుకునే అనుమతిని (వర్క్ పర్మిషన్)ను ఇచ్చేందుకు వీలుగా అతిత్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామని స్పెయిన్ మంత్రి ఎల్మా సయీజ్ తెలిపారు. ఈ హోదా కావాలనుకునేవారు దేశంలోకి 2025 డిసెంబర్ 31వ తేదీకి ముందు వచ్చినట్లు లేదా కనీసం ఐదు నెలలుగా నివసిస్తున్నట్లు ధ్రువీకరణలు చూపాల్సి ఉంటుంది. అదేవిధంగా, ఎలాంటి నేరారోపణల రికార్డు ఉండరాదు. ఈ నిర్ణయం వల్ల కనీసం 5 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని మంత్రి ఎల్మా చెప్పారు.

కరాచీ ప్రమాదం.. 73కు చేరిన మరణాలు

కరాచీ(పాకిస్తాన్): కరాచీలోని గుల్ షాపింగ్ ప్లాజాలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మరణాల సంఖ్య 73కు చేరుకుంది. జనవరి 17వ తేదీన ఈ దుకాణ సముదాయంలో చెలరేగిన మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది రెండు రోజులపాటు శ్రమించాల్సి వచ్చింది. బాధితుల కోసం అన్వేషణ పూర్తయిన తర్వాత ప్లాజా నిర్మాణాన్ని పూర్తిగా నేలమట్టం చేశామని కరాచీ మేయర్ ముర్తజా వహాబ్ చెప్పారు. ఘటనలో 73 మంది చనిపోగా, 20 మంది గాయపడ్డారన్నారు. బేస్‌మెంట్‌లోని రెండు దుకాణాల్లోనే 30 మంది సజీవ దహనమయ్యారని చెప్పారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు అందజేస్తామని సింధ్ ప్రావిన్స్ సీఎం తెలిపారు. దుకాణదారులకు రూ.5 లక్షల చొప్పున ఇస్తామన్నారు.

ఉక్రెయిన్‌పై ఆగని డ్రోన్ దాడులు

కీవ్: ఉక్రెయిన్‌లోని ఒడెసాపై మంగళవారం రష్యా జరిపిన డ్రోన్ దాడిలో ఇద్దరు చిన్నారులు, గర్భిణి సహా 23 మంది గాయపడ్డారు. విద్యుత్ వసతులే లక్ష్యంగా కనీసం 50 అత్యాధునిక వెర్షన్ డ్రోన్లను రష్యా ప్రయోగించిందని అధికారులు తెలిపారు. కొన్ని నివాస భవనాలు ధ్వంసమయ్యాయని, శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని గుర్తించి కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రొటెస్టెంట్ ప్రార్థనా మందిరం కూడా దెబ్బతిందన్నారు. సోమవారం రాత్రి ఏడు ప్రాంతాల్లోని లక్ష్యాలపై రష్యా 165 డ్రోన్లను ప్రయోగించగా 140 వరకు కూల్చేసినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది.

ఇరాన్ ఆందోళనల్లో 6,126 మంది మృతి

దుబాయ్: ఇరాన్‌లో కొనసాగుతున్న నిరసనలను ప్రభుత్వం కఠినంగా అణచివేస్తుండటం తెల్సిందే. ప్రభుత్వ బలగాల చేతుల్లో కనీసం 6, 126 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికాలోని హ్యూమన్‌రైట్స్ యాక్టివిస్ట్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. మరణాలు ఇంతకుమించి కూడా ఉండే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. మరో 41,800 మందిని అరెస్ట్ చేశారని వెల్లడించింది. ఇరాన్ ప్రభుత్వం మాత్రం ఆందోళనల్లో చనిపోయిన వారి సంఖ్య 3,117 మంది మాత్రమేనని వీరిలో 2,427 మంది పౌరులు, భద్రతా సిబ్బంది కాగా మిగతా వారిని ఉగ్రవాదులని పేర్కొంటోంది.

ఘోరంగా పడిపోయిన రియాల్ విలువ

దుబాయ్: ఇరాన్‌లో అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక పరిస్థితులు, నెల రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలకు ట్రంప్ యుద్ధ ప్రకటనలు తోడయ్యాయి. గల్ఫ్ ప్రాంతానికి భారీగా ఆయుధ, సైనిక సంపత్తిని అమెరికా తాజాగా పంపించడంతో ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ మరింతగా పతనమైంది. 15 లక్షల రియాల్స్ విలువ ఒక అమెరికన్ డాలర్‌తో సమానంగా మంగళవారం టెహ్రాన్‌లో ఎక్స్ఛేంజి దుకాణాల్లో మారకం నడిచింది.

పాక్‌లో శ్రీరాముని కుమారుడి ఆలయం

లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ చారిత్రక లాహోర్ కోటలో ఉన్న శ్రీరాముడి కవల కుమారుల్లో ఒకరైన లవుడి పేరుతో ఉన్న లోహ ఆలయాన్ని అధికారులు పూర్తి స్థాయిలో పునరుద్ధరించారు. భక్తుల సందర్శనలకు ఏర్పాట్లు చేశారు. లవుడి పేరుతోనే లోహ, లాహోర్ అనే పేరు వచ్చినట్లుగా భావిస్తున్నారు. 2018లో ఈ ఆలయాన్ని పాక్షికంగా పునరుద్ధరించారు. ఆగా ఖాన్ కల్చరల్ సర్వీస్–పాక్ ప్రభుత్వం సహకారంతో... సిక్కుల కాలం నాటి 'హమ్మామ్' (స్నానశాల), మహారాజా రంజిత్ సింగ్ నిర్మించిన 'అత్‌దారా పెవిలియన్' అనే మరో రెండు కట్టడాలను కూడా పునరుద్ధరిస్తున్నారు.

చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

చెన్నై: చెన్నై విమానాశ్రయంలో మంగళవారం స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. అయితే విమానాశ్రయానికి ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు స్పష్టంచేశారు. విమానాల రాకపోకలకు సైతం ఎలాంటి అంతరాయం కల్గలేదని తెలిపారు. ''ఉదయం 11.45 గంటలప్పుడు టీ2 డిపార్చర్ ప్రాంతంలో ఎయిర్‌లైన్ ఆఫీస్‌లున్న చోట్ల అగ్నిప్రమాదం జరిగింది. వెనువెంటనే అగ్నిమాపక విభాగం అప్రమత్తమై మంటల్ని ఆర్పేసింది. 12.45 గంటలకల్లా అంతా సద్దుకుంది. ఏఏఐ ఫైర్ సర్వీస్, రాష్ట్ర అగ్నిమాపక బృందం, సీఐఎస్ఎఫ్, పోలీస్‌లు సమయానుగుణంగా స్పందించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు''అని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఒక ప్రకటనలో పేర్కొంది.

గోల్డీ బ్రార్ తల్లిదండ్రుల అరెస్ట్

చండీగఢ్: విదేశాల్లో ఉంటూ గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ బెదిరింపులకు పాల్పడుతుంటే స్వదేశంలో ఉంటూ అతని తల్లిదండ్రులను సైతం అదే పనిచేస్తున్నారన్న ఆరోపణలతో పంజాబ్ పోలీసులు వాళ్లను అరెస్ట్‌చేశారు. బ్రార్‌కు తండ్రి షంషేర్ సింగ్, తల్లి ప్రీత్‌పాల్ కౌల్ సాయపడుతున్నారన్న ఆరోపణలపై ఇద్దరినీ అమృత్‌సర్ పోలీసులు ముక్త్‌సర్ జిల్లాలో అరెస్ట్‌చేసి జిల్లా కోర్టులో ప్రవేశపెట్టారు. జనవరి 30వ తేదీదాకా ఇద్దరినీ పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ముక్త్‌సర్ జిల్లా ఉదేకరణ్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి బ్రార్ తల్లిదండ్రుల నుంచి ఒక వాట్సాప్ సందేశం వచ్చింది. బాంబిహా గ్యాంగ్‌కు వెంటనే రూ.50 లక్షలు ముట్టజెప్పాలని బెదిరించారు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదుచేయడంతో ఆ కేసులో భాగంగా బ్రార్ తల్లిదండ్రులను అరెస్ట్‌చేశారు.

దక్షిణ కొరియాకు ట్రంప్ టారిఫ్ బెదిరింపు

వాషింగ్టన్: గతేడాది కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఇప్పటి వరకు అమలు చేయని కారణంగా దక్షిణ కొరియాపై టారిఫ్‌లు విధించబోతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. ఔషధాలు, ఆటోమొబైల్ తదితర రంగాలకు చెందిన ఉత్పత్తులపై 15 నుంచి 25 శాతం వరకు టారిఫ్‌లను వసూలు చేస్తామని స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య గతేడాది జూలైలో వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీన్ని దక్షిణ కొరియా పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంది. 'వాణిజ్య ఒప్పందాలు మాకు చాలా ముఖ్యమైనవి. ఒప్పందాలు కుదిరిన చోట్ల టారిఫ్‌లు తగ్గించుకుంటూ వస్తున్నాం. భాగస్వామ్య దేశాలు కూడా ఇదే రీతిలో స్పందిస్తాయని భావిస్తున్నాం'అని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ హెచ్చరికలపై దక్షిణ కొరియా ప్రభుత్వం స్పందించింది. హామీ ఇచ్చిన విధంగా అమెరికాలో పెట్టుబడులకు కట్టుబడి ఉన్నామని, ఒప్పందంలోని ఇతర అంశాలపై ఉన్నత స్థాయి సంప్రదింపులు కొనసాగిస్తామని తెలిపింది.

ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం

సియోల్: ఉత్తరకొరియా మంగళవారం తక్కువ శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఉత్తరకొరియా రాజధాని ప్యాంగాంగ్‌కు ఈశాన్య ప్రాంతం నుంచి పలు క్షిపణులను ప్రయోగించినట్లు తమ దృష్టికి వచ్చిందని దక్షిణ కొరియా తెలిపింది. అవి కనీసం 350 కిలోమీటర్ల మేర ప్రయాణించినట్లు గుర్తించామంది. రెచ్చగొట్టే ఎలాంటి చర్యలనైనా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామంది. ఉత్తర కొరియా మంగళవారం రెండు బాలిస్టిక్ క్షిపణులను తూర్పు తీరం దిశగా ప్రయోగించిందని మరో పొరుగుదేశం జపాన్ పేర్కొంది. ఆ దేశం చర్యలు తమ దేశానికి, ఈ ప్రాంతానికే కాదు, ప్రపంచ శాంతికి విఘాతం కలిగించేవిగా ఉన్నాయని విమర్శించింది.

'ది అన్-టచబుల్స్' గ్రంథ రచయిత?

సామాజిక అసమానతలు, సామాజిక వెలి, కులతత్వం, మతతత్వం, బాల కార్మిక వ్యవస్థ, అంగవైకల్యం, వృద్ధులు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

1. 'సామాజిక వెలి' అనే పదాన్ని మొదటిసారి ఉపయోగించిన వ్యక్తి?
   ఎ) హట్టన్ బి) రెనీ లీనియర్
   సి) ఎం.ఎన్. శ్రీనివాస్ డి) హెర్బర్ట్ రిస్లే
2. సామాజిక అసమానతలకు ప్రధాన కారణాలు ఏ రకమైనవి?
   ఎ) రాజకీయ పరమైనవి
   బి) సాంస్కృతిక పరమైనవి
   సి) ఆర్థిక పరమైనవి డి) పైవన్నీ
3. 'సామాజిక వెలి' అనే పదాన్ని మొదటగా ఏ దేశ పరిస్థితులను ఉదహరించడానికి ఉపయోగించారు?
   ఎ) అమెరికా బి) ఈజిప్ట్
   సి) ఫ్రాన్స్ డి) ఇండియా
4. కింది వాటిలో సామాజిక వెలి దుష్ఫలితం ఏది?
   ఎ) వివక్ష బి) వలసలు
   సి) నిరుద్యోగం డి) పైవన్నీ
5. కింది వాటిలో సామాజిక స్తరీకరణ (Social Stratification) రూపం ఏది?
   ఎ) కులం బి) బానిసత్వం
   సి) వర్గం డి) పైవన్నీ
6. సామాజిక అసమానతలను రూపుమాపడానికి ఏం చేయాలి?
   ఎ) విద్యను పెంపొందించాలి
   బి) ఆర్థిక సమానత్వం సాధించాలి
   సి) అభివృద్ధి కార్యక్రమాల్లో వివక్ష లేకుండా చూడాలి
   డి) పైవన్నీ
7. కులతత్వం బాగా పెరగడానికి కారణం?
   ఎ) ఓటు బ్యాంకు రాజకీయాలు
   బి) సమాచార సాంకేతికత
   సి) ఆర్థిక అసమానత్వం
   డి) పైవన్నీ
8. జతపరచండి.
   గ్రూప్ – ఎ
   a. క్యాస్ట్ ఇన్ మోడ్రన్ ఇండియా
   b. క్యాస్ట్ అండ్ రేస్ ఇన్ ఇండియా
   c. క్యాస్ట్ ఇన్ ఇండియా
   d. ద హిందూ క్యాస్ట్ సిస్టమ్
   గ్రూప్ – బి
   i. ఎం.ఎన్. శ్రీనివాస్
   ii. జి.ఎస్. ఘుర్యే
   iii. జె.హెచ్. హట్టన్
   iv. హెరాల్డ్
   ఎ) a-i, b-ii, c-iii, d-iv
   బి) a-i, b-iii, c-ii, d-iv
   సి) a-ii, b-iii, c-i, d-iv
   డి) a-iv, b-i, c-iii, d-ii
9. కింది వాటిలో కులతత్వం వల్ల కలిగే దుష్పరిణామం ఏది?
   ఎ) జాతీయ భావాలకు భంగం కలగడం
   బి) ప్రజాస్వామ్యం నిర్వీర్యం చెందడం
   సి) సామాజిక అవ్యవస్థత
   డి) పైవన్నీ
10. కింది వాటిలో కులతత్వ నిర్మూలనకు దోహదపడే అంశం ఏది?
   ఎ) విద్యా వ్యాప్తి
   బి) కులాంతర వివాహాలు
   సి) సాంస్కృతిక- ఆర్థిక సమానత్వం
   డి) పైవన్నీ
11. రిజర్వేషన్లు కల్పించాలని ఒక సామాజిక వర్గం చేసిన ఆందోళనల్లో భాగంగా రైలును తగులబెట్టిన ఘటన ఎక్కడ జరిగింది?
   ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తెలంగాణ
   సి) హరియాణా డి) రాజస్థాన్
12. 2016 జనవరిలో హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ కట్టర్ 'ఖాప్ పంచాయతీ'లను నిర్మూలించడం సాధ్యం కాదు అని పేర్కొన్నారు. ఈ 'ఖాప్ పంచాయతీ'లకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ఇవి కుల పంచాయతీలు
   బి) ఇవి చట్ట వ్యతిరేకమైనవి
   సి) పరువు హత్యలకు కారణం అవుతున్నాయి
   డి) పైవన్నీ
13. కింది వాటిలో కులతత్వానికి కారణం ఏది?
   ఎ) కుల ప్రతిష్టల భావన
   బి) అంతర్వివాహ నియమం
   సి) నగరీకరణ, సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు
   డి) పైవన్నీ
14. జతపరచండి.
   a. ఆర్టికల్ – 14
   b. ఆర్టికల్ – 17
   c. ఆర్టికల్ – 46
   i. చట్టం ముందు అందరూ సమానులే
   ii. అస్పృశ్యత నివారణ
   iii. బలహీన వర్గాల అభివృద్ధికి చర్యలు
   ఎ) a-i, b-ii, c-iii
   బి) a-iii, b-ii, c-i
   సి) a-ii, b-i, c-iii
   డి) a-i, b-iii, c-ii
15. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నిరోధక) చట్టం–1989కు కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసింది. దీని ప్రకారం వారి హక్కులకు భంగం కలిగిస్తే గరిష్ఠంగా ఎంత కాలం శిక్ష పడుతుంది?
   ఎ) 10 ఏళ్లు బి) 15 ఏళ్లు
   సి) 20 ఏళ్లు డి) 5 ఏళ్లు
16. కులం అనే పదం 'కాస్టా' అనే ఏ భాషా పదం నుంచి ఆవిర్భవించింది?
   ఎ) ఇంగ్లిష్ బి) పోర్చుగీసు
   సి) స్పానిష్, పోర్చుగీసు
   డి) పైవేవీ కావు
17. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదును కూల్చివేసినప్పుడు దేశ ప్రధాని ఎవరు?
   ఎ) పి.వి. నరసింహారావు
   బి) అటల్ బిహారీ వాజ్‌పేయ్
   సి) ఐ.కె. గుజ్రాల్
   డి) చంద్రశేఖర్
18. కింది వాటిలో మతతత్వానికి కారణం ఏమిటి?
   ఎ) మత ఛాందస వాదం
   బి) బ్రిటిష్ పరిపాలన విధానాలు
   సి) దేశ విభజన పరిస్థితులు
   డి) పైవన్నీ
19. సంఘటనలు – విచారణ కమిటీలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) బాబ్రీ మసీదు విధ్వంసం – జస్టిస్ లిబర్‌హాన్ కమిషన్
   బి) బొంబాయి అల్లర్లు(1992) – జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్
   సి) గోద్రా అల్లర్ల(2002)పై మొదటిసారి వేసిన కమిషన్ – కె.జి. షా కమిషన్
   డి) పైవన్నీ
20. గోద్రా అల్లర్లు- 2002పై విచారణ కోసం రెండోసారి నియమించిన కమిషన్ ఏది?
   ఎ) కె.జి. షా కమిషన్
   బి) నానావతి కమిషన్
   సి) శ్రీకృష్ణ కమిషన్
   డి) ఏదీకాదు
21. కింది వాటిలో మత ఉద్రిక్తతలకు నివారణోపాయం ఏది?
   ఎ) లౌకిక దృక్పథాలను అభివృద్ధి పరచడం
   బి) మత రాజకీయ సంస్థలపై నిషేధం విధించడం
   సి) ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడం
   డి) పైవన్నీ
22. 'మతం మత్తు లాంటిది' అని వ్యాఖ్యానించిన వారు?
   ఎ) మార్క్స్ బి) ఎం.ఎన్. శ్రీనివాస్
   సి) హెగెల్ డి) లెనిన్
23. భారత రాజ్యాంగం ప్రకారం అల్పసంఖ్యాక వర్గాలకు రక్షణ కల్పించే ప్రకరణలు ఏవి?
   ఎ) ప్రకరణలు 29, 30
   బి) ప్రకరణలు 14, 18
   సి) ప్రకరణలు 23, 24
   డి) ప్రకరణలు 25, 28
24. పార్లమెంటు చేసిన చట్టం ప్రకారం బాల నేరస్థులుగా పరిగణించడానికి కనీస వయసు ఎంత?
   ఎ) 18 ఏళ్లు బి) 16 ఏళ్లు
   సి) 20 ఏళ్లు డి) 21 ఏళ్లు
25. కింది వాటిలో స్త్రీలపై జరుగుతున్న దాడులకు కారణం ఏది?
   ఎ) వరకట్న దాహం బి) పాశ్చాత్యీకరణ
   సి) పోర్నోగ్రఫీ డి) పైవన్నీ
26. కింది వాటిలో ఏ దశాబ్దాన్ని ఐక్యరాజ్యసమితి 'మహిళా దశాబ్దం'గా ప్రకటించింది?
   ఎ) 1975–1985 బి) 2005–2015
   సి) 1955–1965 డి) 1965–1975
27. కింద పేర్కొన్న ఏ కేసులో సుప్రీంకోర్టు మహిళలకు పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నుంచి రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది?
   ఎ) విశాఖ వర్సెస్ రాజస్థాన్
   బి) షాబానో వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా
   సి) అరుణారాయ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా
   డి) మాడిసన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా
28. జతపరచండి.
   గ్రూప్–ఎ గ్రూప్–బి
   a) వరకట్న నిషేధ చట్టం i) 2013
   b) సమాన వేతన చట్టం ii) 2005
   c) గృహ హింస నిరోధక చట్టం iii) 1976
   d) నిర్భయ చట్టం iv) 1961
   ఎ) a-i, b-ii, c-iii, d-iv,
   బి) a-iv, b-iii, c-i, d-ii
   సి) a-iv, b-i, c-ii, d-iii
   డి) a-iv, b-iii, c-ii, d-i
29. 1992లో ఏర్పాటు చేసిన జాతీయ మహిళా కమిషన్ మొదటి అధ్యక్షురాలు ఎవరు?
   ఎ) జయంతీ పట్నాయక్
   బి) మోహిని గిరి
   సి) పూర్ణిమా అద్వానీ
   డి) లలిత కుమార మంగళం
30. జతపరచండి.
   గ్రూప్– ఎ
   a. అస్పృశ్యత నివారణ
   b. సమాన పనికి సమాన వేతనం
   c. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు
   d. మహిళల అక్రమ రవాణా నివారించడం
   గ్రూప్– బి
   i. అధికరణ–17
   ii. అధికరణ– 39 (డి)
   iii. అధికరణ– 243 (డి)
   iv. అధికరణ –23
   ఎ) a-i, b-ii, c-iii, d-iv
   బి) a-iv, b-iii, c-ii, d-i
   సి) a-ii, b-i, c-iv, d-iii
   డి) a-iv, b-i, c-iii, d-ii
31. 'ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పింఛన్ల పథకం'ను ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1975 బి) 1985
   సి) 1995 డి) 2005
32. 'ది అన్–టచబుల్స్' గ్రంథ రచయిత? *(సీడీపీవో–2013)*
   ఎ) ఎం.ఎన్. శ్రీనివాస్
   బి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
   సి) ఘుర్యే డి) గాంధీ
33. అస్పృశ్యులను మొదటిసారిగా 'హరిజనులు' అని సంబోధించింది ఎవరు? *(సీడీపీవో–2013)*
   ఎ) లాల్ బహదూర్ శాస్త్రి
   బి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
   సి) విద్యాసాగర్ డి) గాంధీ
34. కులతత్వం అంటే ఏమిటి? *(సివిల్స్–1993)*
   ఎ) స్వీయ కులం పట్ల పక్షపాతం
   బి) సొంత కులం పట్ల పక్షపాతం- ఇతర కులాల పట్ల విరోధం
   సి) ప్రతి కులం పట్ల పక్షపాతం
   డి) కొన్ని కులాల పట్ల పక్షపాతం
35. ప్రపంచ వికలాంగుల సంక్షేమ దినోత్సవం ఎప్పుడు?
   ఎ) డిసెంబర్–3 బి) నవంబర్–3
   సి) అక్టోబర్–3 డి) జనవరి–3
36. భారత్‌లో వికలాంగులు 2001లో 2.19 కోట్లు ఉండగా 2011లో ఆ సంఖ్య 2.68 కోట్లకు పెరిగింది. వీరిలో ఎక్కువ శాతం ఎవరు ఉన్నారు?
   ఎ) చాలన వైకల్యం బి) వినికిడి సమస్య
   సి) దృష్టి సమస్య డి) బుద్ధి మాంద్యం
37. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
   ఎ) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వికలాంగులకు 3 శాతం రిజర్వేషన్లు కల్పించారు.
   బి) అధికరణ–42 వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలుపుతుంది.
   సి) తెలంగాణ రాష్ట్రంలో 'ఆసరా' పథకం కింద వికలాంగులకు ప్రతి నెలా రూ.1500 ఆర్థిక సహాయం అందిస్తున్నారు
   డి) పైవన్నీ
38. చట్టం, రూపొందించిన సంవత్సరానికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ది పర్సన్ విత్ డిసేబిలిటీస్ యాక్ట్–1995
   బి) ది నేషనల్ ట్రస్టు యాక్ట్–1999
   సి) మానసిక ఆరోగ్య చట్టం–1987 (Mental Health Act)
   డి) పైవన్నీ
39. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ - న్యూఢిల్లీ
   బి) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీకాప్డ్– డెహ్రాడూన్
   సి) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆర్థోపెడికల్లీ హ్యాండీకాప్డ్ – కోల్‌కతా
   డి) పైవన్నీ
40. బాల కార్మిక వ్యవస్థ (నిషేధ, నియంత్రణ) చట్టం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
   ఎ) 1984 బి) 1985
   సి) 1986 డి) 1987
41. భారత రాజ్యాంగంలో బాల కార్మిక వ్యవస్థను ప్రత్యక్షంగా నిషేధిస్తున్న ఆర్టికల్ ఏది?
   ఎ) ఆర్టికల్–14 బి) ఆర్టికల్–24
   సి) ఆర్టికల్ –25 డి) ఆర్టికల్–41
42. తెలంగాణలో వికలాంగులు ఏ జిల్లాలో అధికంగా ఉన్నారు?
   ఎ) ఆదిలాబాద్ బి) నిజామాబాద్
   సి) కరీంనగర్ డి) రంగారెడ్డి
43. వేదకాలంలో స్త్రీ అంతస్తు ఏ విధంగా ఉండేది? *(ఏపీపీఎస్సీ–2002)*
   ఎ) చాలా తక్కువ స్థాయి
   బి) కొంత వరకు ఉన్నత స్థాయి
   సి) పురుషుల కంటే ఉన్నత స్థాయి
   డి) సరిపోల్చలేని స్థాయి
44. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   ఎ) 2007 బి) 2008
   సి) 2009 డి) 2010

సమాధానాలు

1) బి	2) డి	3) సి	4) డి	5) డి
6) డి	7) డి	8) ఎ	9) డి	10) డి
11) ఎ	12) డి	13) డి	14) ఎ	15) ఎ
16) సి	17) ఎ	18) డి	19) డి	20) బి
21) డి	22) ఎ	23) ఎ	24) బి	25) డి
26) ఎ	27) ఎ	28) డి	29) ఎ	30) ఎ
31) సి	32) బి	33) డి	34) బి	35) ఎ
36) ఎ	37) డి	38) డి	39) డి	40) సి
41) బి	42) ఎ	43) సి	44) ఎ	

గమన నియమాలను ప్రతిపాదించింది ఎవరు?

యాంత్రిక శాస్త్రం

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

1. కింద పేర్కొన్న ఏ సూత్రంపై ఆధారపడి రాకెట్ పనిచేస్తుంది?
   ఎ) శక్తి నిత్యత్వ నియమం
   బి) బెర్నోలీ నియమం
   సి) అవగాడ్రో సిద్ధాంతం
   డి) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం
2. గుర్రపుస్వారీ చేసేవారు గుర్రం హఠాత్తుగా ముందుకు కదిలితే పడిపోయే ప్రమాదం ఉంది. దీనికి కారణమేమిటి?
   ఎ) జడత్వ భ్రామకం
   బి) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
   సి) నిశ్చల జడత్వం
   డి) న్యూటన్ మూడో గమన నియమం
3. క్రికెట్ ఆటగాడు బంతిని క్యాచ్ పట్టుకోవడానికి ముందు చేతులు వెనుకకు లాగుతాడు. ఎందుకంటే ..?
   ఎ) బంతి నిశ్చల స్థితికి వస్తుంది
   బి) బంతి త్వరణం చెందుతుంది
   సి) బంతి ఎక్కువ బలాన్ని కలుగజేస్తుంది
   డి) బంతి తక్కువ బలాన్ని కలుగజేస్తుంది
4. మీగడను వేరుచేసే యంత్రంలో ఎలాంటి బలం పనిచేస్తుంది?
   ఎ) అపకేంద్ర బలం బి) అభికేంద్ర బలం
   సి) కేంద్రక బలం కానిది
   డి) బాహ్య బలం
5. లిఫ్టులో ఉన్న వ్యక్తిపై పనిచేసే బలం కింది ఏ సందర్భంలో ఎక్కువ?
   ఎ) లిఫ్ట్ త్వరణంతో కిందికి వస్తున్నప్పుడు
   బి) లిఫ్ట్ త్వరణంతో పైకి వెళుతున్నప్పుడు
   సి) లిఫ్ట్ సమవేగంతో కిందికి వస్తున్నప్పుడు
   డి) లిఫ్ట్ సమవేగంతో పైకి వెళుతున్నప్పుడు
6. లిఫ్ట్‌లో ఉన్న వ్యక్తి దృశ్య భారం నిజ భారం కంటే ఏ సందర్భంలో తక్కువ?
   ఎ) లిఫ్ట్ త్వరణంతో పైకి వెళుతున్నప్పుడు
   బి) లిఫ్ట్ త్వరణంతో కిందికి వస్తున్నప్పుడు
   సి) లిఫ్ట్ సమవేగంతో పైకి వెళుతున్నప్పుడు
   డి) లిఫ్ట్ సమవేగంతో కిందికి వస్తున్నప్పుడు
7. మజ్జిగ చిలికినప్పుడు వెన్న వేరుపడటానికి కారణమేమిటి?
   ఎ) అపకేంద్ర బలం బి) గురుత్వ బలం
   సి) ఘర్షణ బలం డి) అయస్కాంత బలం
8. బస్సు మలుపు తిరిగేటప్పుడు అందులో ప్రయాణించే వ్యక్తి ఒక వైపు వంగుతాడు. దీనికి కారణం ఏమిటి?
   ఎ) గమన జడత్వం బి) దిశా జడత్వం
   సి) వేగ జడత్వం డి) స్థిర జడత్వం
9. కింది వాటిలో అపకేంద్ర బలంపై ఆధారపడి పనిచేసేది ఏది?
   ఎ) కప్పీ బి) వాషింగ్ మెషిన్
   సి) స్క్రూడ్రైవర్ డి) సామాన్యలోలకం
10. ధనస్సులో సంధించిన బాణం ఏ శక్తిని కలిగి ఉంటుంది?
   ఎ) గతిజ శక్తి బి) స్థితిజ శక్తి
   సి) ఘర్షణ శక్తి డి) గురుత్వ శక్తి
11. విరామంలో ఉన్న వస్తువు కింది వాటిలో దేన్ని కలిగి ఉంటుంది?
   ఎ) జడత్వం బి) బలం
   సి) వేగం డి) ద్రవ్యవేగం
12. గాలిలో ప్రయాణిస్తున్న విమానానికి ఉండే శక్తి ఏది?
   ఎ) స్థితిజ శక్తి బి) గతిజ శక్తి
   సి) ఎ, బి డి) ఏ శక్తి ఉండదు
13. పడవపై నుంచి ఒక వ్యక్తి ఒడ్డు పైకి దూకినప్పుడు పడవ వెనక్కి జరుగుతుంది. దీన్ని ఏ సూత్రం ఆధారంగా వివరించవచ్చు?
   ఎ) న్యూటన్ మొదటి గమన నియమం
   బి) న్యూటన్ రెండో గమన నియమం
   సి) న్యూటన్ మూడో గమన నియమం
   డి) న్యూటన్ గురుత్వాకర్షణ నియమం
14. ఒక వస్తువు భారం విషయంలో కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) భూతలంపై ఎక్కడైనా సమానం
   బి) ధ్రువాల వద్ద గరిష్ఠం
   సి) భూమధ్యరేఖ వద్ద గరిష్ఠం
   డి) చదునైన భూమిపై కంటే గుట్టలపై ఎక్కువ
15. ఒక వస్తువును భూమిపై నుంచి చంద్రుడి పైకి తీసుకువెళితే ..?
   ఎ) దాని ద్రవ్యరాశి మారుతుంది, భారం స్థిరంగా ఉంటుంది
   బి) ద్రవ్యరాశి, భారం.. రెండూ మార్పు చెందుతాయి
   సి) ద్రవ్యరాశి స్థిరం, భారం మార్పు చెందుతుంది
   డి) ద్రవ్యరాశి, భారం రెండూ స్థిరంగా ఉంటాయి
16. గమన నియమాలను ప్రతిపాదించింది ఎవరు?
   ఎ) జాన్ డాల్టన్ బి) న్యూటన్
   సి) ఫారడే డి) ఐన్‌స్టీన్
17. న్యూటన్ ప్రతిపాదించిన గమన నియమాల్లో దేనికి అధిక ప్రాధాన్యం ఉంది?
   ఎ) మొదటి నియమం
   బి) రెండో నియమం
   సి) మూడో నియమం
   డి) అన్నింటికీ సమాన ప్రాధాన్యం ఉంది
18. కింది వారిలో యాంత్రిక శాస్త్ర పరిశోధనలతో సంబంధం లేని శాస్త్రవేత్త?
   ఎ) న్యూటన్ బి) గెలీలియో
   సి) అరిస్టాటిల్ డి) మేడమ్ క్యూరీ
19. కొండను ఎక్కుతున్న వ్యక్తి ముందుకు వంగుతాడు. కారణమేమిటి?
   ఎ) పడిపోకుండా ఉండటానికి
   బి) వేగం పెంచుకోవడానికి
   సి) అలసటను తగ్గించడానికి
   డి) స్థిరత్వం పెంచడానికి
20. రాకెట్, జెట్ విమానాలు పనిచేయడంలో ఇమిడి ఉన్న న్యూటన్ గమన నియమం ఏది?
   ఎ) మొదటి నియమం
   బి) రెండో నియమం
   సి) మూడో నియమం
   డి) పైవన్నీ
21. వస్తువు ఏ భౌతిక రాశిపై జడత్వం ఆధారపడి ఉంటుంది?
   ఎ) ద్రవ్యరాశి బి) ఆకారం
   సి) రంగు డి) వైశాల్యం
22. ప్రచోదనానికి ప్రమాణం?
   ఎ) న్యూటన్–మీటర్
   బి) న్యూటన్–సెకన్
   సి) న్యూటన్/మీటర్
   డి) న్యూటన్/సెకన్
23. 60 కిలోల ద్రవ్యరాశి ఉన్న ఒక వ్యక్తి లిఫ్ట్‌లో ప్రయాణిస్తున్నప్పుడు ఆ లిఫ్ట్ తీగలు తెగితే వ్యక్తి భారం?
   ఎ) 60 కిలోలు బి) 0 కిలోలు
   సి) 680 కిలోలు డి) 609.0 కిలోలు
24. కొబ్బరి చెట్టుపై ఉన్న కోతికి తుపాకీతో గురిపెట్టి ట్రిగ్గరు నొక్కే సమయంలో.. ఆ కోతి కిందకు జారడం ప్రారంభిస్తే బుల్లెట్?
   ఎ) కోతిని తాకుతుంది
   బి) కోతి పైభాగం నుంచి తాకకుండా వెళుతుంది
   సి) కోతి కింది భాగం నుంచి తాకకుండా వెళుతుంది
   డి) చెప్పలేం
25. వంపు మార్గంలో వాహనం సురక్షితంగా ప్రయాణించాలంటే దాని గరిమనాభి స్థానం ఏ భాగంలో ఉండాలి?
   ఎ) పైన బి) మధ్య
   సి) కింద డి) వెనక
26. అంతర్గత బలాల మధ్య మార్పు దేనిలో కలుగుతుంది?
   ఎ) బాంబు విస్ఫోటం
   బి) వాహన గమనం
   సి) గ్రహాల చలనం
   డి) పైవన్నీ
27. బలానికి అంతర్జాతీయ ప్రమాణం ఏది?
   ఎ) జౌల్ బి) ఎర్గ్
   సి) ఆంపియర్ డి) న్యూటన్
28. పరావలయ మార్గంలో ప్రయాణిస్తున్న బాంబు మార్గమధ్యంలో విస్ఫోటం చెందితే దాని ద్రవ్యరాశి కేంద్రం ప్రయాణించే మార్గం?
   ఎ) వక్ర మార్గం బి) రుజు మార్గం
   సి) పరావలయ మార్గం
   డి) దీర్ఘవృత్తాకార మార్గం
29. భ్రమణ చలనంలో ఉన్న వస్తువుకు ఉండే నిజమైన బలం?
   ఎ) అభికేంద్ర బలం బి) అపకేంద్ర బలం
   సి) విరూపకార బలం
   డి) బాహ్య బలం
30. భూమి చుట్టూ నిర్దిష్ట కక్ష్యలో పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహం నియంత్రణ కోల్పోయినప్పుడు ఏ మార్గంలో ప్రయాణిస్తుంది?
   ఎ) వృత్తాకార మార్గానికి కోణీయంగా అవతలి వైపు
   బి) వృత్తాకార మార్గానికి లంబంగా
   సి) వృత్తాకార మార్గానికి సమాంతరంగా
   డి) వృత్తాకార మార్గానికి 60° కోణీయంగా అవతలి వైపు
31. వంపు మార్గంపై ప్రయాణిస్తున్న వాహనానికి కావాల్సిన అభికేంద్ర బలం ఎక్కడి నుంచి లభిస్తుంది?
   ఎ) ఇంజన్ బి) బ్రేకులు
   సి) చక్రాలు, రోడ్డు ఉపరితలానికి మధ్య ఉండే ఘర్షణ బలాల వల్ల
   డి) స్టీరింగ్
32. వాషింగ్ మెషిన్ పనిచేయడంలో ఉండే బలం ఏది?
   ఎ) అపకేంద్ర బలం బి) అభికేంద్ర బలం
   సి) ఘర్షణ బలం డి) పైవన్నీ
33. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహానికి కావాల్సిన అభికేంద్ర బలం ఎక్కడి నుంచి లభిస్తుంది?
   ఎ) సౌరపలకలు బి) భూమి
   సి) సూర్యుడు
   డి) భూమి, కృత్రిమ ఉపగ్రహం మధ్య ఉండే విశ్వగురుత్వాకర్షణ బలం
34. నిలువు వృత్తంలో చలిస్తున్న జెట్ విమాన వేగం వృత్తం ఏ స్థానం వద్ద గరిష్ఠంగా ఉంటుంది?
   ఎ) ఉన్నతం బి) నిమ్నతం
   సి) వృత్త కేంద్రం
   డి) వేగం అన్ని స్థానాల్లో సమానం
35. భూమి ఉత్తర ధ్రువం నుంచి దక్షిణ ధ్రువానికి చేసిన రంధ్రంలో జారవిడిచిన వస్తువు ఎక్కడికి చేరుతుంది?
   ఎ) ఉత్తర ధ్రువం బి) దక్షిణ ధ్రువం
   సి) భూ కేంద్రం
   డి) రెండు ధ్రువాల మధ్య సరళ హరాత్మక చలనం చేస్తుంది
36. గమనంలో ఉన్న వాహన చక్రాల చలనం?
   ఎ) సరళ హరాత్మక బి) రేఖీయ
   సి) భ్రమణ డి) బి, సి
37. పుటాకారంలో ఉన్న రోడ్డుపై ఒక బంతి చేసే చలనం?
   ఎ) రేఖీయ బి) కోణీయ
   సి) సరళ హరాత్మక డి) పైవన్నీ
38. ఉపగ్రహం తక్కువ వ్యాసార్థం ఉన్న కక్ష్యలో నుంచి ఎక్కువ వ్యాసార్థం ఉన్న కక్ష్యలోకి ప్రవేశించినప్పుడు దాని రేఖీయ వేగం?
   ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
   సి) మారదు డి) శూన్యం
39. కింది వాటిలో శక్తికి ప్రమాణం ఏది?
   ఎ) ఎర్గ్ బి) జౌల్
   సి) ఎలక్ట్రాన్–ఓల్ట్ డి) పైవన్నీ
40. కదులుతున్న రైలులో ప్రయాణికుడి శక్తి?
   ఎ) గతిజ శక్తి బి) స్థితిజ శక్తి
   సి) యాంత్రిక శక్తి డి) ఉష్ణ శక్తి
41. రిజర్వాయర్‌లోని నీటికి ఉండే శక్తి ఏమిటి?
   ఎ) గతిజ శక్తి బి) స్థితిజ శక్తి
   సి) యాంత్రిక శక్తి డి) రసాయన శక్తి
42. యాంత్రిక శక్తిని విద్యుత్ శక్తిగా మార్చేది?
   ఎ) ట్రాన్స్‌ఫార్మర్ బి) బ్యాటరీ
   సి) సైకిల్ డైనమో డి) విద్యుత్ మోటారు
43. కదులుతున్న రైలు నుంచి ఒక వస్తువును బయటకు జారవిడిచినప్పుడు అది ప్రయాణించే మార్గం?
   ఎ) సరళ రేఖ బి) వృత్తాకారం
   సి) దీర్ఘవృత్తాకారం డి) పరావలయం
44. విద్యుత్‌తో పనిచేసే యంత్ర సామర్థ్యానికి కొలమానం?
   ఎ) ఎర్గ్ బి) వాట్
   సి) కెలోరీ డి) ఆంపియర్
45. తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ రెక్కలకు ఉండే శక్తి?
   ఎ) గతిజ శక్తి బి) భ్రమణ శక్తి
   సి) స్థితిజ శక్తి డి) బి, సి
46. గుర్రాలు బండిని లాగుతున్నప్పుడు శక్తి రూపాంతరం?
   ఎ) కండర శక్తి గతిజ శక్తిగా మారుతుంది
   బి) గతిజ శక్తి కండర శక్తిగా మారుతుంది
   సి) కండర శక్తి స్థితిజ శక్తిగా మారుతుంది
   డి) స్థితిజ శక్తి గతిజ శక్తిగా మారుతుంది
47. కింది దిశలో కదులుతున్న లిఫ్ట్‌లో ఉన్న ఒక వ్యక్తి తన చేతిలోని బంతిని జారవిడిస్తే.. అది?
   ఎ) కిందికి పడుతుంది
   బి) పైకి కదులుతుంది
   సి) లిఫ్ట్ మధ్య బిందువు వద్ద ఆగుతుంది
   డి) సరళ హరాత్మకంగా చలిస్తుంది
48. లిఫ్ట్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
   ఎ) జాన్సన్ బి) ఓటీస్
   సి) న్యూటన్ డి) ఫారడే
49. పై దిశలో కదులుతున్న లిఫ్ట్‌లో వేలాడదీసిన లఘులోలకం ఆవర్తన కాలం?
   ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
   సి) మారదు డి) శూన్యం
50. ఒక వ్యక్తి భూమిపై మీటరు ఎత్తుకు ఎగరగలడు. అదే వ్యక్తి చంద్రునిపై ఎగరగలిగే ఎత్తు ఎంత?
   ఎ) 1 మీ. బి) 1/6 మీ.
   సి) 6 మీ. డి) 10 మీ.

సమాధానాలు

1) డి;	2) సి;	3) సి;	4) ఎ;	5) బి;
6) బి;	7) ఎ;	8) బి;	9) బి;	10) బి;
11) ఎ;	12) సి;	13) సి;	14) బి;	15) సి;
16) బి;	17) బి;	18) డి;	19) డి;	20) సి;
21) ఎ;	22) బి;	23) బి;	24) ఎ;	25) సి;
26) ఎ;	27) డి;	28) సి;	29) ఎ;	30) ఎ;
31) సి;	32) ఎ;	33) డి;	34) బి;	35) డి;
36) డి;	37) సి;	38) బి;	39) డి;	40) సి;
41) బి;	42) సి;	43) డి;	44) బి;	45) డి;
46) ఎ;	47) ఎ;	48) బి;	49) బి;	50) సి.

‘నిజాం సబ్జెక్ట్స్ లీగ్’ అనే సంస్థను నెలకొల్పినవారు?

తెలంగాణ భావన చారిత్రక నేపథ్యం

ముల్కీ ఉద్యమం - పరిణామాలు

1. ముల్కీ సమస్యల వల్ల హత్యకు గురైన ప్రధాని మహ్మద్ గవాన్(బీజాపూర్)కు సంబంధించి కింది వాటిలో ఏది నిజం?
1) బీదర్‌లో అతి ప్రసిద్ధి చెందిన విద్యా భవనం(మదర్సా) నిర్మించాడు
2) ఖ్వాజా మహ్మద్ గిలానీ రాజు వద్ద ప్రధానిగా పనిచేశాడు
3) మహ్మద్‌షా–3 మరణానంతరం గోల్ గుంబజ్ నిర్మించాడు
ఎ) 1 మాత్రమే బి) 1, 2 మాత్రమే
సి) 1, 3 మాత్రమే డి) 2, 3 మాత్రమే

2. ‘ముల్కీ’ నిబంధనలు రద్దు చేసిన అంశంలో కింది వాటిలో వాస్తవమైంది?
1) 1973లో రద్దు చేశారు
2) ప్రెసిడెన్షియల్ ఆర్డర్ (1975) ద్వారా రద్దు చేశారు
3) 1985లో 610 జీవో ద్వారా రద్దు చేశారు
ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
సి) 3, 4 మాత్రమే డి) 1, 2 మాత్రమే

3. 1969 తెలంగాణ ఉద్యమంలో జరిగిన వివిధ సంఘటనలను క్రమ పద్ధతిలో అమర్చండి?
1) పన్నుల సత్యాగ్రహ ఉద్యమం(వరంగల్)
2) స్త్రీల సత్యాగ్రహం(అబిడ్స్)
3) కాసు బ్రహ్మానంద రెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం
4) కుమార్ లలిత్ కమిటీ
ఎ) 1, 2, 3, 4 బి) 4, 3, 2, 1
సి) 3, 4, 1, 2 డి) 3, 4, 2, 1

4. ‘హైదరాబాద్‌లోని ఉద్యోగాలు హైదరాబాదీలకే’ అనే నినాదం ఎప్పుడు వచ్చింది?
ఎ) 1888 బి) 1919 సి) 1935 డి) 1948

5. కుమార్ లలిత్ కమిటీకి సంబంధించి అవాస్తవమైంది?
1) అతను డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
2) తెలంగాణకు చెందిన రూ. 34.10 కోట్ల మిగులు ధనాన్ని ఆంధ్రకు తరలించినట్లుగా పేర్కొన్నారు
3) తెలంగాణకు చెందిన 283 మిలియన్ రూపాయలు తరలించారు.
ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
సి) 3 మాత్రమే డి) 2, 3 మాత్రమే

6. 1969 ఉద్యమం నేపథ్యంలో నిరాహార దీక్షలు చేసిందెవరు?
1) కృష్ణ 2) రవీంద్రనాథ్
3) అనురాధ 4) పట్టాభిరామయ్య
ఎ) 2 మాత్రమే బి) 2,3 మాత్రమే
సి) 1, 2, 3 మాత్రమే డి) పైవారందరూ



7. కింది వాటిలో అవాస్తవమైంది ఏది?
1) 1901లో ప్రధానిగా కిషన్ పర్షాద్ నియామకం
2) నిజాం రాజ్యంలో ఆర్థికశాఖ కార్యదర్శిగా ఆంగ్లేయుడైన కాసన్‌వాకర్ నియామకం
3) పద్మజానాయుడు ముల్కీల ఉద్యమంలో పాల్గొనలేదు
ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
సి) 1, 2 మాత్రమే డి) 3 మాత్రమే

8. ‘మా ఉద్యోగాలన్నీ అపహరించి మీ వారికి అప్పగించావు, నీ కుట్రలన్నీ అమలైతే ఇక చిరుద్యోగాలే మాకు గతి’ అనే కవిత ముల్కీ ఉద్యమ గీతంగా ప్రసిద్ధి. దీన్ని ఉర్దూ భాషలో ఎవరిని ఉద్దేశించి రాశారు?
ఎ) మీర్ ఉస్మాన్ ఆలీఖాన్
బి) ఖాదీర్ మొహినుద్దీన్
సి) కాసన్ వాకర్
డి) జయంతీనాథ్ చౌదరి

9. 1919లో ఉస్మాన్ అలీఖాన్ జారీ చేసిన ఫర్మానా ప్రకారం అవాస్తవమైంది?
1) నిజాం రాష్ట్రంలో జన్మించిన ప్రతీ వారు ముల్కీలు
2) భర్త ముల్కీ అయితే అతని భార్య కూడా ముల్కీనే
3) భార్య ముల్కీ అయితే ఆమె భర్త కూడా ముల్కీనే
ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
సి) 1, 2 మాత్రమే డి) 3 మాత్రమే

10. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1933లో ముల్కీల ఉద్యోగాల రక్షణ కోసం ఫర్మానా జారీ చేశారు. దీన్ని బట్టి వాస్తవమైంది?
1) విద్యావంతులైన ముల్కీలతోనే ఉద్యోగాలు భర్తీ చేయటం
2) కమిషనర్ (కొత్వాల్) రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి మద్దతు
3) నిజాంకు కృతజ్ఞతగా హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు
4) మీర్ అక్బర్ అలీఖాన్, అబుల్ హసన్ సయ్యద్ మొదలైన నాయకులు నిజాంను వ్యతిరేకించారు
ఎ) 1 మాత్రమే బి) 1, 3 మాత్రమే
సి) 2, 4 మాత్రమే డి) 1, 2, 3 మాత్రమే

11. ‘ది నిజాం సబ్జెక్ట్ లీగ్’ లేదా ‘ముల్కీలీగ్’ లేదా జమీయత్ రిఫాయామే నిజాం ఏర్పడిన సంవత్సరం?
ఎ) 1919 బి) 1933 సి) 1935 డి) 1940

12. ‘హైదరాబాద్ ఫర్ హైదరాబాదీస్’ అని నినాదం ఇచ్చినవారు?
ఎ) నవాబ్ నిజామత్ జంగ్
బి) సాదర్ బహదూర్ యార్ జంగ్
సి) సాదర్ యార్ జంగ్
డి) పై వారందరూ

13. ‘నిజాం ప్రజల సంఘం (1935)’ ఒత్తిడి మేరకు నిజాం రాజు వేసిన కమిటీ?
ఎ) అయ్యంగార్ కమిటీ బి) కిషన్ పర్షాద్
సి) పద్మజానాయుడు డి) బి, సి

14. 1888లో నిజాం మహబూబ్ అలీఖాన్ రూపొందించిన నిబంధనల్లో లేనిది?
1) ముల్కీ అనే పదం ఉపయోగించలేదు
2) కనీసం 12 ఏళ్లు రాజ్యంలో నివసించిన వారు స్థానికులు
3) నాన్ ముల్కీలు నిజాం రాజ్యంలో ఉద్యోగాలు పొందాలంటే ప్రధానమంత్రిచే ప్రత్యేక అనుమతి తీసుకోవాలి
ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
సి) 2, 3 మాత్రమే డి) పైవన్నీ

15. ఏ నిజాం రాజు ‘ఉద్యోగుల సాధారణ జాబితా’ విడుదల చేశారు?
ఎ) నిజాం అలీఖాన్
బి) అఫ్జల్ ఉద్దౌలా
సి) మహబూబ్ అలీఖాన్
డి) మీర్ ఉస్మాన్ అలీఖాన్

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

16. ఉద్యోగుల సాధారణ జాబితాలో లేని అంశం?
1) నిజాం రాజ్యంలో గెజిట్ ఉద్యోగులు 680 మంది
2) 76 శాతం నాన్ ముల్కీలు ఉద్యోగులుగా ఉన్నారు
3) ముల్కీలు కేవలం 233 మంది మాత్రమే ఉన్నారు
ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
సి) 1, 3 మాత్రమే డి) 2, 3 మాత్రమే

17. ‘యంగ్ మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ సొసైటీ’ స్థాపించిన సంవత్సరం?
ఎ) 1879 బి) 1897 సి) 1888 డి) 1898

18. కిందివాటిని జతపర్చండి.
1) సికింద్రాబాద్
2) హైదారాబాద్
3) చాదర్‌ఘాట్
4) రెసిడెన్సీ బజార్
i) సోషల్ క్లబ్ (హిందూ)
ii) ఆల్బర్ట్ రీడింగ్ రూం
iii) మాల్యాల సభ
iv) హైదరాబాద్ యువకుల సంఘం
ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv
బి) 1-ii, 2-iii, 3-i, 4-iv
సి) 1-ii, 2-i, 3-iii, 4-iv
డి) 1-ii, 2-iv, 3-iii, 4-i

19. మౌల్వీ మహ్మద్ ముర్తజా ఏ సంఘం ఉపాధ్యక్షులు?
ఎ) మాల్యాల సభ
బి) థియోసోఫికల్ సమాజం
సి) హైదరాబాద్ యువకుల సంఘం
డి) హిందూ సోషల్ క్లబ్

20. ‘జీవరక్ష జ్ఞాన ప్రచారక మండలి’ స్థాపకులెవరు?
ఎ) సేఠ్ లాల్‌జీ మేఘ్‌జీ
బి) కిషన్ జీ
సి) నారాయణ్ గుణాజీ వేలింకర్
డి) రామస్వామి అయ్యర్

21. ‘హైదరాబాద్ రాష్ట్ర సంస్కరణల సంఘం’ స్థాపనలో లేనివారు?
ఎ) వామన్ నాయక్
బి) అసర్గ్ హుస్సేన్
సి) రాఘవేంద్ర శర్మ
డి) రాయ్‌బాల్ ముకుంద్

22. హైదరాబాద్ రాజ్యంలో స్వదేశీ లీగ్ ఉద్యమ నాయకులు కానివారు?
ఎ) శ్రీవజ బి) కాశీనాథ్ వైద్య
సి) పద్మజానాయుడు డి) శ్రీహమాన్

23. ‘నీలగిరి’ (1922) పత్రికకు సంబంధించి అవాస్తమైంది?
ఎ) ఇది తొలి రాజకీయ పత్రిక
బి) రామ నర్సింహారావు సంపాదకత్వంలో వెలువడింది
సి) రాజకీయాల గురించి వ్యంగ్యంగా వివరించేది
డి) ఈ పత్రిక నల్గొండ జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైంది

24. తెలంగాణలో ప్రప్రథమంగా ఆంగ్ల, తెలుగు పత్రికలు ప్రచురణలు చేసింది?
ఎ) సురవరం ప్రతాపరెడ్డి
బి) రామానుజాచార్యులు
సి) బి.ఎస్.శర్మ డి) రాజగోపాల్

25. కిందివాటిలో సాయంకాల పత్రిక ఏది?
ఎ) గారిసన్ బి) దక్కన్ కేసరి
సి) శోభ డి) హైదరాబాద్ బులెటిన్

26. తెలుగు ‘మీజాన్’ పత్రిక సంపాదకులు?
ఎ) సురవరం ప్రతాపరెడ్డి
బి) అడవి బాపిరాజు
సి) మందుముల నర్సింహారావు
డి) రామానుజాచార్యులు

27. సరికానిది జత?
ఎ) రయ్యత్ పత్రిక – నర్సింగ్‌రావు
బి) ఇమ్రోజ్ – షోయబ్ ఉల్లాఖాన్
సి) గారిసన్ – వీరభద్రశర్మ
డి) పయాం – అబ్దుల్ గఫార్

28. ‘తెలుగు తల్లి’ పత్రిక ప్రచురించినవారు?
ఎ) రాచముళ్ల సత్యవతి
బి) అప్పయ్యశాస్త్రి సి) పి.యస్. శర్మ
డి) బి.ఎస్. శర్మ

29. దేవులపల్లి రామానుజారావు సంపాదకత్వంలో వెలువబడిన ‘శోభ’ పత్రిక ముఖ్య కేంద్రం?
ఎ) నిజామాబాద్ బి) వరంగల్
సి) హైదరాబాద్ డి) నల్లగొండ

30. ‘చార్మినార్ గాసిప్’ శీర్షికతో ఏ పత్రికలో వ్యాసాలు వచ్చేవి?
ఎ) హైదరాబాద్ బులెటిన్
బి) దక్కన్ కేసరి సి) శోభ డి) గారిసన్

31. 1969 ఫిబ్రవరి 4న జీవో 36కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రిట్ దాఖలు చేసినవారు?
ఎ) ఎ.వి. నర్సింహారావు
బి) పి.వి. నర్సింహారావు
సి) కొండా మాధవరెడ్డి
డి) కాసాని వెంకటరత్నం

32. ‘పంచసూత్ర’ ప్రణాళిక (1972 నవంబర్ 27) లోని ముఖ్యాంశం?
1) హైదరాబాద్ – సికింద్రాబాద్‌లో సమ్మిళిత పోలీస్ దళం
2) మిగులు ధనం లెక్కలు తీయడానికి ఉన్నతాధికార సంఘం
3) తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాలు స్థానికులకే
ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
సి) 1, 2 మాత్రమే డి) 2, 3 మాత్రమే

33. తెలంగాణలో ఎంతమంది స్థానికేతరులు ఉద్యోగాలు పొందారో తొలిసారి గణాంకాలతో తేల్చిన కమిటీ?
ఎ) కుమార్ లలిత్ బి) జస్టిస్ భార్గవ
సి) జయ భరత్ రెడ్డి డి) సుందరేశన్

34. హైదరాబాద్(నిజాం) రాజ్య విస్తీర్ణం ఎంత?
ఎ) 82,698 చ.మైళ్లు
బి) 68,982 చ.మైళ్లు
సి) 74,698 చ.మైళ్లు
డి) 89,682 చ.మైళ్లు

35. ‘నిజాం సబ్జెక్ట్స్ లీగ్’ అనే సంస్థను నెలకొల్పినవారు?
ఎ) బూర్గుల రామకృష్ణారావు
బి) కె.ఎం. వెల్లోడి
సి) గోవింద్ వల్లభ్‌పంత్
డి) నవాబ్ సాదర్‌యార్ జంగ్

36. ‘సాలార్‌జంగ్–1 నిజాం రాజ్య వ్యవస్థను పునరుజ్జీవింప చేశాడు’ అని వ్యాఖ్యానించిన వారు?
ఎ) లార్డ్ కానింగ్ బి) రాణి విక్టోరియా
సి) విలియం డిగ్బీ డి) కాసన్ వాకర్

37. ఆది హిందువుల చేతి వృత్తుల నైపుణ్యం ప్రదర్శించడానికి ‘హైదరాబాద్‌లో చేతి వృత్తుల ప్రదర్శన’ను ఎప్పుడు నిర్వహించారు?
ఎ) 1920 బి) 1925
సి) 1928 డి) 1934

సమాధానాలు

1) ఎ	2) ఎ	3) డి	4) ఎ	5) సి
6) డి	7) డి	8) సి	9) డి	10) డి
11) సి	12) ఎ	13) ఎ	14) ఎ	15) సి
16) బి	17) ఎ	18) బి	19) సి	20) ఎ
21) డి	22) బి	23) సి	24) బి	25) ఎ
26) బి	27) సి	28) ఎ	29) బి	30) సి
31) ఎ	32) ఎ	33) సి	34) ఎ	35) ఎ
36) సి	37) బి			

Financial statements includes?

BANK EXAMS

BANKING AWARENESS

1. Banks obtain photograph at the time of opening of the account with a view to:
a) Avoid benami accounts
b) Verify the identity of the customer
c) Verify with police records
d) a & b e) a to c

2. Banks are required to submit CTR (Cash Transaction Report) to ___ within ___ of succeeding month.
a) FIU, 30 days b) FIU, 15 days
c) FIU, 7 days d) RBI, 7 days
e) RBI, 15 days

3. Premium payable on deposit insurance on every Rs.100 per annum is
a) 10 paise b) 5 paise
c) 25 paise d) 50 paise
e) None

4. Which of the following can't be a nominee?
a) Illiterate Perso b) Minor
c) NRI d) HUF e) None

5. In case of dishonor of cheques on financial grounds, the holder is required to issue notice to the drawer within ___ days to claim remedy under section 138 of NI Act
a) 7 Days b) 30 Days
c) One Year d) Three Years
e) None

6. National Payment Corporation of India (NPCI) has set up payment network to enable the member banks to issue Domestic Payment Cards with a brand ___
a) Visa Card b) Master Card
c) Prepaid Card d) RuPay
e) Travel Card

7. Permanent Account Number (PAN) is mandatory for
a) Bank transactions (cash) of Rs. 50000/- & above
b) Purchase and sale of shares/ debentures/bonds of Rs. 50000/- & above
c) Purchase and sale of immovable property where the value of the property is Rs. 5 lakh & above
d) a & c e) All

8. High Debt Service Coverage Ratio (DSCR) indicates
a) Unable to meet the installment obligations
b) Able to meet payment of installments comfortably
c) Liquidity problem
d) a & c e) None

9. Which of the following statement is not true with regard to Capital Gains Deposit Scheme?
a) Income Tax Assess who are eligible for exemption under section 54 of the IT Act are alone can open account with Banks
b) Accounts can be opened under Savings, Fixed and Term Deposits
c) Cheque book can be issued to eligible accounts.
d) No lien or deposit loan is allowed against such deposits
e) None

10. Which of the following statement is not correct with regard to Tax Saver Scheme of Banks?
a) Tax exemption is available for the deposit amount under section 80C of IT Act
b) Period of deposit is allowed up to 5 Years
c) TDS is applicable, if interest payment is above Rs.10000/- in a financial year
d) Maximum amount of deposit allowed is Rs. 5 lakhs
e) c & d

11. Financial statements includes
a) Balance Sheet b) P & L
c) Cash & Funds Flow
d) a & b e) a, b & c

12. Banks are permitted to take over borrowal accounts from other Banks & Financial institutions provided
a) Account should be Standard Asset with positive net worth
b) Copy of the borrowal account for preceding 12 months is to be obtained
c) P & C report is to be obtained from other bank before disbursement
d) Branch to take approval from next sanctioning authority
e) All of the above

13. RBI extending incentives to Banks for the following services
a) Adjudication of Mutilated Bank Notes
b) Exchange of Soiled Notes
c) Distribution of Coins over the counter
d) Establishment of Coin vending Machines
e) All of the above

14. Which agency is enabling the transfer of subsidies directly to beneficiary accounts through Aadhaar Enabled Payment Bridge (APB)?
a) RBI b) SEBI c) IDRBT
d) NPCI e) SBI

15. Call Money Market interest are linked to
a) Bank Rate b) Repo Rate
c) Reverse Repo Rate
d) Market forces e) None

16. Transaction Password relates to
a) Core Banking
b) ATM operations
c) Internet Banking
d) Tele banking e) None

17. Nomination in respect of the following is to be witnessed by two persons.
a) All deposit accounts
b) Deposit accounts where the nominee is a minor
c) Physically challenged accounts
d) Thumb impression accounts (illiterate) e) None

18. When the contents of the Negotiable Instrument are modified by the drawer, it is treated as
a) Forgery b) Fraud
c) Material alteration
d) suppression of facts e) None

19. Prepayment charges are exempted for
a) Housing Loans
b) Education Loans
c) Agr. Loans d) Corporate Loans
e) a, b & c

20. IFSC code consists of ___ Digits.
a) 9 b) 10 c) 11 d) 15
e) None

21. One Bank account per family is mandatory to avail
a) Credit facility from bank
b) Direct Benefit Transfer benefit (subsidy)
c) Interest subvention – Housing Loan
d) either a or b e) none

22. What is the time limit to furnish the requested information under Right to Information Act (RTI) and what is the penalty for non-compliance of the said norm?
a) 30 days & Rs. 100 per day
b) 60 days & Rs. 100 per day
c) 30 days & Rs. 250 per day maximum of Rs. 25000/-
d) 60 days & Rs. 250 per day
e) None

23. The documents to be insisted from a NRI for opening an account is
a) Copies of Passport and VISA
b) Local and Overseas addresses
c) Compliance of KYC norms
d) Latest Passport size photographs
e) All of the above

24. Minimum and Maximum period of Certificate of Deposits
a) 15 days & 1 year
b) 30 days & 1 year
c) 7 days & 1 year
d) 7 days & no limit e) None

25. Loans not exempted from Base Rate Purview?
a) Consortium Advance
b) Loans against deposits
c) Export Credit
d) Loans to staff members
e) None

26. Visually challenged persons are allowed to avail the following banking facilities?
a) Cheque Book b) Debit Card
c) ATM Card d) Locker e) All

27. Housing Loan up to ___ is treated as Priority Sector.
a) 10 lakh b) 15 lakh
c) 25 lakh in Metro with population above 10 lakh to 15 lakh in other centers
d) 25 lakh at all places e) None

28. Nominee can exercise his right
a) During the tenure of deposit
b) On maturity of deposit
c) Any time since he will be treated as joint depositor
d) He has no right on deposit since it is in the name of the depositor
e) On the death of the depositor

29. Balances under Cash Reserve Ratio (CRR) earn interest @___
a) 3% p.a.
b) Applicable SB Interest Rate
c) 5% p.a. d) No interest
e) None

30. Banks are allowed to accept deposits under Capital Gains Scheme in ___
a) Savings b) Fixed
c) Current d) a & b
e) Any scheme

31. During March 2015, a Reserve Bank of India (RBI) committee had recommended introduction of PSLCs to enable banks "to meet their PSL requirements even while leveraging their comparative advantage in lending". What does the PSLC stands for?
a) Priority Sector Lending Certificates
b) Priority sector Loan Certificates
c) Primary and Secondary Sector Certificates
d) Public Sector Lending Certificates
e) None of the above

32. Zero Coupon Bonds refers to
a) Bond issued at face value
b) Bond issued with face value & interest
c) Bond issued at discount from its face value with interest
d) Bond issued at discount from its face value without interest
e) None

33. ATMs that are owned and managed by non-banking entities are called as ___
a) Onsite ATM b) Offsite ATM
c) Third Party ATM
d) Red label ATM
e) White label ATM

34. For transfer of funds through NEFT (National Electronic Fund Transfer) and minimum and maximum amount that can be transferred are
a) Rs.1,000 and maximum Rs. 5 lakhs.
b) Rs. 1000 and maximum no limit
c)Rs. 5,000 and maximum 1 lakh
d) No minimum & maximum amount e) None

35. Cash kept in the currency chest is owned by
a) Currency Chest Branch Bank
b) Central Government
c) Reserve Bank of India
d) State Bank of India
e) None of the above

36. Bank can't proceed against the borrower under SARFAESI Act where
a) Security is agri land
b) Liability is less than 1 lakh
c) Liability is less than 20% of the principal
d) Pledge of movables
e) All of the above

37. The minimum capital required to start a new private sector bank is?
a) Rs. 100 crore b) Rs.200 crore
c) Rs. 300 crore d) Rs.400 crore
e) Rs. 500 crore

38. RBI injects liquidity through
a) Increase Bank Rate
b) Reduction of Repo Rate
c) Reduction of Reverse Repo
d) Increase CRR e) Increase SLR

39. A customer requested to include his wife and daughter as nominees after one year of opening of the account. Will it be accepted?
a) It can be accepted since the nominees are the family members of the depositor
b) Cannot be considered since the request is not received at the time of opening of account
c) Can be considered with 50% share each
d) Nomination should be made only in favor of single name. Hence can't be considered
e) None of the above

40. What is the relationship between the Bank and Overdraft Customer where the account is showing credit balance?
a) Creditor & Debtor
b) Principle & Agent
c) Trustee & Beneficiary
d) Debtor & Creditor
e) None of the above

KEY

1) d;	2) b;	3) a;	4) d;
5) b;	6) d;	7) e;	8) b;
9) c;	10) d;	11) e;	12) e;
13) e;	14) d;	15) d;	16) c;
17) d;	18) c;	19) e;	20) c;
21) b;	22) a;	23) e;	24) c;
25) a;	26) b;	27) c;	28) e;
29) d;	30) d;	31) a;	32) d;
33) e;	34) c;	35) c;	36) b;
37) e;	38) b;	39) d;	40) d.